ఈనాడు

విజయవాడ 14-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 335

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రైల్లో ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాలు


రైలింజిన్లు.. బోగీల్లో నిఘా కెమెరాలు

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా రైలింజిన్లు, రైలుపెట్టెల్లో నిఘా కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దాదాపు 15,000 లోకోమోటివ్‌లు (రైలింజిన్లు), 74,000 బోగీల్లో 3.86 లక్షల సంఖ్యలో వీటిని అమర్చనుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకొంది. తక్కువ వెలుగులోనూ, రైలు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న సమయంలోనూ అత్యంత నాణ్యమైన దృశ్యాలను చిత్రీకరిస్తాయని రైల్వేశాఖ (మిగతా 5లో)

‘మద్య’ కథా చిత్రం

ముడుపుల డబ్బుతో సినిమాలు తీసిన వైకాపా ముఠా

- ‘మళ్లీ మొదలైంది’, ‘స్పై’ చిత్రాలు ఆ కోటాలోనివే..
- ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన రాజ్ కెసిరెడ్డి
- ఓ పాన్ ఇండియా నటుడి భార్య నుంచి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాలోకి రూ.కోటి
- నల్లధనం వైట్‌లోకి మార్పు
- సిట్ దర్యాప్తులో వెలుగులోకి




ఈనాడు – అమరావతి

మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకు వైకాపా ముఠా సినిమాల నిర్మాణమూ చేపట్టింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి.. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరిట ఓ నిర్మాణ సంస్థను నెలకొల్పి సుమంత్ హీరోగా ‘మళ్లీ మొదలైంది’, నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా ‘స్పై’ చిత్రాలను నిర్మించారు. ఈ రెండు సినిమాల నిర్మాణానికి రూ.40 కోట్ల మేర నల్లధనాన్ని వెచ్చించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఆ సంస్థ మాత్రం రూ.12 కోట్లే ఖర్చు చేశామని, దీనిని అప్పు తీసుకుని సమకూర్చుకున్నట్లు రికార్డుల్లో చూపించింది. అవన్నీ దొంగ లెక్కలని దర్యాప్తులో సిట్ గుర్తించి ఆరా తీయగా, అసలు గుట్టు వీడింది. ‘మద్యం డిస్టిలరీలు, సరఫరా సంస్థల నుంచి నగదు రూపంలో తీసుకున్న ముడుపుల సొత్తును.. రాజ్ కెసిరెడ్డి ముఠా తొలుత కొందరికి అందజేసేది. తర్వాత ఆ డబ్బును వారి నుంచి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాలోకి జమ చేయించింది. ఈ సొమ్ము వారి నుంచి అప్పుగా తీసుకున్నట్లు రికార్డుల్లో చూపించింది. గతేడాది పాన్ ఇండియా స్థాయిలో అతి పెద్ద హిట్టై, భారీగా కలెక్షన్లు వసూలుచేసిన (మిగతా 5లో)

చెల్లించింది రూ.10 కోట్లు.. రికార్డుల్లో రూ.90 లక్షలే

■ నిఖిల్ సిద్ధార్థ్ నటించిన కార్తికేయ-2 అప్పటికే పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించటంతో రాజ్ కెసిరెడ్డి, వైకాపా ముఠా అతన్ని హీరోగా పెట్టి ‘స్పై’ సినిమా తీసింది. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో 2023 జూన్ 29న ఈ సినిమా విడుదల చేశారు. దీనికి కథ కూడా రాజ్ కెసిరెడ్డే సమకూర్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనకున్న రహస్యాన్ని స్పృశిస్తూ.. ఓ గూఢచారి ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్రానికి భారీ బడ్జెట్ పెట్టారు.

■ ‘నిఖిల్ సిద్ధార్థ్‌కు రూ.10 కోట్లు చెల్లించారు. కానీ రికార్డుల్లో అతని పారితోషికాన్ని రూ.90 లక్షలుగా చూపించారు. ఈ సినిమాలో అత్యధిక భాగాన్ని జోర్డాన్‌లో షూట్ చేశారు. హీరో సహా మొత్తం యూనిట్ అంతా అక్కడే ఎక్కువ రోజులు గడిపింది. అయితే రికార్డుల్లో అసలు జోర్డాన్ షూటింగ్‌కు అయిన ఖర్చుల వివరాలే పేర్కొనలేదు. కనీసం ప్రయాణ టికెట్ల ప్రస్తావనైనా లేదు. దీన్నిబట్టి ఇదంతా నల్లధనమే’ అని సిట్ తేల్చింది.



నవరసాల ‘కోట’ కన్నుమూత

750కిపైగా సినిమాల్లో నటించిన విలక్షణ నటుడు

- చిత్రసీమలో విషాదం
- ప్రధాని సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం

ఈనాడు, హైదరాబాద్: విలక్షణ నటనతో సినీ ప్రియుల్ని మెప్పించి.. చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన నట దిగ్గజం కోట శ్రీనివాసరావు(83) ఇక లేరు. ప్రతినాయకుడు.. సహాయ నటుడు.. హాస్య నటుడు.. ఏ పాత్రలోనైనా అవలీలగా ఒదిగిపోగల ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్న ఆయన.. వయసురీత్యా వచ్చిన అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు సతీమణి రుక్మిణి, కుమార్తెలు పావని, పల్లవి ఉన్నారు. కుమారుడు ప్రసాదరావు 2010లో హైదరాబాద్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. కోట తన నాలుగున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో పలు భాషల్లో 750కిపైగా సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమలో విషాదం నింపింది. ప్రధాని మోదీతో పాటు తెలుగు రాష్ట్రాల సీఎంలు, సినీ, రాజకీయ ప్రముఖులు కోట మృతికి సంతాపం ప్రకటించారు. సినీ, రాజకీయ ప్రముఖులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో కోట అంత్యక్రియలు నిర్వహించారు. కోట శ్రీనివాసరావు 1942 జులై 10న కృష్ణా జిల్లాలోని కంకిపాడులో జన్మించారు. సోదరుడు కోట నరసింహారావు (మిగతా 5లో)

విలక్షణ నటనకు రాచబాట.. కోట సినిమా లో

అంతరిక్ష రంగంలోనూ సత్తా చాటుదాం 5లో
పాలసీని ఆమోదిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

అమరావతిలో బిట్స్ ఏఐ ప్లస్ క్యాంపస్

- రూ.1,000 కోట్ల పెట్టుబడి.. 7వేల మంది విద్యార్థులకు అవకాశం
- 2027లో ప్రవేశాలు ప్రారంభం
- బిట్స్ పిలానీ కులపతి కుమారమంగళం బిర్లా వెల్లడి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ‘ఏఐ ప్లస్ క్యాంపస్’ ఏర్పాటు చేయనున్నట్లు బిట్స్ (బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్) విశ్వవిద్యాలయ కులపతి, పారిశ్రామికవేత్త కుమారమంగళం బిర్లా తెలిపారు. అమరావతి క్యాంపస్‌ను ఆధునిక సాంకేతిక విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతామని.. కృత్రిమ మేధ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. స్మార్ట్, సుస్థిర మౌలిక సౌకర్యాలతో రెండుదశల్లో 7వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా కేంద్రాన్ని తీర్చిదిద్దుతామని, 2027 నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. పిలానీలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ‘అమరావతిలో వచ్చే ఐదేళ్లలో రూ.1,000కోట్ల పెట్టుబడి పెడతాం. పిలానీ, హైదరాబాద్, గోవా క్యాంపస్‌ల విస్తరణకు ప్రాజెక్టు విస్తార్ కింద రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తాం. అక్కడ విద్యార్థుల సంఖ్యను 2030-31 నాటికి 26వేలకు పెంచుతాం’ అని తెలిపారు.



చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా

‘అమరావతిలో బిట్స్ క్యాంపస్ ఉండాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. తక్కువ ధరకే భూములిచ్చారు. ఈ క్యాంపస్ ఆయన దార్శనికతను ప్రతిబింబించేలా ఉంటుంది. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఆర్కిటెక్చర్ ఎంపిక చివరిదశలో ఉంది. గ్రీన్‌బిల్డింగ్స్ (మిగతా 5లో)

యువతను ఆకర్షించాలని.. ఉగ్రవాదంలోకి నెట్టాలని!

- కావాల్సిన వారు దొరక్క బాంబు దాడి కుట్ర విఫలం
- ఉగ్రవాది అబూబకర్ సిద్ధిఖీ విచారణలో వెల్లడి



అబూబకర్ సిద్ధిఖీ

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ఉగ్రవాది అబూబకర్ సిద్ధిఖీ ఉగ్ర చర్యలను పోలీసులు ఒక్కోటిగా రాబడుతున్నారు. పేలుళ్ల ప్రణాళికలు, సహకారంపై రహస్యంగా విచారిస్తున్నారు. వయసు మీదపడటంతో నేరుగా ఉగ్ర కార్యకలాపాలు చేయకుండా, ఇకపై యువతను ఉగ్రవాదం వైపు మళ్లించాలని అబూబకర్ సిద్ధిఖీ నిర్ణయించుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న సిద్ధిఖీ 30 ఏళ్లుగా పరారీలో ఉన్నాడు. ఇటీవలే తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్.. ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆయన్ను అరెస్టు చేసింది. పోలీసులు కస్టడీలోకి తీసుకొని (మిగతా 5లో)



ఈనాడు



విజయవాడ 14-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 335

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఇసుకతోట ప్రాంతంలో నిలిచిన వర్షం నీరు

విశాఖలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం

విశాఖపట్నం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విశాఖ నగరంలో ఆదివారం మధ్యాహ్నం గంటసేపు వర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తూర్పు నియోజకవర్గ పరిధి 16వ వార్డు కేఆర్‌ఎంకాలనీలో గెడ్డ ఉద్ధృతంగా ప్రవహించడంతో మురుగునీరు కాలనీలోకి ప్రవేశించింది. రహదారిపై నిలిపిన రెండు ద్విచక్రవాహనాలు నీటిలో కొట్టుకుపోతుండగా.. స్థానికులు గమనించి ఒక దాన్ని పట్టుకోగలిగారు. జాతీయ రహదారి సమీపంలోని ఇసుకతోట ప్రాంతంలోకి భారీగా వర్షం నీరు చేరింది. మద్దిలపాలెం జాతీయ రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

గోదావరి వరద తగ్గుముఖం

కుక్కునూరు, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: గోదావరి వరద వేగంగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు 31.6 అడుగులకు చేరుకుంది. 24 గంటల్లో 10 అడుగుల మేర తగ్గింది. తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 6,14,342 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

భూమిలేని కుటుంబాలకు పింఛన్ పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో భూమిలేని 1,575 పేద కుటుంబాలకు ప్రభుత్వం పింఛన్లు పునరుద్ధరించింది. గృహ సర్వే ఆధారంగా వీరిని అర్హులుగా నిర్ధారించి, పింఛన్ వర్తింపజేయాలని సీఆర్‌డీఏకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వంలో వీరందరినీ వివిధ కారణాలతో అనర్హులుగా ప్రకటించి పింఛన్లు నిలిపివేశారు.


క్రోనోతో... కలకాలం!

ఏం తినాలి?.. ఎంత తినాలి?

అనే విషయాలను మనం ఎక్కువగా చర్చిస్తాం. 'ఎప్పుడు తింటున్నాం?' అనేది ఇంకా ప్రధానమని చెబుతోంది 'క్రోనో న్యూట్రిషన్'. మనం తీసుకునే సమయాన్ని బట్టి తినే తిండి కూడా మారాలని చెబుతోందీ సిద్ధాంతం.

\- ఈనాడు, హైదరాబాద్





గడియారం కీలకం!

- మన శరీరంలోని అంతర్గత గడియారాలు రక్తంలో చక్కెర స్థాయులు, హార్మోన్ల సమతౌల్యత, రోగనిరోధక వ్యవస్థలను నియంత్రిస్తాయి.
- రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం... ఉదయం ఏమీ తినకుండా ఉండడం... రోజంతా అడపాదడపా తినడం వంటివి మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి.
- అందుకే పొద్దును బట్టి తిండి తీరును మార్చుకోవాలని 'క్రోనో న్యూట్రిషన్' విధానం స్పష్టం చేస్తోంది.

పూటకో తీరు...



- మన జీవక్రియ రోజంతా ఒకే విధంగా ఉండదు. సూర్యోదయం, సూర్యాస్తమయాలకు అనుగుణంగా మన శరీరం స్పందిస్తుంటుంది.
- ఉదయం లేచిన తర్వాత జీవక్రియలు మెరుగ్గా ఉంటాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ గరిష్ఠ స్థాయిలో ఉంటుంది. ఆ సమయంలో ఎక్కువ కేలరీలు తీసుకున్నా రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.
- సూర్యాస్తమయానికి దగ్గర పడుతున్న కొద్దీ జీవక్రియలు మందగిస్తాయి. రాత్రిపూట ఇన్సులిన్ పనితీరు బాగా తగ్గిపోతుంది. ఈ సమయంలో ఎక్కువ ఆహారాన్ని తింటే.. ఇన్సులిన్ సరిపోక.. రక్తంలో షుగర్ స్థాయులు పెరుగుతాయి.
- ఒక్క ఇన్సులినే కాదు మన శరీరంలోని ప్రధాన హార్మోన్లన్నీ శరీర గడియారం లయకు అనుగుణంగా పనిచేస్తాయి. దాన్ని భంగపరిచినప్పుడు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అధిక బరువు, హైబీపీ, మధుమేహం వంటి వ్యాధులు వస్తాయి.

ఇప్పుడేం చేయాలి...

- రోజువారీ ఆహార సమయాలను స్థిరంగా ఉంచాలి.
- ఉదయం నిద్ర లేచిన తొలి గంటన్నరలోపు ఏదైనా తినాలి.
- మధ్యాహ్న భోజనంలో సమతౌల్యత ఉండాలి. అన్నంతో పాటు గింజ ధాన్యాలు, పప్పు దినుసులు, కూరగాయలు, పండ్లు ఉండాలి. ప్రొటీన్ ఆహారం కచ్చితంగా తినాలి. ఫ్యాట్, షుగర్, ఉప్పు తక్కువగా ఉండాలి.
- సాయంత్రం పండ్ల ముక్కలు, మొలకెత్తిన గింజలు, ఓట్స్, రాగి జావ, 10-12కు మించకుండా నట్స్ వంటి స్నాక్ ఏదైనా తీసుకోవాలి.
- రాత్రి ఆహారాన్ని సాధ్యమైనంత పరిమితంగా, త్వరగా ముగించాలి. మధ్యాహ్నం రెండు కప్పుల అన్నం తింటే.. రాత్రిపూట ఒక కప్పు అన్నమే తినాలి. తద్వారా నిద్ర, జీవక్రియకు భంగం కలగదు.
- నిద్రపోవడానికి కనీసం 2 గంటల ముందు ఏమీ తినొద్దు.
- రాత్రి 9 గంటలకు తిన్న తర్వాత మళ్లీ సాధ్యమైనంత వరకూ ఘనాహారం తీసుకోవద్దు. ఆకలిగా అనిపిస్తే.. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, హెర్బల్ టీ వంటి ద్రవాహారాలను తీసుకోవచ్చు.
- ఎన్ని పనుల్లో ఉన్నా కచ్చితంగా నిర్దిష్ట సమయానికే రోజూ ఆహారాన్ని తీసుకోవడం తప్పనిసరి.

ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆహారాన్ని తీసుకోవడం.. మిగిలిన సమయంలో ఉపవాసం పాటించడం. ఇలా 10-12 గంటల ఆహార స్వీకరణ విధానాన్ని అనుసరించడం కూడా మేలు చేస్తుంది.

అధ్యయనం ఇలా...

- ఆహార నియమాల విషయంలో తాజాగా ప్రాచుర్యంలోకి వచ్చిన సిద్ధాంతం 'క్రోనో న్యూట్రిషన్'. దీనిపై అంతర్జాతీయంగా చాలా అధ్యయనాలు జరిగాయి.
- ఊబకాయం ఉన్న 420 మంది బరువును 20 వారాల్లో తగ్గించే ప్రక్రియను స్పెయిన్‌లో చేపట్టారు. వీరిని రెండు గ్రూపులుగా చేశారు.
- అందరికీ ఒకే రకమైన కేలరీలున్న ఆహారం ఇచ్చారు. వ్యాయామాలు, నిద్ర సమయం కూడా ఒకేలా ఉండేలా చేశారు.
- మధ్యాహ్నం 3 గంటలలోపు లంచ్ చేసిన వారు.. ఆ తర్వాత తిన్న వారి కంటే ఎక్కువ బరువు తగ్గారు.
- ఉదయం ఏమీ తినకుండా ఉండడం లేదా బాగా తక్కువ కేలరీలు తీసుకున్నవారు బరువు తగ్గలేదు.
- 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఒబెసిటీ'లో ప్రచురించిన 'క్రోనో న్యూట్రిషన్' ఆహార వేళలు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో స్పష్టం చేసింది.



– డాక్టర్ లతాశశి, చీఫ్ న్యూట్రిషనిస్ట్, ఫెర్నాండెజ్ హాస్పిటల్, హైదరాబాద్

ఒక రూంలో పరీక్ష రాసిన వారందరికీ ఉద్యోగాలు!

- ఒకే హాల్‌టికెట్ నంబరు ఇద్దరిద్దరికి
- స.హ. చట్టంతో డీఎస్సీ-94 అక్రమాలు వెలుగులోకి!

అనంతపురం (ఎస్కేయూ), న్యూస్‌టుడే: డీఎస్సీ-1994లో అక్రమాలు జరగాయంటూ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలను ఓ సహ కార్యకర్త వెలుగులోకి తెచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన మోహన్‌కృష్ణ మూడు దశాబ్దాలుగా ఈ అక్రమాల వెలికితీత కోసం ప్రయత్నిస్తున్నారు. సహ చట్టం కింద ఆయన చేసిన దరఖాస్తుకు జిల్లా విద్యాశాఖ అధికారులు 23 పేజీల సమాచారమిచ్చారు. అందులో పేర్కొన్న ప్రకారం..

- 1994 డీఎస్సీలో కొందరు అభ్యర్థులు ఒకే గదిలో పరీక్షలు రాసేలా వరుసగా హాల్‌టికెట్లు నంబర్లు వేయించుకొన్నారనే అభియోగాలున్నాయి. 12100974 నుంచి 981 వరకూ హాల్‌టికెట్లు ఉన్నవారంతా ఉద్యోగాలు సాధించారు. 12103980 నుంచి 990 వరకూ, 12104061 నుంచి 4069, 12100957 నుంచి 960, 963 నుంచి 966 వరకు హాల్‌టికెట్ నంబర్లు ఉన్నవారందరికీ ఉద్యోగాలు వచ్చాయి. కాపీయింగ్ జరగడం వల్లే ఇలా అందరూ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- ఒకే హాల్‌టికెట్ నంబరు ఒకరి కంటే ఎక్కువ మందికి కేటాయించారు. కుళ్లాయప్ప, చంద్రశేఖర్‌రావు అనే అభ్యర్థులకు 12103950 నంబరు వచ్చింది. 12103995 హాల్‌టికెట్ చాంద్‌బాషా, సమీవుల్లాకి, 12104002 నంబరు సుబ్రహ్మణ్యశర్మ, మీరాబాయిలకు, 12100980 నంబరు వెంకటేశ్వర్లు, రఘునాథరెడ్డిలకు, 12100315 నంబరు చిన్ని కృష్ణ, బషీర్ అహమ్మద్‌లకు కేటాయించారు. ఈ అక్రమాలపై పోరాడేందుకు నాడు పరీక్ష రాసిన అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

డిస్కంల గ్రేడింగ్ పడిపోయింది!

- జగన్ హయాంలో నిర్ణయాల ఫలితం
- ఆర్థికంగా, నిర్వహణలోనూ అస్తవ్యస్తం
- గ్రేడింగ్‌ను విడుదల చేసిన కేంద్రం
- తెలంగాణ డిస్కంలదీ అదే తీరు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కం) పనితీరు దిగజారింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి డిస్కంల ఆర్థిక పరిస్థితి, పనితీరును 15 అంశాల్లో కేంద్రం మదింపు చేసి, గ్రేడింగ్ ఇచ్చింది. ఏపీకి చెందిన సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ గత ఏడాది (2022-23) సాధించిన బి- కంటే దిగజారి 'సి' గ్రేడింగ్ సాధించాయి. ఈపీడీసీఎల్ 'ఎ' గ్రేడింగ్‌ను నిలబెట్టుకున్నా, గత ఏడాదితో పోలిస్తే మార్కులు తగ్గాయి. మూడు డిస్కంల పనితీరు దిగజారినట్లు కేంద్రం ఇచ్చిన గ్రేడింగ్‌లు స్పష్టం చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను విధ్వంసం చేసిందనడానికి ఇదే నిదర్శనం. తెలంగాణలో రెండు డిస్కంల పనితీరూ మరింతగా దిగజారినట్లు కేంద్రం నివేదికలో ప్రస్తావించింది.

100 మార్కులకు మూల్యాంకనం

దేశంలోని 63 డిస్కంలు గ్రేడింగ్ కోసం నివేదికలు అందించాయి. దీనికోసం 15 అంశాలను కేంద్రం మదింపు చేసి '13వ ఇంటిగ్రేటెడ్ రేటింగ్, ర్యాంకింగ్'లను ఇటీవల విడుదల చేసింది. ప్రధానంగా పంపిణీ వ్యయం, యూనిట్ విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం (ఏఆర్‌ఆర్) మధ్య వ్యత్యాసం, కార్పొరేట్ గవర్నెన్స్, సబ్సిడీలు పొందే వ్యవధితో పాటు పలు అంశాలను కేంద్రం పరిశీలించింది. ఈ ప్రక్రియకు నోడల్ ఏజెన్సీగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) వ్యవహరించింది. డిస్కంల పనితీరుకు గరిష్ఠంగా 100 మార్కులను కేటాయించి, అందులో అవి సాధించిన మార్కుల ఆధారంగా ఎ+, ఎ, బి, బి-, సి, సి-, డి కేటగిరీలుగా రేటింగ్స్ ఇచ్చింది.



రాష్ట్ర డిస్కంలు సాధించిన గ్రేడింగ్

డిస్కం	20222-23లో మార్కులు	గ్రేడ్	2023-24లో మార్కులు	గ్రేడ్/రేటింగ్
ఎస్‌పీడీసీఎల్	47.8	బి-	19.5	సి(2 స్టార్)
సీపీడీసీఎల్	45.1	బి-	31.5	సి(2 స్టార్)
ఈపీడీసీఎల్	71.2	ఎ	65.1	ఎ(4 స్టార్)

వెనుకబడిన రాష్ట్రాలూ ముందుకు వెళ్తుంటే..

గతేడాది (2022-23)తో పోలిస్తే.. బిహార్ డిస్కంలూ పనితీరు మెరుగుపరచుకున్నాయి. అస్సాం, ఉత్తరాఖండ్‌తో పాటు మనకు పొరుగునే ఉన్న కర్ణాటక, కేరళ, తమిళనాడు సైతం గ్రేడింగ్ పెంచుకున్నాయి. మొదటి 10 స్థానాల్లో మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణాతో పాటు ఒడిశాలోని మూడు ప్రైవేటు డిస్కంలూ ఉండడం గమనార్హం.

మార్కులు, గ్రేడింగ్ ఇలా..

- **ఉన్నతమైన ఆర్థిక, కార్యాచరణ పనితీరు:** 65-85 మార్కుల లోపు (ఏసీఎస్.. ఏఆర్ఆర్ మధ్య వ్యత్యాసం 15 పైసల లోపు.. ఎ గ్రేడ్)
- **సగటు కంటే తక్కువ ఆర్థిక, కార్యాచరణ పనితీరు:** 15-35 మార్కుల లోపు (ఏసీఎస్.. ఏఆర్ఆర్ మధ్య వ్యత్యాసం యూనిట్‌కు 1.25 కంటే తక్కువ ఉంటే.. సి గ్రేడ్)
- **ఆర్థికంగా, ఇతరత్రా తక్కువ పనితీరు:** 15 మార్కుల కంటే తక్కువ

తెలంగాణ డిస్కంలదీ వెనుకబాటే

తెలంగాణకు చెందిన ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లు గతేడాది కంటే దిగజారి 'సి-' గ్రేడ్‌కు పరిమితమయ్యాయి. వాటికి '1 స్టార్' రేటింగ్ మాత్రమే దక్కింది. ఎన్‌పీడీసీఎల్ గతేడాది 17.9 మార్కులతో 'సి' గ్రేడ్ సాధిస్తే, కేంద్రం తాజాగా విడుదల చేసిన గ్రేడింగ్‌లో 16.7 మార్కులతో 'సి-'కు పరిమితమైంది. ఎస్‌పీడీసీఎల్ గతేడాది 19.9 మార్కులతో 'సి' గ్రేడ్ సాధిస్తే.. ప్రస్తుతం 11.4 మార్కులతో 'సి-'కు దిగజారింది.

సర్వేలో గుర్తించిన ముఖ్య అంశాలు

- దేశవ్యాప్తంగా 16 డిస్కంలు రేటింగ్‌ను పెంచుకోగా, తెలుగు రాష్ట్రాలకు నుంచి ఒక్కటీ లేదు.
- 11 డిస్కంల రేటింగ్ గతేడాదితో (2022-23) పోలిస్తే పడిపోయింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన నాలుగు డిస్కంలు ఇందులో ఉన్నాయి.
- 23 డిస్కంలు.. 10 విద్యుత్ శాఖలు పనితీరును మెరుగుపరుచుకున్నాయి. (గతేడాదితో పోలిస్తే.. 5%కు మించి మార్కులు సాధించాయి)

రూ.1,183 కోట్లు గంగపాలు

- 25% నిధులు ఖర్చు చేసి, ప్రాజెక్టులను మధ్యలో వదిలేసిన ఫలితం
- పూర్తి స్థాయిలో గణిస్తే వృథా రూ.వేల కోట్లలో
- కొత్త సాగునీటి ప్రాజెక్టులపై బహుపరాక్

ఈనాడు, అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఒక వ్యూహం లేకుండా.. నిధుల లభ్యతపై దృష్టి పెట్టకుండా.. కొత్తవాటిని మంజూరు చేస్తూ.. పాతవాటిని మధ్యలో వదిలేస్తుండటంతో అప్పటి వరకు వాటిపై వెచ్చించిన నిధులు సద్వినియోగం కావడం లేదు. జలవనరుల శాఖలో పనులు కొంత చేసి.. కొంత చేయకపోవడం వల్ల రూ.1,183 కోట్లు వృథా ఖర్చుగా మిగిలింది. ఇది 25%లోపు మాత్రమే ఖర్చు చేసి ఆగిపోయిన ప్రాజెక్టుల్లో తేలిన లెక్క మాత్రమే. అంతకన్నా ఎక్కువ మొత్తాలు ఖర్చు చేసి, పూర్తి స్థాయిలో నిధులివ్వక, ప్రాజెక్టులు పూర్తి చేయక, ఫలితాలు దక్కనివి పరిగణనలోకి తీసుకుంటే ఆ వృథా రూ.వేల కోట్లలో ఉంటుంది.

రాష్ట్రంలో ఏళ్ల తరబడి అసలు పైసా కూడా ఖర్చు చేయని, 25% లోపు మాత్రమే ఇంతవరకు ఖర్చు చేసి పనులు నిలిపివేసిన ప్రాజెక్టులపై జలవనరుల శాఖ కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇలాంటి సాగునీటి ప్రాజెక్టుల పనులను నిలిపివేసింది. అందులో ప్రాధాన్య ప్రాజెక్టులను, ప్రజలకు అవసరమైన వాటిపై మళ్లీ చర్చించి ఆమోదం తెలియజేస్తోంది. 71 పనులు కొనసాగించాలని, మరో 50 పనులు అవసరం లేదని తేల్చారు. మరో 30 పనులపై చర్చలు సాగుతున్నాయి. 2009, 2014, 2018 సంవత్సరాల్లో పాలనామోదం పొందిన ప్రాజెక్టులూ వీటిలో ఉండటం గమనార్హం. అప్పటి నుంచి 71 ప్రాజెక్టుల్లో రూ.1,350.17 కోట్ల విలువైన పనులు చేసి వదిలేశారు. ఇందులో రూ.1,183 కోట్ల బిల్లులు చెల్లించేశారు. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా విలువ రూ.27,941 కోట్లు. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రాజెక్టులు అనేకం వీటిలో ఉన్నాయి.


ఏళ్ల తరబడి ఇటు చూడలేదు!

ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఉన్నా ప్రభుత్వాలు ఏళ్ల తరబడి దాన్ని కన్నెత్తి చూడలేదు. 2019లో చంద్రబాబు హయాంలో, అంతకుముందు వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో పాలనామోదం ఇచ్చిన ప్రాజెక్టులతో పాటు జగన్ సర్కార్‌లో టెండర్లు పిలిచిన పనులూ ఇందులో ఉండటం గమనార్హం. ఈ 71 పనుల్లో దాదాపు 24 పనులు 2019 కన్నా ముందు పాలనామోదం ఇచ్చి టెండర్లు పిలిచినవే. ఇందులో 20 పనులపై దాదాపు 25% నిధులు ఖర్చు కూడా చేశారు. 2019 కన్నా ముందు చేపట్టిన 22 పనులపై జగన్ ప్రభుత్వం కనీస ఖర్చు కూడా చేయలేదు.

పాతవి వదిలేసి.. కొత్తవి మొదలుపెట్టి

జగన్ ప్రభుత్వం 2020లో సాగునీటి ప్రాజెక్టులపై లెక్కలు వేసింది. పోలవరం ప్రాజెక్టు మినహా అప్పటికి నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు రూ.24,092 కోట్లు నిధులు అవసరమని తేల్చింది. వాస్తవ లెక్కలు చూడగా ఆ మొత్తం రూ.35 వేల కోట్ల వరకు చేరింది. అలాంటి పరిస్థితుల్లో వైకాపా సర్కార్ రూ.72,458 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. కొన్ని ప్రాజెక్టులపై రూ.వేల కోట్లు ఖర్చు చేసి అనేక సమస్యలతో వాటిని మధ్యలో వదిలేసింది.

ఇదీ సంగతి!



ఏమో డాక్టర్.. అమెరికా వీసా వచ్చిందన్న మాటేగానీ ఎప్పుడూ నన్ను ఎవరో వెంబడిస్తున్నట్లు, నా సోషల్‌మీడియా ఎకౌంట్లు హ్యాక్ అయినట్లు, నా ఫోన్ ఎవరో వింటున్నట్లు అనిపిస్తోంది..!

పర్యాటక భూములపై పెద్దల కన్ను!

- వైకాపా ప్రభుత్వంలో పీపీపీ ప్రాజెక్టుల వెనుక గూడుపుఠాణీ
- కూటమి ప్రభుత్వంలో టెండర్ల రద్దుతో తప్పిన భారీ నష్టం

రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థలో వైకాపా ప్రభుత్వంలో కీలక స్థానంలోని ఒక ఉన్నతాధికారి కన్ను వెలగొండలోని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన విలువైన ఐదెకరాల ఖాళీ స్థలంపై పడింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద అందులో 'వే సైడ్ ఎమినిటీస్ ప్రాజెక్టు' ఏర్పాటుకు రెండు బినామీ సంస్థల పేర్లతో ఎన్నికల ముందు బిడ్లు వేయించారు. ఇందులో ఏ సంస్థకు భూమి కేటాయించినా ప్రాజెక్టు తనకే దక్కేలా ఏర్పాట్లు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల ఆ టెండర్లు రద్దుచేసింది. లేదంటే విలువైన భూములు వైకాపా వీరవిధేయ అధికారులు, ఆ పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లేవి.



ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన విలువైన భూములను కొట్టేసేందుకు ఎన్నికలకు ఐదు నెలల ముందు టెండర్లు పిలిచారు. రాష్ట్రంలో వివిధ చోట్ల సంస్థకు చెందిన వంద ఎకరాలకు పైగా భూములు చేజిక్కించుకోవాలన్నది వైకాపా వర్గీయుల ఆలోచన. ఏడుచోట్ల పీపీపీ ప్రాజెక్టులకు పర్యాటకాభివృద్ధి సంస్థ 2025 జనవరిలో టెండర్లు పిలిచింది. వీటిలో హోటళ్లు, వేసైడ్ ఎమినిటీస్, సాహస పర్యాటకం, రోప్‌వే, సీ ప్లేన్ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి పలు సంస్థలు బిడ్లు వేశాయి. టెండర్లు ఖరారు చేసేలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఆగిపోయాయి.

వైకాపా నేతలు, అధికారుల బినామీ సంస్థలే ఎక్కువ

బిడ్లు దాఖలుచేసిన సంస్థల్లో ఎక్కువగా వైకాపా నేతలు, గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఉన్నతాధికారుల బినామీ సంస్థలే ఉన్నాయి. గత ప్రభుత్వంలో పర్యాటకాభివృద్ధి సంస్థ పాలకవర్గంలో ఒక ప్రముఖుడు, రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థలో ఉన్నతాధికారి, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలకు చెందిన కొందరు వైకాపా ఎమ్మెల్యేల ముఖ్య అనుచరులు బిడ్లు వేశారు. మళ్లీ వైకాపా ప్రభుత్వం ఏర్పాటైతే భూములన్నీ వారి చేతుల్లోకి వెళ్లేవి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టెండర్లు రద్దుచేసింది. పీపీపీ ప్రాజెక్టులకు వేసిన బిడ్లు, వాటి అనుబంధ పత్రాలపై సమగ్ర విచారణ చేయిస్తే వాటి బాగోతం బయటపడేది. పర్యాటకాభివృద్ధి సంస్థ అలాంటి ప్రయత్నం చేయలేదు. టెండర్లు రద్దు చేసి, ఈఎండీలు వెనక్కి ఇచ్చేశారు.

పర్యాటకాభివృద్ధి సంస్థలో అన్నీ వారే..

పర్యాటకాభివృద్ధి సంస్థలో ప్రాజెక్టుల రూపకల్పన, టెండర్లు పిలవడం, బిడ్ల పరిశీలన వంటి విషయాల్లో రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ క్రమంలోనే ఆ సంస్థ కీలక అధికారి పర్యాటకాభివృద్ధి సంస్థ భూములను బినామీ పేర్లతో కొట్టేసేందుకు ప్రయత్నించారు.

– ఈనాడు, అమరావతి




ఈనాడు

శిక్షల భయం లేకే...

మెదడును మొద్దుబార్చి మనిషిలో విచక్షణ జ్ఞానాన్ని చంపేసే మద్యాన్ని సేవిస్తే సరిగ్గా నిలబడటమే కష్టమవుతుంది. అలాంటిది నిషా తలకెక్కిన వ్యక్తి ఏకంగా స్టీరింగ్ పట్టుకుంటే! పైగా అది పిల్లలను బడికి తీసుకెళ్లే వాహనమైతే! ట్రాఫిక్ యంత్రాంగం ఇటీవల హైదరాబాద్ నగరవ్యాప్తంగా చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ పరీక్షల్లో ఈ మేరకు ఆందోళనకర వాస్తవాలు వెలుగుచూశాయి. 14 మంది స్కూల్ బస్సుల డ్రైవర్లు, విద్యార్థులను తరలిస్తున్న మరో 26 మంది ఆటోడ్రైవర్లు పూటుగా తాగి ఉన్నట్లు గుర్తించారు. ఒక బస్ డ్రైవర్‌కైతే రక్తంలో ఆల్కహాల్ నిర్ణీత ప్రమాణాలకన్నా పదమూడురెట్లు ఎక్కువగా ఉంది. పైగా అంత కైపులో బండి నడపడం తనకు కొత్తేమీ కాదని అతడు తాపీగా చెప్పడం దిగ్భ్రాంతపరుస్తోంది. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పరితపించే తల్లిదండ్రులు బస్సులు, ఆటోలు, వ్యాన్లకు ఫీజు రూపాయలు ధారబోస్తారు. తమ బిడ్డలను భద్రంగా తీసుకెళ్లి తిరిగి తీసుకొస్తారన్న నమ్మకంతోనే దూర ప్రాంతాల్లోని స్కూళ్లకు పంపుతుంటారు. యాజమాన్యాల బాధ్యతారాహిత్యం, డ్రైవర్ల నేరపూరిత నిర్లక్ష్యం వల్ల జరగరానిది ఏమైనా జరిగితే ఏంటి పరిస్థితి? స్కూల్ బస్సుల స్థితిగతులు, డ్రైవర్ల తీరుతెన్నులపై రవాణా యంత్రాంగం ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతుంటేనే- చిన్నారులు సురక్షితంగా స్కూళ్లకు వెళ్లగలరు!

మత్తుపదార్థాలు తీసుకుని బండ్లు తోలడం వల్ల భారతీయ రహదారులపై 2022లో పదివేలకు పైగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటిలో 4,201 ప్రాణదీపాలు ఆరిపోయాయి. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే నిరుడు దాదాపు 83వేల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే అవి 18వేలకు పైబడ్డాయి. విశాఖపట్నంలోనూ అలాంటివి 2023తో పోలిస్తే, నిరుడు 58శాతం అధికమయ్యాయి. శ్రీకాకుళం, విజయవాడ, అనంతపురం... ఇలా అన్నిచోట్లా తాగి వాహనాలు నడుపుతూ ఎందరో పట్టుబడుతున్నారు. వాస్తవానికి మత్తులో ఏదుటివారిని ఢీకొడుతున్నవారిలో చాలామంది తప్పించుకుని వెళ్లిపోతున్నారు. శ్వాస విశ్లేషణ పరీక్షల్లో జాప్యం, పోలీసులపై ఒత్తిళ్ల వల్ల వాస్తవంగా జరిగిన దుర్ఘటనలన్నీ సర్కారీ దస్త్రాల్లోకి ఎక్కట్లేదు. మరోవైపు, ఒళ్లూ పయ్యి తెలియని స్థితిలో ఉండే వాహనదారులకు పేరుకు జరిమానాలు విధిస్తున్నారు. అప్పుడప్పుడు లైసెన్సులు రద్దు చేస్తున్నారు. అక్కడక్కడా శిక్షలు పడుతున్నాయి. అయినా పరిస్థితిలో మార్పురాకపోవడం మరిన్ని కఠినచర్యల ఆవశ్యకతను తెలియజేస్తోంది.

ఆస్ట్రేలియాలో మద్యం మత్తులో వాహనాన్ని పరుగులు తీయించి ఎవరి మరణానికైనా కారణమైతే 20ఏళ్ల దాకా కఠిన దండన విధించే వీలుంది. అమెరికా, జపాన్, దక్షిణాఫ్రికా వంటి చోట్ల పదిహేనేళ్ల దాకా కారాగారవాసం తప్పదు. ఆయా దేశాలతో పోలిస్తే ఇండియాలో అరకొర జరిమానాలూ శిక్షల వల్ల నిబంధనల ఉల్లంఘనులకు వెరపు ఉండటం లేదు. కాబట్టి ఎవరైనా తాగి స్టీరింగ్ పట్టుకోవాలంటే భయపడేలా దండనల తీవ్రతను పెంచుతూ చట్టాలను రాటుతేల్చాలి. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడేవారి లైసెన్సులను శాశ్వతంగా రద్దుచేయాలి. వారాంతాల్లోనే కాకుండా ట్రాఫిక్ పోలీసులు నిత్యం తనిఖీలు చేపట్టాలి. హైవేలపైనా డ్రైవర్లకు శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించాలి. సామాజిక అశాంతికి కారణమవుతున్న మద్యం మహమ్మారి- పచ్చటి సంసారాలను ఛిద్రంచేస్తోంది. దాన్ని ఆదాయ వనరుగా చూడకుండా మద్యపాన దురలవాటును సమాజంలోంచి పారదోలేందుకు పాటుపడటం ప్రజాప్రభుత్వాల కనీస బాధ్యత!



కాలానుగుణంగా తనను తాను మార్చుకోవడం, నిరంతరం కొత్త ఆవిష్కరణలతో ముందుకెళ్లడం ఏ సంస్థకైనా అవసరం. అప్పుడే పోటీని తట్టుకుని మునుగడ సాగించగలదు.

- శివ్ నాడార్, వ్యాపారవేత్త

ధర్మాధర్మాలు

ఆహార భయ నిద్రా మైథునాలు అన్ని జీవులకూ సమానమైనా, మనిషిని సకల ప్రాణులనుంచీ వేరు చేసేది బుద్ధి లేదా యుక్తాయుక్త విజ్ఞాన అనే ప్రజ్ఞ. దీని ప్రధాన లక్షణం మానవత్వ పరిరక్షణ. అదే ధర్మం. దీనికి విరుద్ధమైనదే అధర్మం. ధర్మాన్ని సమగ్రంగా ఆచరించటాన్ని, ఈ దేశానికి ధర్మక్షేత్రమని పేరు. ఇది సనాతన ధర్మం ద్వారా, పురాణేతిహాసాల ద్వారా జనజీవితాల్లో భాగమవుతూ వచ్చింది.

ధర్మం కర్తవ్య, నీతి నియమాలకు ప్రతీక. ధర్మం ఆనత్య, అన్యాయాలకు ఆలవాలం. వేదానికి, ధర్మానికి భేదమే లేదు. ధర్మనిష్ఠలో రాముణ్ణి మించినవారు



లేరు. అందుకే 'పది కంపలను లేని నిప్పైననను, రామభజన మందిర ముందు వరలుగాత' అంటూ కౌసల్యాసుతుణ్ణి కీర్తిస్తారు. అశ్వత్థామ హతః అని బిగ్గరగా, కుంజరః అని గొణుగుడు నెమ్మదిగా అన్నా; శరణాగతునికి గాయపడే తన వైపు వచ్చిన పంది జాడను ప్రశ్నించిన వేటగాడితో 'చూసే కన్ను మాట్లాడదు, మాట్లాడే నోరు చూడలేదు' అంటూ పోతన అస్పష్టంగా చెప్పినా ధర్మాన్ని కాపాడటమే. ఒక్కోసారి ధర్మాధర్మాల విభజన రేఖ స్పష్టంగా కనపడదు. ధర్మ పరిరక్షణలో దీక్షాపరుడు అనదగ్గ ధర్మరాజు అంతటివాడు, జూదంలో 'ఇన్నోడి నన్నోడెనా, నన్నోడి ఇన్నోడెనా' అన్న ద్రౌపది ప్రశ్నకు తడబడ్డాడు. ఆవుపాకానికి కర్తవ్యం అయినా, అదే పక్షంలోని విదుర్నం వ్యతిరేకిస్తూ శాస్త్రప్రకారం స్పష్టంగా ధర్మం చెప్పాడు. లాభ లోభ

అంతర్యామి

పక్షపాతాలతోనో, ఊగిసలాడే బుద్ధితో తెలిసి కూడా ధర్మం చెప్పకపోతే, అసత్య దోష వలం ప్రాప్తిస్తుందని వివరిస్తూ వివరించాడు.

ఆవేశమూ ఆగ్రహమూ కలిగినప్పుడు ధర్మాధర్మాలు వివరించి చెప్పలేగానే తోడు ఉండటం అదృష్టం. మొత్తం భారతం సారాంశాన్ని ఒకే శ్లోకంలో చెప్పమని, దాన్ని రాస్తున్న వినాయకుడు వ్యాసుణ్ణి ప్రశ్నిస్తాడు. 'ఇతరులకు ఉపకారం చేయడం పుణ్యం, అపకారం చేయడం పాపం' అని అర్థశ్లోకంలో ధర్మం చెబుతాడు వ్యాసుడు. సమస్త సృష్టితో కలిసి జీవించమని ధర్మం బోధిస్తోంది. ఇది ప్రేమను విస్తరిస్తోంది. అప్పుడే సంపూర్ణంగా మొదలవుతాయి. ఓ వ్యక్తి పై మరో వ్యక్తికి ప్రేమే అందరి మీదా ప్రసరించడాన్ని కరుణ అంటారు. ఆ కరుణే సమస్త ధర్మాల సారం. అందుకే ఆ చెట్టయితే కరుణ అని అంటారు.

ధర్మో రక్షతి రక్షితః అన్నది ఆర్యోక్తి. ధర్మాన్ని రక్షిస్తే, అదే మనల్ని రక్షిస్తుంది. ధర్మం తప్పనివారి పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుంది. ధర్మానికి హాని కలిగినప్పుడల్లా, దాన్ని కాపాడటానికి అవతరిస్తానని గీతాచార్యుడు చెప్పాడు. అధర్మంలో మోసం, హింసలు దాగి ఉంటే- ధర్మంలో సత్యం, దయ, శాంతి, మంచి నడవడి, న్యాయం నిండి ఉంటాయి. అందుకే అది అందరికీ ఆచరణీయం.

- పాణ్ణిడి వీర వెంకట సత్యనారాయణ

స్వతంత్రంగా... సామరస్యంగా...

బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో ఇటీవల బ్రిక్స్ సదస్సు జరిగింది. దీనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పలు కారణాలవల్ల హాజరుకాలేదు. అయితే, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనడం ఆ సభకు దన్నుగా నిలిచింది. మొదట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన బ్రిక్స్‌లో ఇప్పుడు ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. సౌదీ అరేబియా, అర్జెంటీనాలు ఇంకా లాంఛనంగా బ్రిక్స్‌లో చేరలేదు. బహుళపక్ష ఆర్థిక, రాజకీయ, వాణిజ్య సంస్థలపై అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలకున్న పట్టు బ్రిక్స్‌కు ఆటంకం కలిగిస్తోంది. అయినా బ్రిక్స్ పట్టువిడవకుండా ముందుకుసాగాలని భావిస్తోంది. డాలర్‌కు ప్రత్యామ్నాయం కనుగొనాలనే ప్రయత్నం కొనసాగుతోంది.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలలో కల్లోలం, ట్రంప్ ప్రారంభించిన టారిఫ్ యుద్ధం వల్ల అంతర్జాతీయంగా ఏర్పడిన సంక్షుభిత పరిస్థితులలో బ్రిక్స్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ విషయాన్ని గుర్తించి బ్రిక్స్ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్ధమాన, పాశ్చాత్య సంపన్న దేశాల మధ్య వారధిగా నిలవడం భారత్‌కు అనివార్యమైంది.

సహకార మార్గం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రస్తుతం ప్రపంచాన్ని కలవరపరుస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్డీజీ) సాధనకు అమెరికా నుంచి నిధులు, నిబద్ధత కొరవడుతున్నాయి. అగ్రరాజ్యం ఖాళీ చేసిన స్థానాన్ని బ్రిక్స్ భర్తీచేసేలా



కనిపిస్తోంది. వర్ధమాన దేశాల సమగ్ర ప్రగతికి పాటుపడే సంఘంగా అది నిలవనుంది. అమెరికా ఆధిపత్యంలోని ఏకధ్రువ ప్రపంచానికి భిన్నంగా బహుళ ధ్రువ ప్రపంచ సాధనలో ఈ కూటమి కీలక పాత్ర పోషించనుంది. ఇవి సాధ్యపడాలంటే మొదట అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవాలి. బ్రిక్స్ దేశాల ఆర్థిక పాటవం క్రమంగా అమెరికా-ఐరోపాలతో పోటీపడే స్థాయికి చేరుకుంటోంది. పాశ్చాత్య దేశాలకు భిన్నంగా అధునాతన టెక్నాలజీని పరస్పరం పంచుకోవడానికి బ్రిక్స్ సిద్ధంగా ఉంది.

రియో బ్రిక్స్ సదస్సులో పర్యావరణ సంరక్షణ ఆవశ్యకతను భారత్ ముందుకు తెచ్చింది. అంతర్జాతీయ ఆరోగ్య సేవల విస్తరణ ఆవశ్యకతనూ తెలియజెప్పింది. అంతర్జాతీయ సౌరశక్తి కూటమికి భారత్ నాయకత్వం వహిస్తోంది. ప్రకృతి విపత్తులను తట్టుకోగల మౌలిక వసతుల నిర్మాణ కూటమిలోనూ భాగస్వామి అయ్యింది. అంతర్జాతీయ జీవ ఇంధన, అంతర్జాతీయ పులులు, సింహాల సంరక్షణ సంఘాల్లోనూ ఇండియా సభ్యదేశం. మిషన్ లైఫ్, ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరుతో ఒక చెట్టు) వంటి విధానాలతో ప్రకృతి, జీవజాతుల సంరక్షణ పట్ల తన నిబద్ధతను చాటుకుంటోంది. ఇలాంటి కార్యక్రమాల పట్ల పాశ్చాత్య దేశాలకు అంత ఆసక్తి ఉన్నట్లు కనిపించదు. అందుకే వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో పేద దేశాలకు ఆర్థికంగా తోడ్పడటానికి సంపన్న రాజ్యాలు మొరాయిస్తున్నాయి. కానీ, తనవైపు నుంచి నిధులు బ్రిక్స్ సమీకరించడానికి సుముఖత వ్యక్తం చేస్తోంది.

పాశ్చాత్య దేశాలు ఆడమన్నట్లు ఆడటానికి తాము సిద్ధంగా లేమని, ప్రత్యామ్నాయ సహకార వేదికను నిర్మించుకుంటామని బ్రిక్స్ దేశాలు సంకేతాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా బ్రిక్స్‌లో చేరడానికి 23 దేశాలు దరఖాస్తు చేశాయి. మరో 21 దేశాలు ఆసక్తి చూపాయి. ఎక్కువ దేశాల చేరిక వల్ల బ్రిక్స్ పలుకుబడి పెరిగే మాట నిజమే కానీ, మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అవుతుందని గుర్తించి కూటమి విస్తరణపై ఆచితూచి అడుగులు వేయాలి. అమెరికా, ఐరోపా సమాఖ్య(ఈయూ)లతో రష్యా, చైనాలకు ఉన్న తీవ్ర విభేదాలు భారత్‌కు మధ్యవర్తిత్వ అవకాశాన్ని అందిస్తున్నాయి. అమెరికా, ఈయూలతో భారత్ ఘర్షణ పంథాను కాకుండా సహకార మార్గాన్ని అనుసరిస్తోంది. అయితే, డొనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాలపై టారిఫ్ కొరడా ఝళిపించడం, బ్రెజిల్‌పై 50శాతం అదనపు సుంకాలు విధిస్తానని బెదిరించడం భారత్ సామరస్య కృషిని దెబ్బతీస్తోంది. ఏ దేశమైనా బ్రిక్స్‌లో చేరితే ట్రంప్ 10శాతం సుంకం విధిస్తానంటున్నారు. ఆయా దేశాలు దీనిపై ఎలా ముందుకెళ్తాయో చూడాలి. అమెరికా, చైనాల మధ్య ముదురుతున్న వాణిజ్య వైరం ప్రపంచ సరఫరా గొలుసుల్లో బ్రిక్స్ దేశాల భాగస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. అమెరికా, చైనా వాణిజ్య సంప్రతింపులు చివరకు ఎలా ముగుస్తాయన్నది కీలక సమస్యగా మారింది.

అభివృద్ధి వైపు...

తనకు గిట్టని దేశాలకు డాలర్లు చిక్కకుండా ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు అలవాటు. దానివల్ల రష్యా, ఇరాన్ చాలా నష్టపోయాయి. ఫలితంగా డాలర్‌తో కాకుండా ప్రత్యామ్నాయ కరెన్సీలలో వాణిజ్యం జరపాలనే భావన అనేక దేశాల్లో బలపడుతోంది. బ్రిక్స్ దేశాలు సొంత కరెన్సీలలో వ్యాపారం చేసుకోవాలని చూస్తున్నా, డాలర్‌కు పూర్తిగా స్వస్తిచెప్పడానికి భారత్ ఇష్టపడట్లేదు. డాలర్‌ను వదిలిపెడితే చైనా కరెన్సీ బలపడే అవకాశం ఉంది. ఇక ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలూ బ్రిక్స్ దేశాలలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధ పరిష్కారానికి తాను చేస్తున్న ప్రయత్నాలకు రష్యా కలిసిరావడం లేదని ట్రంప్ ఆగ్రహిస్తున్నారు. భారత్ సైతం రష్యా, ఉక్రెయిన్‌లు శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపిస్తోంది. రష్యా, చైనాలు అమెరికాను సవాలు చేయడానికి బ్రిక్స్‌ను ఉపయోగించుకుంటున్నాయని డొనాల్డ్ ట్రంప్ రుసరుసలాడుతున్నారు. మరోవైపు పశ్చిమాసియా పరిస్థితులు చమురు ఎగుమతులను దెబ్బతీసి అంతర్జాతీయ ఆర్థికాన్ని తలకిందులు చేస్తాయన్న ఆందోళన రేగుతోంది. ఇక్కడా భారత్ సామరస్య పాత్రనే పోషిస్తోంది. 2026లో బ్రిక్స్‌కు ఇండియా అధ్యక్షత వహిస్తుంది. బ్రిక్స్ దృష్టిని యుద్ధాల వైపు నుంచి వర్ధమాన దేశాల అభివృద్ధి వైపు మళ్లించడానికి ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకోవాలి. రష్యా, చైనాల అమెరికా వ్యతిరేక వైఖరి బ్రిక్స్ పంథాగా మారకుండా నివారించాలి. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని విస్తరించడానికి, వాతావరణ మార్పులను సంయుక్తంగా అధిగమించడానికి ప్రాధాన్యమివ్వాలి.



డాక్టర్ వివేక్ మిశ్రా
డిప్యూటీ డైరెక్టర్, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్



మీది ఏ బెంచ్!?

స్కూల్లో చేరేటప్పుడూ క్లాసు మారినప్పుడూ పిల్లలకు లోలోపల ఓ భయం వెంటాడుతుంటుంది. బాగా చదివేవాళ్లకేమో... ఎత్తు ప్రకారం వెనక బెంచీలో కూర్చోమంటారేమోననీ, చదువుమీద ఆసక్తి లేని అల్లరి పిల్లలకేమో తమనెక్కడ ముందు కూర్చోబెడతారోననీనూ. ఎత్తు ప్రకారం అన్న రూలు తప్పనిసరి అంటే తప్ప, టీచర్ల దృష్టిలో పడకుండా ఉండేందుకు అల్లరి పిల్లలు సహజంగానే వెనక్కి చేరతారు. తరవాత వాళ్లే రౌడీగ్యాంగ్‌లా మారే ప్రమాదమూ లేకపోలేదు. బ్యాక్‌బెంచీ వాళ్లపట్ల టీచర్లూ పెద్దగా శ్రద్ధ పెట్టరు. చదువుపట్ల ఆసక్తిలేని పిల్లలే అక్కడ ఉంటారన్నది వాళ్ల అభిప్రాయం. టీచర్లు ప్రశ్నలు అడిగేటప్పుడూ బ్యాక్ బెంచ్ అని వెటకరిస్తుంటారు కూడా. మొత్తమ్మీద బ్యాక్ బెంచర్లంటే టీచర్లతోపాటు మిగిలిన విద్యార్థులకీ కాస్త చిన్నచూపే. అలాగని బ్యాక్ బెంచర్స్ మీద పాజిటివ్ అభిప్రాయాలూ లేకపోలేదు. ఫస్ట్ బెంచీ వాళ్లని కేవలం టీచర్లే ఇష్టపడతారనీ, వెనక బెంచీ వాళ్లు మొత్తం క్లాస్‌కి ఫేవరెట్స్ అనీ అనుకుంటారు. 'దేశంలోని మేధావులంతా వెనక బెంచీల్లోనే కనిపిస్తారు' అన్నారు అబ్దుల్ కలాం ఓ సందర్భంలో. అయినా వెనక వెనకబాటే అనుకుంటారంతా.

అందుకే, క్లాస్‌రూమ్‌లో అసలీ బ్యాక్ బెంచ్ కాన్సెప్టే తీసేస్తే... టీచర్‌కి విద్యార్థులంతా ఎదురుగా కనపడేలా చేస్తే... అప్పుడందరూ సమానమే కదా. ప్రతి ఒక్కరి బాడీ లాంగ్వేజ్‌నీ పరిశీలిస్తూ వాళ్లేం చేస్తున్నారో గమనించే అవకాశం టీచర్‌కి ఉంటుంది. సరిగ్గా ఇలాగే ఆలోచించాడు మలయాళ దర్శకుడు వినేష్ విశ్వనాథ్. ఆయన తొలి సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్' ఈమధ్యే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌మీద విడుదలైంది. ఓ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థుల మధ్య ఉండే తగాదాలు, సామాజిక వర్గ పక్షపాత ధోరణి, ఓ టీచర్ సైతం బ్యాక్‌బెంచ్ విద్యార్థిపట్ల చూపే వివక్షలను సున్నితంగా విమర్శిస్తూ తీసిన చిత్రమిది. చివరికి అతడు చూపించిన సెమీ సర్కిల్ క్లాస్‌రూమ్ పరిష్కారం ప్రేక్షకుల్నే కాదు, కేరళలోని స్కూళ్ల యాజమాన్యాలనూ ఆలోచింపజేసింది. ఫలితంగా ఇప్పటికే అక్కడ కొన్ని స్కూళ్లు తరగతి గదుల్లో ఈ తరహా సీటింగ్‌ని ప్రవేశపెట్టాయి. మరికొన్ని బడులూ ఆ దిశగా ఆలోచిస్తున్నాయి.

నిజానికిది కొత్త కాన్సెప్టేం కాదు, దర్శకుడు వినేష్ చిన్నప్పుడు చదువుకున్న ఎలిమెంటరీ స్కూల్లో ఇదే పద్ధతి ఉండేదట. పాతిక ముప్పై ఏళ్ల క్రితం కేరళతోపాటు మరో అయిదు రాష్ట్రాలను మోడల్ స్టేట్స్‌గా ఎంపిక చేసి ప్రాథమిక బడుల్లో సీటింగ్ మార్చమని సూచించింది కేంద్ర ప్రభుత్వం. ఆ సమయంలో కొన్ని స్కూళ్లు ప్రయత్నించాయి కూడా. ఈ సూచనలేవీ లేకుండానే... బెంచీల్లేని ఎలిమెంటరీ, చిన్నస్థాయి కాన్వెంట్‌ల్లోనూ అయిదో తరగతి వరకూ అర్ధ వృత్తంలో కూర్చోవడం ఒకప్పుడు మన దగ్గరా ఉండేది. మొత్తానికి ఒక సినిమా ఈ స్థాయిలో చర్చకు దారితీయడం, స్కూళ్లలో మార్పునకు శ్రీకారం చుట్టడం... చెప్పుకోదగ్గ అంశమే కదా!

- సాహితి

అప్పుల ఊబిలోకి...

పన్నులన్నీ పోగా ప్రజల దగ్గర మిగిలిన డబ్బును డిస్పోజబుల్ ఇన్‌కంగా పిలుస్తారు. ఒకవైపు భవిష్యత్తు అవసరాల కోసం ప్రజలు తమ ధనాన్ని బ్యాంకు డిపాజిట్లు, బాండ్లు, షేర్లు తదితరాల్లో మదుపు చేస్తున్నారు. అదే సమయంలో క్రెడిట్ కార్డులు, లోన్లు తీసుకోవడం, ఈఎంఐ చెల్లింపులు, ఇంటి అవసరాలకు నగలు కుదవబెట్టడం వంటివి అధికమవుతున్నాయి. దాంతో నికర మదుపుతో పోలిస్తే ఇటీవల అప్పులు పైకి ఎగబాకుతున్నాయి. స్థూల పొదుపులోంచి అప్పులు తీసివేస్తే నికర మదుపు వస్తుంది. గడిచిన ఆరు ఆర్థిక సంవత్సరాల్లో ఇండియా గ్రాస్ నేషనల్ డిస్పోజబుల్ ఇన్‌కం(జీఎన్‌డీఐ)లో కుటుంబాల స్థూల ఆర్థిక పొదుపు, అందులో అప్పుల వాటా... (శాతాల్లో)

సంవత్సరం	స్థూల పొదుపు	అప్పుల వాటా
2018-19	11.8	4.0
2019-20	11.4	3.8
2020-21	15.2	3.7
2021-22	10.9	3.8
2022-23	10.7	5.8
2023-24	11.2	6.1

(ఆధారం: ఆర్‌బీఐ వార్షిక నివేదిక)

జీవకళ కోల్పోతున్న ఉజ్జయినీ క్షిప్రా!

మధ్యప్రదేశ్‌లోని వింధ్య పర్వత శ్రేణిలో కక్రిబర్డి కొండల్లో ఉద్భవించిన క్షిప్రా నది- 190 కిలోమీటర్లు ప్రవహించి రాజస్థాన్ సరిహద్దు సమీపంలోని చంబల్ నదిలో కలుస్తుంది. పౌరాణికంగా ఎంతో ప్రాధాన్యమున్న ఈ నదిని 'షిప్రా' అనీ పిలుస్తారు. ప్రసిద్ధ ఉజ్జయినీ క్షేత్రముండేది ఈ నదీ తీరంలోనే. దీంతోపాటు ధార్, దేవాస్, మహిద్‌పూర్, బార్‌నగర్, అలోట్, సన్వర్, మౌ, ఖ్రోడ్ పట్టణాల నీటి అవసరాలను కూడా క్షిప్రా నదే తీరుస్తోంది. పన్నెండేళ్లకోసారి ఇక్కడ సింహస్థ కుంభమేళా నిర్వహిస్తారు. 2016లో జరిగిన ఉజ్జయినీ కుంభమేళాలో దాదాపు ఏడున్నర కోట్ల మంది పాల్గొన్నారు. 2028లో జరిగే పవిత్ర స్నానాలకు 45కోట్ల మంది రావచ్చని అంచనా. దాంతో క్షిప్రా నదిలో తగినంత నీటి ప్రవాహం ఉండేలా చూడటం పెనుసవాలుగా మారింది. మహా కుంభమేళా కోసమేకాదు- పారిశ్రామిక, గృహ, సాగు అవసరాలకూ నదిలో నీరు పారేలా చూడాల్సి ఉంది.

మానవ కార్యకలాపాలు, వాతావరణ మార్పులు, ప్రభుత్వ యంత్రాంగాల నిర్లక్ష్యం కలగలిసి నదుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అనేక జీవనదులు నేడు జలసిరిని కోల్పోతున్నాయి. ఉజ్జయినీ మహాకుంభమేళా జరిగే క్షిప్రా నది దుస్థితే ఇందుకు ఉదాహరణ. ఇలాంటి నదుల పునరుజ్జీవానికి ప్రభుత్వాలు గట్టి పూనిక వహించాలి.



నర్మదాతో తాత్కాలిక అనుసంధానం

క్షిప్రాలో 1970 దశకం వరకూ నిత్యం జల ప్రవాహం ఉండేది. సేద్యానికి అతిగా నీటిని తోడేయడం, వర్షపాతం తగ్గడం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు దీనికి శాపంలా పరిణమించాయి. ఇప్పుడిది ఏడాదిలో అయిదారు నెలలే ప్రవహిస్తోంది. ఈ నదిపై నిర్మించిన సాహిబ్‌ఖేడీ, కాజీఖేడీ వంటి ప్రాజెక్టులు 3,703 చదరపు కిలోమీటర్ల మేర సాగునీటి అవసరాలు తీరుస్తున్నా- నదీ ప్రవాహం ముందుకెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. దీంతో ఉజ్జయిని వంటి చోట్ల తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది.

2016 ఉజ్జయినీ కుంభమేళా సందర్భంగా నర్మదా జలాలను క్షిప్రాలోకి మళ్లించారు. ఇందుకు రూ.432 కోట్లు వెచ్చించారు. విద్యుత్తుతో నడిచే రెండు పంప్ స్టేషన్లను ఏర్పాటుచేసి, నీటిని 350 మీటర్ల ఎత్తువరకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఎలాగోలా ఉజ్జయిని దగ్గర నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడంతో పవిత్రస్నానాలకు అవకాశం కలిగింది. తదుపరి క్షిప్రా కుంభమేళా 2028 ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాకు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. క్షిప్రా కుంభమేళాకు అంతకంటే ఎక్కువమంది తరలిరావచ్చు కాబట్టి- మళ్లీ ఈ నదిని నర్మదాతో తాత్కాలికంగా అనుసంధానించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కానీ, సమస్యకు ఇది సరైన పరిష్కారం కాదు. క్షిప్రాకు జీవకళను సహజంగా తీసుకురావాలేగానీ, కృత్రిమంగా నీటిని పారించడం సరికాదన్నది పర్యావరణవేత్తల సూచన. వాతావరణ మార్పులకు తోడు పాలనా పరమైన నిర్లక్ష్యమే క్షిప్రా దుస్థితికి కారణమన్న 'కాగ్' నివేదిక- ఈ నదీ పర్యావరణాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. సమీపంలోని పట్టణాల నుంచి శుద్ధిచేయని మురుగు, పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలు వచ్చి నదిలో కలవడం, కాలుష్యం పెచ్చుమీరడం వంటి అంశాలను ప్రస్తావించింది. ప్రవాహానికి అవరోధాల్లేకుండా చూసేందుకు దీర్ఘకాలిక చర్యలు అవసరమని హితవు చెప్పింది.

ఇది దేశవ్యాప్త సమస్య


భారత్ నేడు తీవ్ర జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల మంచు పర్వతాలు శరవేగంగా కరిగిపోతూ అకాల వరదలకు కారణమవుతున్నాయి. మరోవైపు గంగా, యమునా వంటి నదులు కుంచించుకుపోతున్నాయి. నదీ పరీవాహకాల్లో తాగు, సాగునీటి అవసరాలకు భూగర్భ జలాలను ఎక్కువగా తోడేస్తుండటం, పారిశ్రామిక వ్యర్థాల పారబోత వంటివి అక్కడి పర్యావరణాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. క్షిప్రా పరీవాహకంలో నాలుగైదేళ్లకు ఒకసారి కరవు కాటకాలు సంభవిస్తున్నాయి. దాంతో ఈ ప్రాంతాన్ని కరవుకు ఆస్కారమున్న ప్రాంతంగా ప్రకటించారు. దీనికితోడు ఉజ్జయిని, ఇండోర్ జిల్లాల్లో భూగర్భ జలాలను భారీగా తోడేస్తున్నారు. రుతుపవనాల ఆధారంగా ప్రవహించే క్షిప్రా వంటి నదుల్లో భూగర్భ నీటిమట్టాలు నిర్దిష్ట స్థాయిలో ఉన్నప్పుడే ప్రవాహం సజావుగా సాగుతుంది. రుతుపవన కాలంలో నదీ గర్భం కంటే ఉపరితలంపైనే నీరుఎక్కువగా ఉంటుంది. అప్పుడు భూగర్భ జలాలు రీఛార్జ్ అవుతాయి. భూగర్భ నీటిమట్టాలు పెరిగిన తరవాత ఉపరితల జలాలు తగ్గినా నదీ ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. కానీ, నీటిని అతిగా వినియోగిస్తుండటం వల్ల నదీ గర్భాల్లో జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి పచ్చదనాన్ని పెంపొందించాలి. అటవీ ప్రాంతాల్లో దట్టమైన పచ్చదనం పెంపకం భూగర్భ జలాల పెంపునకు ఎంతగానో ఉపకరిస్తుంది. మరోవైపు, నదుల సమగ్ర నిర్వహణ, పరిరక్షణకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి.



సీపీ రాజేంద్రన్
భూ విజ్ఞాన శాస్త్రవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో అనుబంధ ఆచార్యులు

తాబేలు పట్టుదల!

ఒక నదిలో తాబేలు, మొసలి చాలా స్నేహంగా ఉండేవి. ఒకసారి మొసలికి కాస్త ఆరోగ్యం బాలేదు. కోతి రకరకాల మూలికలు తీసుకొచ్చి దానికి వైద్యం చేసింది. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో 'మొసలికి అరుదైన ఒక ఔషధ ఆకులతో పసరు చేసి తాగించాలి. అప్పుడే దాని ఆరోగ్యం కుదుటపడుతుంది. కానీ ఆ మొక్క ఉత్తరాన ఉండే పులిగుట్ట మీద ఉంది' అని చెప్పింది కోతి. 'అక్కడ ఒక పిచ్చి పులి తిరుగుతోంది కదా! అది కనిపించిన ప్రతీ జీవిని తినేస్తుంది. ఏ జంతువు అక్కడికి వెళ్లే సాహసం చేయదు' అంది ఎలుగుబంటి. 'తాబేలు తప్ప.. ఇంకెవ్వరూ మొసలి కోసం.. అక్కడికి వెళ్లడానికి ప్రయత్నించరు' అంది కోతి. 'తాబేలు.. గుట్ట మీదికి వెళ్లి, రావడం అంటే ఇప్పట్లో అయ్యే పనేనా?' అంది ఎలుగు. 'లేదు.. తప్పకుండా



వెళ్లి తీసుకొస్తాను' అని బయలుదేరింది తాబేలు. కొంతదూరం వెళ్లగానే దానికి ముళ్లకంపలో ఇరుక్కున్న కొంగ కనిపించింది. వెంటనే దాని దగ్గరికి వెళ్లి.. మెల్లగా ఆ కంపను పక్కకి తోసి కొంగను కాపాడింది. 'నన్ను కాపాడినందుకు ధన్యవాదాలు మిత్రమా! నీకేదైనా సాయం కావాలంటే అడుగు తప్పకుండా చేస్తాను' అంది కొంగ. దాంతో దానికి కావాల్సిన మొక్క గురించి చెప్పింది తాబేలు. వెంటనే ఎగురుకుంటూ వెళ్లి.. ఆ మొక్క ఆకులు తీసుకొచ్చింది కొంగ. ఇక రెండూ కలిసి చెరువు దగ్గరికి చేరుకున్నాయి. దాన్ని చూసి ఒక్కసారిగా

హాయ్! బుజ్జీ!!

ఆశ్చర్యపోయాయి కోతి, ఎలుగు. 'ఆ ఆకులు తీసుకురావడం నీ వల్ల కాదనుకున్నాం. కానీ పట్టుదలతో ఏదైనా పని చేయాలని మొదలుపెడితే.. అందులో విజయం సాధించడానికి చాలా మార్గాలు కనిపిస్తాయని నిన్ను చూసి తెలుసుకోవచ్చు' అని తాబేలుని అభినందించింది ఎలుగు. వెంటనే ఆ ఆకులతో పసరు చేసి మొసలికి తాగించింది కోతి. త్వరలోనే అది కోలుకుని మామూలుగా అయ్యింది.

- పైడిమర్రి రామకృష్ణ

నేనెవర్ని?


1. నేనో ఆరక్షరాల పదాన్ని. నాలోని 1,6,3 కలిపితే వల అనీ.. 5,6,1,3 కలిపితే కిరాయి అనీ.. 5,2,3 కలిపితే ఎలుక అనీ.. 3,5,4,6 కలిపితే నిజం అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?

జవాబు: 1.NATURE

అంతరిక్ష రంగంలోనూ సత్తా చాటుదాం

- రూ.25 వేల కోట్ల పెట్టుబడులు.. 35 వేల మందికి ఉపాధి లక్ష్యం
- రాష్ట్రంలో రెండు స్పేస్ సిటీల అభివృద్ధి
- పాలసీని ఆమోదిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అంతరిక్ష (స్పేస్) రంగంలో సాంకేతికత, సేవలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు వీలుగా 'ఏపీ స్పేస్ పాలసీని ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-30 మధ్య పాలసీ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ రంగంలో రాబోయే పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉపాధి కల్పించడమే పాలసీ లక్ష్యమని తెలిపింది. స్టార్టప్‌లు, భారీ పరిశ్రమలు, విద్యా సంస్థలు, దేశీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే ఆలోచనగా పేర్కొంది. ఈ రంగంలో పెట్టుబడులతో వచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలను అందించనుంది.



పర్యవేక్షించనుందని ప్రభుత్వం వెల్లడించింది. దీనికోసం 'ఏపీ స్పేస్ సిటీ కార్పొరేషన్' పేరిట ఎస్‌పీవీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ప్రతిపాదించిన స్పేస్ సిటీల్లో వివిధ సంస్థలకు భూములను కేటాయించే పనుల పర్యవేక్షణకు కమిటీ వేయాలని పరిశ్రమల శాఖ కమిషనర్‌ను ఆదేశించింది.

కేంద్రంతో సమన్వయానికి ఎస్‌పీవీ

కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ స్టార్టప్ నిధులు, పెట్టుబడుల కోసం ప్రయత్నించడం, మౌలిక సదుపాయాలు కల్పించే పనులను ప్రత్యేక వాహక నౌక (ఎస్‌పీవీ)

✦ జాతీయ స్థాయిలో పరిశోధన, నియంత్రణ, వాణిజ్య కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఐఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) వర్చువల్ క్లస్టర్లు, భారత్ స్పేస్ మిషన్లు, లాంచ్ వెహికల్ టెక్నాలజీ, ఉపగ్రహాల అభివృద్ధి, స్పేస్ బేస్డ్ అప్లికేషన్లను ఇస్రో పర్యవేక్షిస్తోంది. జాతీయ సంస్థల లక్ష్యాలకు అనుగుణంగా ఎస్‌పీవీ సమన్వయం చేస్తుంది.

రెండు స్పేస్ సిటీల అభివృద్ధి

హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు అనుసంధానంగా శ్రీసత్యసాయి జిల్లాలో ప్రతిపాదించిన స్పేస్ సిటీ అభివృద్ధి చేస్తారు. ఇది బెంగళూరుకు సమీపంలో ఉండటం వల్ల పెట్టుబడుల ఆకర్షణకు వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటోంది.

శ్రీసత్యసాయి జిల్లా స్పేస్ సిటీ: లేపాక్షి వద్ద డెవలప్‌మెంట్ సెక్టార్ పెట్టుబడులకు అనుకూలం.

తిరుపతి స్పేస్ సిటీ: రౌతు సురమాలలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ తయారీ, ఇంటిగ్రేషన్, లాంచ్ సపోర్ట్ సర్వీసులకు సంబంధించి పెట్టుబడులకు అనుకూలం.

రాష్ట్రంలో విస్తృత అవకాశాలు

రాష్ట్రానికి ఉన్న పారిశ్రామిక సామర్థ్యం, సంస్థాగత పర్యావరణ వ్యవస్థ, మానవ వనరులు స్పేస్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు కలిసొస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కేంద్ర అంతరిక్ష కేంద్రం ఇస్రో ఉండటంతో జాతీయ మిషన్లు, ప్రైవేటు వాణిజ్య అంతరిక్ష సంస్థలకు సేవలు అందించే అవకాశం ఉంటుందన్నది ఆలోచన. మూడో లాంచింగ్ ప్యాడ్‌ను కేంద్రం అభివృద్ధి చేయనుంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ప్రభుత్వం పాలసీని రూపొందించింది.

అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్న నటుడు కోట

ప్రధాని మోదీ సంతాపం

ఈనాడు, హైదరాబాద్: కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. "ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞ మనకు ఎప్పటికీ గుర్తుంటుంది. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో కూడా ముందంజలో ఉన్నారు. పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారు. ఆయన కుటుంబానికి, అభిమానులకు నా సంతాపం. ఓం శాంతి" అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఆయన పాత్రలు చిరస్మరణీయం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వైవిధ్యభరిత పాత్రలతో సినీ ప్రేక్షక అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ నటులు కోట శ్రీనివాసరావు మరణం విచారకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళాసేవ, పోషించిన పాత్రలు చిరస్మరణీయమని ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతారన్నారు. 1999లో విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేశారని గుర్తు చేశారు.

విలక్షణ నటనకు చిరునామా: పవన్

తెలుగు చిత్రపరిశ్రమలో విలక్షణ నటనకు చిరునామాగా కోట శ్రీనివాసరావు నిలిచారని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సొంత తమ్ముడిగా భావించేవారు: బాబూమోహన్

కోట శ్రీనివాసరావు రెండు రాష్ట్రాల ప్రజలకంటే తనకే ఎక్కువ ఆత్మీయుడని సినీనటుడు బాబూమోహన్ అన్నారు. "ఇద్దరం కలిసి సినిమాల్లోనే కాదు. బయట కూడా సరదాగా ఉండేవాళ్లం. రెండు రోజుల కిందటే మాట్లాడుకున్నాం. ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి ఆయన లేరు. నా కోసమన్న వెళ్లిపోయారు. ఇంటికొస్తే ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు. ఆయనకు అన్నదమ్ములున్నా నన్నే సొంత తమ్ముడిగా భావించేవారు. షూటింగుకు సమయం తక్కువగా ఉన్నప్పుడు అన్నం కలిపి పెట్టిన సందర్భాలున్నాయి. మాటిగా ఏ ఊరికెళ్లినా, పక్క పక్క గదుల్లోనే ఉండేవాళ్లం" అని గుర్తుచేసుకున్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

కోట శ్రీనివాసరావు మృతి పట్ల గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, భాజపా ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేష్, వైకాపా అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఆయన సేవల్ని గుర్తు చేసుకున్నారు.



కోట శ్రీనివాసరావు సతీమణి రుక్మిణిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో దర్శకుడు త్రివిక్రమ్ ★ పుష్పాంజలి ఘటిస్తున్న బాబూమోహన్

నవరసాల 'కోట' కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే నటనపై ఆసక్తి పెంచుకున్నారు. విద్యార్థి దశలో రంగస్థలంపై ఎన్నో నాటకాలు వేసి మెప్పించారు. పదహారేళ్ల వయసులో తన తండ్రి సీతారామాంజనేయులు బాటలో వైద్య వృత్తిలోకి వెళ్లాలని ఆశపడ్డారు. కానీ, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించకపోవడంతో వైద్యవిద్య అభ్యసించే అవకాశం కోల్పోయారు. డిగ్రీ పూర్తి చేసి.. స్టేట్ బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకున్నారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు బదిలీ కావడంతో వేగలంతా బ్యాంకు ఉద్యోగం. ... సాయంత్రం నాటికలు... మధ్య మధ్యలో దూరదర్శన్‌లో స్కిట్లు... ఇలా రోజులు సాగిపోయేవి. ఈ క్రమంలోనే సినిమా రంగంలో రాణించాలన్న ఆశ ఆయనలో మొగ్గ తొడిగింది. రవీంద్రభారతి వేదికపై వేసిన 'ప్రాణం ఖరీదు' నాటిక ఆయన జీవితాన్ని మలుపుతిప్పింది. దాన్ని చూసిన నిర్మాత క్రాంతికుమార్ అదే పేరుతో సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నారు. ఆ నాటికలో చేసిన కోట శ్రీనివాసరావుతోపాటు మరికొందరు రంగస్థల కళాకారులకూ సినిమాలో అవకాశమిచ్చారు. అలా 1978లో వచ్చిన 'ప్రాణం ఖరీదు' చిత్రంతో వెండితెరపై కోట తొలిసారి కనిపించారు.

మలుపు తిప్పిన 'ప్రతిఘటన'..

'ప్రాణం ఖరీదు' తర్వాత కోట శ్రీనివాసరావు 'అమరజీవి', 'బాబాయ్ అబ్బాయ్', 'వందేమాతరం' లాంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో నటించినా పరిశ్రమలో పాతుకుపోవడానికి పునాదిరాయిగా ఉపయోగపడిన చిత్రం 'ప్రతిఘటన'. ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మాణంలో టి.కృష్ణ తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో మినిస్టర్ కాశయ్యగా కోట పండించిన విలక్షణ విలనిజం.. "నమస్తే తమ్మీ" అంటూ తెలంగాణ యాసలో పలికిన సంభాషణలు ఆకర్షణగా నిలిచాయి. చిత్ర విజయంలో కీలకపాత్ర పోషించాయి. ఈ చిత్రంతోనే ఆయన తొలి నంది పురస్కారం దక్కించుకున్నారు. ఈ సినిమా తర్వాత నుంచి అవకాశాలు వరుసకట్టాయి. అప్పటికే స్టార్ విలన్లుగా వెండితెరపై వెలుగులు విరజిమ్ముతున్న కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు, గొల్లపూడి మారుతీరావు లాంటి వారికి పోటీగా నిలిచారు. తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. 'ప్రతిఘటన' తర్వాత కోట శ్రీనివాసరావు నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించిన మరో చిత్రం 'అహ నా పెళ్లంట'. అందులో పరమ పిసినారిగా 'లక్ష్మీపతి' పాత్రలో ప్రేక్షకుల్ని పొట్టచెక్కలయ్యేలా నవ్వించారు. అక్కడి నుంచి కోట సినీ ప్రయాణం రాకెట్ వేగాన్ని అందుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు వెండితెరపై ఆయన జైత్రయాత్ర కొనసాగింది. ఓవైపు తనదైన విలనిజంతో వెండితెరపై విజృంభిస్తూనే.. మరోవైపు హాస్య పాత్రలతో ప్రేక్షకుల మోములపై నవ్వుల పువ్వులు పూయించారు. మధ్యతరగతి తండ్రిగా, అల్లరి తాతయ్యగా, కుట్రలు పన్నే మామగా, అవినీతి నాయకుడిగా, నవ్వించే పోలీసుగా, భయపెట్టే మాంత్రికుడిగా.. ఇలా ఎన్నో విభిన్నమైన పాత్రలతో సినీ ప్రియుల్ని మురిపించారు.

రాజకీయాల్లోనూ సత్తా...

విలక్షణ నటనతో వెండితెరపై తనదైన ముద్ర వేసిన కోట శ్రీనివాసరావు.. ప్రజా నాయకుడిగా రాజకీయ క్షేత్రంలోనూ సత్తా చాటారు. 1999లో జరిగిన ఎన్నికల్లో భాజపా తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2004 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు.

పద్మశ్రీ సహా ఎన్నో పురస్కారాలు

ఏఎన్నార్, కృష్ణ లాంటి నాటి తరం హీరోలతో పాటు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున, పవన్ కల్యాణ్, రవితేజ, మహేశ్‌బాబు, ప్రభాస్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, ఎన్టీఆర్, సాయిదుర్గాతేజ్.. ఇలా ప్రస్తుత తరం హీరోల వరకు అందరితోనూ కోట పనిచేశారు. 'ఖైదీ నంబర్ 786', 'శివ', 'బొబ్బిలిరాజా', 'యమలీల', 'బొమ్మరిల్లు', 'అతడు', 'రెడీ', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే', 'రేసుగుర్రం', 'దూకుడు', 'గబ్బర్ సింగ్', 'అత్తారింటికి దారేది', 'జులాయి'... ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'ప్రతిఘటన'తో పాటు 'గాయం', 'తీర్పు', 'లిటిల్ సోల్జర్స్', 'గణేష్', 'చిన్నా', 'పృథ్వీ నారాయణ', 'ఆ నలుగురు', 'పెళ్లైన కొత్తలో' చిత్రాలకు కోట శ్రీనివాసరావు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నుంచి నంది అవార్డులు అందుకున్నారు. 'కృష్ణం వందే జగద్గురుమ్' సినిమాకు సైమా అవార్డు గెలుచుకున్నారు. చిత్ర పరిశ్రమకు కోట అందించిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది. ఇటీవల పవన్ కల్యాణ్‌తో కలిసి కోట శ్రీనివాసరావు నటించిన సినిమా 'హరి హర వీరమల్లు' ఈ నెలలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

'మద్య' కథా చిత్రం

(మొదటి పేజీ తరువాయి)

ఓ సినీ నటుడి భార్య కూడా ఇలా రూ.కోటి వరకూ ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాకు పంపించారు. తిరిగి ఆ డబ్బు ఆమెకు చెల్లించలేదు" అని సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఆ రూ.12 కోట్లు కాకుండా.. మిగతా రూ.28 కోట్లు నగదు రూపంలో ఖర్చుచేసినట్లు సిట్ తేల్చింది.

రూ.40 కోట్ల నల్లధనం ఖర్చు..

'మళ్లీ మొదలైంది', 'స్కై' సినిమాలను ఎంత బడ్జెట్‌లో నిర్మించినట్లు రికార్డుల్లో చూపించారు? దానికి వాస్తవంగా చేసిన ఖర్చెంత? ఈ సొత్తు ఎక్కడి నుంచి సమకూరింది? ఎలా చెల్లించారు? జరిగిన వ్యాపారమెంత? ఆ సినిమాలు ఎంతకు విక్రయించారు వంటి వివరాలన్నీ సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సీఈవోగా వ్యవహరించిన ఉప్పలపాటి వరుణ్‌తేజ్‌ను రెండు రోజుల కిందట వీటన్నింటిపైనా సమగ్రంగా ప్రశ్నించింది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీసు వద్ద ఫ్లాప్ అయినా ఓటీటీ, ఇతర హక్కులన్నింటినీ కలిపి రూ.36 కోట్లకు విక్రయించినట్లు తేలింది. మొత్తంగా రూ.40 కోట్ల నల్లధనాన్ని ఈ సినిమాల నిర్మాణానికి వెచ్చించి రూ.36 కోట్లను వైట్‌గా మార్చుకున్నట్లు తేల్చింది. ఈ దర్యాప్తు వివరాలన్నింటినీ సిట్ త్వరలో కోర్టుకు సమర్పించనుంది.

జగన్ అధికారంలో ఉన్నప్పుడే ఏర్పాటు

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు.. 2020 డిసెంబరు 12న ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థను రాజ్ కెసిరెడ్డి స్థాపించి, వెంటనే చిత్రనిర్మాణం చేపట్టారు. 'మళ్లీ మొదలైంది' సినిమాను 2022 ఫిబ్రవరి 11న, స్కై చిత్రాన్ని 2023 జూన్ 29న విడుదల చేశారు. తర్వాత ఒకేసారి భారీగా సినిమాలు నిర్మించాలని పలువురు యువ డైరెక్టర్లు, రచయితలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆ మధ్యకాలంలో మిడ్ రేంజ్, కొత్త నటులతో హిట్ సినిమాలు తీసిన ఇద్దరు యువ గుర్తింపున్న డైరెక్టర్లతో ట్రిప్సన్లు, కథలపై చర్చించి సినిమాల నిర్మాణానికి ప్రయత్నించారు. మద్యం కుంభకోణంలో నగదు రూపంలో సమకూరిన డబ్బును ఇందులో కుమ్మరించినట్లు సమాచారం. ఈ లోగా ఎన్నికలు రావడం, జగన్ అధికారం కోల్పోవడం, మద్యం కుంభకోణంపై దర్యాప్తు తీవ్రతరం కావడంతో.. కొత్త ప్రాజెక్టులను నిలిపేసి కలుగులోకి వెళ్లిపోయారు.

రైలింజిన్లు.. బోగీల్లో నిఘా కెమెరాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఇంజిన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పురోగతిని రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్, సహాయమంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టూ సమీక్షించారు. ఉత్తర రైల్వే పరిధిలో ఇప్పటివరకు ఏర్పాటుచేసిన కెమెరాల వివరాలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. దీంతో దేశవ్యాప్తంగా అన్ని కోచ్‌లు, లోకోల్లో కెమెరాల ఏర్పాటుకు మంత్రి ఆమోదం తెలిపారు. ప్రతి కోచ్‌లో నాలుగు ప్రవేశద్వారాల్లో కెమెరాలు ఏర్పాటుచేస్తారు. ఇంజిన్లలో ఆరు కెమెరాలతో నాలుగింటిని ముందు, వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన రెండూ.. లోపలివైపు వెనుక, ముందు భాగాన ఉంటాయి. వీటినుంచి డేటాను విశ్లేషించేప్పుడు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించుకోవాలని రైల్వే మంత్రి సూచించారు. ప్రయాణికుల రాపోకలు సాగించే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంవల్ల భద్రత పెరుగుతుందని, వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైల్వేశాఖ పేర్కొంది. సంఘ వ్యతిరేక శక్తుల కదలికలు తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని తెలిపింది.

అమరావతిలో బిట్స్ ఏఐ ప్లస్ క్యాంపస్

(మొదటి పేజీ తరువాయి)

పునరుత్పాదక విద్యుత్తు విధానాలతో నిర్మాణాలు చేస్తాం. ఐఓటీ, ఏఐ ఆధారిత సేవలతో డిజిటల్ ఫస్ట్ క్యాంపస్‌గా రూపుదిద్దుకుంటుంది. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా ఇలాంటి క్యాంపస్ లేదు. దేశంలో ఉన్న తరవాత దీనను మార్చే అడుగుగా క్యాంపస్‌ను తీర్చిదిద్దుతాం. ఇన్నోవేషన్, ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్‌కు ఇది కేంద్రంగా మారనుంది. పారిశ్రామిక సహకారంతో ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీలపై దృష్టిసారిస్తుంది. ప్రపంచ భాగస్వాములతో కలిసి ఈ తరం టాలెంట్‌ను భారత్ కోసం, ప్రపంచం కోసం తయారుచేస్తుంది. అండర్ గ్రాడ్యుయేట్, ట్రైనింగ్ కోర్సులకు జనరేటివ్ ఏఐ, స్మార్ట్ సిటీస్, ఏఐ ఫర్ హెల్త్‌కేర్ విభాగాల్లో ప్రత్యేక కోర్సులు ఉంటాయి. అమరావతిలో రెండేళ్లు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో రెండేళ్లు అభ్యసించేలా డిజైన్ చేస్తున్నాం. జాయింట్ పీహెచ్‌డీలు చేయొచ్చు' అని వివరించారు.

దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ అమరావతి

'అమరావతి క్యాంపస్ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్ కాబోతోంది. కంప్యూటర్ సైన్స్‌లో అన్ని ముఖ్యమైన ప్రోగ్రామ్స్ అక్కడ ఉంటాయి. దీనితోపాటు వివిధ మేజర్ ప్రోగ్రామ్స్ అందుబాటులోకి తెస్తున్నాం. కృత్రిమమేధలో అన్ని జెన్ కాన్సెప్ట్స్ నేర్పుతుంటాం. వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వరకు అన్ని రంగాల కోర్సులకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వివిధ దేశాల విశ్వవిద్యాలయాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. అమరావతిలోని ఏఐ ప్లస్ క్యాంపస్‌లో ఎన్నో ఆసక్తికరమైన విధానాలు అమలు కాబోతున్నాయి' అని ఉన్నతాధికారి వి.రామగోపాలరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కనే..

బిట్స్ అమరావతి క్యాంపస్ ఏర్పాటుకు సీఆర్‌డీఏ 70 ఎకరాలు కేటాయించింది. వివిధ విశ్వవిద్యాలయాలకు కేటాయించిన ప్రాంతంలోనే బిట్స్‌కు కూడా 50-100 ఎకరాల భూములు ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. సీడ్‌యాక్సెస్ రోడ్డు పక్కన వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో కావాలని బిట్స్ కోరింది. తమ సంస్థ భవనాలూ ఆలయ నమూనాలో నిర్మిస్తామని తెలిపింది. దీంతో వారు కోరిన ప్రాంతంలోనే ప్రభుత్వం భూములు కేటాయించింది. ఇటీవల సీఎం చంద్రబాబు వద్ద కూడా దీనిపై చర్చ జరిగింది. బిట్స్ క్యాంపస్ నమూనాలను ఆయన పరిశీలించారు.

యువతను ఆకర్షించాలని.. ఉగ్రవాదంలోకి నెట్టాలని!

(మొదటి పేజీ తరువాయి)

విచారిస్తుండగా పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సిద్ధిఖీ ముందుగా చెందిన వ్యాపారి ద్వారా రాయచోటికి వచ్చి, అమానుల్లాగా పేరు మార్చుకొని అక్కడే స్థిరపడ్డాడు. ఉగ్రవాది ఇమామ్ అలీ వద్ద బాంబుల తయారీ నేర్చుకొని 1999లో తమిళనాడులోని పలు నగరాల్లో, 2013లో బెంగళూరులోని భాజపా కార్యాలయం వద్ద పేలుళ్లకు పాల్పడ్డాడు. 2012లో వేలూరులో ఓ హత్య చేశాడు. కర్నూలు పేలుళ్ల తర్వాత అతనితో ఉన్న వాళ్లు అరెస్టు కావడంతో భయపడి కార్యకలాపాలు తగ్గించాడు. 2021లో కరోనా సోకినా ఆసుపత్రికి వెళ్లే దారి కోసం ఇంట్లోనే నాటు వైద్యం తీసుకున్నాడు. కంటి చూపు తగ్గడంతో వేలూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఆ తర్వాత మళ్లీ ఉగ్ర కార్యకలాపాలు పునః ప్రారంభించాలని అనుకున్నాడు. తమిళనాడులో పాత పరిచయాలను పునరుద్ధరించుకోవాలని ప్రారంభించాడు. ఈ క్రమంలో కొన్ని నెలల ముందు కోయంబత్తూరుకు వెళ్లి అక్కడ బాంబు పేలుళ్లకు పాల్పడాలని, స్థానిక యువతను ఉగ్ర కార్యకలాపాల వైపు ఆకర్షించాలని చూశాడు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ పథకం అమలు చేయలేపోయాడు. వృద్ధాప్యం వల్ల నేరుగా ఉగ్ర కార్యకలాపాలు చేయడం అసాధ్యమని గ్రహించి.. ఉగ్రవాదులకు సాయం చేయాలని, యువతను ఆ వైపు ఆకర్షించాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో బయటపడింది.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

ఈనాడు, విశాఖపట్నం: పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా తీరాలకు సమీపంలో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం నాటికి వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఆదివారం అల్లూరి సీతారామరాజు, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, కృష్ణా, చిత్తూరులో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో 50 మి.మీ. వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు చురుగ్గా లేకపోవడంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగుతోంది. మరో మూడు రోజుల పాటు ఇలాగే ఉండొచ్చని అంచనా.

స్పీయ సందేహాలతో కలలు సమాధి



మీ కలలను చంపేది వైఫల్యాలు కాదు, మీ స్వీయ సందేహాలు. మీ శక్తిసామర్థ్యాల మీద మీకే విశ్వాసం లేకపోతే వాటిని ఎప్పటికీ పూర్తి స్థాయిలో వినియోగించలేరు. సందేహాలు వదిలి ప్రయత్నాలు మొదలుపెట్టండి. ఆ తర్వాత మీ సామర్థ్యాలేంటో తెలిసొస్తాయి మీరే ఆశ్చర్యపోతారు.

\- నిక్ క్రెన్స్, క్రియేటివ్ డైరెక్టర్

గ్రహం అనుగ్రహం

14-7-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం

చవితి: రా. 11-51 తదుపరి పంచమి

ధనిష్ఠ: ఉ. 7-40 తదుపరి శతభిష

వర్జ్యం: సా. 2-42 నుంచి 4-16 వరకు

అమృత ఘడియలు: రా. 12-06 నుంచి 1-39 వరకు

దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-22 వరకు తిరిగి 3-06 నుంచి 3-58 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.36; **సూర్యాస్తమయం:** సా.6.34

సంకట హర చతుర్థి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.5	27.5
నరసాపురం	39.4	29.4
నెల్లూరు	39.0	29.9
తిరుపతి	38.9	27.4
విజయవాడ	38.8	28.4
కడప	37.0	27.0
ఒంగోలు	36.7	29.7
విశాఖపట్నం	36.4	28.6
అనంతపురం	35.4	26.0
కర్నూలు	34.3	25.2
శ్రీకాకుళం	34.0	27.0

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ కంపెనీ ఏర్పాటుకు అనుమతి

డైరెక్టర్లుగా వివిధ శాఖల ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) పేరుతో ప్రభుత్వ కంపెనీ ఏర్పాటును ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ శాఖలకు చెందిన 9మంది అధికారులను బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. రాజధాని అమరావతి పరిధిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ప్రపంచ సాంకేతిక సంస్థలు, క్వాంటం కంప్యూటింగ్, దీని సాంకేతికతలపై పరిశోధన ల్యాబ్‌ల కేంద్రంగా అమరావతిని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం అమరావతిలో 50 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. గత నెల 30న విజయవాడలో భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించింది. క్వాంటం డిక్లరేషన్‌ను ప్రభుత్వం ప్రకటించింది.

✦ ఐటీ శాఖ కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, ఆర్థిక, పరిశ్రమలు, వ్యవసాయం, ఇంధన, వైద్యారోగ్య, నైపుణ్యాభివృద్ధి, రియల్ టైం గవర్నెన్స్ శాఖల కార్యదర్శులు బోర్డులో సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

న్యాయవాదులకు ఈడీ సమన్లపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

దిల్లీ: కక్షిదారుల తరఫున కేసులను వాదించే న్యాయవాదులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి దర్యాప్తు సంస్థలు నేరుగా సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ అంశాన్ని సుమోటోగా తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం వాదనలు ఆలకించనుంది. కక్షిదారులకు సంబంధించిన 'నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్)' కేసులో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఇటీవల ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ చర్య న్యాయవాద వృత్తి పునాదులపై జరిగిన దాడిగా సుప్రీం కోర్టు న్యాయవాదుల సంఘం, సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ పేర్కొన్నాయి.

ఈఏపీసెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో మొదటి విడత అత్యంత కీలకం!

- 'ఈనాడు-జీజీయూ' ఉచిత వెబినార్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసిన నిపుణులు
- అప్షన్ల నమోదులో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచన

GGU GODAVARI GLOBAL UNIVERSITY

ఈనాడు, హైదరాబాద్, కాకినాడ: ఈఏపీసెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో మొదటి విడత (ఫస్ట్ ఫేజ్) చాలా ముఖ్యమైనదని నిపుణులు విద్యార్థులకు సూచించారు. ఈఏపీసెట్-2025 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై అవగాహన కోసం ఈనాడు-చదువు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సంయుక్తంగా ఆదివారం ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్ నిర్వహించాయి. దీనిలో ఈఏపీసెట్-2025 ఛైర్మన్ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు పాల్గొని.. విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. కంప్యూటర్ సైన్స్, ఏఐ ప్రొఫెసర్ నీల మేఘ శ్యామ్ దేశాయి సమన్వయకర్తగా వ్యవహరించారు. మొదటి విడత కౌన్సెలింగ్‌ను నిర్లక్ష్యం చేస్తే సీటు రాకపోవచ్చని, అందుకే మొదటి విడతలోనే సీటు పొందేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ఈ విషయాన్ని విద్యార్థులు మర్చిపోకూడదని అభ్యర్థనలు చేశారు. వెబినార్లో నిపుణులు తెలిపిన ముఖ్యాంశాలివీ..

✦ వెబ్ ఆప్షన్లు పెట్టుకునే కళాశాలలు కోర్సుల జాబితాను గమనించాలి. కోర్సుల్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచాం. పోరపాటు చేస్తే మీ ర్యాంకుకు రావలసిన సీటు రాదు. ✦ ఏటా పరిస్థితులు మారుతుంటాయి. గతేడాది 1,000 ర్యాంకు వచ్చిన వారికి ఓ కాలేజీలో ఆశించిన సీటు రాకపోవచ్చు. కానీ, ఈ ఏడాది 1,200 ర్యాంకు వచ్చిన వ్యక్తికి రావచ్చు కూడా ఆ కళాశాలలో సీటు రావొచ్చు. ✦ విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టే సమయంలో ఓటీపీ కోసం కొందరు నెట్‌సెంటర్ల నిర్వాహకుల వాళ్ల ఫోన్ నంబర్లు ఇచ్చేస్తుంటారు. ఇలాంటప్పుడు మోసాలు జరిగే అవకాశముంది. ✦ సీటు కేటాయింపు (అలాట్‌మెంట్) తర్వాత ఆ విద్యార్థి ఆ కళాశాలలో తప్పనిసరిగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలా చేయకపోతే రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆ సీటు వేరేవారికి అలాట్ అవుతుంది. ✦ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఈ సీట్లు కన్వీనర్ కోటా ద్వారా భర్తీ అవుతాయి. సొంతంగా చేరితే మాత్రం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు. ✦ బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ), సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరిన వారు కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్ తీసుకుంటే మంచిది. కంప్యూటర్ సైన్స్‌లో ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలు పెరుగుతున్నాయి. వీటిలో 70 నుంచి 80 శాతం సిలబస్, కోర్సులు ఒకేలా ఉంటాయి. ✦ కెమిస్ట్రీ అంటే ఇష్టం ఉన్నవారు కెమికల్ ఇంజినీరింగ్ తీసుకోవచ్చు. ఫ్యూచర్ ఇష్టపడే వారికి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బాగుంటాయి. రాజకీయ, ఎనాలిసిస్ థింకింగ్ ఉన్నవారికి కంప్యూటర్ సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్ వంటివి మేలు. ✦ కెమికల్ ఇంజినీరింగ్ భవిష్యత్తు బాగుంది. జేఎన్‌టీయూ కాకినాడలో బాగానే ఉద్యోగాలు వస్తున్నాయి. వరంగల్ నిట్‌లోనూ 100 శాతం ప్లేస్‌మెంట్ ఉంది.



మాట్లాడుతున్న ఈఏపీసెట్ ఛైర్మన్ ప్రొఫెసర్ సీఎస్ ఆర్‌కే ప్రసాద్. చిత్రంలో కన్వీనర్ సుబ్బారావు, వెబినార్ సమన్వయకర్త ప్రొ.నీలమేఘ శ్యామ్ దేశాయ్ (స్క్రీన్‌పై)

మరిన్ని వివరాలకు స్కాన్ చేయండి

26 నుంచి సీఎం సింగపూర్ పర్యటన

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రులు, అధికారుల ప్రతినిధి బృందం ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనుంది. పట్టణ ప్రణాళిక, నగర సుందరీకరణ, గ్రీనరీ, ఓడరేవులు, ఇతర లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, భవిష్యత్తు సాంకేతికత వంటి రంగాల్లో ఆ దేశ సహకారం తీసుకోవడానికి ఉన్న అవకాశాలపై అక్కడి రాజకీయ, సాంస్కృతిక, వ్యాపార ప్రతినిధులతో ఈ బృందం సంప్రదింపులు జరుపుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్ర, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఆర్థిక అభివృద్ధి సంస్థ సీఈవో సాయికాంత్‌వర్మ సీఎం వెంట సింగపూర్ వెళ్తారని వెల్లడించింది. ఈ నెల 30 వరకు ఈ బృందం సింగపూర్‌లో పర్యటిస్తుంది.

రామాయపట్నం పారిశ్రామిక క్లస్టర్ భూసేకరణకు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రామాయపట్నం పారిశ్రామిక క్లస్టర్‌కు అవసరమైన భూముల సేకరణకు ప్రత్యేక కలెక్టర్‌తో ఒక యూనిట్, కందుకూరు, కావలిలో పాటు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లతో ఐదు యూనిట్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యూనిట్లు రెండేళ్ల పాటు కొనసాగుతాయి. రామాయపట్నం క్లస్టర్‌లో భాగంగా వివిధ ప్రాజెక్టులు, అనుబంధ పరిశ్రమలకు సుమారు 20 వేల ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ శాఖల ఉద్యోగులతో కూడిన ఈ యూనిట్ల నిర్వహణకు అయ్యే ఖర్చును భూసేకరణ కోసం వివిధ సంస్థల నుంచి వచ్చిన డిపాజిట్ల నుంచి చెల్లించాలని మారిటైం బోర్డు సీఈవో, ఏపీఐఐసీ వీసీ ఎండీని ఆదేశించింది.

శాంతి భద్రతల విఘాతానికి జగన్ కుట్ర: మంత్రి రవీంద్ర



ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ డైరెక్షన్‌లో ఆ పార్టీ నాయకులు కుట్రపూరిత కార్యక్రమాలు చేపడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం నెలకొన్న ఉద్రిక్తతల నడుమ జెడ్పీ ఛైర్‌పర్సన్ కారును వదిలేసినా, ఆమె మళ్లీ వెనక్కి వచ్చి పోలీసుల్ని, తెదేపా నాయకుల్ని దుర్భాషలాడారని, ఆమెపై దాడి జరిగిందని దాన్ని తెదేపా నాయకత్వానికి అంటగట్టాలని చూసి బుక్ అయ్యారని పేర్కొన్నారు. ఈ ఘటనను సాకుగా చూపి రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో కొల్లు రవీంద్ర ఆదివారం విలేకరులతో మాట్లాడారు. "రాక్షస మూకలకు రాష్ట్రం అడ్డాగా మారకూడదని పేర్ని నాని మరోమారు నిరూపించారు. సభలు పెట్టి నెత్తుటి రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. కుట్రలు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని అనుకుంటున్నారు. బూతులు తిడుతూ రెచ్చగొడుతున్నారు. గతంలో పేర్ని నాని గుడివాడ వెళితే స్థానికులు తరిమారు. ఇప్పుడు కొడతారనే భయం వేసి ఇంట్లోనే కూర్చొని హౌస్ అరెస్ట్ చేసినట్లు డ్రామాలాడారు. కుట్రలు కుతంత్రాలు చేస్తే ప్రజలు వారిని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొడతారు" అని రవీంద్ర మండిపడ్డారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం

నాగమల్లేశ్వరరావుపై దాడి దుర్మార్గం: సజ్జల



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల

గుంటూరు (కలెక్టరేట్-నగరంపాలెం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్నవ గ్రామ సర్పంచి నాగమల్లేశ్వరరావును సజ్జల ఆదివారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నాగమల్లేశ్వరరావు త్వరగా కోలుకుంటారని ఆశిస్తున్నా. ఆయనపై రాజకీయపరమైన హత్యాయత్నం చేశారు. వైకాపా నేత అంబటి మురళీపైనా కేసు నమోదు చేశారు. నెల్లూరులో ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. గుడివాడలో పోలీసులు అక్కడే ఉన్నా దాడిని అడ్డుకోలేదు. ప్రజాస్వామ్య హక్కులను వైకాపా నేతలను వినియోగించుకోనివ్వడం లేదు. జగన్ పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నారు. పోలీసు వ్యవస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నడుస్తోంది'.. అని ఆరోపించారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళి, నూరి ఫాతిమా తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వీయ ధ్రువీకరణ పథకంలో తొలగిన అవరోధాలు

- నాన్ హైరైజ్ నివాసాలకు 4 వేల చ.మీ.లోపు ప్లాట్లకే పథకంలో అనుమతులు
- నిబంధనలు సడలిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: పట్టణ స్థానిక సంస్థల్లో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన స్వీయ ధ్రువీకరణ పథకం అమలుకు ప్రతిబంధకంగా ఉన్న పలు నిబంధనలను ప్రభుత్వం తొలగించి కొత్తగా వెసులుబాట్లు కల్పించింది. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లైతే దరఖాస్తును ప్రాసెస్ చేసిన లైసెన్స్‌డ్ సాంకేతిక నిపుణుల (ఎల్‌టీపీఎస్)పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్న నిబంధనను పూర్తిగా తొలగించారు. నాన్ హైరైజ్ నివాస భవన నిర్మాణాలకు 4,000 చదరపు మీటర్లలోపు ప్లాట్ ఏరియా వరకే స్వీయ ధ్రువీకరణ పథకంలో అనుమతులిస్తారు. 500చ.మీ. విస్తీర్ణంలోపు ప్లాట్ ఏరియాలో వైట్ క్యాటగిరీ పరిశ్రమల స్థాపనకు పథకంలో కొత్తగా అనుమతులు ఇవ్వనున్నారు. పథకంలో సవరించిన నిబంధనలతో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చిన ప్రభుత్వం.. పుర, నగరపాలక సంస్థల్లోనూ భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యాన్ని నిరోధించేందుకు స్వీయ ధ్రువీకరణ పథకాన్ని (సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం) ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించింది. 18 మీటర్ల ఎత్తు వరకు నాన్ హైరైజ్ నివాస భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ పథకం కింద లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ల ద్వారా అనుమతులు అందించడమే పథకం ప్రధాన ఉద్దేశం. తాజా సవరణల్లో 4,000చ.మీ. లోపు ప్లాట్ విస్తీర్ణం వరకే పథకంలో అనుమతులిస్తారు. అంతకు మించితే బిల్డింగ్ (గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీం పరిధిలోకి వస్తాయి. స్వీయ ధ్రువీకరణ పథకంలో పట్టణ ప్రణాళిక విభాగం జోక్యాన్ని పూర్తిగా నిరోధించారు. టెక్నికల్ పర్సన్ల ద్వారా బీపీఎస్ (ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టం) పోర్టల్‌లో దరఖాస్తును ప్రజలు అప్‌లోడ్ చేసిన వెంటనే భవన నిర్మాణాలకు అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేశారు.

క్రిమినల్ చర్యల నిబంధన తొలగింపు

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా, తప్పుడు దస్తావేజులు అప్‌లోడ్ చేసి అనుమతులు పొందినట్లు తదుపరి తనిఖీల్లో వెల్లడైతే టెక్నికల్ పర్సన్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్వీయ ధ్రువీకరణ పథకం అమలులో భాగంగా ఫిబ్రవరిలో జారీ చేసిన జీవోలో పేర్కొనడంతో వారంతా వ్యతిరేకించారు. అనుమతులు తీసుకున్న వారు నిబంధనలు ఉల్లంఘిస్తే తమకేం సంబంధమని టెక్నికల్ పర్సన్లు దరఖాస్తులను అప్‌లోడ్ చేయడం లేదు. క్రిమినల్ కేసుల నమోదు చేసే చర్యల నిబంధనను పథకం నుంచి తొలగించాలన్న వారి విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిబంధనలు సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులను అప్‌లోడ్ చేసే ప్రక్రియ వేగవంతమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తప్పు చేస్తే ఐదేళ్లపాటు లైసెన్సు రద్దు

★ భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజల తరఫున దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు టెక్నికల్ పర్సన్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్టర్ ప్లాన్, జోనింగ్ నిబంధనలు విధిగా పాటించాలి. భూ హక్కులకు సంబంధించిన పత్రాలు విధిగా పరిశీలించాలి.

★ అనుమతులొచ్చిన భవన నిర్మాణ పనులు మొదలైన ఫ్లింత్ బీమ్ పూర్తయిన ఏడు రోజుల్లో క్షేత్రస్థాయిలో టెక్నికల్ పర్సన్లు తనిఖీ చేసి పట్టణ ప్రణాళిక అధికారులకు నివేదిక ఇవ్వాలి. సెట్ బ్యాక్‌లు పాటించినట్లుగా నిర్ధారించాలి.

★ తనిఖీ నివేదికల్లో సమాచారానికి విరుద్ధంగా నిర్మాణ పనులు చేసినట్లుగా తేలితే సంబంధిత టెక్నికల్ పర్సన్ లైసెన్సును ఐదేళ్లపాటు రద్దు చేస్తారు.

ఒకే వేదికపై 54 మంది కవలలు

కాకినాడలో సందడి చేసిన 108 మంది చిన్నారులు



బహుమతులు అందుకున్న కవలలతో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

కాకినాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఒకే వేదికపై 54 మంది కవలలు చేరడంతో సందడి నెలకొంది. కాకినాడలోని సూర్యకళా మందిరంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల కవలల సమ్మేళనం అందుకు వేదికైంది. ఇందులో కవలలకు వివిధ కేటగిరీలుగా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ మాట్లాడుతూ.. "దక్షిణాది రాష్ట్రాల నుంచి 54 మంది (108 మంది చిన్నారులు) కవలలను ఒకే వేదికపై తీసుకురావడం అభినందనీయం. అందుకు కృషి చేసిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్, అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ నాళం ఆండాళ్‌కు అభినందనలు" అని చెప్పారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బంగార్రాజు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ద వెంకట సూర్యప్రకాశరావు, ఇంటర్నేషనల్ సెక్రటరీ జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సామర్థ్య సాంకేతికతకు కొత్త పథకం.. అదితి!

15న ప్రవేశపెట్టనున్న కేంద్రం

ఈనాడు, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగంలో అత్యాధునిక ఇంధన సామర్థ్య సాంకేతికతను అందించేందుకు ఏడీఈఈటీఐఈ (అదితి) పథకాన్ని కేంద్రం ప్రవేశపెడుతోందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) తెలిపింది. 'పారిశ్రామికరంగంలో పోటీతత్వాన్ని పెంచడం.. ఉపాధి కల్పించడం.. ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడంతో పాటు దేశ ఇంధన సామర్థ్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే అంశాల్లో ఈ పథకం నమూనాగా నిలుస్తుంది. ఈ పథకం ద్వారా ఎంఎస్ఎంఈలకు సాంకేతిక సహకారం, రుణాలపై వడ్డీ రాయితీ వంటివి అందుబాటులోకి వస్తాయి. పరిశ్రమల్లో విద్యుత్ వ్యయాన్ని తగ్గించి.. ఉత్పాదకత పెంచడంలో సహాయపడుతుంది. ఈ నెల 15న పథకాన్ని కేంద్రం ప్రకటించనుంది' అని బీఈఈ పేర్కొంది.

ఇసుక ధరల్లో మంత్రాంగం!



- కృష్ణా నదిలో డ్రెడ్జింగ్‌కు 'కృష్ణా గోదావరి వాటర్‌వేస్'కు అనుమతి
- టన్ను రూ.66కు విక్రయించేలా ప్రభుత్వ ఆదేశాలు
- జిల్లా కమిటీలో ఏకంగా రూ.215కు పెంపు
- గుత్తేదారు సంస్థకు రూ.11.47 కోట్లు అదనంగా మిగులు

ఈనాడు, అమరావతి: నదిలో పంటు నడిపేందుకు వీలుగా ఇసుక తవ్వి, దాన్ని టన్ను రూ.66కే విక్రయిస్తామంటూ ప్రభుత్వ అనుమతులు తీసుకున్న సంస్థ. అనూహ్యంగా జిల్లా అధికారుల నుంచి రూ.215 చొప్పున అమ్ముకునేలా ఆదేశాలు తెచ్చుకుంది. తద్వారా భారీగా లబ్ధిపొందుతోంది. దీనివెనుక భారీ మంత్రాంగమే జరిగినట్లు తెలుస్తోంది. కృష్ణా గోదావరి వాటర్‌వేస్ అనే సంస్థ ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం నుంచి గుంటూరు జిల్లాలో వైకుంఠపురం వరకు డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తవ్వకాలకు గతంలో ఇండియన్ వాటర్‌వేస్‌కు దరఖాస్తు చేసుకుంది. పంటు నడిపేందుకు నదిలో మేటవేసిన ఇసుకను డ్రెడ్జింగ్ చేసి తీస్తామని అభ్యర్థించింది. ఈ దస్త్రాన్ని జలవనరులశాఖ, గనులశాఖ పరిశీలించాయి. గత ఏడాది జులైలో, ఆ సంస్థకు ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పట్లో ఇచ్చిన ఆదేశాల్లో.. అక్కడ తవ్వితీసిన ఇసుక టన్ను రూ.66 విక్రయించాలని స్పష్టంగా పేర్కొంది.

అడ్డగోలుగా రూ.11.47 కోట్లు

ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాక.. కృష్ణా గోదావరి వాటర్‌వేస్ సంస్థ గుంటూరు జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) నుంచి క్లియరెన్స్ పొందే సమయంలో తెరవెనుక మంత్రాంగం నడిపింది. రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చి.. టన్ను రూ.215కు విక్రయించుకునేందుకు గుంటూరు డీఎల్ఎస్‌సీ ఆదేశాలిచ్చేలా చూసింది. ఈ ఏడాది మార్చి మూడో వారం నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరులోపు 7.70 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వితీసి, విక్రయించుకునేందుకు అనుమతిస్తూ డీఎల్ఎస్‌సీ ఆదేశాలిచ్చింది. టన్ను రూ.66 చొప్పున విక్రయిస్తే ఆ సంస్థకు రూ.5.08 కోట్లు వచ్చేది. రూ.215 ధరతో అమ్ముకునేందుకు అవకాశం ఇవ్వడంతో ఏకంగా రూ.16.55 కోట్లు వెనకేసుకునే అవకాశం కల్పించింది. అంటే అదనంగా రూ.11.47 కోట్లు మిగిలేలా చూసుకుంది. గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి ఆధ్వర్యంలో ఈ ఇసుక దందా నడుస్తోంది. నిబంధనల ప్రకారం నదిలో పంటు నడిపేందుకు అడ్డుగా వచ్చే ఇసుకను డ్రెడ్జింగ్ ద్వారా తీసి, ఒడ్డున వేయాలి. దీన్ని డీఎల్ఎస్‌సీ గనులశాఖ ద్వారా విక్రయిస్తుంది. ఆ డబ్బు గనులశాఖకు చేరాలి. లేకపోతే ఉచితంగా ఇసుక సరఫరా చేయొచ్చు. 2018లో ఇదే విధానం పాటించారు. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా ఆదేశాలిచ్చారు.

బిల్లులివ్వరు.. అధిక లోడింగ్

కృష్ణా గోదావరి వాటర్‌వేస్ సంస్థ ప్రస్తుతం తుళ్లూరు మండలంలోని లింగాయపాలెం 1, 2, బోరుపాలెం వద్ద డ్రెడ్జింగ్ ఇసుక తెచ్చి, నిల్వచేసి అమ్ముతోంది. సరైన బిల్లులు ఇవ్వడంలేదు. 18-20 టన్నులకు బదులు ఏకంగా 30-35 టన్నుల ఇసుక లోడ్‌చేస్తున్నారు. మొత్తం లోడ్‌చేసిన ఇసుకకు బిల్లు కావాలని ఎవరైనా లారీ యజమానులు అడిగితే.. అదనంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అసలు నిత్యం ఎంత ఇసుక తవ్వుతున్నారు? ఎంత విక్రయిస్తున్నారనేది పక్కా లెక్కలు లేకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. నావిగేషన్ ఛానల్‌కు అనుగుణంగా తవ్వకాలు చేయాల్సి ఉన్నప్పటికీ, ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తోంది.



గత ఏడాది సెప్టెంబరులో బుడమేరు వరద కారణంగా శాంతినగర్‌లో తెగిపోయిన గండ్లను పూడ్చుతున్న పొక్లెయిన్లు ★ 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన రక్షణ గోడ


వరద ముప్పునకు రక్షణ గోడతో చెక్!

విజయవాడ నగరాన్ని గతేడాది సెప్టెంబరులో బుడమేరు వరద అతలాకుతలం చేసింది. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి వరద వస్తే తమ పరిస్థితి ఏమిటనే భయం నగరవాసుల్లో కలిగింది. దీనిని తొలగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పట్లో విజయవాడ పరిధిలోని శాంతినగర్ వద్ద బుడమేరు వరద ఉద్ధృతికి గట్టు తెగిపోయి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. అప్పట్లోనే తాత్కాలికంగా రాళ్లు, మట్టి పోసి అడ్డుకట్ట వేసినా నీరు లీకవుతుండటంతో శాశ్వతంగా గోడ కట్టాలని నిర్ణయించారు. మేలో రూ.28 కోట్ల అంచనాతో 11 మీటర్ల లోతు నుంచి గట్టుపై 8.6 మీటర్ల ఎత్తు, 500 మీటర్ల పొడవునా గోడను నిర్మించే పనులు ప్రారంభించి రికార్డు స్థాయిలో 3 నెలల్లోనే పూర్తిచేశారు. 200 మీటర్ల మేర ర్యాప్టింగ్, బిడ్డింగ్ పనులు కూడా పూర్తయ్యాయి.

– ఈనాడు, అమరావతి

మాకు పార్టీలు కాదు.. చట్టాలే ముఖ్యం

రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పష్టీకరణ



రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గంతో ప్రతినిధులు

ఒంగోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పోలీసులు చట్టాలకు లోబడి పనిచేస్తున్నారని, పార్టీల కోసం పనిచేయడం లేదని రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జనుకుల శ్రీనివాసరావు స్పష్టంచేశారు. ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గతంలో తెదేపా, తర్వాత వైకాపా హయాంలో పనిచేశాం. మళ్లీ ఇప్పుడు తెదేపా ప్రభుత్వంలో పనిచేస్తున్నాం. అధికారంలో ఎవరున్నా ప్రజల రక్షణ కోసం 100% శ్రమిస్తాం. అదే సమయంలో తప్పుచేసినవారు ఎవరైనా, ఎంతటి స్థాయిలో ఉన్నా చట్టప్రకారం శిక్షార్హులేనని గుర్తించాలి' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా చర్చించారు. సిబ్బందిపై పనిభారం పెరిగి పలువురు అనారోగ్యం పాలవుతున్న నేపథ్యంలో వారాంతపు సెలవును మంజూరు చేయాలని తీర్మానించారు. సమావేశంలో భాగంగా ఖాళీగా ఉన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ప్రకాశం జిల్లా సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య ఎన్నికవగా, ఒంగోలులో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఆర్ఎస్సైగా పనిచేస్తున్న వీరెల్ల తిరుపతిస్వామిని ఉపాధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. కో ఆప్షన్ సభ్యులుగా జి.వినోద్‌కుమార్ (ఇసుకపల్లి మెరైన్ పీఎస్, ఎస్‌పీఎస్ఆర్, నెల్లూరు), షేక్ షఫీఉల్లా (కడప), ఇ.మాల్యాద్రి (ప్రకాశం), బి.రామమోహన్‌రెడ్డి (సీఐడీ, మంగళగిరి), ఎం.లక్ష్మయ్య (గుంటూరు అర్బన్)లు ఎన్నికయ్యారు.

పేర్ని నానిపై కేసు

పామర్రు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నానిపై పామర్రు పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈ నెల 8న స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో వైకాపా విస్తృతస్థాయి సమావేశంలో నాని మాట్లాడుతూ వైకాపా శ్రేణులను 'రప్పా.. రప్పా' అంటూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఇవి తెదేపా, వైకాపా వర్గాల మధ్య ఘర్షణలను పెంచేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని తెదేపా సీనియర్ నాయకుడు చాట్ల రమేష్, ఇతర నేతలు పామర్రు సీఐ సుభాకర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యకర్తలను ఆ విధంగా ప్రేరేపించిన పేర్ని నాని, అనిల్‌కుమార్, వైకాపా నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, పెయ్యల రాజు, బాలవెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, కల్యాణ మండప నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

బీసీల డిమాండ్ల సాధనకు ఆగస్టు 18న 'చలో దిల్లీ'

ఈనాడు, అమరావతి: జాతీయ స్థాయిలో బీసీల డిమాండ్ల సాధనకు వచ్చేనెల 18న 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి నూకా నమ్మ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి తేదీలు ఖరారు చేసినట్లు వెల్లడించారు.

10 ఉత్పత్తులకు ఓడీఓపీ అవార్డులు

నేడు దిల్లీలో బహూకరించనున్న కేంద్రం

ఈనాడు, అమరావతి, పెనుకొండ, న్యూస్‌టుడే: ఒక జిల్లా- ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కార్యక్రమంలో రాష్ట్రానికి పది ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయని చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా పేర్కొన్నారు. వీటిలో ఏడు అవార్డులు చేనేత, హస్త కళల ఉత్పత్తులకు, రెండు వ్యవసాయ ఉత్పత్తులకు లభించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మరో అవార్డు అంతర్జాతీయ విభాగంలో దక్కిందన్నారు. ఈ అవార్డులను దిల్లీలో సోమవారం నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లాకు చెందిన ఏటికొప్పాక బొమ్మలు, కాకినాడ జిల్లా పెద్దాపురం చీరలు, బాపట్ల జిల్లా చీరాల, తిరుపతి జిల్లా వెంకటగిరి చీరలు, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం అల్లికలు, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టు చీరలు ఈ అవార్డులకు ఎంపికైనట్లు వివరించారు. వ్యవసాయ విభాగంలో గుంటూరు మిర్చి, శ్రీకాకుళం జీడిపప్పు అవార్డులు గెలుచుకున్నాయని తెలిపారు. ఈ అవార్డుల్లో జాతీయస్థాయిలో మూడు రాష్ట్రాలు ఎంపికకాగా, అందులో రాష్ట్రానికి ఒకటి రావడం సంతోషాన్నిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఆమె ఆదివారం మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో చేనేత, హస్తకళలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయన్నారు.

ఆగస్టు 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్తు..

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7న చేనేతలకు ఉచిత విద్యుత్తు పథకాన్ని ప్రారంభించనున్నట్లు సిసోదియా వివరించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామన్నారు. అదే రోజు త్రిఫ్ట్ ఫండ్ కూడా విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఉప్పాల హారిక ఫిర్యాదుపై కేసు నమోదు

గుడివాడ, న్యూస్‌టుడే: కూటమి కార్యకర్తలు తనను అవమానించి, కారు అద్దాలు పగలగొట్టారని కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక శనివారం అర్ధరాత్రి గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుడివాడ మండలం లింగవరంలో వైకాపా సమావేశానికి వెళుతుండగా కూటమి కార్యకర్తలు పట్టణంలోని నాగవరప్పాడులో తన కారు ఆపి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చంపుతామంటూ బెదిరించారని, తన కారును కదలనివ్వకుండా అసభ్య పదజాలంలో దూషించారన్నారు. దీంతో పోలీసులు 126(2), 292, 324(4), 351(2) రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేశారు.

రాజధానిలో 13 సంస్థలకు 65.89 ఎకరాల కేటాయింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో 13 సంస్థలకు ప్రభుత్వం 65.89 ఎకరాలు కేటాయించింది. వైద్యకళాశాల ఏర్పాటుకు కిమ్స్‌కి 25 ఎకరాలు, భాజపా రాష్ట్ర కార్యాలయానికి 2 ఎకరాలు.. పలు ఇతర సంస్థలకు మరో 5.4 ఎకరాలు కలిపి మొత్తం 32.40 ఎకరాలు కొత్తగా కేటాయించారు. 2014-19 మధ్య ఆరు సంస్థలకు కేటాయించిన 33.49 ఎకరాలను చిన్నపాటి సవరణలతో పునరుద్ధరించారు. గతంలో గెయిల్‌కి 0.4 ఎకరాలు, అంబికా సంస్థకు హోటల్ నిర్మాణానికి ఒక ఎకరం చొప్పున చేసిన కేటాయింపుల్ని రద్దుచేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్‌ల నివాసాల్లో పనుల పూర్తికి రూ.524.70 కోట్లు

రాజధాని అమరావతిలోని నేలపాడులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల కోసం 18 టవర్లలో 432 అపార్ట్‌మెంట్లతో చేపట్టిన బహుళ అంతస్తుల నివాస సముదాయంలో పెండింగ్ పనులను రూ.524.70 కోట్లతో పూర్తి చేయనున్నారు. ఇందుకోసం సీఆర్‌డీఏకి పరిపాలన అనుమతులిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఆదివారం ఉత్తర్వులిచ్చింది. ఆర్కిటెక్చరల్, అంతర్గత, బాహ్య విద్యుత్తు పనులు, ప్లంబింగ్, శానిటరీ, ఫైర్ ఫైటింగ్, లిఫ్టులు, భద్రత వ్యవస్థ, బాహ్య అభివృద్ధి పనుల పూర్తికి ఈ నిధులు వెచ్చిస్తారు.

ప్రొఫెసర్ల నియామక నోటిఫికేషన్‌ను నిలిపేయాలి

మంత్రి సత్యకుమార్‌కు ప్రభుత్వ వైద్యుల సంఘం లేఖ

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల నియామకం చేపట్టేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే నిలిపేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆదివారం లేఖ రాసింది. రెగ్యులర్ ప్రభుత్వ వైద్యుల హక్కులను పరిరక్షించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్, సెక్రటరీ జనరల్ రమేష్ కోరారు.

అధికారంలోకి వచ్చాక రప్పా.. రప్పా చేస్తా

వైకాపా ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల, న్యూస్‌టుడే: తమ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడానికి కూటమి పాలకులు ఏడాదిగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైకాపా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా గెలిచిన వెంటనే ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తామని, కూటమి నాయకులు, అధికారులను.. తమ కార్యకర్తల ఇంటివద్దకే తీసుకెళ్లి రప్పా.. రప్పా చేస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమను వేధించిన వారికి.. వైకాపా అధికారంలోకి రాగానే రెండింతల వేధింపులకు గురిచేస్తామని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అన్నారు.

76 ఏళ్ల ముసలోడివి.. ఎంతకాలం బతుకుతావ్?

సీఎం చంద్రబాబుపై పేర్ని నాని వ్యాఖ్య



ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: '76 ఏళ్ల ముసలోడివి నువ్వు ఎంతకాలం బతుకుతావ్? 50 ఏళ్ల జగన్‌ను భూస్థాపితం చేస్తావా? అది నీ తరమా, నీ కొడుకు తరమా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి వైకాపా నేత పేర్ని నాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని పచ్చ మహిళలతో నన్ను తిట్టిస్తారా? అని రెచ్చిపోయారు. పెడనలో ఆదివారం నిర్వహించిన వైకాపా కార్యకర్తల సమావేశంలో పేర్ని తన నోటికి పనిచెప్పారు. తాను నరికేయండని అనలేదంటూనే.. వివాదాస్పదంగా మాట్లాడారు. 'అరేయ్.. నేను అనాలంటే పట్టపగలే వేసేయమని చెబుతా్రా, చీకటిలో నరికేయండని అనలేదు' అంటూ మళ్లీ రెచ్చగొట్టారు. ఎన్నికల ముందు కూటమి నేతల ప్రసంగ వీడియోలను ప్రదర్శిస్తూ అవమానకరంగా మాట్లాడారు. 'వల్లభనేని వంశీని ఏదో చేస్తానంటూ ఎన్నికల ముందు నారా లోకేశ్ మాట్లాడాడు. ఐదు నెలలు వంశీని బెజవాడ జైల్లో ఉంచారు. ఏం చేశావ్..' అని పేర్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'ఆరోగ్యం బాగు చేసుకొని మరో మూడు నెలల్లో కొడాలి నాని గుడివాడలో అడుగుపెడుతున్నాడు. ఎవడొస్తాడో రండ్రా.. దమ్ముంటే చెడ్డీతో నడిపించండ్రా చూద్దాం..' అని రెచ్చగొట్టారు. 'అయ్యన్నపాత్రుడు 80 ఏళ్లొచ్చినా చావలేదు' అని స్పీకర్‌ను పరుష పదజాలంతో దూషించారు. 'కొల్లు రవీంద్ర కాదు.. సొల్లు రవీంద్ర. అన్నం కాకుండా.. బ్రాందీ షాపుల్లో కమీషన్లు తింటున్నాడు. కృత్తివెన్నులో 45 ఎకరాలు ఆక్రమించాడు. త్వరలో ఆధారాలతో సహా బయటపెడతాను' అని పేర్ని వ్యాఖ్యానించారు.

వారి బియ్యం మీకు రుచిగా ఉండవా?

'జగన్ పేరు మీద డిబేట్లు పెట్టి ఇన్నాళ్లు పబ్బం గడుపుకొన్నారు. నిన్నొక్కరోజు నా పేరు మీద నడిపించారు. ఏం..? కూటమి నేతల వ్యాఖ్యల మీద డిబేట్లు పెట్టరా? వారి బియ్యం మీకు రుచిగా ఉండవా?' అని మీడియాను అవమానించేలా పేర్ని మాట్లాడారు.




ఎక్కాలంటే గండం.. దిగాలంటే నరకం..

ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దుర్గాఘాట్ నుంచి కొండపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన దేవస్థానం బస్సులు చాలక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో కిక్కిరిసి చంటిబిడ్డలతో తల్లడిల్లుతున్నారు. వారంతం, సెలవు రోజుల్లో అదనపు బస్సులు వేయాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. బస్సులు చాలీచాలని వేళ... ఇలా బస్సు ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ కొండపైకి వెళ్లే మార్గంలో గాయాల పాలవుతున్నామని భక్తులు వాపోతున్నారు. – ఈనాడు, అమరావతి

కాలువలకు 12,788 క్యూసెక్కుల సాగునీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 12,788 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు(కేఈ) ప్రధాన కాల్వకు 9,781, కృష్ణా పశ్చిమ(కేడబ్ల్యూ) ప్రధాన కాల్వకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు కాల్వకు 1,404, బందరు కాల్వకు 1,853, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు.

వినతుల స్వీకరణ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఈనెల 14వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని వెల్లడించారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వినతులు స్వీకరిస్తామని వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి

ఎన్టీఆర్ కలెక్టరేట్: పచ్చి మిర్చి ధర పెరుగుతోంది. నగరంలోని రైతు బజార్లలో శని, ఆదివారాల్లో కిలో రూ.65 చొప్పున విక్రయించారు. ఈనెల ఒకటో తేదీన కిలో రూ.32 ఉన్న మిర్చి ధర క్రమేపీ పెరుగుతోంది. 5న రూ.38, 6న రూ.42 ఉండగా, ఏడో తేదీన ఏకంగా రూ.60లకు పెరిగింది. 8న రూ.66 ధర ఉండగా, 9న రూ.54లకు తగ్గింది. 10న రూ.50లకు తగ్గగా, 11న రూ.52లకు, 12న రూ.65లకు పెరిగింది. బాపట్ల జిల్లాలో స్థానిక పంట అయిపోయింది. ఆ తర్వాత ఉమ్మడి కడప జిల్లా బాలాగారిపల్లె నుంచి రాగా అక్కడా సరకు అయిపోవడంతో.. ప్రస్తుతం పులివెందుల నుంచి తక్కువగా, కర్నూలు జిల్లా నుంచి ఎక్కువగా వస్తోంది. తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి డిమాండ్ ఉండడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. కర్ణాటక నుంచి నల్ల మిర్చి అందుబాటులో ఉన్నా.. దీన్ని కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే నల్ల మిర్చి తెస్తారు.

తగ్గిన విక్రయాలు: ఇటీవల కాలంలో పచ్చి మిర్చి రూ.15లకు విక్రయించిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో ధర లేక మిర్చి సాగుపై రైతులకు ఆసక్తి తగ్గినట్టు చెబుతున్నారు. స్థానిక పంట వస్తే గానీ ధరలు అదుపులోకి వచ్చే పరిస్థితి లేదు. ధర తక్కువగా ఉంటే నగరంలోని ఒక రైతుబజారులో రోజుకు 15 నుంచి 16 క్వింటాళ్ల సరకు విక్రయిస్తుంటారు. ధర పెరగడంతో కొనుగోళ్లు 8 క్వింటాళ్లకు పడిపోయాయి..

విలక్షణ కోట.. విలువల పూదోట

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, కంకిపాడు, గవర్నర్‌పేట, భవానీపురం

విలక్షణ నటుడు... కోట శ్రీనివాసరావు.

ఆయనకు కృష్ణా జిల్లాతోనూ.. విజయవాడ నగరంతోనూ విడదీయలేని అనుబంధం ఉంది. కంకిపాడులో పుట్టి పెరిగిన కోట.. నటనలో తొలి అడుగులు ఇక్కడే వేశారు. విజయవాడలో కొన్నాళ్లు నివాసం ఉన్నారు. నగరంలో కళా, నాటక ప్రదర్శనలను చూసే ఆయన స్ఫూర్తి పొందారు. నటుడిగానే కాక ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా అనేక కార్యక్రమాలనూ నిర్వహించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా.. సేవలందించిన వేళ కళలు, కళాకారులను ఎంతో ప్రోత్సహించారు.



కోట శ్రీనివాసరావుకు కళారంగమంటే అమితమైన ఇష్టం. సినిమాల్లోకి వెళ్లక ముందు విజయవాడలో ఉన్నారు. కోటకు.. వన్‌టౌన్ కొత్త గుళ్ల వద్ద మూడు సొంత ఇళ్లు ఉండేవి. ఒకదానిలో తానుండి, మిగతావి చాలా తక్కువకు కళాకారులకు అద్దెకు ఇచ్చేవారు. అప్పట్లో రూ.3 వేలు అద్దె వచ్చే ఇంటిని రూ.800కే కళాకారులకు ఇచ్చేవారని ఆయన సన్నిహితులు గుర్తుచేసుకున్నారు.

కళాక్షేత్రానికి వెళ్లాల్సిందే... కొత్త గుళ్ల సెంటర్ నుంచి రోజూ రిక్షాలోనే లోబ్రిడ్జి మీదుగా విజయవాడలో పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. మధ్యలో కళాక్షేత్రంలో ఏవైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటే కచ్చితంగా ఆగి వీక్షించేవారు. కళలపై ఆసక్తితో నాటక రంగం వైపు ఆకర్షితులయ్యారు. సినిమా రంగానికి వెళ్లినా బెజవాడను మరవలేదు. తూర్పు ఎమ్మెల్యే అయ్యాక నగర కళా రంగంతో ఆయనకు అనుబంధం మరింత పెరిగింది.

జంధ్యాల పురస్కారమిక్కడే...

2001లో సుమధుర కళానికేతన్ సంస్థ జంధ్యాల పురస్కారంతో విజయవాడలో కోటను ఘనంగా సత్కరించింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనేక కళా ప్రదర్శనలు, సభలకు కోటా తరచూ ఎమ్మెల్యే హోదాలో హాజరయ్యేవారు.


1995లో పునాదిపాడులో కబడ్డీ విజేతలకు షీల్డ్ ప్రదానం సందర్భంగా విద్యార్థులతో...

నేనేమైనా చిరంజీవినా.. బాలకృష్ణనా?

కోట పదేళ్ల కిందట కంకిపాడు వచ్చినప్పుడు.. నలుగురు విద్యార్థినులు ఆయన దగ్గరకు వచ్చి "మీతో ఫొటో దిగుతాం సార్.. మీరన్నా, మీ నటనన్నా ఇష్టమని" చెప్పారు. దీంతో ఆయన తన సహజశైలిలో నవ్వుతూ.. 'నేను చిరంజీవో.. బాలకృష్ణో కాదు కదా.. నేను ఇష్టం అనడానికి..' అని చమత్కరించారు. "నాతో ఫొటో దిగాలనే కదా.. నాకు బిస్కెట్ వేస్తున్నారని" అనడంతో అక్కడున్న వాళ్లందరి ముఖంలోనూ నవ్వులు పూశాయి. ఆ తర్వాత విద్యార్థినులతో ఫొటో దిగి.. "చూశారా, ఈతరం పిల్లలు ఎంత తెలివితేటలతో పుడుతున్నారో.." అని చమత్కరించారు.

కంకిపాడులో చదువు.. విజయవాడలో వెలుగు

స్వగ్రామంపై మమకారం...

కంకిపాడులో మధ్యతరగతి కుటుంబంలో కోట శ్రీనివాసరావు పుట్టారు. సినీరంగాన మేటిగా ఎదిగినా.. కంకిపాడుపై తరగని మమకారం. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత పునాదిపాడులో హైస్కూలు విద్య చదివారు. బాల్యం నుంచి హాస్యోక్తులతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకునేవారు. కోట తండ్రి.. సీతారామాంజనేయులు. ఆయన... డాక్టర్‌గా సుపరిచితులు. తండ్రి క్రమశిక్షణ, అంకితభావమే తనకు స్ఫూర్తి అనీ.. ఎంత ఎదిగినా ఒదగాలనేది తండ్రి నుంచే నేర్చుకున్నానని కోట గుర్తు చేసుకునేవారు. కంకిపాడు బ్రాహ్మణ సంఘానికి కోట శాశ్వత గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.


2012లో కంకిపాడు వచ్చినప్పుడు స్థానికులతో..

నా అన్నే... తొలి గురువు..

కోట శ్రీనివాసరావు అన్న నరసింహారావు.. మంచి రంగస్థల నటుడు. ఆయన దర్శకత్వంలో రాష్ట్రంలో వందలసార్లు ప్రదర్శించిన 'వీరమ్మతల్లి', 'పుణ్యవతి' నాటకాల్లో కోట ప్రధాన పాత్ర పోషించారు. నటనలో 'అన్నే... నా తొలి గురువని' పలు మార్లు కోట చెప్పేవారు.


తమ్ముడు శంకరరావు, అన్న నరసింహారావులతో..

కల్యాణ మండపం కట్టాలనుకున్నా...

కోట.. తనకు వారసత్వంగా వచ్చిన కంకిపాడులోని స్థలంలో పేద, మధ్యతరగతి వారి కోసం కల్యాణ మండపం నిర్మించాలని భావించారు. కానీ.. ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో ఆయన కోరిక నెరవేరలేదు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులో నిర్మించిన గాయత్రీ ధ్యాన మందిరానికి కోట భారీ విరాళం అందజేశారు. సమయం దొరికిన ప్రతిసారీ కంకిపాడు వచ్చి బాల్యమిత్రులు, సంఘం సభ్యులు, గ్రామస్థులతో ఉల్లాసంగా గడిపేవారు.


గాయత్రీ ధ్యాన మందిరం

మీ కార్యక్రమానికి నేను రావచ్చా..

సుందర హనుమాన్ ధార్మిక పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో 2003లో సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలను విజయవాడలోని రామకోటిలో ఏర్పాటు చేశారు. షణ్ముఖశర్మకు అదే మొదటి కార్యక్రమం. అప్పట్లో ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు ఉన్నారు. షణ్ముఖశర్మ కార్యక్రమం ఉందని తెలిసి నిర్వాహకులకు ఫోన్ చేసి మరీ... నేను రావచ్చా అని కోట అడిగారు. దీంతో నిర్వాహకులు ఆనందంతో ఆయనను ఆహ్వానించారు. కోట శ్రీనివాసరావు చేతుల మీదగానే కార్యక్రమాన్ని ఆరంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఆయనకు ఉన్న ఇష్టానికి ఇది నిదర్శనం.


విజయవాడలో భాజపా నాయకులతో కలిసి ప్రజాప్రదర్శన

విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలు..

ఎన్డీయే కూటమి పొత్తులో భాగంగా 1999లో విజయవాడ తూర్పు నుంచి భాజపా ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట శ్రీనివాసరావు బరిలో దిగారు. కోట శ్రీనివాసరావుకు 57,047 ఓట్లు.. కాంగ్రెస్ అభ్యర్థి ఐలాపురం వెంకయ్యకు 50,971 ఓట్లు వచ్చాయి. 6,076 ఓట్ల ఆధిక్యంతో కోట ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత పునర్విభజనలో నాటి తూర్పు పరిధిలోని అధిక భాగం నేటి సెంట్రల్ నియోజకవర్గంగా మారింది. అప్పటి కంకిపాడు నియోజకవర్గంలోని కొంత భాగం వేరుచేసి ప్రస్తుత విజయవాడ తూర్పు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. కోట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రస్తుత సూర్యారావుపేట రాణా భవన సముదాయం ప్రారంభించారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హయాంలో రూపకల్పన చేశారు. డీస్నీల్యాండ్‌లో భాజపా రాష్ట్ర సమావేశాలను విజయవంతంగా నిర్వహించారు. భాజపా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతూనే.. ప్రజాప్రదర్శన నిర్వహించారు.

డబ్బుల కోసమే హతమార్చారు?

శ్రీకాళహస్తి సెల్‌ఫోన్ దుకాణదారుడి చాకచక్యంతో చిక్కిన నిందితులు

పటమట, న్యూస్‌టుడే: విశ్రాంత ఇంజినీర్ రామారావుని డబ్బుల కోసమే హతమార్చినట్లు పోలీసుల విచారణలో ప్రాథమికంగా తేలింది. రామారావుని హతమార్చి పరారైన పల్లెపు మంగ, ఉపేంద్రరెడ్డిని మాచవరం పోలీసులు శనివారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీకాళహస్తిలో అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం వాళ్లిద్దరినీ విజయవాడ నగరానికి తీసుకువచ్చారు.

★ మంగ ఈ ఏడాది మే 28న ఉపేంద్రరెడ్డిని శ్రీకాళహస్తిలో మూడో వివాహం చేసుకుంది. తరువాత నందు మొబైల్స్ దుకాణంలో ఇద్దరికీ కొత్త సిమ్‌లు తీసుకున్నారు. ఉపేంద్రరెడ్డి శివ భక్తుడు. ప్రతినెలా శ్రీకాళహస్తి వచ్చి దర్శనం చేసుకుంటాడు. ఆ కోణంలో పోలీసులు ఆలోచించి సెల్‌ఫోన్ దుకాణ యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పారు. వారి ఫొటోలు, వివరాలు అందజేశారు. అనుకున్నట్లే ఆదివారం రాత్రి కొత్త సిమ్ కొనేందుకు ఆ దుకాణానికి వెళ్లారు. దుకాణ యజమాని వెంటనే మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు తమ పై అధికారులకు విషయం చెప్పారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రక్రియ అంతా పది నిమిషాల్లో ముగిసింది. తరువాత ఎస్ఐ శంకర్ బృందం వారిని విజయవాడ తీసుకువచ్చింది.

పొంతన లేని సమాధానాలు: విచారణలో మంగ పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రామారావు తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని, ఉపేంద్రకు ఫోన్ చేసి విషయం చెబితే అతను వచ్చి అడగడంతో వివాదం చోటు చేసుకుందని, రామారావే ముందుగా చేయి చేసుకోవడంతో కోపంలో ఘటన జరిగిందని చెప్పుకొచ్చింది. బీరువాలో నగదు ఎందుకు తీశావంటే సమాధానం చెప్పట్లేదు. నాలుగు రోజుల కిందట రామారావు కుమార్తె చందన వచ్చి కొంత నగదు రామారావుకు ఇచ్చింది. అది మంగ చూసింది. బీరువాలో పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని ఊహించి ఉపేంద్రతో కలిసి ప్రణాళిక వేసుకున్నట్లు తెలిసింది.

★ గురువారం రాత్రి రామారావు నిద్రపోయిన తర్వాత ఉపేంద్రకు ఫోన్ చేసి పిలిచింది. ఇంటి వెనుక తలుపు తీసి లోపలికి తీసుకెళ్లింది. రాత్రి 12 గంటలకు బెడ్ రూమ్‌లో పడుకున్న రామారావు ఛాతిపై ఉపేంద్ర కూర్చొని దిండుతో ముఖంపై అదమగా, రామారావు కాళ్లని మంగ పట్టుకుంది. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అతనిపై కారం చల్లారు. బీరువా తెరిచి చూస్తే అందులో రూ.50 వేలు మాత్రమే ఉన్నాయి. ఇల్లు అంతా వెతికినా బంగారం, నగదు దొరక్కపోవడంతో అవి తీసుకుని పరారయ్యారు.

వెలితి తీర్చాలి.. వెలుగు తేవాలి..!

కూటమి సర్కారు చొరవతో కానూరు పైవంతెన పూర్తి

ఈనాడు, అమరావతి – కానూరు, న్యూస్‌టుడే

'జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పట్టించుకోకుండా వదిలేసిన కానూరు సిద్ధార్థ కళాశాల పైవంతెనను కూటమి సర్కారు రాగానే.. యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తేవడం హర్షణీయం. కానీ.. ఆ వంతెన మీదుగా వెళ్లే రహదారిపై వేయాల్సిన వీధి దీపాలను నేటికీ వేయలేదు. నిత్యం వేల మంది రాత్రుళ్లు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుద్దీపాలు లేక.. పెనమలూరు ఠాణా నుంచి తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలముకొని.. ప్రమాదాలు జరుగుతున్నాయి." విజయవాడ నగరాన్ని శివారు ప్రాంతాలను కలిపే కీలకమైన అనుసంధానం... కానూరు పైవంతెనే. వీధి దీపాల కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయని.. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు ప్రకటించి ఎనిమిది నెలలైంది. వంతెన మీదుగా వందడుగుల రహదారి వరకూ సెంట్రల్ లైటింగ్ వేస్తామన్నారు. కానీ.. రహదారి పక్కన డ్రెయినేజీ పనులు పూర్తి కాక.. సెంట్రల్ లైటింగ్ పనులు అడుగు పడటంలేదు.


పైవంతెనపై అంధకారం

కాలువల జాప్యంతో ఆగిన విస్తరణ.. పెనమలూరు ఠాణా నుంచి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా వందడుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో ఇరువైపులా కాలువల పనులు చేపడుతున్నారు. ఒకవైపు పూర్తవగా.. మరోవైపు నిర్మాణాల తొలగింపుతో జాప్యమైంది. ఇక్కడ కొన్ని విద్యుత్తు స్తంభాలు, ఓ ఆలయం ఉన్నాయి. దీంతో అలైన్‌మెంట్ మార్చి.. పనులు చేసేలా అధికారులు ప్రతిపాదించారు. మరో 300 మీటర్ల పొడవైన కాలువనూ నిర్మించాలి. ఇవి పూర్తయ్యాకే దారిని విస్తరించి.. సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతారు. అందుకే డ్రెయినేజీ పనులను త్వరగా చేయించాలి.

బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయం.. పంటకాలువ రహదారి పూర్తిగా అందుబాటులోకి వచ్చాక బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గంగా మారింది. నిత్యం వేల వాహనాలు బందరు రోడ్డుపై కాకుండా.. పైవంతెన మీదుగా తాడిగడప చేరుతున్నాయి. ఆపై నగర శివార్లలో జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. కానీ.. కిలోమీటరుకు పైగా పైవంతెన వద్ద అంధకారం నెలకొని తరచూ వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ఢీ కొని పడిపోతున్నారు. రాత్రి 7 గంటల నుంచిఅర్ధరాత్రి వరకూ వంతెన మీదుగా వాహనాలు భారీగానే వెళ్తున్నాయి.

కానీ విద్యుద్దీపాలు లేక.. నిత్యం ప్రమాదాలు

దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ..

సిద్ధార్థ పైవంతెన నుంచి వందడుగుల రోడ్డు వరకు కిలోమీటరు రహదారిని ఎమ్మెల్యే సుజనాచౌదరి దత్తత తీసుకున్నారు. ఆయన నివాసం ఇక్కడే ఉండటంతో రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలూ సిద్ధం చేయించారు. డ్రెయినేజీ పనులు పూర్తయితే రహదారిని విస్తరించి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ వేస్తారు.

నెలలో డ్రెయినేజీ పనుల పూర్తి

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం. కొలిక్కి రాగానే సెంట్రల్ లైటింగ్ పనులు చేపడతాం. ఈనెల ఆఖరులోగా పూర్తిచేయాలని గుత్తేదారు, అధికారులను ఆదేశించాం.

– నజీర్, కమిషనర్, తాడిగడప

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింటా అందాలు

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానదీ తీరంలో చిన్నారులు, యువత వేసిన ఫ్లోర్ పెయింటింగ్, బొమ్మలు ఆకట్టుకున్నాయి. జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బరంపార్కు ఘాట్ వద్ద ఆదివారం పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. యువత, చిన్నారులు సృజనకు పదును పెట్టారు. చిన్నారులు, యువతతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర ఫ్లోర్ పెయింట్ వేశారు. కుమారుడితో కలిసి కలెక్టర్ పీ4 బొమ్మకు రంగులు అద్దారు. అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో మిగిలిన వారిలోనూ ఉత్సాహం నెలకొంది.



చిన్నారులతో కలిసి పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్

ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 746 మంది హాజరు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు ఆదివారం 746 మంది అభ్యర్థులు హాజరై తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో 60,001 నుంచి లక్ష ర్యాంకు వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 260 మంది, క్రీడా విభాగంలో 103 మంది హాజరయ్యారు. ఆర్మీ సంతతి విభాగంలో ఒకటి నుంచి 50,000 ర్యాంకుల వరకు పిలవగా.. 383 మంది వచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. 14వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో 1,00,001 - 1,50,000 ర్యాంక్ వరకు, ఆర్మీ విభాగంలో 50,001 - 1,00,000 ర్యాంకు వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రావాలని ఆయన తెలిపారు.

నవ్యతే నేస్తమై.. నడిపించే అస్త్రమై

★ టెక్ @ఎన్టీఆర్ కమిషనరేట్
★ నూతన ఆవిష్కరణలకు వేదిక..

న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్.. రాష్ట్రంలో మార్మోగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో మేటిగా నిలిచింది. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తనదైన ప్రత్యేకత చాటుతూ.. నూతన ఆవిష్కరణలకు వేదిక అవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పట్టున్న ఎస్.వి.రాజశేఖరబాబు.. సీపీగా కొలువుదీరాక అనేక మార్పులకు శ్రీకారం చుట్టడం.. సత్ఫలితాలను ఇస్తోంది.

సకల జన... 'సురక్ష': ప్రతి ఠాణాలో అన్ని వర్గాల ప్రజలతో 'సురక్ష కమిటీలు వేశారు. తర్వాత 'సురక్ష 360' పేరుతో అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గ్రామాల్లో పూర్తిగా సీసీ కెమెరాలు పెట్టారు. హోంమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. తాజాగా 'సురక్ష డివైన్' పేరుతో ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలకు శ్రీకారం చుట్టారు.

యాప్‌తోడు.. సేవలు మెండు: వీవీఐపీ పర్యటనలు, పండగల వేళ శరవేగ బందోబస్తుకు ప్రత్యేకంగా 'ఏపీ పోలీస్ ఈ డిప్లాయిమెంట్' యాప్‌ను తెచ్చారు. దీంతో నిమిషాల్లో బందోబస్తు వేసే వీలుండటంతో ప్రశంసలు అందుకుంది. డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా దీనిని రాష్ట్రవ్యాప్త అమలుకు నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ టూల్‌తో 'అస్త్రం' యాప్ రూపొందించారు. నగర ట్రాఫిక్ సమస్యలను క్షణాల్లో గుర్తించి సరిచేసేలా తీర్చిదిద్దారు. 'ఇ-పహారా' యాప్‌తో బీట్ సిస్టమ్ తెచ్చి.. రాత్రుళ్లు అన్ని ప్రాంతాల్లో నిఘా సులభతరం చేశారు.




మహిళా కానిస్టేబుళ్లకు డ్రోన్ పైలట్లుగా శిక్షణ

సైబర్ నేరాలపై.. కమాండోస్ సైరన్: 'డిజిటల్ అరెస్టు'.. ప్రజలను వణికించింది. రూ.కోట్లు దోచేస్తున్న సైబరాసురులను ఎదుర్కొనేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయించారు. ప్రజలకు అవగాహన కలిగించి.. భరోసా కల్పించేలా 'సైబర్ కమాండోస్' రూపొందించారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 3 లక్షల మందిని సిద్ధం చేశారు.

డ్రోన్ విప్లవంతో భళా...: కమిషనరేట్‌లో డ్రోన్ విప్లవం.. మరో మేలిమలుపు. ట్రాఫిక్ నియంత్రణేకాక.. పోలీసులు వెళ్లలేని మారుమూలకూ డ్రోన్లను పంపి అసాంఘిక శక్తుల ఆట కట్టించారు. ఇందుకు ప్రతి ఠాణాకు ఒక డ్రోన్ కేటాయించారు. 70 మంది మహిళా పోలీసులకు డ్రోన్ నిర్వహణలో శిక్షణ ఇచ్చి డ్రోన్ పైలట్లుగా తీర్చి దిద్దారు.

ప్రతీ క్షణం.. నిశిత నిఘా: శాంతిభద్రతల రక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ పరిశీలనకు సీసీ కెమెరాలను పూర్తిగా అమర్చారు. నేరాలను చాలా వరకు వీటి సాయంతో కట్టడి చేశారు. ప్రతి కూడలిలో ట్రాఫిక్‌పై నిఘా పెంచి ఉల్లంఘనులకు జరిమానాలు వేస్తున్నారు. ఏడాది వ్యవధిలో 428 చోరీ కేసులు నమోదవగా.. 280 కేసులు ఛేదించారు. రూ.7.16 కోట్ల సొత్తు చోరీకి గురవగా.. రూ.6.07 కోట్లు రికవరీ చేయగలిగారు.


సీసీ కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షణ

వినూత్న పథంలో ముందుకు..

★ ఏడాదిలో మూడుసార్లు చోరీకి గురైన... 1400 చరవాణులను పట్టేసి సొంతదారులకు అప్పగించారు. ★ హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితుల కుటుంబాలకు రూ.8.95 కోట్లు పరిహారం ఇప్పించారు. ★ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఆధునికీకరణ ★ 350 మంది ట్రాఫిక్ అంబాసిడర్ల నియామకం. ★ గంజాయి నేరస్థులపై పిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ ★ రౌడీషీటర్ల పూర్తి వివరాల కంప్యూటరీకరణ ప్రత్యేకతగా నిలిచాయి.

ఈదుతూ.. సేద తీరుతూ!



కరకట్ట వద్ద కృష్ణానదిలో ఈత కొడుతున్న నగరవాసులు

రోజంతా చదువులు, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు, వివిధ పనులు నిమిత్తం బిజీబిజీగా కాలం గడిపే విజయవాడ నగర వాసులు, విద్యార్థులు వారాంతం ఆదివారం వచ్చిందంటే చాలు కృష్ణమ్మ ఒడిలో వాలిపోతున్నారు. కుటుంబాలతో సహా తెల్లవారుజామున 5 గంటలకే ప్రకాశం బ్యారేజి కరకట్ట వద్దకు చేరుకుని కృష్ణా నదిలో ఈత కొడుతూ సేద తీరుతున్నారు. నిత్యం వచ్చి సాధన చేసే వారితో పాటు వారాంతంలో వచ్చే వారు కూడా తోడవటంతో నదీ తీరమంతా సందడిగా మారుతోంది. - ఈనాడు అమరావతి

రెండో విడత ప్రవేశాలకు 907 మంది ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు రెండో విడత ప్రవేశాల కోసం ఎంపికైన 907 మంది విద్యార్థుల జాబితాను ఆదివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థుల పేర్లను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొదటి విడతలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 628 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో చేరలేదు. దీంతో ఆ సీట్లు ఖాళీపడ్డాయి. వీటితో పాటు దివ్యాంగుల కోటా కింద 179, సైనికోద్యోగుల పిల్లల కోటా కింద 80, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 20 సీట్లతో కలిపి మొత్తం 907 సీట్లకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందులో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలుకు 460, నూజివీడుకు 85, శ్రీకాకుళానికి 265 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ కోటా కింద 40 సీట్లు, క్రీడా కోటా కింద 20 సీట్లకు నిపుణులైన ఆయా శాఖల అధికారుల నుంచి విద్యార్థుల మెరిట్ జాబితా అందాల్సి ఉంది. ఈ సీట్ల భర్తీ కూడా మరో వారంలో పూర్తి కానుంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 96 మంది విద్యార్థులు ఈ నెల 17న ఇడుపులపాయకు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 810 మంది విద్యార్థులు అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగే కౌన్సెలింగ్‌కు ధ్రువపత్రాలు, లగేజీలతో హాజరు కావాలని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కొత్తగా ఎంపికైన విద్యార్థులందరికీ సోమవారం నుంచి ఓరియెంటేషన్ తరగతులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి సమీక్ష నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ ఈనెల సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఎ.వి.ఎస్.రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూలు కులాల జనాభా స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల స్థితి, ప్రభుత్వ పరంగా వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షిస్తారు. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎన్‌సీఎస్‌సీ) డైరెక్టర్ జి.సునీల్‌కుమార్‌బాబు పాల్గొంటారు.

నగదు అవకతవకలపై సీబీఐ అధికారుల దర్యాప్తు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని సున్నంపాడు పోస్టాఫీస్‌లో నగదు గల్లంతైన విషయంపై ఆ గ్రామంలో ఆదివారం సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు సర్పంచి దేశం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో డిపాజిట్‌దారు నగదు ఏ విధంగా దోపిడీకి గురైంది, ఎవరి ఖాతాలో ఎంత నగదు గల్లంతైందో బాధితుల నుంచి వివరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. రూ.35 లక్షలు పైబడి డిపాజిటర్ల నగదు స్వాహా జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు సీబీఐ సీఐ నరేష్ తెలిపారు. ఆయనతో పాటు హెడ్‌కానిస్టేబుల్ కమ్రుద్దీన్, గ్రామస్థులు విచారణలో పాల్గొన్నారు.

చిక్కడు.. దొరకడు

బెంగళూరు డ్రగ్స్ సూత్రధారి దోబూచులాట

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యం 'మెత్' స్వాధీనం చేసుకున్న కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. ఈ కేసులో ముగ్గురు యువకులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5.2 గ్రాముల మెత్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన గౌర శ్రీరాం వెంకట మణికంఠ బెంగళూరు నుంచి మెత్ తీసుకు వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి..

మాదకద్రవ్యం విక్రయించే ముఠా పోలీసులకు దొరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు విచారణలో గుర్తించారు. బెంగళూరులోని పబ్‌లో ఆకాశ్ అనే యువకుడు మణికంఠకు పరిచయమయ్యాడు. డ్రగ్స్ సరఫరాలో అతనిదే కీలకపాత్ర అని గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారం ఇచ్చి పుచ్చుకుంటారు. డ్రగ్స్ కోసం వేర్వేరు వ్యక్తుల నెంబర్లకు యూపీఐ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆకాశ్ రంగంలోకి వస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో డ్రగ్స్ ఎక్కడ ఉంచాడో చెబుతాడు. దీని కోసం వీరు జాతీయ రహదారులను ఎంపిక చేసుకుంటారు. ఫలానా ప్రదేశంలో ఉంచి ఆ సమాచారాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తారు. తరువాత ఆ వివరాలు తొలగిస్తారు. చరవాణిపై పోలీసులు నిఘా ఉంచడంతో..తద్వారా నిందితులు పోలీసులకు దొరికిపోతున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వీరు ఇన్‌స్టాగ్రామ్‌ను ఎంచుకున్నారు. పోలీసులకు దానిపై నిఘా లేకపోవడంతో సులువుగా వీరి లావాదేవీలు జరిగిపోతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దీనికి సంబంధించిన కీలకమైన సమాచారం సేకరించారు. బెంగళూరుకు చెందిన ఆకాశ్ దొరికితే తప్ప ఈ ముఠా గుట్టు రట్టు చేయలేమని విజయవాడ పోలీసులు అంటున్నారు.

ఖాతాలు, లావాదేవీలపై దృష్టి

డ్రగ్స్ కొనుగోళ్లు, అమ్మకాల్లో భాగంగా నగదు లావాదేవీలు జరిపిన ఖాతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ప్రధానంగా మణికంఠ ఖాతా నుంచి ఏయే ఖాతాలకు డబ్బులు వెళ్లాయి? వాటి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. వీటి పూర్తి వివరాలు తెలిస్తేనే డ్రగ్స్ ముఠా ఎంత మందితో లావాదేవీలు నిర్వహిస్తుంది? తదితర విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఇవన్నీ జరిగితే రాబోయే రోజుల్లో ఈ ముఠాను కట్టడి చేయవచ్చని పోలీసులు అంటున్నారు.

సంగీతంలో ఉన్నత స్థానానికి సూరిబాబు



మాట్లాడుతున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, పక్కన మల్లాది సూరిబాబు, ఎల్వీ సుబ్రహ్మణ్యం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : గురువుల అనుగ్రహం, అభిమానుల ఆదరణతో సంగీత రంగంలో సూరిబాబు ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సామగాన లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన సంగీతోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళల పట్ల యువత ఆసక్తి కనబరచాలని కోరారు. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సూరిబాబు ఎన్నో కచేరిలు నిర్వహిస్తూ... తన సంగీతంతో ఎంతో మంది అభిమానులను పొందగలిగారని, ఎన్నో అవార్డులు సాధించి తన కంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు డి.రాఘవచారి, ఎన్.రవికుమార్, అన్నవరపు రామస్వామి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, భగవాన్ రమణ మహర్షి ట్రస్ట్ నిర్వాహకుడు సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సూరిబాబు దంపతులను అతిథులు సత్కరించారు.



జనజాగృతి చిత్రాలకు రంగులు అద్దుతూ..



బంగారు కుటుంబం ఆవిష్కరిస్తూ...




మొదటి స్థానంలో నిలిచిన తనూజకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

కృష్ణా తీరం.. వర్ణ రంజితం


భవానీపురం, న్యూస్‌టుడే: నగర ప్రజలు, యువత వేసిన బొమ్మలతో కృష్ణానదీ తీరం కొత్త రూపు సంతరించుకుంది. ఎన్టీఆర్ జిల్లా అధికారులు, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలోని హరిత బరంపార్కు ఘాట్ వద్ద ఫ్లోర్ పెయింటింగ్, చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు ఆదివారం ఉదయం నిర్వహించారు. యువతీ, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చాటారు. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ...ప్రజలను జాగృతం చేసేలా వేసిన చిత్రాలతో నదీ తీరం కొత్త శోభను సంతరించుకుందన్నారు. వైబ్రెంట్ విజయవాడకు ఈ కార్యక్రమం తొలిఅడుగు అని పేర్కొన్నారు. నగర పరిధిలోని పవిత్ర సంగమం, కొండపల్లి ఖిల్లా, గాంధీకొండ తదితర పర్యాటక ప్రదేశాల్లో వివిధ థీమ్‌లతో కార్యక్రమాలను రూపకల్పన చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగర యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ విధమైన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.



ప్లాస్టిక్ భూతం నుంచి భూమాతను రక్షించుకుందామంటూ..



బొట్టుబొట్టునూ ఒడిసిపడదాం..



మేల్కోకుంటే ఎడారే

విజేతలకు బహుమతులు

ఫ్లోర్ పెయింటింగ్, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్-సేవ్ వాటర్ అంశంపై బొమ్మ వేసిన జి.తనూజ మొదటి స్థానంలో నిలవగా రూ.10వేలు బహుమతిగా అందజేశారు. ద్వితీయ బహుమతిగా యామిని విశాలకు రూ.7500లు, తృతీయ బహుమతి వి.జశ్వంతి, నాలుగో బహుమతి ఎం.సురేష్ పొందారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానంలో ఎం.ఎస్.వైష్ణవి, రాహుల్ జయాన్ ద్వితీయ, జి.భాష్యశ్రీ తృతీయ, లక్ష్య జైన్ నాలుగో స్థానంలో నిలిచారు. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సమాజ పరివర్తనకు ఉపయోగపడే సాహిత్యం అవసరం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబించే వాస్తవ జీవన చిత్రాన్ని ఎస్.ఆర్.పృథ్వి రచించిన 'పగిలిన జీవ కలలు' పుస్తకంలో చూస్తామని కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ చెప్పారు. ఆదివారం సాయంత్రం విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, జి.ఆర్.కె. పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి ఎస్.ఆర్.పృథ్వి రచించిన పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంతియాజ్ తొలుత 'పగిలిన జీవ కలలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ పరివర్తనకు ఉపయోగపడే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. 'నానో ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించిన డీఎస్పీ ఎన్.వి.రమణ మాట్లాడుతూ స్వల్ప అక్షరాలతో అనల్పమైన అర్థం నానో కవితా ప్రక్రియలో చూస్తామని తెలిపారు. అనేక మంది కవుల రచనా శైలిని కవి ఎస్.ఆర్.పృథ్వి చక్కగా విశ్లేషించారని ప్రశంసించారు. ఆకాశవాణి పూర్వపు సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, ప్రముఖ రచయిత్రి కాపూరి సత్యవతి ఈ పుస్తకాలను సమీక్షించారు. సభకు ఎక్సరే కొల్లూరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, బి.అంజనేయరాజు, దాముర్ల వెంకటసుబ్బయ్య, కొల్లూరి కనకవల్లి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, ఎస్ఆర్ పృథ్వి, ఎన్.వి.రమణ, కొల్లూరి, వెంకటసుబ్బయ్య, కృష్ణకుమారి, సత్యవతి తదితరులు

దుర్గమ్మకు పోలీసుల ఆషాఢ సారె



అమ్మవారికి సారె తీసుకువస్తున్న సీపీ రాజశేఖర బాబు దంపతులు, పక్కన ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖరబాబు దంపతులు ఆదివారం సారెను సమర్పించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని రావి చెట్టుకు పూజ చేసిన అనంతరం పోలీసు కుటుంబాలతో కలిసి సీపీ దంపతులు ఊరేగింపుగా సారెను తీసుకువచ్చారు. ఈవో శీనానాయక్ వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సీపీ దంపతులకు ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. డీసీపీలు ఉదయరాణి, ప్రసాద్, ఏడీసీపీలు రామకృష్ణ, ప్రసన్నకుమార్, ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, దామోదరరావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాశ్ పాల్గొన్నారు.

కమ్మ సేవా సమాఖ్య కార్యక్రమాలు విస్తృతం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

పటమట, న్యూస్‌టుడే: కమ్మ వారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు కమ్మ సామాజికవర్గ మేధావులు, పెద్దలు ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని పటమట ఫన్ టైమ్స్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ కమ్మ వారి సేవా సమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఐక్యత లేకపోవడం వల్ల ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుపడడం లేదని అన్నారు. కేవలం కమ్మ కులానికే కాకుండా ఇతర వర్గాల్లో కూడా పేదలను గుర్తించి వారికి విద్య, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో అమరావతిలో రాష్ట్ర స్థాయి కమ్మ భవన్ నిర్మాణానికి, డిజిటల్, భౌతిక గ్రంథాలయాల ఏర్పాటుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మండవ రమ్య సంధానకర్తగా వ్యవహరించగా.. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు గన్ని భాస్కరరావు సభకు అధ్యక్షత వహించారు. సభ్యులు గూడూరు సత్యనారాయణ, సూరపనేని స్వరూపరాణి, మండలపు జగదీష్, గుమ్మడి రామకృష్ణ, కనకమేడల శ్రీనివాస చక్రవర్తి, బొర్రా గాంధీ, జీవీ రాయుడు, సామినేని కోటేశ్వరరావు, నల్లూరి చలపతిరావు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

చెరువు భూమి ఆక్రమణపై చర్యలు

ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'చెరువు భూమిని చెరబట్టేశారు' శీర్షికన ఈ నెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి తుళ్లూరు పోలీసులు స్పందించారు. వడ్డమాను గ్రామంలో నకిలీ పత్రాలతో చెరువు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశారని గ్రామానికి చెందిన బాధిత రైతు జంగా శివశంకర్‌రెడ్డి (46) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం తుళ్లూరు సి.ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగా శివశంకర్‌రెడ్డి ముత్తాత జంగా వెంకటరామిరెడ్డికి సర్వే నం.159లో ఉన్న 4.65 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇంకా ఎవరికీ పంపకాలు చేయలేదు. ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి గ్రామానికి చెందిన కంజుల పురుషోత్తమరెడ్డి, మరో నలుగురు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 20 జూన్ 2025న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనికి కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, చినఆవుటపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సింహాద్రి సుబ్బారావు సహకరించారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురిపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ -173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపేయండి



ఐక్యత చాటుతున్న రామకృష్ణ, శ్రీనివాసరావు, శోభనాద్రీశ్వరరావు, దుర్గాభవాని, ప్రసాద్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అదానీ కంపెనీ స్మార్ట్‌మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆపకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం దాసరిభవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వం అదానీ నుంచి ముడుపులు తీసుకొని 20 సంవత్సరాల ఒప్పందంతో రూ.లక్ష కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని ఆరోపించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల బిగింపుతో అందరిపై పెనుభారాలు పడతాయని చెప్పారు. న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 17, 22 తేదీల్లో పట్టణ, మండల స్థాయిలో సదస్సులు, 23 నుంచి 29 వరకు ఇంటింటికీ ప్రచారం, సంతకాల సేకరణ, 30వ తేదీ నుంచి ఆగస్టు 4 వరకు కాలనీల్లో నిరసన ప్రదర్శనలు, ఆగస్టు 5న విద్యుత్తు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు హరినాథ్, ఎం.రామకృష్ణ, తూమాటి శివయ్య, ఖాదర్‌బాషా, గోవిందరాజులు, జానకిరాములు, మరీదు ప్రసాదబాబు, బి.శ్రీనివాసులు, రావుల వెంకయ్య, బి.నరసింగరావు, రవీంద్రనాథ్, దుర్గాభవాని, యు.వీరబాబు, కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.

జైల్లో పరిచయం.. కలిసే దొంగతనం



నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ చంద్రశేఖర్, రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు

మైలవరం, న్యూస్‌టుడే: దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు...వేర్వేరు కేసుల్లో జైలుకెళ్లి ఒకరికొకరు పరిచయమయ్యారు. ఒంటరిగా ఎందుకనుకుని తోడు దొంగలుగా మారారు. పొలంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు) సహకారంతో ఇద్దరినీ పట్టుకుని మళ్లీ జైలుకు పంపించారు. రెడ్డిగూడెం మండలం కుదపలో చోటుచేసుకున్న దొంగతనం కేసు వివరాలను ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ దాడి చంద్రశేఖర్ వివరించారు. ఈ నెల 4వ తేదీన రెడ్డిగూడెం మండలం కుదపలో మరీదు జమలమ్మ ఒంటరిగా పొలంలో గేదెలు మేపుతోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆమె వద్దకు వచ్చి, మాటలతో ఏమార్చి ఠక్కున మెడలో బంగారు నానుతాడును లాక్కుని, అప్పటికే రహదారిపై ద్విచక్ర వాహనంతో సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సాయంతో నిందితులు, పాత నేరస్థులైన కొండపల్లి ముత్యాలచెరువు ప్రాంతానికి చెందిన నామాల నాగరాజు, కృష్ణాజిల్లా గుడివాడ చెంచుకాలనీకి చెందిన మోటపర్తి నాగరాజులుగా గుర్తించారు. శనివారం సాయంత్రం మండలంలోని గణపవరం సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు. వారిద్దరిపై ఇప్పటికే స్టేషన్ల పరిధిలో దొంగతనాల కేసులు నమోదవగా, నామాల నాగరాజుపై కేడీ షీటు ఉంది. రిమాండ్ ఖైదీగా ఉన్న అతను ఈ ఏడాది మే 8వ తేదీన విశాఖపట్నం కేజీహెచ్ నుంచి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. మోటపర్తి నాగరాజుపై గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైంది. ఇద్దరికీ గతంలో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఏర్పడిన పరిచయంతో కొన్నాళ్లుగా కలిసి దొంగతనాలు చేస్తున్నారని వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.2.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి, కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహరించిన రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు, సిబ్బందిని కమిషనర్, డీసీపీ, ఏసీపీలు అభినందించినట్లు తెలిపారు.

కోలుకుంటున్న శిశువు

విజయవాడ పాతాసుపత్రి : విజయవాడలోని కొత్తపేట కొండ ప్రాంతంలో ఈనెల 2న అమానవీయ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పాతబస్తీ కొత్తపేట పోతిన సాయిప్రసాద్ వీధి చింతాడ రాము ఇంటి వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే జన్మించిన మగ శిశువును రోడ్డుపై వదిలివెళ్లారు. ఆ శిశువు బొటనవేలును ఎలుకలు కొరుక్కుతిన్నాయి. 2వ పట్టణ పోలీసులు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ అధికారులు విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువుకు పిల్లల వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం కోలుకుంటుందని వైద్యులు పేర్కొన్నారు. కాకపోతే శిశువు బొటనవేలుకు ప్లాస్టిక్ సర్జరీ అవసరమవుతుందని వైద్యులు భావిస్తున్నారు. ఆ సర్జరీని శిశువు తట్టుకోలేడని, ఇప్పుడు కాకపోయిన భవిష్యత్తులో ఇన్‌ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఉన్నందున రెండేళ్లు వచ్చిన తరువాత సర్జరీ చేయాలని వైద్యులు భావిస్తున్నారు. శిశువు ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యాక శిశు సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? మండలంలోని దుగ్గిరాలపాడు గ్రామంలో కాలువల్లో పూడిక తీయక మురుగు పేరుకుపోయి దుర్వాసన దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **-కె.రాంబాబు, స్థానికుడు** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించి బ్లీచింగ్ చల్లిస్తాం. **- హరికృష్ణ పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు

? గుంటుపల్లి ఖాజీపేటలోని మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు పారుదల నిలిచిపోయింది. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- రామనాయక్, స్థానికుడు** ✔ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- మురళీ, గ్రామకార్యదర్శి,** – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

స్పందనకు వందనం

◆ పట్టణంలోని 6వ వార్డుల్లో డ్రెయినేజీలు పిచ్చి మొక్కలతో నిండిపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

◆ పట్టణంలోని 5వ వార్డులో రెవెన్యూ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన చెట్ల కొమ్మలు పెరిగి ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు వివరించగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారి పక్కన చెట్ల కొమ్మలు తొలగించి ట్రాక్టర్‌తో బయటకు తరలింపజేశారు.– న్యూస్‌టుడే, తిరువూరు

170 మందికి ఆరోగ్య పరీక్షలు



కోడూరులో ప్రజలకు వైద్యం చేస్తున్న డాక్టర్ శ్వేత

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరులో తెదేపా నాయకుడు యెలినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విజయవాడ ఒమెగా అను ఆస్పత్రి వైద్యులు పాల్గొని కీళ్లు, ఎముకలు, గుండె జబ్బులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. యెలినేని నాగశిరోమణి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ శ్వేత, డాక్టర్ అన్వర్ పాల్గొని సుమారు 170 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం అక్కడకి వచ్చిన ప్రజలకు, రోగులకు ఆరోగ్యంపై నిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే ఉచిత ధన్వంతరి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 95 మంది రోగులు హాజరు కాగా వైద్యులు ఈశ్వర్, పవన్, శ్రీవాణి తదితరులు మధుమేహం, రక్తపోటు వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడా మందులను ట్రస్టీ నిర్వాహకుడు జువ్వా వెంకటేశ్వరరావు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, రామారావు, యేసు, బొద్దా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ముత్యాలమ్మ

ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్లపాడులో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు, భక్తులు ఆదివారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే: మండల, పట్టణంలోని రౌడీషీటర్లకు ఆదివారం తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సౌర పలకలతో అధిక లాభం

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రతి గృహ విద్యుత్తు వినియోగదారుడు సౌరశక్తి పలకలను ఏర్పాటు చేసుకుని 25 ఏళ్ల పాటు లాభం పొందాలని ఏపీఎస్పీడీసీఎల్ సహాయక ఇంజినీర్ పవిత్రాశ్రీ అన్నారు. సోలార్‌పై గృహ వినియోగదారులకు అవగాహన కలిగిస్తూ కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని కొండపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణానికి హితమైన సౌర పలకల ద్వారా పొందే విద్యుత్తు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. గృహ వినియోగదార్ల కోసం 2, 3 కేవీల సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రాయితీ ఇస్తుందన్నారు. బ్యాంకుల ద్వారా పొందిన రుణాలకు నెలవారీ సులభ వాయిదాలు చెల్లించిన తర్వాత విద్యుత్ బిల్లుల భారం ఉండదని చెప్పారు. వీటిపై అవగాహన లేని వారు అందుబాటులో ఉన్న లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ సహాయంతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భద్రత మరవద్దు.. బాధ్యత మీ వంతు

దమ్ము చక్రాలతో ఏమరుపాటుగా ఉంటే ప్రాణానికే ముప్పు

తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే

జిల్లాలో అన్నదాతలు ఖరీఫ్ వరినాట్లు ప్రారంభించారు. గత పది రోజులుగా చెరువులు, ఎత్తిపోతల పథకాలు, బోర్లు, బావులు, వాగుల కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలు మాగాణి భూముల్లో దమ్ము చేయడానికి ఇనుప చక్రాలతో ఉన్న ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బురదలో చక్రాలు కూరుకుపోయి తిరగబడే ప్రమాదం ఉంది. జరగరానిది జరిగి ఆ సమయంలో మృత్యువాత చెందితే కుటుంబాలు ఒంటరిగా మిగులుతాయి.



ప్రమాద నివారణకు ఇనుప చక్రాలతో పాటు ఇలా పళ్లగొర్రు

గతంలో తిరువూరు నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఆరుగురు వరకు దుర్మరణం చెంది..వారి బంధువులకు దూరమయ్యారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో 40 వేల ఎకరాల వరకు వరిసాగు చేస్తున్నారు. గతంలో వరినాట్లు ముందు ఎడ్ల నాగళ్లు, అడ్డతో దమ్ము చేసేవారు. యాంత్రిక వ్యవసాయం ప్రారంభించాక తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకోవాలన్న తొందర్లో చోదకులు, రైతులు, కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలిలా.. మాగాణిలో ట్రాక్టర్‌తో దమ్ము చేసేటప్పుడు ఇనుప చక్రాలతో పాటు వెనుక గొర్రు(కల్టివేటర్) అమర్చాలి. దీంతో ఇంజిన్ పైకి లేవకుండా, పల్టీ కొట్టకుండా అడ్డుపడుతుంది. ఒక మడి నుంచి మరో మడికి వెళ్లేటప్పుడు రెండు చక్రాలు పొలం గట్టుపై ఒకేసారి ఎక్కించకుండా ఒక చక్రాన్ని ఎక్కించిన అనంతరం మరోదాన్ని ఎక్కించాలి. రెండు చక్రాలను ఒకేసారి ఎక్కిస్తే ట్రాక్టర్ హౌజింగ్ గట్టుకు తగిలి ఆగిపోయే అవకాశం ఉంది. అజాగ్రత్తగా ఉంటే ట్రాక్టర్ వెనక్కి పడే అవకాశం ఉంటుంది. ఎత్తు తక్కువున్న గట్టు వద్ద ట్రాక్టర్‌ను దాటించడం శ్రేయస్కరం. ట్రాక్టర్ ఫుట్‌బాల్ మట్టి లేకుండా చూసుకోవాలి. దమ్ము చేయాల్సిన పొలంలో నీళ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లు తక్కువగా ఉంటే కేజ్‌వీల్స్ మట్టితో నిండి ట్రాక్టర్ వెనక్కు పడుతుంది. నడిపేందుకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. వర్షం కురుస్తున్నప్పుడు, మద్యం తాగి దమ్ము చేసే ట్రాక్టర్‌ను నడపవద్దు. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకున్న వారు, నేర్చుకునే వారు వెళ్లకపోవడమే మంచిది.

అనుభవం ఉండాలి



గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు ఆరంభమయ్యాయి. మాగాణిలో నాట్లు వేసేందుకు ఇనుప చక్రాలు ఉన్న ట్రాక్టర్లతోనే రైతులు దమ్ము చేస్తున్నారు. అలాంటి సమయాల్లో అనుభవం ఉన్న, నిష్ణాతులైన చోదకులు ట్రాక్టర్ నడిపితే ప్రమాదాలు జరగవు.

- సాయిశ్రీ, ఎ.కొండూరు మండల వ్యవసాయాధికారి

తెదేపా గ్రామశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరే

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని తెదేపా గ్రామ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం పూర్తయినట్లు నియోజకవర్గ పరిశీలకులు సుబ్బారావు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. వి.వెంకటేశ్వర్లు, పి.మారేశ్వరరావు (కలగర), పి.శ్రీనివాసరావు, ఎల్.పుల్లారావు (తాతకుంట్ల), ఎం.శ్రీధర్, ఇ.అంజనేయులు (కొండపర్వ), బి.బాలు, కె.అంజనేయులు (చండ్రుపట్ల తండ), వి.మాధవరావు, పి.వెంకటనారాయణ (చండ్రుపట్ల), పి.నాగరాజు, జి.శ్రీను (పుట్రేల), ఎ.వెంకటేశ్వరరావు, సి.హెచ్.రంగారావు (కొర్లమండ), బి.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ (వేమిరెడ్డిపల్లి), ఎ.శ్రీనివాసరావు, ఇ.నరేశ్వరరావు (పుట్రేల), డి.రాంబాబు, జి.రామకృష్ణ (తెల్లదేవరపల్లి), సి.హెచ్.బాబూరావు, వి.రాంబాబు (మారేమండ), కె.శ్రీనివాసరావు (విస్సన్నపేట) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం



మోటార్ల వద్ద తెదేపా నాయకులు, రైతులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: రైతులు పంటలు పండించుకునేందుకు, వివిధ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం గొల్లపూడి పంపింగ్ స్కీం నుంచి నీటిని ఆదివారం విడుదల చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరిస్తామన్నారు. పంపింగ్ స్కీం పేరు చెప్పుకొని వేరుపైన ప్రభుత్వం రైతుల వద్ద కూర్చునేలా.. తెలిపారు.. మర్యాదలను మెరుగుపరిచారని మాజీ చైర్మన్ గుర్రపు వెంకట్రావు, సత్యనారాయణ ... చెప్పారు. మార్కెట్‌యార్డు చైర్మన్ నర్రా వాసు, తెదేపా నాయకులు నారదా, చలపతిరావు, రైతులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో ఆదివారం తెదేపా మండల నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నామా సత్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. గ్రామ పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు శ్రమించాలి



మాట్లాడుతున్న శ్రీధర్

కొండపల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా శ్రమించాలని ఎంబీపీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ అన్నారు. విశ్వ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండపల్లి బి.కాలనీ శ్మశాన వాటికలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవకోటి సమతుల్యతతో మనుగడ సాగిస్తున్నదన్న సంగతి మరువకూడదన్నారు. ప్రస్తుతం అన్ని చోట్ల కాలుష్యం పెరిగిందని దాని నుంచి చెట్లు మాత్రమే కాపాడగలవన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటి వాటి సంరక్షణకు అడుగు వేయాలన్నారు. అనంతరం పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్ దుర్గా భవానీ, తెదేపా నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై ప్రచారం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు, గ్రామస్థులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురం, జీళ్లకుంట, వల్లంపట్ల, మంత్రియ తండా, ఎ.కొండూరు తండాలో ఆదివారం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో యువత, మహిళలు స్వయం ఉపాధి కోసం కేశినేని ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతులపై అవగాహన కల్పించారు. పేదరిక నిర్మూలనకు చేపట్టిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు సంజీవయ్య, మునియ్య, రమేష్‌రెడ్డి, దేవీదాస్‌రాజు, చైతన్య, ఏలియాబాబు తదితరులు పాల్గొన్నారు.

గమనిస్తుంటా..సాయం చేస్తుంటా



నేర పరిశోధనలో క్రియాశీలకంగా ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే, నర్సింగ్ పరిధిలో ఎక్కడికక్కడే గ్రామాల్లో దాతల వితరణతో వందలాది కెమెరాలను ఏర్పాటు చేశారు. నివాస ప్రాంతాల్లోనే కాకుండా, రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాలపైనా దృష్టి పెట్టారు. అందులో భాగంగా స్థానిక పూర గుట్ట వద్ద, ఇతర పలు గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన స్తంభాలకు సీసీ కెమెరాలను బిగించారు. –న్యూస్‌టుడే, మైలవరం

కాంగ్రెస్ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్తగా రాజీవ్‌రతన్

గవర్నర్‌పేట: అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ నూతన సమన్వయకర్తలను నియమిస్తూ ఆదివారం ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఇప్పుడు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న రాజీవ్‌రతన్‌ను తిరువూరుకు పంపించారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై పార్టీని పటిష్ఠం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్తలకు షర్మిలా రెడ్డి సూచించారు.

స్థల సమస్య అధిగమించేందుకే సీటీజీ



కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీధర్, శ్రీదేవి

కొండపల్లి, న్యూస్‌టుడే: నగర పరిధిలో మొక్కలు పెంచడానికి ప్రధానమైన స్థల సమస్యను అధిగమించేందుకు టెర్రస్ గార్డెనింగ్ ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ చేయాలని మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ అన్నారు. మెప్మా, సీటీజీ(సిటీ టెర్రస్ గార్డెనింగ్) ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని సచివాలయం-1 పరిధిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీటీజీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగరాల్లో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా మొక్కలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పి పొదుపు సంఘ మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో కోగంటి శ్రీదేవి, వంగూరు ప్రకాష్, హసీనా, శిరీష, పారదబీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ప్రమాదాలు ఆపుతాయా..?



కుంటముక్కల గురుకులం గోడ కూలిపోవడంతో పట్టాలు ఏర్పాటు చేశారిలా

గత సెప్టెంబర్‌లో వచ్చిన వరద ఉద్ధృతికి కుంటముక్కల బాలికల గురుకులం ప్రహరీ కూలి ఏడాదైనా అధికారులు పట్టించుకోవడం లేదు. కూలిపోయిన గోడ స్థానంలో తాత్కాలికంగా పట్టాలు ఏర్పాటు చేసి వదిలేశారు. చుట్టుపక్కల పొలాలు ఉండడంతో విష పురుగులు లోపలికి వచ్చే అవకాశం ఉందని, లోపల బాలికలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక గురుకులం జాతీయరహదారి-30 పక్కనే ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు శ్రద్ధ వహించి గోడను పునర్నిర్మించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, జి.కొండూరు

ఎవరూ అడగట్లేదని ఎదురొస్తున్నారా..?

రహదారులపై ఒకరు చేసే తప్పులకు మరొకరు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కొందరు వాహనచోదకులు రోడ్లపై నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా అపసవ్య దిశలో రావడంతో ఎదుటివారు ప్రమాదాలకు గురవుతున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు కొందరు భారీ వాహనాలతో అపసవ్య దిశలో వస్తున్నారు. దీంతో ఏదొకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, గొల్లపూడి



గొల్లపూడి వద్ద వ్యతిరేక మార్గంలో లారీ రావడంతో నిలిచిన ట్రాఫిక్

అన్నీ గుంతలు..అంతా అవస్థలు



మండలంలోని కందులపాడు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితికి చేరి ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. రహదారిపై తారు మొత్తం పోయి రాళ్లు తేలడం, గుంతలతో నరకయాతన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రహదారి గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా వాహనదారుల అవస్థలపై దృష్టి సారించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, జి.కొండూరు

ఇది డంపింగ్ యార్డు కాదు..!

మండల పరిధిలోని కూనపరాజుపర్వలో దక్షిణ బజారు వైపు నుంచి కుదప వెళ్లే తారురోడ్డును డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు మార్జిన్‌లో వేయడంతో అందులోకి కుక్కలు, పందులు చేరి మరింత అధ్వానంగా మారుస్తున్నాయి. దీనికి తోడు వాటిని రోడ్డుపైకి లాక్కొని రావడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని వ్యర్థాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు



కొండపల్లి: కరపత్రాలు అందజేస్తున్న సీతారామయ్య, ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు



దాములూరులో..



రంగాపురం ఎస్సీవాడలో..




విస్సన్నపేట: తాతకుంట్లలో..

రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, తాతకుంట్ల(విస్సన్నపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలువురు తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం తిరువూరు, మైలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో తెదేపా నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

గ్రామాల్లో ఆషాఢ సారె సందడి

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలోని రాజ్యలక్ష్మి, గోదాదేవి, సీతమ్మ వారికి ఆదివారం గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. అర్చకులు సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి నూతనవస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. తదుపరి మహిళలు పసుపు, కుంకుమ, పూలు, ఫలాలు, గాజులు, చీర, జాకెట్లు, పిండి వంటలతో సారెను మంగళ వాయిద్యాలతో ప్రదర్శనగా తీసుకువచ్చి సమర్పించారు.



ఊటుకూరు కోదండ రామాలయానికి ప్రదర్శనగా వస్తూ..



పాత తిరువూరులో బోనాలు తీసుకొస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. గుడి వద్ద భక్తులతో సందడి నెలకొంది.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి శివారు కిలేశపురంలోని గ్రామ దేవత గంగానమ్మకు గ్రామానికి చెందిన భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత గ్రామంలోని బొడ్డురాయికి ప్రత్యేక పూజలు చేసి..అనంతరం డప్పు వాయిద్యాలతో గంగానమ్మ ఆలయానికి చేరుకుని సారె అందజేశారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మైలవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఆషాఢ సారెల సందడి నెలకొంది. మైలవరంతో పాటు పలు గ్రామాల్లో ఆయా గ్రామదేవతలకు మహిళలు సారెలు అందజేస్తున్నారు. ఆదివారం మైలవరంలో భక్తులు స్థానిక విజయవాడ రోడ్డులోని వాటర్‌ట్యాంకు వద్ద నుంచి సారెతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.



సారె అందుకున్న గంగానమ్మ



చిలుకూరివారిగూడెంలో

కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల కిందట తిరువూరులో జరిగిన ఘంటసాల జయంతి వేడుకలకు ఆహ్వానించగా ఆయన పాల్గొని సంతోషంగా గడిపారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు.



ఇరవై ఏళ్ల కిందట కోట శ్రీనివాసరావును సత్కరించిన ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

ట్రాక్టర్ ట్రక్కు కిందపడి ఒడిశా కార్మికుడి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటుకలు ఉన్న ట్రాక్టర్ ట్రక్కు కిందపడి ఓ కార్మికుడి మృతి చెందిన ఘటన మండల పరిధి వెల్లటూరు గ్రామ శివారులో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లాకు చెందిన చల్లా తిరుపతిరావు విజయవాడలో ట్రాక్టర్‌తో ఇటుకలు తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కింద పనిచేసేందుకు ఐదు రోజుల కిందట దుష్మంత్ చిందా(22) అనే ఒడిశా కార్మికుడిని పనిలో పెట్టుకున్నాడు. ఆదివారం ఇటుకలు తీసుకెళ్లేందుకు వెల్లటూరు నుంచి కుంటముక్కల వైపు వస్తున్న ట్రాక్టర్ ఓ మలుపు వద్ద ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ పక్కనే కూర్చున్న దుష్మంత్ కిందపడగా ట్రక్కు అతడిపై నుంచి వెళ్లడంతో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యామ్నాయం లేకనే సమ్మెబాట

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె మొదలు పెట్టారు. ఆదివారం పట్టణంలో తాము నిర్వహించాల్సిన వివిధ రకాల విధులకు దూరంగా ఉన్నారు. శిబిరాన్ని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ..ఏడేళ్లుగా కార్మికులకు రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. రెండు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే..ప్రత్యామ్నాయం లేక సమ్మెబాట పట్టామని కార్మికులు తెలిపారు. సీఐటీయూ, సంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.వీరభద్రం, రవి, బాజీ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నినాదాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పురపాలిక ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం సమ్మెను చేసి..పుర కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అందులో భాగంగా వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, ఇంజినీరింగ్ కార్మిక యూనియన్‌కు చెందిన శ్రీను, వాసు, అంజి తదితరులు పాల్గొన్నారు. దీంతో పురపాలికలో ఆదివారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అనేక చోట్ల వీధి దీపాలు వెలగలేదు.

కరెంట్ అఫైర్స్



◆ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (భారతీయ సినిమాను ప్రోత్సహించే లక్ష్యంతో 1975లో ఎన్ఎఫ్‌డీసీను ఏర్పాటు చేశారు?) జ: ప్రకాష్ మగ్దుమ్

◆ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (POK)ల్లో ఎన్ని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట రహస్య ఆపరేషన్‌ను నిర్వహించాయి? (26 మంది భారతీయ పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు వారాల తర్వాత ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.) జ: 9

మాదిరి ప్రశ్నలు

◆ 2025, మే 6న భారత్‌తో ఏ దేశం చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది? జ: యునైటెడ్ కింగ్‌డమ్

◆ యెమెన్ నూతన ప్రధానిగా ఎవరు నియమితులయ్యారు? (దేశ ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న ఈయనను యెమెన్ ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సిల్ కొత్త ప్రధాన మంత్రిగా నియమించింది.)

జ: సలేం సలేహ్ బిన్ బ్రైక్

మరింత సమాచారం


[ఏపీ ఎకానమీ]

ఉప రంగాలే వృద్ధి చోదకాలు!

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలోని రంగాలు

దేశంలో రెండంకెల వృద్ధి రేటు నమోదు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ప్రధానంగా వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక, సేవా రంగాలకు వ్యవసాయ రంగంతో సమాన ప్రాధాన్యం ఉంది. ఈ మూడు ప్రధాన రంగాలు, వాటి అనుబంధ, ఉప రంగాలన్నీ కలిసి రాష్ట్ర వృద్ధి రేటు, తలసరి ఆదాయాలను నిర్ణయిస్తున్నాయి. ఏపీ ఆర్థిక వ్యవస్థ స్వరూపం, జీఎస్‌డీపీలో రంగాలవారీ వాటా, విలువ, వృద్ధి పరంగా ముందంజలో నిలుస్తున్న రంగాలు, ఇటీవలి గణాంకాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వారీగా అధిక వాటా సమకూరుస్తున్న జిల్లాలు, నిర్దిష్ట వార్షిక వృద్ధి రేటే లక్ష్యంగా రూపొందిన స్వర్ణాంధ్ర ఆశయాలను తెలుసుకోవాలి.






స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రంగాలు: జీఎస్‌డీపీని స్థూలంగా వ్యవసాయం - అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవా రంగం అనే మూడు విభాగాలుగా విభజించారు.

వ్యవసాయం - అనుబంధ రంగాలు: వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు, పశుసంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్య సంపద.

పారిశ్రామిక రంగంలోని ఉప రంగాలు: తయారీ పరిశ్రమలు (రిజిస్టర్, రిజిస్టర్ కాని), విద్యుత్తు ఉత్పత్తి, గ్యాస్ ఉత్పత్తి, పరిశ్రమలకు నీటి సరఫరా, నిర్మాణ రంగం, గనులు, తవ్వకాలు.



సేవా రంగం (తృతీయ రంగం)లోని ఉప రంగాలు: వర్తకం, హోటల్, రెస్టారెంట్లు, రైల్వే, రోడ్డు, జల, వాయు రవాణా; గిడ్డంగులు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, బీమా, ఇతర ఆర్థిక సేవలు, రియల్‌ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ప్రభుత్వ పరిపాలన, ఇతర సేవలు.

నోట్: రాష్ట్ర జీఎస్‌డీపీలో 17 ఉపరంగాలు ఉన్నాయి.

◆ ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో అత్యధిక వాటా ఉన్న రంగాలు వరుసగా సేవారంగం, వ్యవసాయం-అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం ఉన్నాయి. అదే స్థిర ధరల వద్ద చూస్తే సేవా రంగం, పారిశ్రామిక రంగం, వ్యవసాయం - అనుబంధ రంగాలు వరుసలో నిలుస్తున్నాయి. ◆ 2023-24లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వ్యవసాయం, ఉద్యాన ఉత్పత్తులు'. అధిక వృద్ధిరేటు నమోదైన ఉప రంగం 'పశు సంపద'.

◆ 2023-24లో పారిశ్రామిక రంగంలో అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం 'తయారీ పరిశ్రమలు'. అధిక వృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం 'నిర్మాణ రంగం'.

◆ 2023-24లో సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉప రంగం 'వర్తకం, హోటల్, రెస్టారెంట్'. అధికవృద్ధిరేటు నమోదు చేసిన ఉపరంగం రియల్ ఎస్టేట్.

ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో రంగాల వారీ వాటా (2023 – 24)

రంగం	ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా	స్థిరధరల వద్ద జీఎస్‌డీపీలో వాటా
1) వ్యవసాయం, అనుబంధ రంగాలు	34.15%	29.7%
2) పారిశ్రామిక రంగం	25.69%	30.4%
3) సేవా రంగం	40.16%	39.9%
మొత్తం	100%	100%

స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ - గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్): ఒక ఆర్థిక సంవత్సరంలో జిల్లా సరిహద్దులకు లోబడి ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవల విలువను 'స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)' అంటారు. 2022 - 23 నూతన నివేదిక ప్రకారం 26 జిల్లాల ప్రాతిపదికగా మొత్తం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా ఏలూరు. పారిశ్రామిక రంగం వాటా అధికంగా ఉన్న జిల్లా విశాఖపట్టణం. సేవారంగం వాటా అధికంగా ఉన్న జిల్లా ఎన్‌టీఆర్.

✦ 2022 - 23 గణాంకాల ప్రకారం ప్రస్తుత, స్థిర ధరల వద్ద జీడీడీపీ విలువ ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా. ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం జీడీడీపీ విలువ తక్కువ ఉన్న జిల్లా అల్లూరి సీతారామరాజు. ✦ ప్రస్తుత ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (4,83,892), కృష్ణా (3,35,324), ఏలూరు (2,87,481). ✦ స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం ఎక్కువ ఉన్న జిల్లాలు విశాఖపట్టణం (3,10,968), కృష్ణా (2,11,739), ఎన్‌టీఆర్ (1,66,049). ✦ ప్రస్తుత, స్థిర ధరల ప్రకారం తలసరి ఆదాయం తక్కువ ఉన్న జిల్లా అల్లూరి.

ప్రస్తుతం, స్థిర ధరల వద్ద జీడీడీపీ (రూ.కోట్లలో)

జిల్లా	ప్రస్తుత ధరల వద్ద జీడీడీపీ	స్థిర ధరల వద్ద జీడీడీపీ
1) విశాఖపట్టణం	1,19,268	77,498
2) ఎన్‌టీఆర్	73,632	44,729
3) కృష్ణా	68,301	43,530

స్వర్ణాంధ్ర @ 2047: దేశానికి స్వాతంత్ర్యానంతరం 100 సంవత్సరాల కాలపరిమితిలో 2047 నాటికి కేంద్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను 'వికసిత్ భారత్ @ 2047' పేరుతో నిర్దేశించింది. ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర @ 2047' విధానపత్రం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలను పేర్కొంది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ 2.4 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కావాలి. అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం 43,000 డాలర్లకు చేరాలి. రాష్ట్ర ప్రభుత్వ సగటు వార్షిక వృద్ధి రేటు 15%గా ఉండాలనే లక్ష్యాలను స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం

✸ 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.2,42,479 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.1,84,205. అంటే దేశ తలసరి ఆదాయం కంటే ఏపీ తలసరి ఆదాయం ఎక్కువ. 2021 - 22 నుంచి ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వృద్ధి రేటు భారతదేశ జీడీపీ వృద్ధి రేటు కంటే వరుసగా రెండేళ్లు తక్కువగా ఉంది. కానీ 2023 - 24లో దేశ సగటు వృద్ధి రేటు 9.6% ఉంటే, రాష్ట్ర వృద్ధిరేటు 10.44%గా నమోదైంది. 2021 - 22 నుంచి స్థిరధరల వద్ద రాష్ట్ర వృద్ధి రేటు కంటే భారతదేశ వృద్ధి రేటు అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

✸ 2023 - 24 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలు వరుసగా గోవా (రూ.4,75,401), సిక్కిం (రూ.4,63,509), దిల్లీ (రూ.3,76,217). తలసరిఆదాయ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో 16వ స్థానంలో ఉంది.



సంవత్సరాలు	ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో)	వృద్ధిరేటు	స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం(రూ.ల్లో)	వృద్ధి రేటు
2021 - 22	1,97,214	17.35%	1,21,762	9.72%
2022 - 23	2,19,881	11.49%	1,26,690	4.05%
2023 - 24	2,42,479	10.28%	1,35,806	7.20%

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పారిశ్రామిక రంగంలోని ఉపరంగం కానిది?
   1) బ్యాంకింగ్, బీమా 2) ఉద్యాన ఉత్పత్తులు 3) రియల్ ఎస్టేట్ 4) పైవన్నీ
2. 2023 – 24 డేటా ప్రకారం ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీలో సేవారంగం వాటా ఎంత శాతం?
   1) 25.69% 2) 34.15% 3) 39.9% 4) 40.16%
3. స్వర్ణాంధ్ర @ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం ఎన్ని డాలర్లుగా ఉండాలి?
   1) 42,000 2) 43,000 3) 44,000 4) 45,000
4. 2023 – 24 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీకి సేవారంగం నుంచి అధిక విలువ నమోదు చేసిన ఉపరంగం?
   1) వర్తకం, హోటల్, రెస్టారెంట్లు 2) కమ్యూనికేషన్ 3) రియల్ ఎస్టేట్ 4) బ్యాంకింగ్, బీమా
5. 2022 – 23 ప్రకారం ప్రస్తుతం, స్థిరధరల వద్ద స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (జీడీడీపీ) ఎక్కువగా ఉన్న మూడు జిల్లాలు వరుసగా..
   1) విశాఖపట్టణం, కృష్ణా, ఎన్‌టీఆర్
   2) విశాఖపట్టణం, ఎన్‌టీఆర్, కృష్ణా
   3) విశాఖపట్టణం, కృష్ణా, ఏలూరు
   4) విశాఖపట్టణం, ఏలూరు, కృష్ణా
6. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎన్ని ఉపరంగాలున్నాయి?
   1) 9 2) 13 3) 15 4) 17
7. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ ఎంత ఉండాలని స్వర్ణాంధ్ర @ 2047 విధాన పత్రంలో పేర్కొన్నారు?
   1) 2.1 ట్రిలియన్ డాలర్లు
   2) 2.2 ట్రిలియన్ డాలర్లు
   3) 2.3 ట్రిలియన్ డాలర్లు
   4) 2.4 ట్రిలియన్ డాలర్లు
8. 2022 – 23 డేటా ప్రకారం స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ) విలువలో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా అధికంగా ఉన్న జిల్లా?
   1) ఏలూరు 2) పశ్చిమ గోదవరి 3) తూర్పుగోదావరి 4) కృష్ణా




రచయిత: సుబ్బారెడ్డి

సమాధానాలు

1-4; 2-4; 3-2; 4-1; 5-2; 6-4; 7-4; 8-1.

ముప్పై జిల్లాలను ఆదుకుంటున్న ఆపదమిత్ర!

అకస్మాత్తుగా సంభవించి అప్పటి వరకు ఉన్న సానుకూల వాతావరణాన్ని ధ్వంసం చేసే పెద్ద ప్రమాదమే విపత్తు. ప్రకృతిపరమైన కారణాలకు తోడు మానవకారక విపత్తులు కూడా ఏటేటా పెరిగిపోతున్నాయి. పర్యావరణాన్ని, సమాజ ప్రగతిని విచ్ఛిన్నం చేస్తున్న ఈ విపత్తుల నిర్వచనాలు, రకాలు, వాటిని ఎదుర్కొనే పద్ధతులు, ముందస్తు నివారణ చర్యలు, ఇందుకోసం దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటైన సంస్థలు, హెచ్చరిక వ్యవస్థలు, వాటి విధులు, పరిధితో పాటు దేశంలో విపత్తు నిర్వహణ వ్యవస్థ నిర్మాణం, అమలు చేస్తున్న కార్యక్రమాలు తదితరాలను పోటీ పరీక్షార్థులు విధిగా తెలుసుకోవాలి. దుర్బలతను పెంచుతున్న మానవకారక చర్యలు, దేశాల వారీగా పరిస్థితులు, ఇప్పటి వరకు నిర్వహించిన ముఖ్యమైన సదస్సులు, తీసుకున్న నిర్ణయాలు, సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లోని కీలకాంశాలు, అమలు తీరుపై అవగాహన కలిగి ఉండాలి.




విపత్తు నిర్వహణ - ప్రాథమిక భావనలు

1. విపత్తు అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) ఫ్రెంచ్ 2) గ్రీకు 3) జపనీస్ 4) తెలుగు
2. విపత్తు ఏయే పదాల కలయిక ద్వారా ఏర్పడింది?
   1) చెడు 2) నక్షత్రం 3) 1, 2 4) ఏదీకాదు
3. 'డిజాస్టర్' అనే పదాన్ని ఏ రెండు పదాల నుంచి సృష్టించారు?
   1) డిజాస్టరీ 2) డిజాస్ట్రో 3) 1, 2 4) ఏదీకాదు
4. మానవ కల్పిత విపత్తులు ఏవి?
   1) అగ్నిప్రమాదాలు 2) మహమ్మారి వ్యాధులు 3) రోడ్డు ప్రమాదాలు 4) పైవన్నీ
5. కృత్రిమ విపత్తులు ఏవి?
   1) రసాయన విస్ఫోటాలు 2) అణు ప్రమాదాలు 3) 1, 2 4) ఏదీకాదు
6. 'అకస్మాత్తుగా, పెద్ద దురదృష్టంగా సమాజ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసే సంఘటనే విపత్తు' అని నిర్వచించింది ఎవరు?
   1) ప్రపంచ బ్యాంకు 2) యూఎన్ఓ 3) యునెస్కో 4) ఆసియా అభివృద్ధి బ్యాంకు
7. విపత్తు నిర్వహణపై జె.సి.పంత్ కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 2000 2) 1999 3) 2001 4) 2002
8. జె.సి.పంత్ నేతృత్వంలోని విపత్తు నిర్వహణపై ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించిన వైపరీత్యాలు ఎన్ని?
   1) 31 2) 34 3) 35 4) 32
9. ప్రమాదాలకు సంబంధించిన విపత్తులకు ఉదాహరణలు?
   1) కార్చిచ్చు, చమురు ప్రమాదాలు
   2) పట్టణాల్లో అగ్నిప్రమాదాలు
   3) వరుస బాంబు పేలుళ్లు 4) పైవన్నీ
10. శీతోష్ణస్థితికి సంబంధిత సంఘటనలు?
   1) కరవు 2) కార్చిచ్చు 3) హిమానీనదాలు ఉప్పొంగడం 4) పైవన్నీ
11. హజార్డ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) గ్రీకు 2) ఫ్రెంచ్ 3) లాటిన్ 4) జపనీస్
12. విపత్తు ముప్పు నిర్వహణలో భాగంగా చేపట్టే కార్యకలాపాల మూడు ముఖ్యమైన దశలు ఏవి?
   1) విపత్తుకు ముందు 2) విపత్తు సమయంలో 3) విపత్తు తర్వాత 4) పైవన్నీ
13. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎండీఏ) 'ఆపదమిత్ర' అనే పథకాన్ని దేశవ్యాప్తంగా ఎన్ని జిల్లాల్లో అమలు చేస్తోంది?
   1) 30 2) 40 3) 50 4) 120
14. విపత్తు నిర్వహణలో వచ్చేవి?
   1) యథాస్థితికి తీసుకురావడం 2) పునర్ నిర్మాణం 3) మిటిగేషన్ 4) పైవన్నీ
15. ప్రకృతి విపత్తులకు సంబంధించిన రికార్డు నమోదు ఎప్పటి నుంచి జరుగుతుంది?
   1) క్రీ.పూ.310 2) క్రీ.పూ.430 3) క్రీ.పూ.540 4) క్రీ.పూ.1020

విపత్తు నిర్వహణ

16. 'ఇన్ ది లైన్ ఆఫ్ ఫైర్: ట్రామా ఇన్ ది ఎమర్జెన్సీ సర్వీసెస్' పుస్తక రచయిత(లు)?
   1) రేగర్ 2) బాబర్ 3) 1, 2 4) ఎవరూకాదు
17. దక్షిణాసియా విపత్తు పీడిత దేశాల్లో అధిక జనాభా కారణంగా, ఎక్కువగా విపత్తులకు గురవుతున్న దేశం/దేశాలు?
   1) భారత్ 2) బంగ్లాదేశ్ 3) 1, 2 4) పాకిస్థాన్
18. అంతర్జాతీయ విపత్తు కుదింపు దినం?
   1) అక్టోబరు 13 2) నవంబరు 13 3) జులై 13 4) ఆగస్టు 13
19. అంతర్జాతీయ విపత్తు కుదింపు దశాబ్దం?
   1) 1990 - 1999 2) 2000 - 2009 3) 1980 - 1987 4) 1970 - 1979
20. పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ ఎక్కడ ఉంది?
   1) స్విట్జర్లాండ్ 2) ఐర్లాండ్ 3) హవాయి 4) న్యూయార్క్
21. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
   1) బీజింగ్ 2) న్యూయార్క్ 3) హోనలులు 4) సవన్నా
22. పసిఫిక్ ప్రాంతంలో సునామీ హెచ్చరికల సమన్వయ గ్రూపును ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) న్యూదిల్లీ 2) ప్యారిస్ 3) బీజింగ్ 4) బాన్
23. సార్క్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీఎంసీ) ఎప్పుడు, ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) న్యూదిల్లీ-2006 2) ముంబయి-2008 3) హైదరాబాద్-2009 4) చెన్నై-2010
24. ఎస్‌డీఎంసీ నిర్వహించే వెబ్ పోర్టల్?
   1) sdmc.nic.in 2) s-sdmc.nic.in 3) saarc-sdmc.org.in 4) sdmc-saarc.nic.in
25. ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (యూఎన్ఐఎస్‌డీఆర్)ను ఎక్కడ, ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) జెనీవా, 1999 2) న్యూయార్క్, 2000 3) సిడ్నీ, 2001 4) సింగపూర్, 1998
26. ఇంటర్ – గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ)ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1990 2) 1989 3) 1988 4) 1987
27. ఐపీసీసీని ఏర్పాటు చేసిన సంస్థ?
   1) డబ్ల్యూఎంఓ 2) యూఎన్ఈపీ 3) 1, 2 4) ఏదీకాదు



28. ఐపీసీసీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) జెనీవా 2) హైదరాబాద్ 3) చెన్నై 4) సింగపూర్
29. ఎన్ఐడీఎం ఆధ్వర్యంలో భారత్‌లో మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
   1) న్యూదిల్లీ 2) చెన్నై 3) బెంగళూరు 4) హైదరాబాద్
30. ఇండియా మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్‌ను ఎవరు ప్రారంభించారు?
   1) అటల్ బిహారీ వాజ్‌పేయి 2) నరేంద్ర మోదీ 3) మన్మోహన్ సింగ్ 4) రాహుల్ గాంధీ



31. 'హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ఫర్ యాక్షన్' గడువు ఎప్పటితో ముగిసిపోయింది?
   1) 2010 2) 2015 3) 2018 4) 2012
32. మూడో యూఎన్ఓ విపత్తు ముప్పు కుదింపు ప్రపంచ సదస్సు జపాన్‌లో ఎక్కడ జరిగింది?
   1) కోబె 2) సెండాయ్ 3) టోక్యో 4) నాగసాకి
33. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని లక్ష్యాలను నిర్దేశించారు?
   1) 8 2) 7 3) 6 4) 5
34. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశకత్వంలో భారత ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళికను ఎప్పుడు విడుదల చేసింది?
   1) 2015, జూన్ 1 2) 2016, జూన్ 1 3) 2017, జూన్ 1 4) 2018, జూన్ 1
35. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అమలులో ఉండే కాలం?
   1) 2015-2030 2) 2010-2020 3) 2010-2025 4) 2015-2025
36. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్‌ను మొదట అమలు చేసిన భారత రాష్ట్రం?
   1) అస్సాం 2) కేరళ 3) ఒడిశా 4) బిహార్
37. బీఐఎస్ ప్రకారం భారత్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విపత్తులకు గురయ్యే ప్రాంతం ఎంత శాతం?
   1) 85% 2) 99% 3) 52% 4) 73%
38. విపత్తు నిర్వహణ సమన్వయానికి నోడల్ డిపార్ట్‌మెంట్‌గా బాధ్యత వహించేది?
   1) కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ
   2) పౌర విమానయాన శాఖ
   3) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 4) రక్షణ శాఖ
39. 'మేనేజింగ్ డిజాస్టర్ రిస్క్ ఇన్ ఎమర్జింగ్ ఎకానమిస్' ఎవరి నివేదిక?
   1) ప్రపంచ బ్యాంకు
   2) ఆసియా అభివృద్ధి బ్యాంకు
   3) గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
   4) కేంద్ర హోంమంత్రిత్వ శాఖ



40. విపత్తుల వల్ల అత్యధికంగా పశువులను కోల్పోయే రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) రాజస్థాన్ 3) పశ్చిమ బెంగాల్ 4) పైవన్నీ
41. విపత్తు నిర్వహణపై అంతర్జాతీయంగా ఆన్‌లైన్ కోర్సులను ఏ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది?
   1) కాప్లన్ విశ్వవిద్యాలయం
   2) వాల్డెన్ విశ్వవిద్యాలయం
   3) గ్రాండ్ కాన్యాన్ విశ్వవిద్యాలయం 4) పైవన్నీ
42. 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్: రీసెంట్ అప్రోచెస్' గ్రంథకర్త ఎవరు?
   1) బి.నారాయణ 2) అరవింద్ కుమార్ 3) జగ్బిర్ సింగ్ 4) బి.సి.బోస్
43. విపత్తులకు గురయ్యే స్వభావాన్ని బట్టి, భారత్‌లో ఉన్న ప్రత్యేక ప్రాంతాలు ఏవి?
   1) హిమాలయ ప్రాంతం, ఎడారి ప్రాంతం
   2) ఒండ్రు మైదానాలు, తీరప్రాంత మండలం
   3) ద్వీపకల్ప ప్రాంతంలో కొండల భాగం
   4) పైవన్నీ
44. విపత్తు నిర్వహణ ప్రణాళిక ప్రధాన లక్షణాలు ఏమిటి?
   1) సరళత 2) లక్ష్య సుద్ధి 3) ఆచరణ సాధ్యం 4) పైవన్నీ
45. కింది వాటిలో విపత్తును తగ్గించే వ్యూహం?
   1) పిల్లలకు స్కూల్ యూనిఫాం ఇవ్వడం.
   2) చౌకగా విద్యుత్తును అందించడం.
   3) బ్యాంకుల నుంచి అప్పులు ఇవ్వడం.
   4) తుపాను షెల్టర్లను నిర్మించడం.
46. ఇండియాలో ఏటా ఎంతమంది ప్రజలు వరదలకు గురవుతున్నారు (మిలియన్లలో)?
   1) 175 మి. 2) 150 మి. 3) 200 మి. 4) 325 మి.
47. మొత్తం దేశంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్ని విపత్తు ముప్పును కలిగి ఉన్నాయి?
   1) 25 2) 30 3) 31 4) 28
48. సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ అమలు కోసం అస్సాం రాష్ట్రానికి సహాయపడే సంస్థలు ఏవి?
   1) యూనిసెఫ్ 2) యూఎన్ఐఎస్‌డీఆర్ 3) 1, 2 4) ఏదీకాదు
49. ఆసియన్ డిజాస్టర్ రిడక్షన్ సెంటర్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1998 2) 2002 3) 2004 4) 2006

సమాధానాలు


1-2; 2-3; 3-3; 4-4; 5-3; 6-2; 7-2; 8-1; 9-4; 10-4; 11-2; 12-4; 13-1; 14-4; 15-2; 16-3; 17-3; 18-1; 19-1; 20-3; 21-3; 22-2; 23-1; 24-3; 25-1; 26-3; 27-3; 28-1; 29-1; 30-3; 31-2; 32-2; 33-2; 34-2; 35-1; 36-1; 37-1; 38-1; 39-1; 40-4; 41-4; 42-2; 43-4; 44-4; 45-4; 46-3; 47-1; 48-3; 49-1.

వసుంధర

vasundhara@eenadu.in

స్కాలర్‌షిప్‌తో లండన్‌లో మాస్టర్స్ చదివే అవకాశం ఓవైపు... అధిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేసిన బహుళజాతి సంస్థ మరోవైపు... రెండింటినీ కాదనుకుందామె. అంకుర సంస్థ ఏర్పాటుకు మిత్రుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భారతదేశంలో తొలిసారిగా మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్‌ను ఆవిష్కరించడంలో తనవంతు సహకారాన్ని అందించారు గొండు వాగ్దేవి. 'వసుంధర'తో ఆ వివరాల్ని పంచుకున్నారిలా...

ప్యాకేజింగ్‌లో పుట్టగొడుగు!



వాగ్దేవి

మా స్వస్థలం శ్రీకాకుళం. నాన్న విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ఉద్యోగి కావడంతో అక్కడే స్థిరపడ్డాం. 2019లో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. కర్ణాటకలోని ఓ ఫార్మా కంపెనీలో రిసెర్చ్ ల్యాబ్‌లో ఏడాది, గోవాలోని ఓ బహుళజాతి సంస్థ (ఎమ్ఎన్‌సీ)లో ఏడాదిన్నర పాటు పనిచేశాను. లండన్‌లో మాస్టర్స్ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగానికి రాజీనామా చేశాను. అదే సమయంలో గోవాలో పనిచేసిన ఎమ్ఎన్‌సీ నుంచే మరో మంచి ఆఫర్ వచ్చింది. అప్పుడే నా స్నేహితుడు ఆదిత్య శ్రీనివాస్ మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్ ప్రాజెక్టు గురించి చెప్పాడు. అప్పటికే తనతో చిన్నచిన్న ప్రాజెక్టుల్లో పనిచేసి ఉండటంతో ఈ ప్రాజెక్టులో పాల్గొనాలని కోరాడు. రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషీన్ వంటి వస్తువులను ప్యాకింగ్ చేసేందుకు వాడే థర్మకోల్, స్టైరోఫార్మ్‌లకు ప్రత్యామ్నాయమే ఈ మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్. పుట్టగొడుగు నుంచి వచ్చే మైసీలియంతో వ్యవసాయ వ్యర్థాలైన గడ్డి, చెరకు పిప్పి, మొక్కజొన్న వ్యర్థాలు, కొబ్బరి పీచు, అరటినార... వంటివి కలిపి తయారుచేస్తాం. పర్యావరణానికి హాని లేకపోవడం, ఘనవ్యర్థాలు ఉండకపోవడం ఈ ప్రాజెక్టు ప్రధానాంశంగా ఉండటంతో వెంటనే అంగీకరించా. అలా 'రోహ బయోటెక్' సహ వ్యవస్థాపకురాలిగా మారాను.



ఓపికతో సాధించాం...

మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్ ప్రాజెక్టు కోసం చెన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో ల్యాబ్‌ను ఉపయోగించుకున్నాం. ఇది పూర్తిగా కొత్త ప్రాజెక్టు కావడంతో పరికరాలను స్వయంగా డిజైన్ చేసుకోవాల్సి వచ్చింది. ప్రాజెక్టుకు అవసరమైన వ్యవసాయ వ్యర్థాలను చెన్నై సమీప ప్రాంతాల రైతుల నుంచి నేరుగా సేకరించాం. ఈ ప్రాజెక్టు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు ల్యాబ్‌లోనే గడిపిన సందర్భాలూ ఉన్నాయి. వాతావరణం, ఉష్ణోగ్రతల్లో చిన్నపాటి మార్పులు చోటుచేసుకున్నా ప్రయోగంలో ఆశించిన ఫలితాలు వచ్చేవి కావు. దీంతో మళ్లీ ప్రయోగాలు చేయాల్సి వచ్చేది. అలా ఓపికతో చేసిన ప్రయోగాలతో ఏడాది తర్వాత మా ప్యాకేజింగ్‌కు తుదిరూపం వచ్చింది. భారతదేశంలో తొలి మైసీలియం ఆధారిత ప్యాకేజింగ్‌ను ఆవిష్కరించిన ఘనత మాకు దక్కింది. థర్మకోల్, స్టైరోఫార్మ్‌లకు త్వరగా మండే గుణం ఉండగా... గరిష్ఠంగా 700-800 డిగ్రీల వేడినీ తట్టుకోవడం మా ప్యాకేజింగ్ ప్రత్యేకాంశం. వాస్తవానికి ఇలాంటి ప్రాజెక్టుకు తుదిరూపం తీసుకురావడానికి మూడేళ్లు పడుతుంది. కానీ, పట్టుదల, ఓపికతో దీన్ని చాలా త్వరగా సాధించాం. ప్రాజెక్టు విజయవంతం కావడంతో వ్యాపార అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా ఏడాది తర్వాత ఐదుగురు నిపుణులకు ఉద్యోగావకాశం కల్పించాం. వండలూర్‌లో ఉత్పాదక వసతిని కల్పించుకున్నాం. ప్రస్తుతం నెలకు 4 టన్నులు ఉత్పత్తి చేస్తున్నాం. భవిష్యత్తులో దీన్ని 50 టన్నులకు పెంచడానికి కృషి చేస్తున్నాం. ఈ ఏడాది మా ఆదాయం రూ.1.2 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నాం.

– కటికల సతీష్‌బాబు, చెన్నై

ఆ రసాయనంతో జాగ్రత్త!

శోధిత



అసలే వర్షాకాలం... సూక్ష్మజీవులతో ఏ అంటువ్యాధులు వస్తాయోనన్న భయంతో పిల్లలకోసం యాంటీ మైక్రోబియల్ సోప్‌లు వాడుతుంటాం. వాళ్ల కోసం ప్రత్యేకంగా డిటర్జెంట్లూ శానిటైజర్లూ టూత్‌పేస్టులూ మౌత్‌వాష్‌లూ క్రీములూ లోషన్లూ... ఇలా ఏరికోరి కొంటుంటాం. కానీ వాటిల్లో ట్రైక్లోశాన్ రసాయనం ఉందో లేదో ఒకసారి పరిశీలించండి. దీనికి ఎక్కువగా గురవడంవల్ల చిన్నారుల్లో రకరకాల అలర్జీలు తలెత్తుతున్నాయట. వివిధ ఉత్పత్తుల్లో దీని వాడకాన్ని అనేక దేశాలు ఇప్పటికే నిషేధించాయి. యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, బ్రౌన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని మరోసారి నిర్ధరించారు. ట్రైక్లోశాన్‌కు గురయిన పిల్లల్లో ఎగ్జిమా, హే ఫీవర్, అలర్జీ, శ్వాసలో గురక... వంటి అనారోగ్య సమస్యలు కనిపించాయని చెప్పారు. ఇందుకోసం వీళ్లు గర్భం దాల్చిన కొందరు తల్లుల్నీ వాళ్లకు పుట్టిన పిల్లలకు 12 ఏళ్లు వచ్చేవరకూ గమనిస్తూ వచ్చారు. వాళ్ల యూరిన్ శాంపిల్స్‌ని సేకరించి, అందులో దీని శాతాన్ని లెక్కించారు. ఈ రసాయనం అధిక మోతాదులో ఉన్నవాళ్లలో అలర్జీ సంబంధిత వ్యాధులూ ఎక్కువగా ఉన్నట్లు తేలింది. పెద్దవాళ్లకీ ఇది మంచిదికాదట. హానికర సూక్ష్మజీవులతోపాటు ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియానీ నాశనం చేస్తుందని హార్మోన్లమీదా ప్రభావం చూపిస్తుందనీ చెబుతున్నారు పరిశోధకులు. అందుకే కొన్ని కంపెనీలు లేబుల్‌మీద ట్రైక్లోశాన్ ఫ్రీ అనీ ఇస్తున్నాయి. జాగ్రత్త మరి!

నాన్నకు బాసటగా... యువతకు ఆదర్శంగా...

ఎంపిక చేసుకున్న రంగమేదైనా, తమకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని తపిస్తున్నారు ఇప్పటి అమ్మాయిలు. సవాళ్లకు ఎదురెళ్లి మరీ తాము అనుకున్నది సాధిస్తున్నారు. పాలూరు తన్మయి లక్ష్మి కూడా ఈ కోవకు చెందినదే. పర్యావరణ హితమైన ఈ-బైక్స్ తయారీ సంస్థను ఏర్పాటుచేసి... ఐదురకాల కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకొచ్చిందీమె.



తన్మయి

'బీటెక్ చదివి... మంచి ఉద్యోగం సంపాదించాలి'. చిన్నప్పట్నుంచీ ఇదే లక్ష్యం తన్మయికి. కానీ కరోనా ఆమె ఆలోచనా విధానాన్ని మార్చింది. వేల మంది ఉద్యోగాలు కోల్పోయి... ఇంటిబాట పట్టడం చూసి... ఉద్యోగం చేసే స్థాయిలో కాకుండా, ఇచ్చే స్థానంలో ఉండాలనుకుంది. దీనికి నాన్న ప్రోత్సాహమూ తోడైంది. అది మొదలు తన ఆలోచనలకు పదును పెడుతూ మార్కెట్ అవసరాలపై దృష్టి పెట్టింది తన్మయి. తనది గుంటూరు. నాన్న గురుకృష్ణ కాటన్ వ్యాపారం చేస్తారు. అమ్మ జ్యోతిర్మయి. 'కరోనాలో నాన్న వ్యాపారం కాస్త మందగించింది. అప్పుడే నిర్ణయించుకున్నా నాన్న వారసత్వాన్ని తీసుకోవాలని. అయితే నాకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని కోరుకున్నా. పర్యావరణహిత వాహనాలకు డిమాండ్ పెరుగుతున్న రోజులవి. కానీ వాటి తయారీ, సర్వీసు సంస్థలేమో ఎక్కువ శాతం విదేశాల్లోనే ఉన్నాయి. స్థానికంగా వాటిని తీసుకువస్తే... బాగుణ్ణు అనిపించింది. తక్కువ ధరలో, విభిన్న ఫీచర్లతో వాహనాలను తయారుచేస్తే ఈ రంగంలో రాణించడం సులువనిపించింది' అనే తన్మయి ప్రయాణం అనుకున్నంత సజావుగా సాగలేదట. సిబ్బంది ఎంపిక, మెటీరియళ్ల కొనుగోలు, మన రోడ్లకు తగ్గట్టు వాహనాల ఫ్లెక్సిబిలిటీ, బ్యాటరీ లాంటి విషయాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అవన్నీ పాఠాలు అయ్యాయే తప్ప... వెనుదిరగాలనే నిరుత్సాహాన్ని ఇవ్వలేదంటుంది తన్మయి.



అత్యుత్తమ ఫీచర్లతో...

'పర్యావరణ హితమైన వాహనాల కోసం ప్రభుత్వం మొగ్గు చూపిస్తున్నా... వినియోగదార్లు ఆసక్తిగా ఉన్నా కొన్ని ఇబ్బందులు వాళ్లని వెనక్కి లాగుతున్నాయని అర్థమైంది. అర్థాంతర పేలుళ్లు, తక్కువ మైలేజీ, అవసరమైనప్పుడు సర్వీసు అందకపోవడం వీటికి కారణం అని తెలిసింది. ఈ సమస్యలన్నింటినీ ఛేదిస్తూ మా ఉత్పత్తుల్ని మార్కెట్లోకి తీసుకురావడానికి ఏడాది పట్టింది. 2020 నుంచీ 2021 వరకూ అనేక పరిశోధనలు, క్షేత్రస్థాయిలో ట్రయల్స్ తర్వాత 'కుబేర మోటార్స్' సంస్థ స్థాపనకు బీజం పడింది' అనే తన్మయి జీపీఎస్ ట్రాకింగ్, యాప్ కనెక్టివిటీ, యాంటీ థెఫ్ట్ లాక్, కీలెస్ ఇగ్నిషన్, మల్టిపుల్ డ్రైవింగ్ మోడ్‌లు, మోటార్ కట్ ఆఫ్-ఆన్ స్విచ్... తదితర ఆకర్షణీయ ఫీచర్లతో ఈ-బైక్‌లు మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇంతటితో సరిపెట్టుకోలేదామె. నేటికీ ఆ రిసెర్చ్‌ని కొనసాగిస్తూ వాహనాల్లో మార్పులు చేస్తోంది. బైక్ ఎక్కడ ఆగిపోయినా రిపేర్, సర్వీస్ చేసే వాళ్లకి నోటిఫికేషన్ వెళ్లి... తక్షణ చర్యలు తీసుకునేలా కొత్త డెవలప్‌మెంట్ గురించి ప్రయత్నిస్తున్నా అంటోంది 25 ఏళ్ల తన్మయి. అంతేకాదు, సుదూర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక మోడళ్లనూ తయారుచేసిందీమె. ఈ సంస్థ ద్వారా 20 మందికి ఉపాధి కూడా కల్పిస్తోంది.

– గాలి సురేష్, గుంటూరు

ఏ స్టార్టప్‌నకు అయినా, పెట్టుబడి అందే దశ కీలకం. అందులోనూ అమ్మాయిలుగా మనల్ని మనం నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉంది. మన ఆలోచన, ప్రణాళికలేంటీ, వాటికి ఎంతగా కట్టుబడి ఉన్నాం అనేది పెట్టుబడిదారులకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత మనదే. అప్పుడే ఈ దశను దాటి ముందుకు అడుగులు వేయగలం.

- ప్రాన్షు పాట్నీ, జూట్, హెలో ఇంగ్లీష్ , కో-ఫౌండర్



మీకు తెలుసా?

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం... టీనేజీ పిల్లలకు స్కూళ్లు ఉదయం 10గంటల తరవాత ప్రారంభించటం వల్ల అనేక లాభాలున్నాయి. త్వరగా ప్రారంభమయ్యే స్కూలు వేళల వల్ల వారి నిద్రాసమయాల్లో సహజంగానే మార్పులు వస్తాయట. కాబట్టి, కాస్త ఆలస్యంగా స్కూళ్లు ప్రారంభించటం వల్ల నిద్రవేళలు సర్దుకుని, ఏకాగ్రత, చదువు, ఆరోగ్యం... వంటివి మెరుగుపడతాయని పరిశోధకులు సూచిస్తున్నారు.



మరకేగా... పోగొట్టొచ్చు!

కొత్త పోయి ఇప్పటికే పిల్లలు స్కూళ్లకు అలవాటు పడిపోయారు కదా! రోజూ ఏదో ఒకటి చెబుతూ మరకలూ మోసుకొచ్చేస్తుంటారు. వాటిని వదలగొట్టడం మనకో శ్రమ. అలాగని ఆపేస్తామా ఏంటి? అలా చేస్తే పిల్లలు ఏదైనా ధైర్యంగా ఎలా చేయగలుగుతారు. కాబట్టి, వాళ్లని ఆపొద్దు. మరకల పనే పడదాం!

✦ **బురద చిందితే...** నీళ్లని చూస్తే పిల్లలను ఆపగలమా? పోనీ వాళ్లే జాగ్రత్తగా వచ్చినా వర్షాకాలం బురద నుంచి వాళ్లను కాపాడటం కష్టమే. కాబట్టి, ఈ మరకలు మనల్ని తరచూ పలకరిస్తూనే ఉంటాయి. పోగొట్టాలంటే ఆ మరకల్ని కాస్త ఆరనీయండి. తరవాత మట్టిని బ్రష్‌తో రుద్దేయండి. ఆపై చల్లని నీటితో గట్టిగా రుద్ది కడిగాక... డిటర్జెంట్‌తో మరకలున్నచోట మరోసారి రుద్దితే వదిలిపోతాయి.

✦ **ఇంక్ పడితే...** దాన్ని పరీక్షించేటప్పుడో... లేదా పెన్నుకే ఏదైనా సమస్య వచ్చో చొక్కా మీద పడిందనుకోండి. మరక ఉన్న ప్రాంతం వరకూ పాలల్లో కొద్దిసేపు నానబెట్టండి. తరవాత యథావిధిగా సబ్బుతోనో, డిటర్జెంట్‌తోనో ఉతికేయండి. మ్యాజిక్ చేసినట్లు వదులుతుందట.

✦ **రక్తమా?...** చదువు, ఆట చెట్టాపట్టాలేసుకుని సాగేది స్కూల్లోనే! అలాంటప్పుడు చిన్న దెబ్బలు... వాటి తాలూకూ చిహ్నాలు రక్తం రూపంలో దుస్తుల మీద కనిపించడం మామూలే. మరక మీద కాస్త హైడ్రోజన్ పెరాక్సైడ్ చల్లండి. అది కరుగుతున్నట్లుగా కనిపిస్తుంది. అప్పుడు చల్లని నీటితో కడిగేస్తే చాలు. సోప్‌తో కడిగేస్తే ఆనవాళ్లూ కనపడవు.


✦ **నూనె చిందితే...** నాప్కిన్, టిష్యూలంటూ ఎన్నైనా పెట్టండి. అన్నం మీద పడేసుకోకుండా తినరు. నూనె మరకలేమో దుస్తులమీద కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంటాయి. ఇలాంటప్పుడు మరక మీద వైట్ చాక్‌పీస్ పొడినో, పౌడర్‌నో చల్లి కాసేపు వదిలేయండి. అవి నూనెను పీల్చుకున్నాక మామూలుగా ఉతికేస్తే సరిపోతుంది. లేదంటే డిష్‌వాష్ లిక్విడ్‌ని సమస్య ఉన్నచోట పూసి, మృదువుగా రుద్దాలి. ఆపై అరగంట పక్కన పెట్టి, నీటితో కడిగేయండి.



✦ **చాక్లెట్ పూసుకుంటే...** ముందు మరకను స్పూనుతో గీకేయాలి. ఆపై అయిదు నిమిషాలు చల్లటి నీటిలో నాననివ్వాలి. ఇప్పుడు డిష్‌వాష్ లిక్విడ్‌ని మరక ఉన్న ప్రాంతంలో పూసి, తిరిగి అరగంట నానబెట్టాలి. ఆపై చేత్తో రుద్ది కడిగితే సరిపోతుంది. అప్పటికీ పోకపోతే స్టెయిన్ రిమూవర్‌ని ఉపయోగించొచ్చు. అయితే శుభ్రతకి వేడి నీళ్లని మాత్రం వాడొద్దు. టొమాటో కెచప్ అంటితే... అరబకెట్ నీళ్లలో కప్పు వినెగర్ కలిపి, ఆ మిశ్రమంలో వస్త్రాన్ని నానబెట్టండి. తరవాత మరక అంటినచోట డిటర్జెంట్ రాసి, రుద్దితే వదులుతుంది.

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

అత్తగారింట్లో రోజూ పనే!

నాకు పెళ్లై ఆరు నెలలు. అమ్మానాన్నలు ఎంతో గారాబంగా పెంచారు. అత్తగారింట్లో లేచింది మొదలు పనే. వీటితోనే రోజంతా సరిపోతోంది. మా వారితో కలిసి బయటికి వెళ్లడానికీ లేదు. పరిస్థితి ఇలానే ఉంటే నేనేమైపోతానో అని భయమేస్తోంది? -ఓ సోదరి

■ ఇదివరకు రోజుల్లో ఆడపిల్లలు యుక్త వయసుకు వచ్చినప్పట్నుంచే... పెళ్లయ్యాక అత్తారింట్లో ఎలా నడుచుకోవాలో నేర్పుతూ ఉండేవారు. ఇవన్నీ ఆడపిల్లల రాబోయే జీవితానికి చాలా అవసరమైన జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్). అందుకే పలకరింపులు, వంటింటి పనులు, ఇంటిని చక్కబెట్టడం లాంటివి ఒక్కొక్కటిగా నేర్పుతూ వాళ్లని భవిష్యత్తు కోసం సిద్ధం చేసేవారు. కానీ ఇప్పుడంతా కెరియర్ వైపే పరుగులు. మంచి ర్యాంకులు, కాలేజీలు, ఉద్యోగాల పైనే దృష్టంతా. ఈ లక్ష్యాల వెంటబడి పెళ్లి తర్వాత కొత్తింట్లో ఎలా మసలుకోవాలో మచ్చుకైనా పిల్లలకు చెప్పడం లేదు. వీటన్నింటి పర్యవసానమే ఇది. మీరేం కంగారు పడకండి. మీకు పెళ్లై ఆరు నెలలే అయింది అంటున్నారు. మీరు పెరిగిన వాతావరణం వీటన్నింటికీ భిన్నంగా ఉందని మీరు చెప్పిన దాన్నిబట్టి అర్థం అవుతోంది. తరాలు మారినా... కోడలు వచ్చాక తనకి బాధ్యతలు అన్నీ అప్పజెప్పాలనే ఉద్దేశం ఉన్న అత్తలు ఇంకా ఉన్నారు. కాబట్టి ముందుగా మీకు ఎదురవుతున్న ఇబ్బందిని మీ భర్తతో పంచుకోండి. మీ పరిస్థితిని ఆయనకు అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించండి. తర్వాత మీ అత్తతో మాట్లాడండి. ఆమె మీద ఫిర్యాదు చేస్తున్నట్లు కాకుండా మీ సమస్య వివరిస్తున్నట్లు మాత్రమే చెప్పండి. పనులను విభజించుకోండి. కొత్తింట్లో సర్దుకుపోవడానికి కొంత సమయం పడుతుంది. చేస్తున్న పనిని కష్టంగా కాకుండా మీ వాళ్ల కోసం చేస్తున్నా అన్నట్లు భావించండి. పరిస్థితులు మీకు అనుకూలంగా మారతాయి.

నన్ను ప్రేమిస్తే చాలంటున్నా..!

మావారికి 48 ఏళ్లు. ఎప్పుడూ పరస్త్రీల సాంగత్యంలోనే ఉంటారు. ఆయన ఎలా ఉన్నా... 'నాకు ఇవ్వాల్సిన ప్రేమ, సమయం ఇస్తే చాలు. మన మధ్య మనస్పర్థలు ఉండవు' అంటాను నేను. ఈ విషయమై మాకు ఎప్పుడూ గొడవలే. ఫ్యామిలీ కౌన్సెలర్ దగ్గరకు వెళ్దాం అంటే ఒప్పుకోవడం లేదు. అతన్ని మార్చేదెలా? -ఓ సోదరి

■ పరస్త్రీల సాంగత్యం అన్నారు కానీ అది ఎలాంటిదన్నది మీరు చెప్పిన విషయంలో తెలియడం లేదు. అతనిది వ్యామోహమో, ఆకర్షణో, అవతలి వాళ్లని పొందాలన్న ప్రయత్నమో మీరు చెబుతున్న దాన్నిబట్టి అర్థం కావడం లేదు. ఇవేవీ కాదు కేవలం గొప్పలు పోవడానికి మాత్రమే అతని ప్రయత్నం అయితే మీరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మీరు ఆలోచిస్తున్న కోణం ఏంటో ఒక్కసారి గమనించుకోండి. ఇందుకు అతను మాట్లాడే అమ్మాయిల్నీ, మహిళల్నీ మీకూ పరిచయం చేయమని అడగండి. అతనిది తప్పుడు ఉద్దేశమే అయితే ఇందుకు ఒప్పుకోరు. సరేనని మిమ్మల్ని వారికి పరిచయం చేస్తే సమస్యే లేదు. అలాకాకుండా మాటల్ని దాటవేసినా, మీతో తగాదాకు దిగినా ఈ విషయాన్ని మీ పెద్దవాళ్లతో చర్చించండి. వాళ్ల మాట వినడం లేదంటే... మీరు అతని మీద నుంచి ధ్యాసను మళ్లించుకోండి. వృత్తిగత జీవితం, లేదా వేరే వ్యాపకాల మీదకు మనసు మళ్లించండి. తను మారే అవకాశం ఉంటుంది.

అత్యవసర నిధి ఉందా..!



కార్యాలయాల్లో మేనేజర్, ఇన్‌ఛార్జ్ స్థాయిలో ఉండే వాళ్లు పెట్టే ఒత్తిడి వర్ణనాతీతమైంది కదా! ఎంత చెప్పుకొన్నా, ఇంకా ఏదో బాకీ ఉండనే ఉంటుంది. అమ్మాయిలు, మహిళల విషయంలోనైతే మరీనూ. ఎక్కడ ఏ చిన్న వైఫల్యం ఎదురైనా దానికి కారణం మహిళలే అన్నట్లు కొందరు చూపిస్తారు కూడా. పాపం వాళ్లు మాత్రం ఏం చేస్తారు. డెడ్‌లైన్లు, సబ్మిషన్లు, ఉత్పాదకత అంటూ వాళ్లని పైవాళ్లు పరుగెత్తిస్తుంటారు. వాళ్లేమో అదంతా మన మీద చూపిస్తుంటారు. వీటన్నింటి వల్లా చేస్తోన్న పని వదులుకోలేక... ఇంకెక్కడా ప్రయత్నించే వీలు లేక... ఒత్తిడీ, ఆందోళనలతో కొట్టుమిట్టాడుతుంటాం. ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కూడా అలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి. రోజులో 12 గం. పనిచేసినా... పైవాళ్లు అసంతృప్తిగా ఉండటం గమనించి, ఉద్యోగానికి రాజీనామా చేశారట. ఆ విషయాన్ని తన సామాజిక మాధ్యమం ఖాతాలో పంచుకుందిలా... ఈ ఉద్యోగం చేస్తూ రూ.35 లక్షలు పొదుపు, రూ.12 లక్షలు మదుపు చేసుకున్నా. వేరే ఉద్యోగం దొరికే వరకూ వీటితో నా జీవితం గడిచిపోతుంది. కానీ నాలా పనిచేసే ఉద్యోగి ఆ కంపెనీకి దొరుకుతుందా' అంటూ రాసుకొచ్చింది. తనమీద తనకు ఎంత ఆత్మవిశ్వాసమో చూశారా! ఇదంతా డబ్బు ఇచ్చిన బలమే కదా. సమయానుకూలంగా తను చేసిన పొదుపు, మదుపు అత్యవసర పరిస్థితిలో ఎలా ఆదుకుందో గమనించారా. 'ఉద్యోగం చేస్తోన్న ప్రతి ఒక్కరూ పొదుపు, మదుపు చేయాలి... మరీ ముఖ్యంగా మహిళలైతే జీతంలో 20శాతం ఈ ఖాతాకు మళ్లించాలి. అదే మనల్ని అనారోగ్య, అత్యవసర సమయాల్లో ఆదుకుంటుంది'. ఇవన్నీ ఎప్పట్నుంచో వింటూ వస్తున్నాం కదా. కానీ మనలో ఎంత మంది వీటిని పాటిస్తున్నాం. కనీసం 5 శాతం అయినా ఇందుకు వెచ్చిస్తున్నామా అంటే... లేదనే చెప్తారు చాలా మంది ఉద్యోగినులు. సంపాదిస్తున్నా ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, ప్రతి రూపాయి ఇంటి ఖర్చులకే వాడటం ఒక ఎత్తైతే... బ్రాండ్లు, విలాసాల పేరుతో డబ్బును వృథా చేయడం లాంటి కారణాలు మరో ఎత్తు. వీటన్నింటి వల్లా భవిష్యత్తును అగాధంలోకి నెట్టుకుంటున్నాం. అందుకే ఇప్పటికైనా మీకంటూ కొంత మొత్తం దాచుకోండి. పరిస్థితుల్ని మీకు అనుకూలంగా మార్చుకుని, అనవసర ఒత్తిడి నుంచి దూరంగా వెళ్లాలంటే అత్యవసర నిధి మీ గుప్పిట్లో ఉండాల్సిందే..!

అందమంతా 'అల్లిక'లోనే...

స్వీట్ హోమ్





ఇప్పటికీ చిట్టి చిట్టి క్రోషే బూటీలు, మిటెన్లు, స్వెటర్ల వంటి వాటిని బుజ్జాయిలకు వేసి మురిసిపోతుంటారు చాలామంది అమ్మలు. ఆ తరవాత వాటిని అపురూపంగా దాచుకుంటారు కూడా. అంతలా మనతో అనుబంధాన్ని పెనవేసుకుంటాయివి. అందుకేనేమో... కాలం మారినా, అనేక రకాల గృహాలంకరణల రూపాల్లోకి మారి, ఇప్పటికీ ట్రెండీగా నిలుస్తున్నాయివి. అందమైన కర్టెన్లు, టేబుల్ రన్నర్లు, మ్యాట్‌లు, కోస్టర్లు... ఇలా ఒక్కటేమిటీ కాదేదీ 'క్రోషే' కళకు అనర్హం అన్నట్లుగా భిన్న రకాల్లో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. సృజనాత్మకత, వ్యక్తిగత అభిరుచుల మేళవింపుతోపాటు. ఆధునిక హంగులూ అద్దుతుండటంతో వీటికే ఓటేస్తున్నారు చాలామంది ఆడవాళ్లు. ఇంట్లో వాడే ప్రతి చిన్న వస్తువు ఉపయోగకరంగా ఉండటమేకాదు, అది నయనానందకరమైన భావననీ అందించాలనుకుంటున్నారు. కాబట్టే, ఆతరం, ఈతరం అనే తేడాలేకుండా ఏరికోరి 'క్రోషే'నే ఎంచుకుంటున్నారు. అందమైన డిజైన్లు ఉన్న వస్తువులు బోలెడు దొరకొచ్చు... కానీ, మనసు తెలుసుకుని మన కోసమే ప్రత్యేకంగా అల్లినట్లుండే వీటిని ప్రేమించనివారెవరు? రంగురంగులు పూలు, లతలు, సున్నితమైన అల్లకం... ఎవరినైనా మంత్రముగ్ధుల్ని చేయాల్సిందే.... ఏ ఆధునిక యంత్రాలకూ అందని ఆ క్లిష్టమైన అల్లికలోని సృజనాత్మకత ముచ్చటగొల్పాల్సిందే. అందుకే, అల్లిన వస్తువులు ఒకటో, రెండో ఉండటం కాదు, సాధ్యమైనన్ని రూపాల్లో డెకార్‌లో భాగం అయ్యేలా చూసుకుంటున్నారు. మనమూ ప్రయత్నిద్దామా ఈ కొత్త ట్రెండ్‌ని...











చాంపియన్





టీమ్‌ఇండియా ఓ గొప్ప అవకాశాన్ని సృష్టించుకుంది. లార్డ్స్‌లో విజయం ఊరిస్తోంది. లక్ష్యం చిన్నదే.. 193 పరుగులు మాత్రమే. కానీ ఆ కాస్త ఛేదనే కష్టంగా కనిపిస్తోంది. ఆ కొద్ది లక్ష్యమే కొండలా అనిపిస్తోంది.

సూపర్ బౌలింగ్‌తో రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టును తక్కువకే ఆలౌట్ చేసిన టీమ్‌ఇండియా.. ఛేదనలో తడబడుతోంది. 58 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకుంది. నెగ్గాలంటే ఇంకా 135 పరుగులు చేయాలి. అది తేలిక కాదని అర్థమవుతోంది. ఆఖరి రోజు చాలా కష్టపడాల్సిందే. మరి టీమ్‌ఇండియా పోరాడుతుందా? అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందా?

ఊరిస్తోంది.. అందుతుందా?

- స్వల్ప ఛేదనలో భారత్ తడబాటు
- లక్ష్యం 193.. ప్రస్తుతం 58/4
- రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 ఆలౌట్
- విజృంభించిన సుందర్

లండన్

భారత్-ఇంగ్లాండ్ మూడో టెస్టు రసవత్తర ముగింపు దిశగా సాగుతోంది. 193 పరుగుల చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. నాలుగో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి 58 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. రాహుల్ (33 బ్యాటింగ్; 47 బంతుల్లో 6×4) పోరాడుతున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 2/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 192 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (4/22), సిరాజ్ (2/31), బుమ్రా (2/38) ఆతిథ్య జట్టు పతనాన్ని శాసించారు. రూట్ (40; 96 బంతుల్లో 1×4) టాప్ స్కోరర్. చివరి రోజు తొలి గంటలో రాహుల్, పంత్ ఎలా ఆడతారన్నదే మ్యాచ్‌లో కీలకం కానుంది.

ఛేదనలో తడబడ్డారిలా..: లక్ష్యం చిన్నదే అయినా.. ఛేదన అంత తేలిక కాదని భారత్‌కు త్వరగానే అర్థమైంది. ఇంగ్లాండ్ పేసర్లు పదునైన పేస్‌తో పరీక్షించారు. రెండో ఓవర్లోనే జైస్వాల్ (0)ను ఔట్ చేయడం ద్వారా ఆర్చర్ పతనాన్ని ఆరంభించాడు. ఇంగ్లిష్ బౌలర్లు ఇబ్బంది పెడుతున్నా రాహుల్, కరుణ్ నాయర్ (14) నిలవడంతో ఓ దశలో భారత్ 41/1తో కుదురుకున్నట్లే కనిపించింది. కానీ 17 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. కార్స్ తన వరుస ఓవర్లలో కరుణ్, గిల్ (6)లను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌ను దెబ్బతీశాడు. నాలుగో రోజు ఆఖరి ఓవర్లో నైట్ వాచ్‌మన్ ఆకాశ్‌దీప్ (1)ను స్టోక్స్ బౌల్డ్ చేశాడు. ఆదివారం ఇంగ్లిష్ పేసర్లను ఎదుర్కొని నిలవడం భారత బ్యాటర్లకు సవాలే.

మెరుగైన ఆరంభం: నాలుగో రోజును టీమ్‌ఇండియా గొప్పగానే ఆరంభించింది. పేసర్ సిరాజ్ విజృంభించడంతో లంచ్ వేళకు ఇంగ్లాండ్‌ను 98/4కు పరిమితం చేసి మెరుగైన స్థితిలో నిలిచింది. మూడో రోజు ఆఖరి ఓవర్ నాటకీయంగా సాగగా.. ఆదివారం కూడా మైదానంలో అదే తీవ్రత కనిపించింది. సిరాజ్‌తో కలిసి బౌలింగ్ దాడిని ఆరంభించిన బుమ్రా.. క్రాలీ (22)కి సమస్యలు సృష్టించాడు. భారత్‌కు వికెట్ దక్కడానికి ఎంతో సమయం పట్టలేదు. అయిదో ఓవర్లోనే డకెట్‌ను ఔట్ చేయడం ద్వారా సిరాజ్.. ఇంగ్లాండ్ పతనాన్ని ఆరంభించాడు. సిరాజ్ బంతిని పుల్ చేయబోయిన డకెట్ (12).. మిడాన్‌లో బుమ్రాకు చిక్కాడు. వికెట్ దక్కిన ఆనందంలో డకెట్‌ను చూస్తూ సిరాజ్ గట్టిగా అరిచాడు. డకెట్ అతణ్ని చూడకుండా వెళ్లిపోయాడు.. అంపైర్లు బౌలర్‌తో ఏదో మాట్లాడారు. సిరాజ్ కాసేపటి తర్వాత ఓలీ పోప్ (4)నూ ఔట్ చేసి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. లోపలికి సీమ్ అయిన బంతికి పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డిని బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు దించాడు కెప్టెన్ గిల్. నితీశ్ తన రెండో ఓవర్లోనే ఫలితాన్నిచ్చాడు. అతడి ఫుల్ డెలివరీని డ్రైవ్ చేయబోయిన క్రాలీ.. ఎడ్జ్‌తో జైస్వాల్ చేతికి చిక్కాడు. క్రాలీ తొలి ఇన్నింగ్స్‌లోనూ నితీశ్ బౌలింగ్‌లోనూ ఔటయ్యాడు. 50/3తో ఇంగ్లాండ్ చిక్కుల్లో పడగా... బ్రూక్ (23)తో కలిసి రూట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇద్దరూ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. ఎటాకింగ్ గేమ్ ఆడిన బ్రూక్ చకచకా బౌండరీలు బాదాడు. కానీ ఈ భాగస్వామ్యం ఎంతో సేపు సాగలేదు. విరామానికి కాసేపటి ముందు బ్రూక్‌ను ఆకాశ్‌దీప్ ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. స్ట్రెయిట్‌గా వచ్చిన ఫుల్ డెలివరీని స్వీప్ చేసే ప్రయత్నంలో అతడు బౌల్డయ్యాడు.




లార్డ్స్‌లో గంట కొట్టి నాలుగో రోజు ఆటను ఆరంభిస్తున్న భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలి రాజ్

తిప్పేసిన సుందర్: రూట్, స్టోక్స్ క్రీజులో పాతుకుపోయారు. భారత బౌలర్లను పరీక్షిస్తున్నారు. ఎలాంటి రిస్క్‌లకు పోకుండా ప్రశాంతంగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబడుతున్నారు. చిన్న అవకాశం కూడా ఇవ్వట్లేదు. అప్పుడప్పుడు బంతి అనూహ్యంగా వస్తున్నా.. బ్యాటర్లు క్రీజులో సౌకర్యంగానే కదులుతున్నారు. స్పిన్నర్లు, పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నారు. క్రమంగా ఇంగ్లాండ్ స్కోరు 150 దాటింది. ఆ జట్టు మంచి స్కోరుపై కన్నేసింది. లంచ్ తర్వాత పరిస్థితి ఇది. పరిస్థితి భారత్‌కు ప్రతికూలంగా మారుతున్నట్లనిపించిన వేళ.. వికెట్ పోకుండానే ఆ జట్టు సెషన్‌ను ముగిస్తుందేమో అనిపించింది. కానీ వాషింగ్టన్ సుందర్ మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. అద్భుత బౌలింగ్‌తో చకచకా వికెట్లు పడగొట్టి టీమ్‌ఇండియాకు ఊపునిచ్చాడు. ముందు అతడు రూట్‌ను ఔట్ చేయడం ద్వారా ప్రమాదకర భాగస్వామ్యాన్ని విడదీశాడు. సుందర్ బంతిని స్వీప్ చేయడంలో విఫలమై రూట్ బౌల్డ్ కావడంతో 67 పరుగుల అయిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. భారత్‌కు అత్యవసరమైన వికెట్ అది. సుందర్ కాసేపటి తర్వాత వికెట్‌కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ (8)ను కూడా బౌల్డ్ చేశాడు. స్మిత్ ఈ సిరీస్‌లో కీలక సమయంలో కీలక ఇన్నింగ్స్‌లతో భారత్‌ను విసిగించిన సంగతి తెలిసిందే. కాస్త ఆలస్యమైనా రెండు వికెట్లు దక్కడంతో టీమ్‌ఇండియా సంతృప్తిగానే టీ విరామానికి వెళ్లింది. విరామం తర్వాత స్టోక్స్ (33)ను సుందర్ బౌల్డ్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కార్స్ (1)ను బుమ్రా ఔట్ చేశాడు. బుమ్రా తన తర్వాతి ఓవర్లో వోక్స్ (10)ను వెనక్కి పంపాడు. బషీర్ (2)ను సుందర్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. సుందర్ ఔట్ చేసిన నలుగురూ బౌల్డే కావడం విశేషం. ఇంగ్లాండ్ 38 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లు చేజార్చుకుంది.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 387

భారత్ తొలి ఇన్నింగ్స్: 387

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (సి) జైస్వాల్ (బి) నితీశ్ కుమార్‌రెడ్డి 22; డకెట్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 12; పోప్ ఎల్బీ (బి) సిరాజ్ 4; రూట్ (బి) సుందర్ 40; బ్రూక్ (బి) ఆకాశ్‌దీప్ 23; స్టోక్స్ (బి) సుందర్ 33; జేమీ స్మిత్ (బి) సుందర్ 8; వోక్స్ (బి) బుమ్రా 10; కార్స్ (బి) బుమ్రా 1; ఆర్చర్ నాటౌట్ 5; బషీర్ (బి) సుందర్ 2; ఎక్స్‌ట్రాలు 32 **మొత్తం:** (62.1 ఓవర్లలో ఆలౌట్) **192; వికెట్ల పతనం:** 1-22, 2-42, 3-50, 4-87, 5-154, 6-164, 7-181, 8-182, 9-185; **బౌలింగ్:** బుమ్రా 16-3-38-2; సిరాజ్ 13-2-31-2; నితీశ్ కుమార్‌రెడ్డి 5-1-20-1; ఆకాశ్‌దీప్ 8-2-30-1; జడేజా 8-1-20-0; వాషింగ్టన్ సుందర్ 12.1-2-22-4

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ బ్యాటింగ్ 33; కరుణ్ నాయర్ ఎల్బీ (బి) కార్స్ 14; గిల్ ఎల్బీ (బి) కార్స్ 6; ఆకాశ్‌దీప్ (బి) స్టోక్స్ 1; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (17.4 ఓవర్లలో 4 వికెట్లకు) **58; వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58; **బౌలింగ్:** వోక్స్ 5-2-11-0; ఆర్చర్ 4-0-18-1; స్టోక్స్ 4.4-0-15-1; కార్స్ 4-1-11-2

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అయిదున్నర గంటలు పోరాడారు కార్లోస్ అల్కరాస్-యానిక్ సినర్. అలాంటి ఆటగాళ్ల మధ్య మళ్లీ ఫైనల్ అంటే అంచనాలు ఎక్కడికో వెళ్లాయి. కానీ వింబుల్డన్ తుదిపోరు ఆ స్థాయిని అందుకోలేదు. సినర్ దూకుడు ముందు అల్కరాస్ పోరాటం సరిపోలేదు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో హ్యాట్రిక్ సాధించాలనుకున్న ఈ స్పెయిన్ స్టార్ కల చెదిరింది. తానెందుకు నంబర్‌వన్ ఆటగాడినో చాటుకుంటూ పచ్చగడ్డిలో అదరగొట్టిన యానిక్ సినర్ తొలి వింబుల్డన్ టైటిల్‌ను ముద్దాడాడు. గత రెండేళ్లలో అల్కరాస్‌పై సినర్‌కు ఇదే తొలి విజయం. అతడికిది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్. దీంతో ఫైనల్ చేరిన ప్రతిసారీ టైటిల్ గెలిచిన అల్కరాస్ రికార్డు చెదిరింది.


వింబుల్‘డాన్’ సినర్

ఫైనల్లో అల్కరాస్‌పై గెలుపు



లండన్

వింబుల్డన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్ ఆధిపత్యానికి గండిపడింది. దూకుడుకి ఆధిపత్యాన్ని జోడిస్తూ అదరగొట్టేసిన ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ) టోర్నీలో కొత్త ఛాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో టాప్‌సీడ్ సినర్ 4-6, 6-4, 6-4, 6-4తో రెండోసీడ్ అల్కరాస్‌ను ఓడించాడు. తొలి సెట్ ఆరంభంలో సినర్ దూకుడుగా ఆడాడు. అయిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన అతడు.. 4-2తో సెట్ దిశగా సాగాడు. కానీ అల్కరాస్ పుంజుకున్నాడు. బలమైన బేస్‌లైన్ ఆటతో అదరగొట్టాడు. డ్రాప్ షాట్లు, క్రాస్‌కోర్టు విన్నర్లతో పాయింట్లు సాధించాడు. ఎనిమిదో గేమ్‌లో సినర్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ స్పెయిన్ స్టార్ 4-4తో స్కోరు సమం చేశాడు. తర్వాత పదో గేమ్‌లో మరోసారి బ్రేక్ సాధించి సెట్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత రెండు సెట్లలో సినరే ఆధిపత్యం ప్రదర్శించాడు. అల్కరాస్ అంత తేలిగ్గా లొంగకపోయినా కీలక సమయాల్లో బ్రేక్‌లు సాధించి వరుసగా రెండు సెట్లు గెలిచాడు. రెండో సెట్ తొలి గేమ్‌లోనే అల్కరాస్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరుతో తేలిగ్గా సెట్ గెలిచాడు. మూడో సెట్ కూడా హోరాహోరీ సాగింది. సర్వీస్ కోల్పోకూడదని ఇద్దరూ పట్టుదలగా ఆడారు. దీంతో స్కోరు 4-4తో అయింది. తొమ్మిదో గేమ్‌లో అల్కరాస్ గేమ్ బ్రేక్ చేసిన సినర్ 5-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. తర్వాత సర్వీస్ నిలబెట్టుకుని సెట్ గెలిచి 2-1తో ఆధిక్యంలో నిలిచాడు. నాలుగో సెట్లోనూ సినర్ జోరు ప్రదర్శించాడు. మూడో గేమ్‌లో బ్రేక్ సాధించి ఆపై 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే దూకుడుతో సెట్‌తో పాటు ట్రోఫీని కైవసం చేసుకున్నాడు.



మెర్టిన్స్ జంటకు డబుల్స్ టైటిల్: మహిళల డబుల్స్ టైటిల్‌ను ఎలిస్ మెర్టిన్స్ (బెల్జియం)-కుద్రిమెతోవా (రష్యా) జంట గెలుచుకుంది. ఫైనల్లో మెర్టిన్స్ ద్వయం 3-6, 6-2, 6-4తో సువీయ్ (తైపీ)-జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా) జంటను ఓడించింది.

బంగ్లా చేతిలో లంక చిత్తు

దంబుల్లా: శ్రీలంకతో టీ20 సిరీస్‌ను ఓటమితో ఆరంభించిన బంగ్లాదేశ్.. రెండో మ్యాచ్‌లో ఘనవిజయం సాధించింది. ఆదివారం ఆ జట్టు 83 పరుగుల తేడాతో ఆతిథ్య లంకను చిత్తు చేసింది. మొదట కెప్టెన్ లిటన్ దాస్ (76; 50 బంతుల్లో 1×4, 5×6), షమీమ్ హొసేన్ (48; 27 బంతుల్లో 5×4, 2×6) మెరుపులు మెరిపించడంతో బంగ్లా 7 వికెట్లకు 177 పరుగులు చేసింది. బినుర ఫెర్నాండో (3/31) ఆ జట్టును దెబ్బ తీశాడు. అనంతరం రిషాద్ హొస్సేన్ (3/18) షోరిఫుల్ ఇస్లామ్ (2/12), మహ్మద్ సైఫుద్దీన్ (2/21) విజృంభించడంతో లంక 15.2 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది. నిశాంక (32) టాప్‌స్కోరర్.

విడాకుల బాటలో సైనా, కశ్యప్

హైదరాబాద్, ఈనాడు: భారత బ్యాడ్మింటన్ స్టార్లు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ విడిపోనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్వయంగా సైనా వెల్లడించింది. ఎంతో ఆలోచించి, చర్చించిన అనంతరం తాను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సైనా తెలిపింది. బ్యాడ్మింటన్ ఆడుతూ వీరి మధ్య మొదలైన స్నేహం తర్వాత ప్రేమగా మారింది. 2018లో సైనా, కశ్యప్ పెళ్లి చేసుకున్నారు.

ప్రిక్వార్టర్స్‌లో హంపి, దివ్య



బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచ చెస్ కప్‌లో భారత క్రీడాకారిణులు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టారు. మూడో రౌండ్లో హంపి 1.5-0.5తో కులాన్ క్లాడియా (పోలెండ్)ను ఓడించింది. తొలి గేమ్‌ను డ్రా చేసుకున్న హంపి.. రెండో గేమ్‌లో గెలిచింది. దివ్య 1.5-0.5తో ఇంజాక్ (సెర్బియా)ను ఓడించింది. తొలి గేమ్‌లో నెగ్గిన దివ్య.. రెండో గేమ్‌ను డ్రాగా ముగించింది. వంతిక అగర్వాల్ 1-1తో కేథరినా లాగ్నో (రష్యా)తో సమంగా నిలిచింది. వీరి మధ్య టైబ్రేక్ జరగనుంది. ద్రోణవల్లి హారిక-స్ట్రాసోవా (గ్రీస్), వైశాలి-కారిసా (అమెరికా)ల మధ్య పోరు కూడా 1-1తో డ్రా అయింది. హారిక, వైశాలి తమ ప్రత్యర్థులతో టైబ్రేక్ ఆడనున్నారు.





ఇంగ్లాండ్‌దే ఆఖరి టీ20

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్‌పై చరిత్రాత్మక టీ20 సిరీస్ విజయంతో సత్తాచాటిన భారత మహిళల జట్టు.. ఆఖరి మ్యాచ్‌లో త్రుటిలో ఓడింది. ఆఖరి బంతికి ఫలితం తేలిన అయిదో టీ20ల ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే భారత్ గెలుచుకోగా.. చివరి పోరులో నెగ్గిన ఇంగ్లాండ్ 2-3తో సిరీస్‌ను గౌరవప్రదంగా ముగించింది. షెఫాలీ వర్మ (75; 41 బంతుల్లో 13×4, 1×6) చెలరేగడంతో మొదట భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ చార్లీ డీన్ (3/23), సోఫీ ఎకెల్‌స్టోన్ (2/28), భారత్‌ను కట్టడి చేశారు. అనంతరం ఇంగ్లాండ్ 5 వికెట్లు కోల్పోయి చివరి బంతికి విజయాన్నందుకుంది. ఓపెనర్లు డాని వ్యాట్ హాడ్జ్ (56; 37 బంతుల్లో 9×4), సోఫియా డంక్లీ (46; 30 బంతుల్లో 3×4, 1×6), కెప్టెన్ టామీ బ్యూమాంట్ (30; 20 బంతుల్లో 5×4) రాణించారు. భారత బౌలర్లలో దీప్తిశర్మ (2/31), అరుంధతిరెడ్డి (2/47), రాధ యాదవ్ (1/20) సఫలమయ్యారు. రెండు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ బుధవారం మొదలవుతుంది.

భారత 87వ గ్రాండ్‌మాస్టర్‌గా హరికృష్ణన్

దిల్లీ: చెన్నై కుర్రాడు హరికృష్ణన్ చెస్ గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న లా ప్లాగ్నే ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో మూడో జీఎం నార్మ్ సంపాదించిన 24 ఏళ్ల హరికృష్ణన్.. భారత్ తరఫున 87వ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించాడు. గ్రాండ్ మాస్టర్ శ్యాంసుందర్ మోహనరాజ్ దగ్గర హరికృష్ణన్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఇటీవలే శ్యాంసుందర్ శిష్యుడు శ్రీహరి.ఎల్.ఆర్ భారత్ తరఫున 86వ గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు.

భారత్-ఎ 540 ఆలౌట్


బెకెన్‌హామ్: ఇంగ్లాండ్‌తో అండర్-19 టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 540 పరుగులకు ఆలౌటైంది. 450/7తో రెండో రోజు, ఆదివారం బ్యాటింగ్ కొనసాగించిన భారత్.. ఇంకో 90 పరుగులు చేసి మిగతా 3 వికెట్లు కోల్పోయింది. 31 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన అంబ్రిష్ (70) అర్ధశతకం పూర్తి చేశాడు. ఇంగ్లిష్ బౌలర్లలో అలెక్స్ గ్రీన్ (3/74), రాల్ఫీ ఆల్బర్ట్ (3/95) రాణించారు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన ఇంగ్లాండ్.. రెండో రోజు ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 230/5తో నిలిచింది. హెనిల్ పటేల్ (2/51) ధాటికి 37 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఆ జట్టును.. హంజా షేక్ (84), రాకీ ఫ్లింటాఫ్ (93) ఆదుకున్నారు. ఆట చివరికి థామస్ ర్యూ (3), ఏకాంశ్ సింగ్ (0) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ ఇంకా 310 పరుగులు వెనుకబడి ఉంది.

ఆస్ట్రేలియా 225 ఆలౌట్



కింగ్‌స్టన్: ఆస్ట్రేలియాతో మూడు టెస్టుల సిరీస్‌ను ఇప్పటికే 0-2తో చేజార్చుకున్న ఆతిథ్య వెస్టిండీస్.. చివరిదైన మూడో టెస్టు (డే/నైట్)ను మెరుగ్గా ఆరంభించింది. షమర్ జోసెఫ్ (4/33), జస్టిన్ గ్రీవ్స్ (3/56) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను 225 పరుగులకే ఆలౌట్ చేసింది. ఒక దశలో 157/3తో మెరుగ్గానే కనిపించిన కంగారూ జట్టు.. 68 పరుగుల తేడాతో 7 వికెట్లు కోల్పోయింది. స్టీవెన్ స్మిత్ (48), కామెరూన్ గ్రీన్ (46) రాణించారు. ఆట చివరికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో కెవ్లన్ అండర్సన్ (3) వికెట్ నష్టపోయి 16 పరుగులు చేసింది. బ్రెండన్ కింగ్ (8 బ్యాటింగ్), రోస్టన్ చేజ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఫైనలిస్ట్ అయినందుకు గర్వించు



లండన్: వింబుల్డన్ ఫైనల్లో 0-6, 0-6తో స్వైటెక్ చేతిలో చిత్తుగా ఓడిపోయింది అనిసిమోవా. ఫైనల్లో ఒక దశలో ఆమె చాలా అసహనానికి, అయోమయానికి గురైంది. అలసట కారణంగా సరిగా సర్వీస్ చేయలేకపోయింది. అయితే కెరీర్‌లో తొలిసారి ఫైనల్‌కు వచ్చి రన్నరప్‌గా నిలిచిన ఈ అమెరికా అమ్మాయికి.. అభిమానులు, మాజీ క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. ఇలా ఆమెకు మద్దతు పలికిన వారిలో స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్ కూడా ఉన్నాడు. గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ అయినందుకు గర్వించాలని అనిసిమోవాకు రఫా సూచించాడు. "అమండా అనిసిమోవా.. గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ అయినందుకు గర్వించు" అని ‘ఎక్స్’లో రఫా పేర్కొన్నాడు. అభిమానులు కూడా అనిసిమోవాకు మద్దతుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. "నామీద నాకు నమ్మకముంది. తిరిగి వింబుల్డన్ ఫైనల్‌కు వస్తాను. మానసికంగానే కాక శారీరకంగా బలపడాలి. స్వైటెక్‌తో తుదిపోరులో అలసట ఆవహించింది. ఆటపై మరింత దృష్టి సారించాలి" అని అనిసిమోవా తెలిపింది.

భారత మిక్స్‌డ్ జట్లు విఫలం

ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

లొనాటో: ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత మిక్స్‌డ్ జట్లు నిరాశ పరిచాయి. లక్షయ్ షెరాన్ (22, 19, 25)- నీరూ ధండా (25, 24, 25) పతక రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ క్వాలిఫయింగ్ రౌండ్లో లక్షయ్- నీరూ జోడీ 140/150 స్కోరుతో పదో ర్యాంకు సాధించింది. జొరావర్ సింగ్ సంధూ (21, 23, 24)- ప్రీతి రజక్ (23, 24, 23) జంట 138/150 స్కోరుతో 22వ స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, బ్రిటన్, స్పెయిన్ (2 జట్లు) పతక రౌండ్‌కు దూసుకెళ్లాయి.

ఏ పొద్దూ.. ఆపొద్దు



- టెక్ యుగంలో నిరంతరం నేర్చుకుంటేనే భవిష్యత్తు
- ఎమర్జింగ్ టెక్నాలజీల్లో సర్టిఫికేషన్లు చేయాలి
- విద్యార్థులు, ఉద్యోగులకు నాస్కామ్ సూచన
- నానో డిగ్రీలు ఇవ్వాలని కళాశాలలకు నిర్దేశం

సాంకేతికత నిరంతరం అభివృద్ధి చెందుతోంది.. అందుకను గుణంగా కొత్తగా ఏమైనా నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండటమే నేటి విద్యార్థులు, ఉద్యోగులు పాటించాల్సిన ఆధునిక మంత్ర మని సూచిస్తోంది నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్). భవిష్యత్తు టెక్ ప్రొఫెషనల్స్‌ను సిద్ధం చేయడం, అకాడమీ పద్ధతుల పునరాకృతిపై నాస్కామ్ తాజాగా నివేదిక విడుదల చేసింది. పారిశ్రామిక అవసరాలు, తరగతులకు మధ్య అంతరాలు తగ్గించేందుకు, నైపుణ్యం కలి గిన విద్యావంతుల తయారీలో విద్యాసంస్థలు కీలక భాగస్వామిగా మారుతున్నాయని పేర్కొంది. సర్వేలో పాల్గొన్న కళాశాలల్లో 68 శాతం పాఠ్యప్రణాళిక రీడిజైన్ చేయగా... 60 శాతం కళాశాలలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు, పారిశ్రామిక భాగస్వా మ్యంతో కొత్త పాఠ్యప్రణాళికలు సిద్ధం చేశాయని తెలిపింది. ఇంకా ఏం చెప్పిందంటే..

- ఈనాడు, హైదరాబాద్

పరిశ్రమలు ఏం కోరుకుంటున్నాయి

అభ్యర్థులు ఓపెన్ సోర్స్ ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లతో వాస్తవ ప్రపంచ సమస్యలు పరిష్కరిస్తూ ప్రత్యక్ష అనుభ వాన్ని పెంచుకోవాలి. ఎమర్జింగ్ టెక్నాలజీలతో నిరంతరం అప్‌డేట్‌గా ఉండాలి. ఏడబ్ల్యూఎస్, అజూర్, క్లౌడ్, ఏఐ/ఎంఎల్‌లో నైపుణ్యాల సర్టిఫికేషన్లు చేయాలి. సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలి.. ప్రాక్టికల్, సాఫ్ట్‌స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలి.

జీసీసీ, స్టార్టప్స్‌లో ఫ్రెషర్స్ నియామకాలు

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో జీసీసీ(గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లు, స్టార్టప్స్ ఫ్రెషర్స్‌ను ఎక్కువగా ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. ఈ ఏడాది జీసీసీల్లో ఫ్రెషర్స్ నియామకాలు 20 శాతం పెరుగుతాయి.. 2030 నాటికి మొత్తం నియామకాల్లో ఫ్రెషర్స్‌వి 50 శాతానికి మించి ఉంటాయన్న అభి ప్రాయం జీసీసీల నుంచి వ్యక్తమవుతోంది. విద్యార్థులు జీసీసీల్లో ఉద్యో గాలు పొందేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. కెరీర్ వేగంగా అభి వృద్ధి చెందడంతోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుతున్నాయి. మరోవైపు స్టార్టప్‌ల్లో ఇన్నోవేషన్‌తోపాటు నేర్చుకునే అవకాశాలు, ప్రయోగాలు చేసే స్వేచ్ఛ, మెంటార్ల సహకారం ఉంటోంది. 2024-25 ఫ్రెషర్స్ నియామకాల్లో 85శాతం టెక్నాలజీ కంపెనీలు, 15శాతం నాన్ టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు ఇచ్చాయి. జీసీసీలు టెక్నికల్, సాఫ్ట్‌స్కిల్స్ పరీక్షి స్తుంటే, అంకుర సంస్థలు రియల్‌టైం ప్రాజెక్టు లపై పనిచేసే అవకాశాన్నిస్తున్నాయి.



ఇవీ సూచనలు

- **పరిశ్రమలకు:** పరిశ్రమలు అకడమిక్ భాగస్వామ్యాలు మరింతగా వృద్ధి చేసుకోవాలి.
- **విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాలకు:** ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టాలి. కొత్తతరం టెక్నాలజీల కోసం నానో డిగ్రీలు చేర్చాలి. అనుభవ పూర్వక విజ్ఞానం, సాఫ్ట్‌స్కిల్స్‌పై దృష్టిపెట్టి... మరిన్ని పారిశ్రామిక భాగ స్వామ్యాలు నెలకొల్పాలి. బోధకులకు శిక్షణ ఇవ్వడంతోపాటు పరిశోధన లకు మరిన్ని అవకాశాలు కల్పించాలి.

ఫ్రెషర్స్ వేతనాలు ఇలా... (ఏడాదికి సగటున రూ.లక్షల్లో)

ఐటీ ఉత్పత్తులు, సేవల సంస్థలు	
ఫుల్‌స్టాక్ డెవలపర్	6.2
డెవలపర్స్	4.8
డేటా ఎనలటిక్స్	4.7
ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ	4.4
యూఐ/యూఎక్స్	4
జీసీసీ	
డేటాసైన్స్	8.3
బ్లాక్‌చైన్	8.2
ఏఐ/ఎంఎల్	7.6
సైబర్ సెక్యూరిటీ	7.2
క్లౌడ్	6.5
నాన్ టెక్ పరిశ్రమలు..	
డేటా ఇంజినీరింగ్	5.8
క్లౌడ్ సపోర్టు	4.5
సాఫ్ట్‌వేర్ డెవలపర్	4
బిజినెస్ ఇంటెలిజెన్స్	4
ఆటోమేషన్	3.4

'శెభాష్' గుప్తా..

ఇలాంటివారు ఊరికొకరున్నా చాలుగా!



- తనలాంటి అంధులు, అనాథల కోసం రెండు వసతిగృహాలు

అంధుడినైనా.. కుటుంబ సహకారం లేకున్నా.. డిగ్రీ చదువుకుని.. ఉద్యోగం సాధించా. వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడ్డా. 'మేము కంటే ఇద్దరు పిల్లలను కంటాం.. దీనికి బదులుగా ఆదరణ నోచుకోని అంధులను, అనాథలను చేరదీస్తే.. వారందరికీ తల్లిదండ్రులం అవుతాం' అనే సంకల్పంతో సమాజసేవ దిశగా అడుగులు వేశాం. అలా అక్కున చేర్చుకున్న వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాం. వారి కాళ్లమీద వారు నిలబడేలా చేస్తూ.. విజ్ఞాన సేవాదృక్పథంతో ముందడుగు వేస్తున్నాం. ఆయన తన జీవిత విశేషాలను 'ఈనాడు-ఈటీవీ'తో పంచుకున్నారు. మాది నిజామాబాద్ జిల్లా బోధన్. పుట్టుకతో అంధుడిని. నాకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా.. తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చిన్నతనంలోనే ఇంట్లో నుంచి వచ్చేశా. హాస్టల్లో చేరి డిగ్రీ వరకు కష్టపడి చదువుకున్నా. 1992లో ఆంధ్రా బ్యాంకులో క్లర్క్ కం క్యాషియర్‌గా ఉద్యోగం వచ్చింది. కోఠిలోని శాఖలో 23 ఏళ్ల ఉద్యోగం చేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశా. 2000 సంవత్సరంలో వసతిగృహాలు ఏర్పాటు చేసి అంధులకు ఆశ్రయం కల్పిస్తున్నాం. శోభారాణిని పెళ్లి చేసుకున్నాక.. ఇద్దరం కలిసి వారి యోగక్షేమాలు చూసుకున్నాం. ఇప్పుడు మాకు వందల మంది పిల్లలున్నారు. వారు ప్రయోజకులయ్యాక వివాహాలు చేసుకొని సొంతంగా జీవిస్తున్నారు. ప్రస్తుతం రెండు హాస్టళ్లలో కలిపి 25 మంది అనాథలు, అంధులు న్నారు. ఖాళీ సమయాల్లో వారికి అగర్‌బత్తీలు, చాక్‌పీస్ తయారీలో ఉపాధి కల్పిస్తున్నాం. మా దగ్గరకు వచ్చిన వారందరికీ మొదట నడక, నడత నేర్పుతాం. తర్వాత పదో తరగతి పరీక్షలు రాయిస్తాం. క్రమంగా ఇంటర్, డిగ్రీ పూర్తి చేయించి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేలా ప్రోత్సహిస్తాం. ఇప్పటివరకు 101 మందికి బ్యాంకు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. 'వికలాంగుల వివాహ వేదిక' ఏర్పాటు చేసి 50 జంటలను ఏకం చేశాం.



వసతిగృహంలోని అంధులతో సుభాష్‌గుప్తా

'మేము మీకోసం'

మా దగ్గర ఉంటూనే ఉద్యోగాలు సాధించినవారితో కలిసి 'మేము మీకోసం' (వి ఫర్ యూ) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాం. నేను ఉద్యోగ విరమణ పొందాక ఎలాంటి అవసరమున్నా.. 'వి ఫర్ యూ' సంస్థనే చూసుకుంటోంది. ఉద్యోగాలు చేస్తున్నవారంతా నా దగ్గరే చిట్టీలు వేస్తారు. దాని ద్వారా వచ్చిన వడ్డీని వసతి గృహాల నిర్వహణకు వెచ్చిస్తున్నాం.

-ఈనాడు డిజిటల్, హైదరాబాద్

యాప్‌తో జవజీవాలు

- చెన్నై యువకుల హైటెక్ వ్యాపారం
- గతేడాది రూ.25 కోట్ల టర్నోవర్



ద మీట్ చాప్ స్టార్టప్ యజమానులు అబ్బాస్, యాసర్ అరాఫత్, నవాజ్‌ఖాన్, కల్యాణసుందరం

'పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి..' అనే మాట ఈ యువకుల కథ వింటే నిజమే అనిపిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వదిలి వ్యాపారంలోకి వచ్చిన వారిని కరోనా దెబ్బతీసింది. అయినా.. వ్యాపారాన్ని వదలలేదు. సాంకేతికతతో తిరిగొచ్చి నమ్ముకున్న రంగంలో దూసుకెళ్తున్నారు. వారే చెన్నైకి చెందిన యువ ఇంజినీర్లు అబ్బాస్, యాసర్ అరాఫత్, నవాజ్‌ఖాన్, కల్యాణసుందరం. 'ద మీట్ చాప్' అనే స్టార్టప్ ద్వారా జీవాల వ్యాపారానికి సరికొత్త వేదికగా మార్చారు. ఈ విజయం వెనుక కృషిని అబ్బాస్ మాటల్లోనే తెలుసుకుందాం..

"నలుగురం కంప్యూటర్ సైన్స్ చదివాం. యాసర్ నా తమ్ముడు. నవాజ్‌ఖాన్ బంధువు. కల్యాణ సుందరం నా తమ్ముడి కాలేజ్ మేట్. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగాం. చదువు కాగానే నలుగురికీ పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. తొలుత 2011లో ఐటీ కంపెనీలో ఓ కొటేషన్ పెట్టాం. యాప్‌తోనే ఆర్డర్ చేసే బిల్లు చెల్లించేలా చూడటంతో మా కొటేషనుకు మంచి పేరు వచ్చింది. ఆదే ఉత్సాహంతో 22 బ్రాంచులు పెట్టాం. నలుగురం ఉద్యోగాలు మానేసి వాటిపైనే దృష్టి సారించాం. ఇంతలో కరోనా వచ్చి పరిస్థితి తలకిందులైంది. అన్నీ మూసేయాల్సి వచ్చింది.

దుకాణంతో తిరిగి మొదలు..

పరిస్థితులు కుదుటపడ్డాక మాంసం విక్రయాల్లోకి వెళ్లాం. హైటెక్ పద్ధతిలో నాణ్యతగా, డిజిటలైజ్ చేశాం. రూ.60 లక్షలతో చెన్నై క్రోంపేటలో 2021లో 'ద మీట్ చాప్' ఔట్‌లెట్ షాప్ తెరిచాం. నెలకు సగటున రూ.25 లక్షల వ్యాపారం నడిచేది. జీవాల కొనుగోళ్లలో సమస్యలు వచ్చాయి. వాటి నాణ్యత నిర్ధారించుకునేందుకు ఎలాంటి వ్యవస్థ లేదు. ఆ వ్యవస్థను మేమే తయారు చేసి, ఆరోగ్యకరమైన జీవాలను కొని, విక్రయిస్తే బాగుంటుందని భావించాం. అలా యాప్‌ను తయారు చేశాం.



విక్రయ కేంద్రాల్లోని జీవాలు

అంతా యాప్‌లోనే..



జీవాలకు తగిలించిన ట్యాగ్ స్కాన్ చేస్తూ..

రాజస్థాన్, యూపీ, ఎంపీ, బిహార్‌ల నుంచి జీవాలు తెప్పిస్తాం. కొన్న ప్రతి గొర్రె, మేక చెవికి బార్‌కోడ్ ట్యాగ్ వేయిస్తున్నాం. దాన్ని యాప్‌తో స్కాన్ చేస్తే జీవాల వయసు, బరువు, ఆరోగ్యం.. వంటి 28 వివరాలు వస్తాయి. ఎవరైనా వాటిని పరిశీలించి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రస్తుతానికి వారానికి 3 వేల జీవాలు విక్రయిస్తున్నాం. గతేడాది రూ.25 కోట్ల టర్నోవర్ సాధించాం. పెట్టుబడిదారుల నుంచి రూ.7 కోట్లు పెట్టుబడి పొందాం. కోయంబత్తూర్, మదురై, చెన్నై పల్లవరం, పూళల్ ప్రాంతాల్లో బ్రాంచులు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకూ విస్తరించాలనుకుంటున్నాం" అని వివరించారు.

- చెన్నై(ఆర్కే నగర్), న్యూస్‌టుడే

26 సమాధుల మధ్య..

'లక్కీ' రెస్టారెంట్




ఈటీవీ భారత్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం లాల్‌దర్వాజా ప్రాంతంలో ఉన్న లక్కీ రెస్టారెంటు చాయ్, మస్కా బన్నుకు ప్రసిద్ధి. స్థానికులతోపాటు చాలామంది ప్రముఖులు ఈ రెస్టారెంటుకు వస్తుంటారు. గతంలో ప్రఖ్యాత చిత్రకారుడు ఎం.ఎఫ్.హుస్సేన్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇక్కడి టీ రుచి చూశారు. ఇంత మంది దృష్టిని ఆకట్టుకోడానికి చాయ్ ఒక్కటే కారణం కాదు.. 26 సమాధులు, రెండు చెట్ల మధ్య ఈ రెస్టారెంటు ఉండటం విశేషం. హోటలు రోజంతా రద్దీగా ఉంటుంది. సిబ్బంది ప్రతి రోజూ అన్ని సమాధులపై పూలు చల్లి, ఫాతెహా చదువుతారు. ఈ రెస్టారెంటును 1950లో మహమ్మద్ భాయ్ స్థాపించారని, ఓ శ్మశానవాటిక లోపల దీన్ని నిర్మించినట్లు 17 ఏళ్లుగా ఇందులో క్యాషియరుగా పనిచేస్తున్న రజాక్ మన్సూరీ తెలిపారు. ఆదివారం ఎక్కువ రద్దీ ఉంటుందని, ఈ రెస్టారెంటు హిందూ, ముస్లిం ఐక్యతకు చిహ్నంగా ఉంటుందని వినియోగదారు ఫరీద్ తెలిపారు.

శతాబ్దాల చరిత్ర..

చెదలు పట్టకుండా..



పన్నోన్‌హల్మా (హంగరీ): దాదాపు లక్ష పుస్తకాల్లో దాగిన కొన్ని శతాబ్దాల చరిత్రను చెదలు పట్టిపోకుండా కాపాడేందుకు హంగరీలోని వెయ్యేళ్ల కిందటి అతి పురాతన గ్రంథాలయం ఓ యుద్ధమే చేస్తోంది. మధ్యయుగానికి చెందిన మఠం లాంటి భవన అల్మారాల్లో ఉంచిన పుస్తకాల దుమ్ము దులిపి జాగ్రత్తగా ప్రత్యేకమైన సంచుల్లో పెడుతున్నారు. ఈ సంచుల నుంచి ఆక్సిజన్‌ను తొలగించినందున, స్వచ్ఛమైన నత్రజని మధ్య ఆరు వారాల్లో చెదలు మరణిస్తాయని భావిస్తున్నారు. ఆ తర్వాత ఒక్కో పుస్తకాన్ని పరిశీలించి మళ్లీ అల్మారాల్లోకి చేర్చుతారు. ఈ కార్యక్రమం ముగిశాక వచ్చే ఏడాది ప్రథమార్థంలో గ్రంథాలయాన్ని పునఃప్రారంభించే అవకాశమున్నట్లు లైబ్రరీ డైరెక్టరు లోనా అస్వానీ తెలిపారు. 13వ శతాబ్దానికి చెందిన పూర్తి బైబిలు ఇందులో ఉంది. ముద్రణ యంత్రం రాక ముందు నాటి కొన్ని వందల రాత ప్రతులు కూడా భద్రపరిచారు. ఈ భవనాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో గుర్తించింది.



జూలోకి కొత్త ఫ్రెండ్స్

ఆఫ్రికాకు చెందిన సర్వల్ జాతి పిల్లుల జత ఆదివారం నెహ్రూ జూలో సందడి చేశాయి. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ వ్యక్తి వీటిని బహూకరించగా.. సందర్శకులు వీక్షించడానికి వీలుగా అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి (హెచ్‌ఓఎఫ్ఎఫ్-హెడ్ ఆఫ్ ఫారెస్టు ఫోర్సు) డా.సి.సువర్ణ జెండా ఊపి వీటిని స్మాల్‌క్యాట్ ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశపెట్టారు. జూలో 195 రకాల అరుదైన జంతు జాతులు ఉన్నాయని తెలిపారు. –న్యూస్‌టుడే, చార్మినార్

'సెకండ్ ఇన్నింగ్స్' మామిడి



మామిడి తోటల్లో సాధారణంగా 35 ఏళ్ల వయసున్న చెట్ల ఫలసాయం తగ్గిపోతోంది. రైతులు వాటిని నరికేసి కొత్త మొక్కలు నాటుతుంటారు. అవి తిరిగి ఫలసాయం ఇవ్వడానికి నాలుగైదేళ్ల సమయం పడుతుంది. అలాకాకుండా ఇప్పటికే ఉన్న చెట్లను కొత్తగా చిగురింపజేసి మూడు నాలుగేళ్లలో అధిక ఫలసాయం వచ్చేలా.. 'పునరుద్ధరణ' విధానం అమల్లోకి వచ్చింది. ఉద్యానశాఖ అధికారుల సూచనతో ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెంలో ఇద్దరు రైతులకు చెందిన 30 ఎకరాల తోటను ఈ విధానంలో పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. తోటలోని చెట్లను భూమి నుంచి 4, 5 అడుగులు ఉంచి కొమ్మలు పూర్తిగా నరికేశారు. నరికినచోట సున్నం, మైలతుత్తం పూసి, పాలిథిన్ కవర్లు చుట్టారు. దీని వల్ల ఆ భాగం దెబ్బతినదు. మిగిలిన భాగంలో చిగుర్లు వచ్చాయి. అవి కొమ్మలుగా మారి మూడేళ్లలోనే తిరిగి కాతకు వస్తుందని.. నాలుగో ఏట నుంచి 4-5 టన్నుల దిగుబడి (సాధారణ చెట్ల కంటే ఒక టన్ను అధికం) అందుతుందని వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణుకుమార్ తెలిపారు. అప్పటికే ఆ చెట్లకు ఉన్న బలమైన వేరు వ్యవస్థ ఇందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నరికిన చోట కొమ్మకు ఒకటి చొప్పున వేరే రకం అంట్లు కట్టే అవకాశమూ ఉందని వివరించారు.

– ఈనాడు, ఖమ్మం; పెనుబల్లి, న్యూస్‌టుడే

నేటికీ సారే జహా సే అచ్ఛా

- ఐఎస్ఎస్‌లో శుక్లా వీడ్కోలు ప్రసంగం
- నేడు రోదసి కేంద్రానికి గుడ్‌బై
- రేపు భూమికి తిరిగిరాక



ఐఎస్ఎస్‌లో ఆదివారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శుభాంశు శుక్లా

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు యాక్సియం-4 ఆస్ట్రోనాట్‌లు భూమికి తిరిగివచ్చే సమయం ఆసన్నమైంది. వారు సోమవారం ఐఎస్ఎస్‌కు వీడ్కోలు పలికి పుడమికి పయనం కానున్నారు. వీరికి ఏడుగురు ఐఎస్ఎస్ ఆస్ట్రోనాట్‌లు లాంఛనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ.. "రోదసి నుంచి చూసినప్పుడు భారత్ ఎలా ఉందో తెలుసుకోవాలన్న కుతూహలం అందరిలో ఉంది. నేటి భారత్ నిర్భీతిగా ఉంది. ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఈ కారణాల వల్ల రోదసి నుంచి చూసినప్పుడు నేటికీ 'సారే జహా సే అచ్ఛా' (ప్రపంచంలోనే అత్యుత్తమం)గా కనపడుతోంది" అంటూ 1984లో అంతరిక్షంలోకి వెళ్లిన భారత తొలి వ్యోమగామి రాకేశ్‌శర్మ వ్యాఖ్యలను గుర్తుచేశారు. 'అనేక జ్ఞాపకాలు, నేర్చుకున్న కొత్త అంశాలతో మనసుల్లో పదిలపరచుకొని తిరిగి వెళుతున్నా. వాటిని నా దేశవాసులతో పంచుకుంటా'' అని వివరించారు.

ఐఎస్ఎస్‌కు వీడ్కోలు పలకనున్న నేపథ్యంలో వ్యోమగాములు ఆదివారం విందు చేసుకున్నారు. శుభాంశుతో పాటు యాక్సియం-4 వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు సోమవారం మధ్యాహ్నం 2.25 గంటలకు.. అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమై ఉన్న డ్రాగన్ వ్యోమనౌకలోకి ప్రవేశిస్తారు. సాయంత్రం 4.35 గంటలకు ఈ వ్యోమనౌక.. అంతరిక్ష కేంద్రంతో విడిపోతుంది. పలు విన్యాసాల అనంతరం భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగుతుంది.

కంటెయినర్‌లోకి ఎక్కించి ట్రాక్టర్ చోరీ

విజయవాడ (భవానీపురం), న్యూస్‌టుడే: ఆ దొంగ చాలా 'పెద్ద' ప్లానే వేశాడు. ట్రాక్టర్‌ను కంటెయినర్‌లోకి ఎక్కించి తీసుకెళ్లిపోయాడు. ఎన్టీఆర్ జిల్లా భవానీపురంలో ఈ నెల 9న రాత్రి ట్రాక్టర్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందింది. పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ట్రాక్టర్‌ను కంటెయినర్‌లోకి ఎక్కించినట్లు గుర్తించి, ఆ కంటెయినర్ వెళ్లిన మార్గంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. శ్రీసత్యసాయి జిల్లా కియా ఇండస్ట్రియల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నట్లుగా గుర్తించారు. అక్కడికి వెళ్లి కంటెయినర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడు రాజస్థాన్‌కు చెందిన రాజీవ్‌సింగ్ పరమార్‌ను అరెస్టుచేశారు.

పాకిస్థాన్ రంగస్థలంపై రామాయణం



కరాచీ: కోట్ల మంది హిందువుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన 'రామాయణం' గాథ పాకిస్థాన్ గడ్డపై ప్రదర్శితమవుతోంది. కరాచీలో ఓ నాటక బృందం ఈ భారతీయ ఇతిహాసాన్ని కళ్లకు కట్టింది. ఇందులోని కళాకారులు పాకిస్థానీయులే కావడంతో పాటు స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తడం విశేషం. పాకిస్థాన్‌కు చెందిన యోగేశ్వర్ కరేరా, రాణా కజ్మాలు 'మౌజ్' అనే ఓ నాటక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గత నవంబరులో 'ది సెకండ్ ఫ్లోర్' ఆర్ట్ గ్యాలరీలో తొలిసారి రామాయణాన్ని ప్రదర్శించారు. మంచి ఆదరణ రావడంతో ఆర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ కరాచీలో ఇటీవల మూడు రోజులపాటు దీన్ని ప్రదర్శించారు.

బ్రిటన్‌లో రేపటి నుంచి

'ఈ-వీసా' అమలు



ఇంటర్నెట్ డెస్క్: బ్రిటన్‌లో మంగళవారం నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈ-వీసాలు అమల్లోకి రానున్నాయి. కొత్తగా జారీ చేసే అన్ని రకాల వీసాలు.. వాటిని పొందేవారి పాస్‌పోర్టులతో లింకై.. డిజిటల్ రూపంలో ఉంటాయి. బ్రిటన్‌లో చదువుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. నూతన విధానంపై వారు అవగాహన కలిగి ఉండాలి. కొత్త విధానం ప్రకారం- పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా వీన్యెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఈ-వీసా ఇస్తారు. ఇది డిజిటల్ ఇమ్మిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఈ-వీసాల్లో విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది.

■ విద్యార్థులు కచ్చితంగా యూకేవీఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఈ-వీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

■ ఈ-వీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఈ-వీసాను తనిఖీ చేస్తారు.



మానసిక విశ్రాంతి కోసం విషం తాగుతారా?

పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఎవరైనా విషం తాగుతారా? మరి వారాంతం వచ్చేసరికి మద్యం తాగాలన్న ఆలోచన ఎందుకు చేస్తారు? అది కూడా ఓ రకమైన విషమే. ఆరోగ్యాన్ని నిదానంగా దెబ్బతీసి మనిషిని చంపేస్తుంది. మీకు విశ్రాంతి కావాలంటే, కంటి నిండా నిద్రపోండి. నడకకు వెళ్లి ప్రకృతిని ఆస్వాదించండి. మీ భావాలకు అక్షరరూపం ఇవ్వండి.

– పాట్రిక్ రూనీ, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్

ఆదర్శాల నీడన.. ఆకట్టుకున్న ప్రదర్శన



గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం గాంధీభవన్ ప్రకాశం హాల్‌లో మహాత్మాగాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, మహాత్మా చరఖా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గాంధీభవన్ ప్రాంగణంలో ఒక అడుగు ఎత్తున్న 1500 గాంధీ విగ్రహాలను ప్రదర్శించారు. మహాత్ముని 156వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో 156 మంది చిన్నారులు గాంధీ వేషధారణతో అలరించారు. 156 చరఖాల వద్ద చిన్నారులు నూలు వడికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు.

– ఈనాడు, హైదరాబాద్

కాంతి రేగింది.. కార్చిచ్చులా



ఈ చిత్రం చూస్తుంటే కొండ మీద ఏదో కార్చిచ్చు బయలుదేరినట్లు అనిపిస్తోందా? అలా అనుకుంటే భ్రమపడినట్లే! శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో ఈ దృశ్యాన్ని చూసేందుకు సందర్శకులు వేల వాహనాల్లో తరలివస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వచ్చే మార్గం కిక్కిరిసిపోయింది. ఆదివారం చీకట్లు ముసిరే సమయంలో నల్లమల గిరుల్లో బారులు తీరిన వాహనాల లైట్లు వెలుగులు విరజిమ్ముతుండగా ఈ మనోహర దృశ్యం ఆవిష్కృతమైంది. – న్యూస్‌టుడే, సున్నిపెంట

చిటికెడుకు మించి తినేస్తున్నారు



- ఉప్పు వినియోగంపై ఎన్ఐఈ వెల్లడి

దిల్లీ: దేశంలో మోతాదుకు మించి ఉప్పును వినియోగిస్తుండటంతో క్రమంగా అది ప్రజల్లో తీవ్ర అనారోగ్యాల ముప్పును పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ(ఎన్ఐఈ) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. "ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం.. ఓ వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పునే వాడాలి. కానీ, భారత్‌లో ఈ వినియోగం పట్టణ ప్రాంతాల్లో 9.2 గ్రాములు, గ్రామీణ ప్రాంతాల్లో 5.6 గ్రాములుగా ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి. ఫలితంగా ఇది అధిక రక్తపోటు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధుల ముప్పును పెంచుతోంది" అని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఉప్పు వినియోగాన్ని తగ్గించేందుకు, దానికి బదులుగా తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి పెట్టేందుకు ప్రజల భాగస్వామ్యంతో తాము ఓ అధ్యయనాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇది పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల్లో మూడేళ్ల పాటు కొనసాగనుందని.. దీనికి భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) సహకారం అందిస్తోందని ఎన్ఐఈ శాస్త్రవేత్తలు తెలిపారు.

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ హత్యకు ఇజ్రాయెల్ యత్నం

- ఐఆర్‌జీసీ నివేదిక వెల్లడి



టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌ను అంతమొందించేందుకు గత నెలలో ఇజ్రాయెల్ ప్రయత్నించిందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) నివేదిక వెల్లడించింది. జూన్ 15వ తేదీన పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్, న్యాయ వ్యవస్థ చీఫ్ మొహసేనీ ఇజెయ్‌తోపాటు ఇతర సీనియర్ అధికారులు టెహ్రాన్‌లో సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశంలో ఉండగా ఇజ్రాయెల్ దాడి చేసిందని ఐఆర్‌జీసీ అనుబంధ ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఆదివారం తెలిపింది. అధ్యక్షుడు స్వల్ప గాయాలతో బయపడ్డట్లు వివరించింది. తనపై దాడిని అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవలే ధ్రువీకరించారు. 'వారు ప్రయత్నించారు. కానీ విఫలమయ్యారు' అని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఫార్స్ న్యూస్ వివరాల ప్రకారం.. ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో పెజెష్కియాన్ కాలికి గాయమైంది. టెహ్రాన్ పశ్చిమ ప్రాంతంలోని ఓ భవనంపై ఈ దాడి జరిగింది. భవనం కింది భాగంలో ఇరాన్ అధికారులు ఉన్నారు. పేలుడు సంభవించగానే విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అత్యవసర వ్యవస్థలను ముందుగానే సిద్ధం చేసుకోవడంతో భవనంలోని వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

సోనియా అధ్యక్షతన రేపు కాంగ్రెస్ కీలక భేటీ

దిల్లీ: రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సమావేశం కానున్నారు. దీనికి పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షత వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు సీనియర్ నాయకులంతా ఈ భేటీలో పాల్గొననున్నారు. బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఈ పార్లమెంటు సమావేశాల్లో కాంగ్రెస్ ప్రధానంగా లేవనెత్తనుంది. ఆపరేషన్ సిందూర్ లోపాలు, నష్టాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలను రాబట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా విధించిన సుంకాల అంశాన్ని ప్రస్తావించనుంది. సమావేశాల్లో లేవనెత్తే అంశాలపై వ్యూహాన్ని సిద్ధం చేసిన తర్వాత మిత్రపక్షాలతో కలిసి సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈసారి పార్లమెంటు సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగనున్నాయి.

సాగు భూముల్లో అడవుల పెంపకం

- అన్నదాతల ఆదాయం పెంచేందుకు ప్రోత్సాహం
- ముసాయిదా నిబంధనలు జారీ చేసిన కేంద్రం



ఈనాడు, దిల్లీ: దేశంలో వ్యవసాయ భూముల్లో అడవుల పెంపకాన్ని (ఆగ్రో ఫారెస్ట్రీ) ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూర్చాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను జారీ చేసింది. వ్యవసాయ భూముల్లో పెంచిన చెట్ల నరికివేతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ లేఖ రాసింది. నేషనల్ ఆగ్రో ఫారెస్ట్రీ పాలసీ-2014 ప్రకారం ఈ నిబంధనల రూపకల్పన జరిగింది. 'ఇది చెట్ల కొట్టివేత, అటవీయేతర ప్రాంతాల్లో కలప ఉత్పత్తులకు సర్టిఫికేషన్ జారీకి ఉపయోగపడుతుంది. దీనివల్ల భూ యజమానులు, రైతులు, ఇతర భాగస్వాములు ఆగ్రో ఫారెస్ట్రీ విధానాన్ని అనుసరించడానికి బాటలు వేస్తుంది. దేశంలో కలప, ఇంధన వనరులు, దాణాలకు పెరుగుతున్న డిమాండును అందుకోవడానికి దోహదం చేస్తుంది. దిగుమతులతోపాటు సంప్రదాయ అడవులపై ఒత్తిడిని తగ్గించడానికి వీలవుతుంది. ఈ ముసాయిదా నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించి రాష్ట్రాల్లో ఆగ్రో ఫారెస్ట్రీని ప్రోత్సహించాలి. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో ప్రైవేటు భూముల్లో పెంచిన కొన్ని రకాల జాతుల చెట్లను కొట్టి, రవాణా చేసుకోవడానికి ఎలాంటి పరిమితులు లేవు. ఇప్పటికే రాష్ట్రాలు కల్పిస్తున్న మినహాయింపులకు ఈ ముసాయిదా నిబంధనలు ఎలాంటి అడ్డంకులు కల్పించవు' అని కేంద్రం పేర్కొంది. ఈ నిబంధనల అమలు బాధ్యతను రాష్ట్ర స్థాయి కమిటీ పర్యవేక్షిస్తుంది.

పెంచే విధానమిదీ..

- వ్యవసాయ భూముల్లో అటవీ ఉత్పత్తులను పెంచాలనుకున్నవారు నేషనల్ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టంలో పేర్లు నమోదు చేసుకోవాలి. అందులో భూమి, యజమాని వివరాలు పొందుపరచాలి.
- పేరు నమోదు చేసుకొనేటప్పుడే ఏయే జాతుల మొక్కలను పెంచబోతున్నదీ వివరాలు చెప్పాలి. ఇప్పటికే నాటిన మొక్కల జాతులు, వాటిని నాటిన కాలం, ఇప్పుడు ఎంత ఎత్తులో ఉన్నాయన్న వివరాలూ అందించాలి.
- రాష్ట్ర స్థాయి కమిటీ నిర్దేశించిన సమయం ప్రకారం దరఖాస్తుదారులు మొక్కల వివరాలను అప్‌డేట్ చేస్తూ వెళ్లాలి. అందులో మొక్క చుట్టుకొలత, ఎత్తు గురించి పేర్కొనాలి. జియోట్యాగ్ చేసిన ఫైల్ అప్‌లోడ్ చేయాలి.
- వ్యవసాయ భూముల్లో 10కి మించి ఉన్న చెట్లను కొట్టేయాలనుకుంటే నేషనల్ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత గుర్తింపు పొందిన ఏజెన్సీ దాన్ని తనిఖీచేసి చెట్ల నరికివేతకు అనుమతి ఇస్తుంది.

బిహార్ ఓటర్లుగా బంగ్లా, నేపాల్ దేశస్థులు

దిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) ప్రారంభించిన ఓటర్ల జాబితా సవరణ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అనేక మంది బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను అక్రమ మార్గాల ద్వారా పొందినట్లు వెల్లడించారు. ఆగస్టు 1 నుంచి అనర్హులను పరిశీలించి, సెప్టెంబరు 30న విడుదల చేసే తుది ఓటర్ల జాబితాలో వారి పేర్లను తొలగిస్తామని అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికల అధికారులు ఓటర్ల ఇంటింటికి వెళ్లి తనిఖీ చేస్తున్న సమయంలో అక్రమ వలసదారుల విషయం బయటపడింది. అనర్హులు, నకిలీ ఓటరుతో పాటు విదేశీయులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే లక్ష్యంగా ఈ సర్వే ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. ఇలాంటి సర్వేను చివరిసారిగా 20 ఏళ్ల క్రితం చేశారు. అప్పటి నుంచి అనుబంధ సవరణలు మాత్రమే చేపడుతున్నారు.

వచ్చే నెల నుంచి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్!


బిహార్ తరహాలోనే వచ్చే నెల నుంచి దేశవ్యాప్తంగా ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించేందుకు ఈసీ సిద్ధమవుతోంది. విదేశీ అక్రమ వలసదారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్‌ను నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బిహార్ ఓటరు జాబితాల సవరణ వ్యవహారం ఈ నెల 28న సుప్రీం కోర్టులో మరోసారి విచారణకు రానుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఈ కసరత్తు నిర్వహణపై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.



హర్షవర్ధన్ శ్రింగ్లా



ఉజ్వల్ నికమ్



సదానందన్ మాస్టర్



మీనాక్షీ జైన్

రాజ్యసభకు శ్రింగ్లా, ఉజ్వల్ నికమ్

- సదానందన్ మాస్టర్, మీనాక్షీ జైన్ కూడా

దిల్లీ: వివిధ రంగాలకు చెందిన నలుగురిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. వీరిలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, ప్రముఖ చరిత్రకారిణి మీనాక్షీ జైన్, కేరళకు చెందిన ఉపాధ్యాయుడు సి.సదానందన్ మాస్టర్ ఉన్నారు. ఆయా రంగాల్లో వారి సేవలను గుర్తించి ఈ నలుగుర్ని నామినేట్ చేశారు. ఆ మేరకు కేంద్ర హోంశాఖ శనివారం రాత్రి పొద్దుపోయాక నోటిఫికేషన్ వెలువరించింది. ముంబయి ఉగ్రదాడుల కేసులో ఉగ్రవాది కసబ్‌కు ఉరిశిక్షపడేలా ప్రభుత్వం తరఫున ఉజ్వల్ నికమ్ వాదనలు వినిపించిన విషయం తెలిసిందే.

ఆనందంగా ఉంది



"డాక్టర్ మీనాక్షి జైన్‌ను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆమె పండితురాలిగా, పరిశోధకురాలిగా, చరిత్రకారిణిగా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. సామాన్యుల గౌరవాన్ని కాపాడటంలో, రాజ్యాంగపరమైన అంశాల్లో నికమ్ సేవలు ఎనలేనివి. ఆయన విజయవంతమైన న్యాయవాది. విదేశాంగ విధానానికి విశిష్ట సేవలందించిన శ్రింగ్లా అనుభవం పార్లమెంటరీ కార్యకలాపాల్లో విశేషంగా ఉపయోగపడుతుంది. అన్యాయాన్ని ఎదిరించే ధైర్యానికి ప్రతిరూపం సదానందన్ మాస్టర్ జీవితం" - ప్రధాని నరేంద్ర మోదీ



స్ఫూర్తినిచ్చే వ్యక్తులతో స్నేహం చేయండి

మీ స్నేహితులతో గడుపుతున్నప్పుడు, వారితో మాట్లాడుతున్నప్పుడు మీకు ఏ విషయంలోనూ స్ఫూర్తి కలగడం లేదంటే మీరు సరైనవారితో సాంగత్యం చేయడం లేదని అర్థం. జీవితంలో ఎదగాలంటే వెంటనే ఆ కూపం నుంచి బయటపడండి. స్ఫూర్తిదాయక వ్యక్తులతోనే స్నేహాన్ని కొనసాగిస్తూ, వారి నుంచి పనికొచ్చే విషయాలు నేర్చుకోండి.

– ఎరిక్ బెర్గ్, రచయిత

యూనిట్‌పై 30 పైసల తగ్గింపు!

- ఎఫ్‌జీడీ నిబంధన సడలింపుతో విద్యుత్ ధరలో వెసులుబాటు

దిల్లీ: బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాల్లో సల్ఫర్ ఉద్గారాలకు సంబంధించిన నిబంధనలను కేంద్రం సడలించడం వినియోగదారులకు ఆర్థికంగా మేలు చేయనుంది. సర్కారు తాజా నిర్ణయంతో- ఒక్కో యూనిట్ విద్యుత్ ధర 25-30 పైసల మేర తగ్గుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గును మండించినప్పుడు సల్ఫర్ వాయువు విడుదలవుతుంది. దానిని నివారించేందుకు ఆయా కేంద్రాలన్నీ 'ఫ్లూ-గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ)' వ్యవస్థలను తప్పనిసరిగా అమర్చుకోవాలని 2015లో కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అయితే దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సల్ఫర్ డయాక్సైడ్ స్థాయిలు 'నేషనల్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ (ఎన్ఏఏక్యూఎస్)' నిర్దేశిత పరిమితులకు లోబడే ఉన్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఒక్కో క్యూబిక్ మీటరుకు గరిష్ఠంగా 80 మైక్రోగ్రాముల వరకూ సల్ఫర్ డయాక్సైడ్ ఉండొచ్చని ఎన్ఏఏక్యూఎస్ సూచిస్తోంది. చాలా నగరాల్లో అది 3-20 మైక్రోగ్రాముల మధ్యే ఉందని తేలింది. ఈ నేపథ్యంలో ఎఫ్‌జీడీ నిబంధనలను సవరించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం- 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలకు 10 కిలోమీటర్ల దూరంలోపు ఉండే విద్యుదుత్పత్తి కేంద్రాలకు మాత్రమే ఎఫ్‌జీడీ వ్యవస్థను తప్పనిసరి చేశారు. ఈ నిర్ణయంతో దేశంలో దాదాపు 79% బొగ్గు ఆధారిత విద్యుత్తును ఉత్పత్తి చేసే కేంద్రాలపై ఎఫ్‌జీడీ వ్యయభారం తగ్గనుంది. దీంతో ఒక్కో యూనిట్ విద్యుత్ ధర 25-30 పైసల మేర తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎఫ్‌జీడీ నిబంధనల కారణంగా బొగ్గు విద్యుదుత్పత్తి కేంద్రాలపై రూ.2.5 లక్షల కోట్ల వరకూ ఆర్థిక భారం పడుతుందని గతంలో అంచనాలు వెలువడ్డాయి.

అమెరికాలో ఖలిస్థాన్ ఉగ్రవాది సహా 8 మంది అరెస్టు

ఇంటర్నెట్ డెస్క్: అపహరణ, వేధింపుల కేసుల్లో ఓ ఖలిస్థానీ ఉగ్రవాది సహా 8 మంది భారత సంతతి పౌరులను అమెరికాలోని కాలిఫోర్నియాలో ఎఫ్‌బీఐ అధికారులు అరెస్టు చేశారు. వీరి దగ్గర నుంచి ఆరు తుపాకులు, వందల రౌండ్ల మందుగుండు సామాగ్రి, 15 వేల డాలర్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌బీఐ అదుపులోకి తీసుకున్న ఉగ్రవాది పవిత్తర్ సింగ్ బటాలా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వాంటెడ్ జాబితాలో ఉన్న నేరస్థుడు. నిషేధిత బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ)లో సభ్యుడు. బటాలాను ఇటీవలే ఎన్ఐఏ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది.

నా కుమార్తెపై అత్యాచారం జరగలేదు

- పోలీసులే బలవంతంగా అలా చెప్పించారు
- కోల్‌కతా ఐఐఎం కేసులో విద్యార్థిని తండ్రి ప్రకటన

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) బాయ్స్ హాస్టల్‌లో ఓ విద్యార్థినిపై అత్యాచారానికి సంబంధించిన కేసు కొత్త మలుపు తిరిగింది. బాధితురాలి తండ్రి తన కుమార్తె ప్రమాదంలో గాయపడిందని, లైంగిక దాడి జరగలేదని తెలిపారు. 'నా కుమార్తెపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదు. శనివారం రాత్రి 9.40 గంటలకు నా కుమార్తె నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఆమె ఎక్కడ ఉందో చెప్పలేదు. కారులో నుంచి పడిపోయి గాయాలయ్యాయని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పింది. లొకేషన్ ట్రాక్ చేయగా.. ఆసుపత్రిలో ఉన్నట్లు తెలిసి అక్కడికి వెళ్లాను. ఆమెను కాపాడి ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు చెప్పారు. తనకు ఏం జరగలేదని, ఎవరూ ఎలాంటి హాని చేయలేదని, బాగానే ఉన్నానని నా కుమార్తె నాకు చెప్పింది. అత్యాచార ఆరోపణలు చేయాలని పోలీసులు బలవంతం పెట్టినట్లు చెప్పింది" అని విద్యార్థిని తండ్రి మీడియాకు వెల్లడించారు. ఓ విద్యార్థి కౌన్సెలింగ్ ఇస్తానని హాస్టల్‌కి పిలిపించుకొని తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు అతనికి ఈ నెల 19 వరకు పోలీసు కస్టడీ విధించింది. ఈ క్రమంలో విద్యార్థిని తండ్రి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు.. ఈ అత్యాచార ఘటనపై దర్యాప్తు చేయడానికి తొమ్మిదిమంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మహిళా కమిషన్ కూడా ఈ కేసును సుమోటోగా స్వీకరించింది.

కొల్లగొట్టిన ఆయుధాలు.. స్నైపర్ రైఫిళ్లుగా..

- ఇంఫాల్‌లో కీలక విషయం వెలుగులోకి



ఇంఫాల్: మణిపుర్‌లో జాతుల మధ్య ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్న సమయంలో పోలీసు ఆయుధాగారాల నుంచి వేలాది ఆయుధాలను ఆందోళనకారులు లూటీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఆయుధాల్లో మార్పులు, చేర్పులు చేపడుతూ.. వాటిని మరింత ప్రమాదకరంగా మార్చినట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కాల్పుల తీవ్రతను, పరిధిని మరింత పెంచేలా ఆ ఆయుధాలను మలచినట్లు వెల్లడించారు. "పోలీసు ఆయుధాగారాల నుంచి దాదాపు ఆరు వేల ఆయుధాలు అపహరణకు గురయ్యాయి. వాటిలో ఏకే అసాల్ట్, పాయింట్ 303, ఇన్సాస్ రైఫిళ్లు, కార్బైన్ వంటివి ఉన్నాయి. ప్రత్యర్థులను సుదూరం నుంచే లక్ష్యంగా చేసుకునేందుకు వాటిని స్నైపర్ రైఫిళ్లుగా మార్చారు. సాధారణంగా పాయింట్ 303 రైఫిల్ పరిధి దాదాపు 500 మీటర్లు ఉంటుంది. కానీ, మార్పులు చేపట్టి, ప్రత్యేక టెలిస్కోప్‌ను అమర్చిన అనంతరం.. దాని పరిధి, కచ్చితత్వం, ప్రాణాంతక సామర్థ్యం మరింత పెరుగుతుంది" అని అధికారులు తెలిపారు. మణిపుర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చిన అనంతరం.. అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను అప్పగించాలంటూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే భద్రతా బలగాలు ఇప్పటివరకు వేలల్లో అక్రమ తుపాకులు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. గత నెలలో ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో 328, జులై మొదటి వారంలో కొండ ప్రాంతాల్లోని నాలుగు జిల్లాల్లో 203 ఆయుధాలను సీజ్ చేశాయి.

నలుగురూ నలుగురే

- వేర్వేరు రంగాల్లో దిట్టలు నూతన సభ్యులు
- రాజ్యసభకు నామినేట్ అయినవారి విజయ ప్రస్థానం

దిల్లీ: రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు కొత్తగా నామినేట్ అయిన నలుగురు ఆయా రంగాల్లో తమదైన ముద్ర సొంతం చేసుకున్న వారే. ఆ వివరాలు..

క్రిమినల్ కేసులలో దిట్ట ఉజ్వల్ నికం

దేశంలోని ప్రముఖ న్యాయవాదులలో ఉజ్వల్ నికం ఒకరు. 26/11 ముంబయి ఉగ్రదాడుల కేసు విచారణ, ఇతర సంచలనాత్మక క్రిమినల్ కేసుల్లో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాజపా తరఫున ఉత్తర-మధ్య ముంబయి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి వర్ష గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు.

దౌత్యంలో అందెవేసిన చేయి శ్రింగ్లా

1984 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు చెందిన శ్రింగ్లా అమెరికా, బంగ్లాదేశ్, థాయిలాండ్‌లకు రాయబారిగా విధులు నిర్వహించారు. కీలక దౌత్య పదవులు చేపట్టారు. 2023లో జీ-20 సారథ్య బాధ్యతలు మన దేశానికి లభించినప్పుడు ప్రధాన సమన్వయకర్తగా పనిచేశారు. అనేక విషయాల్లో మనదేశ వాణి ప్రపంచానికి వినిపించారు.

సామాజిక కార్యకర్త సదానందన్

కేరళలోని కన్నూరు జిల్లాకు చెందిన సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. సామాజిక కార్యకర్తగా, భాజపా నేతగా కొనసాగుతున్నారు. 1994లో రాజకీయ ప్రత్యర్థులు దాడిచేసి ఆయన రెండు కాళ్లూ నరికేశారు. ఈ ఘటన అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. 2016, 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన భాజపా తరఫున పోటీ చేశారు.

విద్యారంగంపై ముద్ర మీనాక్షీ జైన్

మీనాక్షీ జైన్ చరిత్రకారిణిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గానూ విధులు నిర్వర్తించారు. విద్యా రంగంలో చేసిన కృషికి గానూ 2020లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

ఏటీఎంల్లో రూ.500 నోట్లు నిలిపివేయాలని ఆర్‌బీఐ కోరలేదు

స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం


దిల్లీ: నకిలీ సమాచారం వ్యాప్తినే ఆయుధంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు ప్రజల బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. తాజాగా ఏటీఎంల ద్వారా రూ.500 నోట్ల పంపిణీని సెప్టెంబరు నాటికి నిలిపివేయాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించినట్లుగా వ్యాప్తి చేస్తున్న నకిలీ వార్తలను కేంద్రం ఖండించింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టంచేసింది. వాట్సప్ ద్వారా ఈ అంశంపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని.. ఇలాంటి సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తూ పీఐబీ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. రూ.500 నోట్లు చట్టబద్ధంగా చలామణిలో కొనసాగుతాయని తేల్చి చెప్పింది. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలను కోరింది.

చిత్రకూటం.. చిత్తహారణం



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో గల చిత్రకూట్ జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి

యూపీ మాజీ సీఎం చంద్రభాను తపాలా బిళ్ల ఆవిష్కరణ



తపాలా బిళ్లను ఆవిష్కరిస్తున్న రాజ్‌నాథ్


లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో కొత్తగా ప్రారంభించిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి ఉత్పత్తి కేంద్రం రక్షణ రంగంలో దేశ స్వావలంబనను బలోపేతం చేస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. లఖ్‌నవూలోని నేషనల్ పీజీ కళాశాల యాజమాన్యం ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాజీ సీఎం చంద్రభాను గుప్తా విగ్రహాన్ని, తపాలా బిళ్లను ఆవిష్కరించారు. "మౌలిక సదుపాయాల్లో చరిత్రాత్మక మార్పులు సంభవిస్తున్నాయి. విమానాశ్రయాలు, మెట్రో, వైద్య కళాశాలలు అభివృద్ధికి అద్దం పడుతున్నాయి. పదవి అనేది అధికారమో, స్థానమో కాదని, అది ఒక బాధ్యత అనేది గుప్తా జీవిత సారాంశం. రాజకీయాల్లో అభిప్రాయభేదాలు ఉండొచ్చు కానీ, ఈర్ష్య, ద్వేషాలు ఉండకూడదన్నది ఆయనిచ్చిన ముఖ్య సందేశం" అని ఆయన వ్యాఖ్యానించారు.

శాంతియుత ప్రయోజనాలకే మా అణు కార్యక్రమం

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్

ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌తో ఇటీవల నెలకొన్న ఉద్రిక్తతలు అణు ఘర్షణలకు దారితీయొచ్చనే ఆందోళనలను పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. ఇస్లామాబాద్‌లో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. పాకిస్థాన్ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని స్పష్టంచేశారు. దేశ రక్షణ కోసమే వాటిని వినియోగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో 55 మంది పాక్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు అసిం మునీర్ గురించి కూడా ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా దించేసి మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ వస్తున్న వార్తలను షరీఫ్ ఖండించారు. అవన్నీ వదంతులని.. దేశాధ్యక్షుడు కావాలనే ఆకాంక్షను మునీర్ ఏనాడు వ్యక్తపరచలేదన్నారు.

న్యాయవాద వృత్తికి స్వస్తి పలికిన దుష్యంత్ దవే



దిల్లీ: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ అడ్వొకేట్ దుష్యంత్ దవే 4 దశాబ్దాల తన న్యాయవాద వృత్తికి స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నారు. 'న్యాయవాద వృత్తిలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. 70వ జన్మదినాన్ని జరుపుకొన్నాను. ఇక ఈ వృత్తిని వదిలేద్దామని అనుకుంటున్నాను' అని దవే వాట్సప్ సందేశం ద్వారా తెలియజేశారు. ఆయన 1954 అక్టోబరు 27న జన్మించారు. 1978లో గుజరాత్‌లో న్యాయవాద వృత్తిని ఆరంభించారు. అనంతరం దిల్లీకి వచ్చి సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేశారు. దవే తండ్రి జస్టిస్ అర్విందు దవే గుజరాత్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలందించారు.

లక్షిత హత్యల కోసమే లారెన్స్‌ను వాడుకున్నారు..

- మోదీపై పంజాబ్ మంత్రి సంచలన ఆరోపణలు



హర్‌పాల్ చీమా

ఈటీవీ భారత్: పంజాబ్ ఆర్థిక మంత్రి హర్‌పాల్ చీమా ప్రధాని మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. లక్షిత హత్యలు చేయించేందుకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయిని మోదీ వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. లారెన్స్ ద్వారా భాజపా బెదిరింపులకు దిగుతోందన్నారు. ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయి ప్రధాని, కేంద్ర హోం మంత్రుల ఇలాకాలోని జైలులోనే ఉన్నాడని హర్‌పాల్ చీమా పేర్కొన్నారు. పంజాబ్‌లో డ్రగ్స్ స్మగ్లర్లకు రక్షణ కల్పించేందుకు భాజపా, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని హర్‌పాల్ చీమా పేర్కొన్నారు. ఆప్ నేతలు తాను మాట్లాడిన ఓ వీడియోను ఎడిట్ చేయించి, తప్పుడు అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో వైరల్ చేయించారంటూ చండీగఢ్‌లోని సెక్టార్-3 పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా ఫిర్యాదు చేశారు. ఈ అభియోగాల ఆధారంగా శుక్రవారం పంజాబ్‌లోని ఆప్ మంత్రులు హర్‌పాల్ సింగ్ చీమా, అమన్ అరోరాపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై స్పందిస్తూ హర్‌పాల్ చీమా పైవ్యాఖ్యలు చేశారు. మజీఠియా అరెస్టు వ్యవహారంలో ఏమీ చేయలేకపోతున్నామనే నైరాశ్యంతోనే తనపై కాంగ్రెస్ కేసులు పెట్టించిందన్నారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి భాజపా, కేంద్ర హోం శాఖ మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈసీ.. మోదీ చేతిలో కీలుబొమ్మే: కపిల్ సిబల్

దిల్లీ: ఎన్నికల సంఘం(ఈసీ) ఎప్పుడూ మోదీ చేతిలో కీలుబొమ్మలానే ఉందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ఆరోపించారు. బిహార్‌లో ఈసీ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అనేది మెజారిటీ ప్రభుత్వాలు అధికారంలో ఉండడానికి ఉద్దేశించిన రాజ్యాంగ విరుద్ధ చర్య అని ఆయన వ్యాఖ్యానించారు.



ఈ నెల 16న న్యూయార్క్‌లో సోథీ బే వేలం వేయనున్న యాపిల్-1 మదర్‌బోర్డ్, 1976 నాటి యాపిల్ కంప్యూటర్; భూమ్మీద కుజ గ్రహానికి చెందిన అతిపెద్ద రాయి. వేలంలో వీటికి రెండు నుంచి నాలుగు మిలియన్ డాలర్ల చొప్పున ధర పలకొచ్చని భావిస్తున్నారు.



ఒక గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

కృష్ణాలో తగ్గుముఖం పట్టిన వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: కృష్ణా నదికి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శ్రీశైలం జలాశయం ఒక రేడియల్ క్రస్ట్ గేటును 10 అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 27,295 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ పరీవాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 73,586 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయ నీటిమట్టం 883.30 అడుగులు, నీటి నిల్వ 206.0996 టీఎంసీలుగా నమోదైంది

తిరుమలలో అకస్మాత్తుగా పెరిగిన రద్దీ

- ఎస్ఎస్‌డీ టోకెన్లు దొరక్క భక్తుల ఆవేదన



తిరుమలలో సర్వదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లేందుకు వేచి ఉన్న భక్తులు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమలలో వారాంతపు సెలవుల నేపథ్యంలో అకస్మాత్తుగా భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర క్యూలైన్లలో సర్వదర్శనం భక్తులు వేచి ఉన్నారు. శనివారం శ్రీవారిని అత్యధికంగా 92,221 మంది దర్శించుకున్నారు. ప్రస్తుతం సర్వదర్శనానికి 16 గంటలు పడుతోంది. రద్దీతో ఈ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు తిరుపతిలో ఎస్ఎస్‌డీ టోకెన్లు లభించక భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎస్‌డీ టోకెన్లు ఇచ్చే భూదేవి కాంప్లెక్స్, విష్ణు నివాసం, శ్రీనివాసం కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలైన్లల్లో వేచి చూస్తున్నారు. మరుసటి రోజైనా దొరుకుతాయన్న ఆశతో ఇక్కడే వసతి లేకపోయినా ప్లాంట్‌ఫాంలు, రోడ్లపై టోకెన్లు ఇచ్చే కేంద్రాల సమీప ప్రాంతాల్లో తినీతినక గడిపేస్తున్నారు. తితిదే ఉన్నతాధికారులు టోకెన్ల కేంద్రాల వద్ద పరిస్థితులను పరిశీలించి, వారాంతాల్లో టోకెన్ల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

తితిదే సిబ్బందితో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వాగ్వాదం

- పరిమితికి మించి దర్శనానికి అనుమతించాలని డిమాండ్



దర్శనానంతరం ఆలయం బయట ఎమ్మెల్యే థామస్ ఆయన అనుచరులు

తిరుమల, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ ఆదివారం తితిదే ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. తితిదే అధికారుల వివరాల మేరకు.. ఎమ్మెల్యే థామస్ పది మందితో శ్రీవారి ప్రొటోకాల్ దర్శనం కోసం వచ్చారు. జనరల్ బ్రేక్ దర్శన టికెట్లు ఉన్న మరో ఆరుగురు అనుచరులనూ తనతోపాటు 'ప్రొటోకాల్' దర్శనానికి తీసుకెళ్తానని వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 వద్దకు చేరుకున్నారు. జనరల్ బ్రేక్ కలిగిన వారిని ప్రొటోకాల్ దర్శనానికి పంపడం కుదరదని విధుల్లో ఉన్న తితిదే ఉద్యోగులు, భద్రతా సిబ్బంది తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వారితో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ అనుచరులను తనతోపాటు ఆలయం వరకు తీసుకెళ్లారు. ఇంతలో ఉన్నతాధికారులు వచ్చి వారిని అడ్డుకోగా ఎమ్మెల్యే వారిపైనా దుర్భాషలతో విరుచుకుపడ్డారు. చివరికి తితిదే అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవీఎస్‌వో వచ్చి నిబంధనల ప్రకారం వెళ్లాలని, జనరల్ బ్రేక్ టికెట్లు పొందిన వారికి 'ప్రొటోకాల్'లో పంపడం కుదరదని తేల్చిచెప్పారు. చివరకు జనరల్ బ్రేక్‌లోనే వారిని దర్శనానికి అనుమతించారు.

ఉచిత స్పర్శ దర్శనం నిలుపుదల

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 18 వరకు మల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనాన్ని నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శ్రీశైల జలాశయం గేట్లు తెరవడంతో భక్తులు, పర్యాటకుల రద్దీ పెరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



ముళ్లదారిలో ప్రయాణమే జీవితం

జీవితం ఓ ముళ్లదారి అన్న కఠోర వాస్తవాన్ని అంగీకరించండి. కష్టాలనే ముళ్లను చూసి భయపడితే ఎప్పటికీ ముందుకు వెళ్లలేరు. జీవితం కొట్టే ఎదురుదెబ్బలను కాచుకోవడానికి సిద్ధమై కదలండి. బాధలను ఓర్చుకోండి. కిందపడిన ప్రతిసారీ పైకి లేచి వెళ్తూనే ఉండండి. అంతే తప్ప పరిస్థితుల మీదో, వ్యక్తుల మీదో నిందవేస్తూ ప్రయాణాన్ని ఆపకండి. ఎక్కడో ఓ చోట మీకు తప్పకుండా విజయ తోరణాలు స్వాగతం పలుకుతాయి.

– సిల్వెస్టర్ స్టాలోన్, నటుడు

నమ్మకు నమ్మకు.. ఆ నిద్రని..!



వాహనం నడిపే క్రమంలో క్షణం పాటు వచ్చే కునుకు.. నిండు బతుకులను ఛిద్రం చేస్తుంది.. కుటుంబాలను శోకసంద్రంలో ముంచేస్తుంది! నిద్రలేమి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రైవింగ్ చేసేవారికి కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి.

- నిద్రలేమి అనేక రకాల ఆరోగ్య, మానసిక సమస్యలకే కాదు.. రహదారి ప్రమాదాలకు ముఖ్య కారణాల్లో ఒకటిగా నిలుస్తోంది.
- దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం వరకు కునికి పాట్లతోనే జరుగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

రోడ్డు ప్రమాదాలపై కేంద్రం విడుదల చేసిన గణాంకాలు (2024లో)

- దేశ వ్యాప్తంగా జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారు 1.8 లక్షలు
- ఇందులో 66 శాతం మంది 18–34 ఏళ్లలోపు వారే
- నిద్రలేమితో జరిగే రోడ్డు ప్రమాదాలు 20 శాతం
- హెల్మెట్ ధరించక పోవడంతో చనిపోయినవారు 30 వేలు

ఏం చేయాలి..

- కుటుంబంతో సహా రెండు, మూడు రోజుల ట్రిప్ పెట్టుకుంటే సొంతకారైనా సరే డ్రైవర్‌ను పెట్టుకోవడం శ్రేయస్కరం.
- రాత్రంతా ఒక్కరే విశ్రాంతి లేకుండా వాహనం నడపడం సరికాదు. డ్రైవింగ్ తెలిసిన మరొకరు కూడా ఉండాలి.
- పగలు, రాత్రి ఏకధాటిగా నడపడం కాకుండా మధ్యలో విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి.
- ప్రయాణం చేసేవారికి 6-7 గంటలపాటు నాణ్యమైన నిద్ర అవసరం. అప్పుడే ట్రిప్‌ను ఆస్వాదించగలుగుతాం.
- తీవ్రంగా అలసిపోయినప్పుడు డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం ఉత్తమం.
- దూరప్రయాణాలు చేసే ముందు కూడా విశ్రాంతి అవసరం.
- డ్రైవింగ్‌లో ఎలక్ట్రానిక్ పరికరాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ఇవి ఏకాగ్రతపై ప్రభావం చూపిస్తాయి.

మగతగా ఉండటం, కనురెప్పలు బరువుగా ఉండటం, కునికిపాట్లు పడుతూ ఉంటే.. వెంటనే వాహనాన్ని నిలిపివేసి విశ్రాంతి తీసుకోవాలి.

- ఈనాడు, హైదరాబాద్

నగరాల్లో నిద్రలేమితో బాధపడుతున్న వారు **10%**

దేశంలో ప్రతి 100 మంది వయోజనుల్లో నిద్రలేమి సమస్య ఉన్నవారు **20-25**

ఏ పార్టీలోనూ చేరను.. నా కండువా మారదు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, వేదికపై కేఎస్ జవహర్, చిల్లపల్లి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: 'నేను ఏ పార్టీలోనూ చేరను. నా కండువా మారదు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం నా పోరాటం ఆగదు' అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. 'పద్మశ్రీ' పురస్కారం పొందిన నేపథ్యంలో మంద కృష్ణమాదిగ దంపతులను ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ఆ సంఘం అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షత వహించారు. మంద కృష్ణ మాట్లాడుతూ 'రాజకీయాల్లో చేరితే వ్యక్తిగతంగా బాగుపడతాను.. కానీ ఉద్యమం చేస్తే జాతిని గెలిపించి భవిష్యత్తును ఇవ్వవచ్చు. పలు రాజకీయ పక్షాలు ఎంపీ, రాజ్యసభ సీట్లు ఇస్తామన్నాయి. తీసుకుంటే నేడు మాజీగా మిగిలిపోయేవాడిని. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు సాధించడం భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా పెట్టుకున్నా. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిలదీస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ మాట్లాడుతూ మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని మంద కృష్ణ పోరాటం నిలబెట్టిందన్నారు. పలువురు ఉద్యోగ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ కృష్ణమాదిగకు లభించిన పద్మశ్రీ పురస్కారం యావత్ మాదిగ జాతికి లభించినట్లుగా గర్వపడుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు సునీత, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తొలుత ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఆయన్ను సన్మాన వేదిక వరకు డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తోడ్కొనివచ్చారు.

మహిళా వ్యాపారికి రూ.3.2 కోట్ల టోకరా

ఈనాడు, హైదరాబాద్: నకిలీ స్టాక్‌ట్రేడింగ్ అప్లికేషన్‌తో హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళా వ్యాపారి(44) నుంచి సైబర్ నేరస్థులు సుమారు రూ.3.2 కోట్లను కాజేశారు. తొలుత మే 28న బాధితురాలి వాట్సప్‌నకు మోసగాళ్లు లింక్ పంపడంతో ఆమె దాన్ని ఓపెన్ చేసి గ్రూప్‌లో చేరారు.. ఆ గ్రూప్‌లో క్రమం తప్పకుండా షేర్ ట్రేడింగ్ మెళకువలు పంపుతుండటంతో ఆమె షేర్లలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపారు. అలా మోసగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాల్లోకి మే 30 నుంచి జులై 9 వరకు మొత్తం రూ.3.24 కోట్లను బదిలీ చేశారు. ఈక్రమంలో తన షేర్ల విలువ రూ.30 కోట్లకు చేరినట్లు ఆమెకు కేటాయించిన ఆన్‌లైన్ ఖాతాలో నేరస్థులు చూపారు. ఆమె ఆ ఖాతా నుంచి నిధులను ఉపసంహరించేందుకు ప్రయత్నించగా షేర్ల మొత్తం విలువలో 15 శాతం చెల్లించాలని నేరస్థులు సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌన్సెలింగ్‌లో కనీస ఫీజు రూ.43 వేలు.. జీవోలో మాత్రం రూ.40 వేలు!

- ఇంజినీరింగ్ వెబ్ఐచ్ఛికాల్లో ముందే వివరాల నమోదుతో గందరగోళం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 10 ప్రైవేటు యూనివర్సిటీలు, 212 ప్రైవేటు, 24 ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి కనీస ఫీజు రూ.40 వేలు, గరిష్ఠంగా ఆరు కళాశాలలకు రూ.1.05 లక్షలుగా నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఆర్ఎం ప్రైవేటు విశ్వవిద్యాలయంలో 35% కోటా భర్తీకి సీట్ల వివరాలు ఇవ్వకపోవడంతో 2023-24 విద్యా సంవత్సరం సీట్లనే ఆన్‌లైన్‌లో ఉంచారు. ఈ వర్సిటీలో గత రెండేళ్లలో సీట్లు భారీగా పెరిగాయి. నిబంధనల ప్రకారం మొత్తం సీట్లలో 35% కన్వీనర్ కోటాకు ఇవ్వాలి. కానీ, ఈ వర్సిటీ వివరాలు ఇవ్వడం లేదు. డీమ్డ్‌టుబీ వర్సిటీగా మారబోతున్నామని, తమను కౌన్సెలింగ్ నుంచి తప్పించాలంటూ ఇటీవల ఉన్నత విద్యామండలికి ఆ వర్సిటీ లేఖ రాసింది. మరోవైపు అధికారికంగా జీవోల విడుదల కంటే ముందే సాంకేతిక విద్యాశాఖ కౌన్సెలింగ్‌లో వెబ్ ఐచ్ఛికాల నమోదుకు ఆదివారం ఉదయమే అవకాశం కల్పించింది. అయితే, ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో కనీస ఫీజు రూ.40 వేలుగా ఉండగా.. కౌన్సెలింగ్‌లో మాత్రం అది రూ.43 వేలుగా ఉంది. దాంతో కళాశాలల యాజమాన్యాల్లో కొంత అయోమయం నెలకొంది. జీవోలు రాకముందే గతేడాది ఫీజులనే పేర్కొంటూ వెబ్ ఐచ్ఛికాలకు అవకాశం కల్పించడంతో ఈ గందరగోళం నెలకొంది. వీఆర్ సిద్ధార్థ కళాశాల గత రెండేళ్ల కిందటే డీమ్డ్‌టుబీ వర్సిటీగా మారింది. కానీ, ఈ కళాశాలకు రూ.1.05 లక్షల ఫీజు నిర్ణయించినట్లు జీవోలో పేర్కొన్నారు.

మీరు కో అంటే వాళ్లు కొల్లగొట్టేస్తారు!



- ఈ ఏడాది సైబర్ మోసగాళ్లు రూ.20వేల కోట్లు దోచుకునే అవకాశం
- ఈ తరహా నేరాల విస్తృతిపై 'క్లౌడ్‌సెక్ సంస్థ' అంచనా
- జాగ్రత్తగా ఉండకుంటే మోసపోయేందుకు ఆస్కారం

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సంస్థ పేరు చెప్పి షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులతో భారీ లాభాలొచ్చేలా సలహాలు ఇస్తామంటూ ఆశ పెడుతున్నారా? బ్యాంకు మేనేజర్‌నంటూ ఫోన్ చేసి లావాదేవీల సమాచారం అడుగుతున్నారా? అయితే అలాంటి అపరిచితుల మాటలను అట్టే నమ్మేయొద్దు. నమ్మి మీరు కో అన్నారంటే వారు కోట్లు కొల్లగొట్టేస్తారు. అలాంటి సమయాల్లో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ఈ ఏడాది చివరికల్లా భారత్‌లో బాధితుల నుంచి సైబర్‌నేరస్థులు రూ.20వేల కోట్ల మేరకు కొల్లగొడతారని 'క్లౌడ్‌సెక్' సంస్థ అంచనా వేసింది. గతేడాది సైబర్‌నేరాలు ఎక్కువగా నమోదైంది తెలంగాణలోనే కాబట్టి ఆశకు పోయి అసలుకే ఎసరు తెచ్చుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

2025లో సైబర్ నేరాల విస్తృతిపై అంచనా ఇలా..

2024లో మొదటి 9 నెలల్లోనే భారత్‌లో రూ.11,333 కోట్ల మేర సొమ్మును సైబర్ నేరస్థులు కొల్లగొట్టినట్లు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) వెలువరించిన డేటా ఆధారంగా క్లౌడ్‌సెక్ తాజా అంచనాలు వెలువరించింది. 2024తో పోల్చితే 2025లో 76.5శాతం మేర సైబర్ మోసాలు పెరుగుతాయని, సుమారు 2.5మిలియన్ల ఫిర్యాదులు అందుతాయని ఆ సంస్థ అంచనా.

ప్రముఖ బ్రాండ్ల పేరు చెప్పి..

ప్రముఖ సంస్థల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమ ఖాతాలను ఏర్పాటు చేసి మోసాలకు తెర లేపుతారు. వీటి ద్వారా వ్యక్తిగత, ఆర్థిక డేటాను సేకరించి మోసాలకు పాల్పడతారు.

ఈ తరహాలో మోసాలకు అవకాశం

గతేడాది మాదిరిగానే వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్.. తదితర ఫిషింగ్ మెయిల్స్‌ను పంపి బురిడీ కొట్టించే మోసాలు ఈసారీ అధికంగా జరగనున్నాయి.

- **ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్ యాప్స్ :** ప్రముఖ కంపెనీల పేరుతో యూట్యూబ్, టెలిగ్రామ్‌ల్లో నకిలీ యాప్‌లను సర్క్యులేట్ చేస్తారు.
- **బ్యాంక్ కేవైసీ/రివార్డ్ యాప్స్ :** బ్యాంకు ఖాతాల యూజర్‌నేమ్, పాస్‌వర్డ్, ఓటీపీలాంటి క్రెడెన్షియల్స్‌ను తెలుసుకునేందుకు ఫోన్లు చేస్తారు. లేదా మెసేజ్‌లు పంపి మోసం చేస్తారు.
- **నకిలీ బిల్ పేమెంట్ యాప్‌లు :** కరెంట్, నల్లా.. తదితర బిల్లుల చెల్లింపుల కోసం నకిలీ యాప్‌ల లింక్‌లను పంపి మోసగిస్తారు.

గూగుల్ 'డిజి కవచ్' రక్షణ

సైబర్‌నేరాలు విస్తృతమవుతున్న నేపథ్యంలో గూగుల్ కృత్రిమమేధ డిజిటల్ పర్యావరణాన్ని సురక్షితంగా ఉంచేందుకు 'డిజి కవచ్' అనే వ్యవస్థను రూపొందించింది. ఇది ఆన్‌లైన్‌లో ఆర్థిక నేరాల్ని ముందస్తుగానే గుర్తించి వినియోగదారుల్ని హెచ్చరించడం ద్వారా మోసపోకుండా అప్రమత్తం చేస్తుంది. 2024లో భారత్‌లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి 13 మిలియన్ల సెల్‌ఫోన్లలో మాల్‌వేర్లు చొరబడకుండా అడ్డుకొంది. 247 మిలియన్ల మోసపూరిత ప్రకటనల్ని తొలగించడంతోపాటు 2.9 మిలియన్ల ఖాతాలను సస్పెండ్ చేసింది. సైబర్‌మోసాల్లో సొమ్ము పోగొట్టుకుంటే వీలైనంత తొందరగా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

ఆమె గొంతుతో అతడు!

- వాయిస్ ఛేంజర్ మిషన్‌తో మాయచేసిన నిందితుడు తిరుమలరావు
- సర్వేయర్ హత్య కేసులో వెలుగులోకి వస్తున్న కొత్త విషయాలు



తిరుమలరావు వినియోగించిన వాయిస్ ఛేంజర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణలో సంచలనం సృష్టించిన ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో పలు విషయాలు వెలుగుచూస్తున్నాయి. ప్రధాన నిందితులకు కోర్టు తాజా రిమాండ్ అనంతరం ఏ1 తిరుమలరావు, ఏ3 నాగేష్, ఏ4 పరుశరాము, ఏ5 రాజులను నాలుగు రోజులు కస్టడీలోకి తీసుకొని నిర్వహించిన విచారణలో వెల్లడైన అంశాలను ఆదివారం గద్వాల సీఐ శ్రీను విలేకరులకు వివరించారు. ఆయన కథనం ప్రకారం.. తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితులు తిరుమలరావు, ఐశ్వర్యల మధ్య ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఐశ్వర్యను రెండో వివాహం చేసుకుంటానని తిరుమలరావు తన భార్యను ఒప్పించేందుకు ప్రయత్నించగా ఆమె అంగీకరించలేదు. తిరుమలరావును వివాహం చేసుకుంటే కుటుంబం పరువుపోతుందని బంధువులు చెప్పడంతో ఐశ్వర్య, తేజేశ్వర్‌ని వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా ఐశ్వర్య, తిరుమలరావు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. భర్త తేజేశ్వర్, వారి కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా తిరుమలరావు వాయిస్ ఛేంజర్ డివైజ్ సాయంతో మహిళ గొంతులో ఐశ్వర్యతో మాట్లాడేవాడని విచారణలో తేలింది. ఈ పరికరాన్ని కర్నూలులో తిరుమలరావు పనిచేసే బ్యాంకులో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ముందే ప్లాన్‌వేసినా..

తేజేశ్వర్ బతికుంటే ఎప్పటికైనా సమస్యలు వస్తాయని, అతన్ని అంతమొందించి అడ్డు తొలగించుకోవాలని ఐశ్వర్య తన ప్రియుడిని ప్రేరేపించింది. తిరుమలరావు, ఐశ్వర్యలు సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం చేసుకున్నారు. జూన్ 13న గద్వాల పట్టణ పరిధిలోని సంగాల చెర్వు వద్దకు రావాలంటూ తేజేశ్వర్‌కు గ్యాంగ్ ఫోన్ చేయగా.. అతను తన స్నేహితుడితో కలిసి రావడంతో హత్య పన్నాగం విఫలమైంది. మళ్లీ 17న డ్రైవర్ నాగేష్, పరుశరాము, రాజు కలిసి గద్వాలలోని కృష్ణారెడ్డి బంగ్లా వద్ద తేజేశ్వర్‌ని కారులో తీసుకెళ్లారు. కారులోనే అతన్ని వేట కొడవళ్లు, కత్తులతో గొంతు కోసి, ఆపై పొట్ట భాగంలో తీవ్రగాయాలు చేసి కర్కశంగా కడతేర్చారు. 'అన్నా.. నన్నెందుకు చంపుతున్నారు' అని తేజేశ్వర్ గ్యాంగ్‌ను అడిగినట్లు విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు.

కుమారుడిని తప్పించాలని..

తేజేశ్వర్ హత్య రోజు తాను బ్యాంకులోనే ఉన్నట్లు తిరుమలరావు వేలిముద్ర వేసి.. పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అతడే ప్రధాన నిందితుడని తెలియగానే తిరుమలరావు తండ్రి, విశ్రాంత ఏఎస్సై తిరుపతయ్య కుమారుడిని తొలుత హైదరాబాదుకు, అక్కడి నుంచి ఏపీలోని కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని ఓ గ్రామానికి పంపాడు. అక్కడ పరిచయస్తుల ఇంటిపైన ఒకరు మాత్రమే ఉండగలిగే గదిలో దాచినట్లు తెలిసిందని సీఐ వివరించారు.

అన్నమయ్య జిల్లాలో లారీ బోల్తా.. తొమ్మిది మంది కూలీలు దుర్మరణం

- మరో 12 మందికి తీవ్రగాయాలు



బోల్తా పడిన మామిడికాయల లారీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పుల్లంపేట, ఓబుళవారిపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొంది. మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడటంతో తొమ్మిది మంది కూలీలు మృతిచెందగా.. మరో 12 మంది గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి... రాజంపేట మండలం ఇసుకపల్లి గ్రామ పరిసరాల్లోని తోటల నుంచి మామిడికాయలు కోయడానికి రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీ, తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం వద్దివేడు, కల్వకుంట్ల ప్రాంతాలకు చెందిన 21 మంది కూలీలు ఆదివారం వచ్చారు. మామిడికాయల లోడుతో రైల్వేకోడూరు మార్కెట్‌కు వెళ్తున్న లారీపై వీరంతా కూర్చున్నారు. లారీ పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై అదుపుతప్పి బోల్తా పడడంతో కూలీలంతా లోడు కిందపడ్డారు. కూలీలను పనికి తీసుకెళ్లిన మేస్త్రీ శివ ఒక్కరే చిన్న గాయాలతో బయటపడగా అతని భార్య చిట్టెమ్మ(25)తో పాటు సుబ్బరత్నమ్మ(45), గజ్జల దుర్గయ్య(32), గజ్జల శ్రీను(33), గజ్జల లక్ష్మీదేవి(36), రాధ(39), గజ్జల రమణ(42), వెంకట సుబ్బమ్మ(37) ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. వద్దివేడు గ్రామానికి చెందిన మునిచంద్ర(38)ను రాజంపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. వడమంచిలి వెంకటేశ్, గజ్జల వెంకటయ్య, జి.శీనయ్య, జి.లక్ష్మి, వెంకటరమణ, సిద్ధమ్మ, జి.వెంకటేశ్, పోలి వెంకటేశ్, పోలమ్మ, చెంచులక్ష్మి, గంగమ్మ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ముడిచమురు వ్యాగన్లలో చెలరేగిన మంటలు

- రూ.80 కోట్ల విలువైన ఇంధనం అగ్నికి ఆహుతి
- తమిళనాడులోని పెరియకుప్పం వద్ద గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో ఘటన



వ్యాగన్ల నుంచి ఎగసిపడుతున్న మంటలు

చెన్నై(రెడ్‌హిల్స్), న్యూస్‌టుడే: ముడిచమురు వ్యాగన్లతో వెళుతున్న గూడ్సు రైలు అగ్నిప్రమాదానికి గురైంది. చెన్నై తండయారుపేటలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్లాంట్ నుంచి ముడిచమురుతో కూడిన 52 వ్యాగన్లతో ఓ గూడ్స్ రైలు శనివారం అర్ధరాత్రి వేలూర్ సమీప జోలార్‌పేటకు బయలుదేరింది. ఒక్కో వ్యాగన్‌లో 27వేల లీటర్ల ముడిచమురు ఉంది. ఆదివారం వేకువజామున 5.10 గంటలకు తిరువళ్లూరు సమీప పెరియకుప్పం వద్ద రైలు వెళుతుండగా 17 వ్యాగన్లు పట్టాలు తప్పాయి. దీంతో పట్టాలు, చక్రాల మధ్య ఏర్పడిన రాపిడితో నిప్పురవ్వలు పుట్టి వ్యాగన్లకు మంటలు అంటుకున్నాయి. ప్రమాదాన్ని గుర్తించిన లోకోపైలట్ వెంటనే రైలును ఆపేశారు. గాలి బలంగా వీచడంతో మంటలు ఇతర వ్యాగన్లకు వ్యాపించాయి. రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, అరక్కోణం నుంచి వచ్చిన రెండు జాతీయ విపత్తు స్పందన బృందాలు(ఎన్డీఆర్ఎఫ్).. సుమారు 10 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశాయి. మిగతా 35 వ్యాగన్లను స్థానికుల సాయంతో దూరంగా నెట్టడంతో మరింత నష్టం తప్పింది. ప్రమాదంలో రూ.80 కోట్ల విలువైన 11.90 లక్షల లీటర్ల ముడిచమురు అగ్నికి ఆహుతైంది. ప్రమాదం కారణంగా తిరువళ్లూరు-అరక్కోణం మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపేశారు. తమిళనాడు మంత్రి నాజర్, జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎస్పీ శ్రీనివాస పెరుమాల్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

వైకాపా హయాంలో తుడాలో అవినీతిపై విచారణ పూర్తి

- ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ పూర్తయింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి ఛైర్మన్లుగా పనిచేసిన సమయంలో తుడా నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. 2024 డిసెంబరు 24న అధికారులు ఈ విచారణను ప్రారంభించగా.. ఇటీవలే పూర్తిచేసి, నాలుగు వేల ప్రతులతో ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. తుడా ఆస్తుల్ని మంచినీళ్లప్రాయంగా విక్రయించడం, తద్వారా వచ్చిన రూ.వందల కోట్లను చెవిరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి రాజకీయ, వ్యక్తిగత ప్రచారం కోసం వినియోగించారనే ఆరోపణలపై విజిలెన్స్ బృందం సుదీర్ఘ విచారణ జరిపింది. తుడాలోని అన్ని విభాగాల అధిపతుల నుంచి సమగ్ర వివరాలు సేకరించింది. వీటికి సంబంధించి విజిలెన్స్ అధికారులు.. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నుంచి 37 ప్రశ్నలకు సమాధానాలు కోరారు. మద్యం కుంభకోణం కేసులో ఆయన అరెస్టు కావడంతో ఆయా సమాధానాలు లేకుండానే నివేదిక సమర్పించాల్సి వచ్చింది.

మరో ముగ్గురు తుడా అధికారులకు సిట్ తాఖీదులు

- మద్యం ముడుపుల కేసులో నేడు విచారణకు రావాలని పిలుపు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో ముడుపుల సొమ్మును తరలించడంలో తుడా పాత్రను నిగ్గు తేల్చిన సిట్.. మరింత లోతైన దర్యాప్తుపై దృష్టి సారించింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అరెస్టు చేయడంతో పాటు తుడాకు చెందిన నాలుగు వాహనాలను ముడుపుల తరలింపు కోసం వాడినట్లు ఆధారాలతో పేర్కొంది. ఈ విషయంలో తుడాకు చెందిన ఇద్దరు డ్రైవర్లు విచారణకు హాజరుకాగా.. మరొకరు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మరిన్ని అంశాలను నిర్ధారించుకునేందుకు ఎన్నికల సమయంలో తుడా ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసిన వెంకటనారాయణ, అప్పటి పరిపాలనాధికారి గుణశేఖర్‌రెడ్డి, వాహనాల పర్యవేక్షకుడిగా పనిచేసిన మోహన్‌కుమార్‌ను సోమవారం విచారణకు రావాలని సిట్ అధికారులు తాజాగా నోటీసులు ఇచ్చారు. 2024 ఫిబ్రవరి నుంచి తుడాకు చెందిన వాహనాలను ముడుపుల తరలింపునకు వినియోగించినట్లు సిట్ అధికారులు శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు సేకరించారు. వాస్తవానికి ఎన్నికల ప్రకటన విడుదలైన వెంటనే చెవిరెడ్డి ఆధీనంలో ఉన్న వాహనాలను తుడాకు అప్పగించినప్పటికీ ముడుపుల తరలింపు సమయంలో లాగ్‌బుక్‌లో నమోదు చేయకుండా తుడా డ్రైవర్ల సహకారంతో వాహనాలను వినియోగించినట్లు సమాచారం.

EENADU Vol: 51, Issue: 335 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao


TVS RONIN
THE ULTIMATE MODERN-RETRO
CLASS-LEADING TECH | SUPERIOR RIDING COMFORT | UNMATCHED STYLING
NOW STARTS @ ₹1.35 L*
FEATURING
CHARCOAL EMBER
GLACIER SILVER
MIDNIGHT BLUE
Ride #UnScripted
1800 315 7666
tvsronin | tvsmotor.com/tvs-ronin

భారత్‌తో బంధంలో ఓ సమస్య

- దలైలామా వారసుడి ఎంపికపై చైనా

దిల్లీ: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని



చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశీ వ్యవహారాల నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని.. ఇందులో భారత్ కల్పించుకోవడం సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో జైశంకర్ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం.

కెంటకీలో వరుస కాల్పులు

- పోలీసు అధికారి సహా పలువురికి గాయాలు, దుండగుడి హతం

కెంటకీ: అమెరికాలోని కెంటకీలో ఆదివారం రెండు చోట్ల వరుస కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఒక పోలీసు అధికారితోపాటు పలువురు గాయపడ్డారు. ఆ తర్వాత దుండగుడు హతమయ్యాడు. లెక్సింగ్టన్ ప్రాంతంలో ఈ కాల్పులు జరిగాయి. తొలుత ఫయేట్ కౌంటీలో పోలీసు అధికారిపై కాల్పులు జరిపిన దుండగుడు అక్కడి నుంచి రిచ్‌మండ్ రోడ్డు బాప్టిస్ట్ చర్చి వద్దకు వచ్చాడు. అక్కడా కాల్పులు జరిపాడు. అక్కడే పోలీసులు అతడిని గుర్తించారు. కాల్పుల్లో అతడు మృతి చెందాడు.

కరాచీ వెళదామని విమానం ఎక్కితే సౌదీలో దింపారు

ఇంటర్నెట్‌డెస్క్: లాహోర్ నుంచి కరాచీకి టికెట్ తీసుకున్న ప్రయాణికుడిని ఏకంగా దేశం దాటించి సౌదీ అరేబియాలో దింపింది పాకిస్థాన్‌కు చెందిన ఓ ఎయిర్‌లైన్ సంస్థ. ఈ సంఘటన పెద్ద కలకలం రేపింది. పాక్ అధికారులు విచారణకు కూడా ఆదేశించారు. లాహోర్ నుంచి కరాచీ వెళ్లేందుకు టికెట్ తీసుకున్న షాజహాన్ అనే ప్రయాణికుడు పొరపాటున వేరే విమానం ఎక్కారు. "లాహోర్ విమానాశ్రయానికి చేరుకున్నా. రెండు విమానాలు పక్కపక్కనే ఉన్నాయి. పొరపాటున వేరేది ఎక్కాను. అక్కడి సిబ్బందికి నా టికెట్ చూపించాను. వారెలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకుండా నన్ను అనుమతించారు. రెండు గంటలైనా కరాచీ రాకపోవడంతో అనుమానమొచ్చి సిబ్బందిని వాకబు చేశాను. అప్పుడు పొరపాటు గ్రహించారు. తప్పు నాదేనంటూ నిందించారు. కరాచీకి చేర్చాలని కోరగా, మరో టికెట్ కొనుగోలు చేస్తేగాని తీసుకెళ్లలేమని పేర్కొన్నారు" అని షాజహాన్ తెలిపారు. జెడ్డాలో దిగిన షాజహాన్‌ను అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. పరిస్థితిని అర్థం చేసుకొని వారు అతడిని లాహోర్‌కు తిరిగి పంపించారు.

10 మంది అమర్‌నాథ్ యాత్రికులకు గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం బేస్ క్యాంప్‌కు వెళుతున్న అమర్‌నాథ్ యాత్రికుల వాహనశ్రేణిలో మూడు బస్సులు ఒకదానికొకటి ఢీకొనడంతో 10మంది యాత్రికులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు అమర్‌నాథ్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు భారీ భద్రత నడుమ 7,049 మంది యాత్రికులతో 12వ బ్యాచ్ ఆదివారం జమ్మూ నుంచి బయలుదేరింది.



సంకేత భాషతో మతమార్పిళ్లు..
యూపీలో చంగూర్‌బాబా లీలలు

ఇంటర్నెట్ డెస్క్: విదేశాల నుంచి సొమ్ములు పోగేసి.. అక్రమంగా మతమార్పిళ్లకు పాల్పడుతున్న జలాలుద్దీన్ అలియాస్ చంగూర్‌బాబా ఆర్థిక నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో ఈడీ అధికారులు నిమగ్నమై ఉన్నారు. అతడికి సంబంధించిన 30 బ్యాంకు ఖాతాలపై దర్యాప్తు కొనసాగుతుండగా.. మరో 18 ఖాతాల సమాచారం వెలుగులోకి వచ్చింది. వీటిలో దాదాపు రూ.68 కోట్ల మేరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ ఖాతాలకు గత మూడు నెలల్లోనే విదేశాల నుంచి రూ.7 కోట్లు బదిలీ అయినట్లు తేలింది. గత 15 ఏళ్లుగా మతమార్పిడుల రాకెటును నిర్వహిస్తున్న జలాలుద్దీన్ సంకేత భాషను ఉపయోగించేవాడు. యూపీ పోలీసులు దీన్ని ఛేదించారు. లక్ష్యంగా ఎంచుకొన్న మహిళలను 'ప్రాజెక్ట్' అని.. మతమార్పిడిని 'మిట్టీ పలట్నా'.. మానసికంగా మహిళలను సిద్ధం చేయడాన్ని 'కాజల్ కర్నా' అని, జలాలుద్దీన్‌తో భేటీ ఏర్పాటు చేయడాన్ని 'దీదార్' అని వ్యవహరించేవారు. చంగూర్‌బాబాకు భారత్, నేపాల్‌లలో 100 వరకు బ్యాంకు ఖాతాలున్నట్లు అంచనా. గత మూడేళ్లలో బాబాకు రూ.500 కోట్ల విదేశీ నిధులు అందాయని.. ఇందుకోసం నేపాల్ సరిహద్దులను వాడుకున్నట్లు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే, యూఏఈ నుంచి నిధులు వచ్చినట్లు చెబుతున్నారు. ఈ బాబాకు చెందిన బలరామ్‌పుర్‌లోని భారీ విల్లాను ఇప్పటికే యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడు స్వాధీనం చేసుకొని కమాండోలను రక్షణగా పెట్టింది.

పైలట్ల పాత్రపై అప్పుడే నిర్ధారణకు రాలేం

- ప్రాథమిక నివేదికతోనే అంచనాకు రావడం తొందరపాటే
- ఏఏఐబీ మాజీ చీఫ్ హోండా వ్యాఖ్య
- సవాళ్ల సమయంలో పైలట్లు బాధ్యతగానే వ్యవహరించారు
- విమాన ప్రమాదంపై ఐసీపీఏ స్పష్టీకరణ



దిల్లీ, ముంబయి: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంమీద వచ్చిన ప్రాథమిక దర్యాప్తు నివేదికతోనే పైలట్ల పాత్రపై నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుందని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) మాజీ అధిపతి అరబిందో హోండా అభిప్రాయపడ్డారు. తుది నివేదిక మాత్రమే కచ్చితమైన కారణాన్ని వెల్లడించగలదని స్పష్టం చేశారు. దర్యాప్తును పారదర్శకంగా, పక్షపాతం లేకుండా పూర్తి చేయడానికి ఏఏఐబీని అనుమతించాలని పేర్కొన్నారు. ఏఏఐబీలో ఉన్నప్పుడు 100కుపైగా విమాన ప్రమాదాలపై దర్యాప్తును నిర్వహించిన హోండా.. ఆదివారం అహ్మదాబాద్ విమాన ప్రమాద ప్రాథమిక నివేదికపై స్పందించారు. 'ఇప్పటిదాకా ఏఏఐబీ బాగా పని చేసింది. దర్యాప్తు కొనసాగాలి. ఇక నుంచీ దర్యాప్తు అధికారులు ఎందుకు.. ఎలా ఇంధన స్విచ్‌లు మారాయనే అంశంపై దృష్టి సారిస్తారు. మెకానికల్, ఎలక్ట్రికల్ వైఫల్యాలేమైనా చోటుచేసుకున్నాయా అని విచారణ జరుపుతారు' అని వివరించారు. 'కొంత మంది.. ప్రత్యేకించి విదేశీ మీడియావారు పైలట్లలో ఒకరు తప్పు చేసి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. అటువంటి ఊహాగానాలకు మన సీనియర్ విమానయాన రంగ నిపుణులు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని పేర్కొన్నారు.

అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా విమాన పైలట్లు.. తాము తీసుకున్న శిక్షణకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించారని ఇండియన్ కమర్షియల్ పైలట్స్ అసోసియేషన్ (ఐసీపీఏ) స్పష్టం చేసింది. సవాళ్ల సమయంలోనూ వారు సరిగానే వ్యవహరించారని, ఊహాగానాలతో వారిపై నిందలు వేయొద్దని ఆదివారం సూచించింది. తుది నివేదిక వచ్చే వరకూ ఎటువంటి ఊహాగానాలను అంగీకరించబోమని, అలాంటి వాటిని ఖండించాల్సిందేనని పేర్కొంది. విమానంలోని పైలట్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడటంవల్లే ప్రమాదం జరిగిందని కొందరు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. అటువంటి ఆరోపణలకు ఎటువంటి ఆధారాల్లేవని స్పష్టం చేసింది.

దర్యాప్తులో మేం భాగం కావాలని కోరుకుంటున్నాం: ఏఎల్‌పీఏ

ఎయిరిండియా విమాన ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో తాము భాగం కావాలని కోరుకుంటున్నామని, అందుకుగల చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నామని ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్‌పీఏ) వెల్లడించింది. ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో పైలట్ల తప్పిదం ఉన్నట్లుగా పక్షపాత వైఖరి కనిపిస్తోందని ఆదివారం అభిప్రాయపడింది. దేశంలోని విమానయాన, హెలికాప్టర్ సంస్థలకు చెందిన 800 మంది పైలట్లకు తమ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తోందని, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్‌లో (ఐఎఫ్‌ఏఎల్‌పీఏ) సభ్యురాలని తెలిపింది. ఇది 100 దేశాల్లోని లక్ష మంది పైలట్లకు ప్రాతినిధ్యం వహిస్తోందని వివరించింది. ఏఏఐబీ నివేదిక నేపథ్యంలో సోమవారం డీజీసీఏ అధికారులను కలిసి చర్చలు జరపనున్నామని ఏఎల్‌పీఏ అధ్యక్షుడు శాం థామస్ తెలిపారు.

ప్రమాదకర ఖైదీలను విడదీయండి: కేంద్రం

- జైళ్లలో విప్లవ పోకడలకు కళ్లెం వేయాలని సూచన

దిల్లీ: కారాగారాల్లో పెరుగుతున్న విప్లవవాద పోకడలు సంక్లిష్టమైన సవాలుగా పరిణమిస్తున్న దృష్ట్యా దానికి కళ్లెం వేసేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు సూచనలు జారీచేసింది. శాంతి భద్రతలను కాపాడేందుకు ఇది అవసరమని పేర్కొంటూ దానికి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఖైదీలను స్క్రీనింగ్ చేయడం, వారితో ముప్పు తలెత్తేందుకు ఉన్న అవకాశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటం, అధిక ముప్పు తలెత్తే అవకాశం ఉన్నవారిని విభజించి.. అనుక్షణం నిఘా విధించడం, అలాంటి ఖైదీల్లో విప్లవ పోకడలు పోయేలా చూడటం ఎంత ముఖ్యమో దీనిలో వివరించింది.

ర్యాడికల్ భావాలకు అడ్డుకట్ట పడాలి

"జైళ్లలో విప్లవపోకడలు ప్రమాదకరం. హింసాత్మక ప్రవృత్తి, సంఘవ్యతిరేక కార్యకలాపాలు, తోటివారిలో తిరుగుబాటును ప్రేరేపించడం వంటివాటివల్ల హింస చెలరేగవచ్చు. జైలు సిబ్బందిపై, సహచర ఖైదీలపై, కొన్ని సందర్భాల్లో బయట ఉన్నవారిపై వీరు దాడులకు పాల్పడవచ్చు. అనేక నేరాలకు ఈ ర్యాడికల్ భావనలే కారణం. వీటికి అడ్డుకట్ట పడాలి. తీవ్రమైన అతివాదం వల్ల తలెత్తే ముప్పును తగ్గించి, దేశభద్రతను కాపాడి, ఖైదీలు తిరిగి సమాజంలో మమేకమయ్యేలా చూడడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. ఖైదీలను పరిశీలించే వ్యవస్థను తీర్చిదిద్దుకోవాలి. వారి ప్రవర్తన తీరు, సైద్ధాంతిక భావజాలం, ఎలాంటివారితో కలుస్తున్నారు అనేవి అంచనా వేయడానికి ఇది ఉపయోగపడాలి. జైల్లోకి ఖైదీ అడుగుపెట్టినప్పుడు మాత్రమే కాకుండా ఖైదులో ఉన్న సమయంలో వారితో తలెత్తే ముప్పును తరచూ అంచనా వేస్తుండాలి. చట్టాన్ని అమలుచేసేవారితో, నిఘా సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. ప్రమాదకర ఖైదీలను ఇతరుల నుంచి విడదీయడం ద్వారా వారి భావజాలం వ్యాప్తి చెందకుండా ఆపాలి. కరడుగట్టిన ఉగ్రవాదుల్ని ఖైదు చేసేందుకు అత్యంత భద్రతతో కూడిన ప్రత్యేక కారాగారాలను రాష్ట్రాలు ఏర్పాటుచేసుకోవచ్చు. ఖైదీలు తమ కుటుంబ సభ్యులతో సంప్రదింపులు కొనసాగిస్తుంటే భావోద్వేగపరంగా స్థిరత్వం సాధించవచ్చు" అని కేంద్రం పేర్కొంది.

కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీస్ స్టేషన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు.




క్లిఫ్ హౌస్ వద్ద పేలుళ్లు జరగబోతున్నాయంటూ అందులో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సీఎం నివాసంలో తనిఖీలు చేసి.. అది నకిలీ ఇ-మెయిల్‌గా తేల్చారు. "బాంబు బెదిరింపు తర్వాత ముఖ్యమంత్రి నివాసాన్ని బాంబు స్క్వాడ్‌తో క్షుణ్నంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పద వస్తువు కనిపించలేదు" అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబసభ్యులు విదేశాల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలే లక్ష్యంగా ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపుల వ్యవహారంతో తాజాగా వచ్చిన ఇ-మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎల్‌జీబీటీక్యూఐఏ+ల హక్కులకు న్యాయవ్యవస్థ ఉత్ప్రేరకంగా పనిచేయాలి

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కౌల్ పిలుపు

దిల్లీ: ఎల్‌జీబీటీక్యూఐఏ+ వ్యక్తుల (స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లు తదితరులు) హక్కుల కోసం న్యాయ వ్యవస్థ ఉత్ప్రేరకంగా పని చేయాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పిలుపునిచ్చారు. వారిని గుర్తించడానికి ఇప్పటికే చట్టపరమైన ప్రక్రియ రూపొందినా.. ఇంకా అందులో పలు లోపాలున్నాయని స్పష్టం చేశారు. అసహజ లైంగిక ఆసక్తులున్న వారిని దేశ చట్టపరమైన, సామాజిక ప్రవంతిలో చేర్చడానికి చేయాల్సిన సిఫారసులపై విధానపరమైన డాక్యుమెంటు తయారుచేయడానికి శనివారం దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేశవ్ సూరి ఫౌండేషన్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. 'అసహజ లైంగికత అనే పదాన్ని భారత చట్టంలో నిర్వచించలేదు. లైంగికాసక్తి లేని వ్యక్తులకు విధానపరమైన చట్రంలో చోటులేదు. వ్యాపారాన్ని ప్రారంభించడానికి, ఇల్లు కొనుక్కోవడానికి, వ్యక్తిగత అవసరాలకు ప్రస్తుతం బ్యాంకు ఖాతా, లోన్లు తీసుకోవడం అనేది సాధారణం. కానీ ఎల్‌జీబీటీక్యూఐఏ+ వ్యక్తులు బ్యాంకు ఖాతా తెరవాలన్నా కష్టమే. వారు దరఖాస్తులో జెండర్‌ను తెలపాల్సి



వస్తోంది. వీటితోపాటు వస్తువులను కొనుక్కోవడం, ఆర్థిక సేవలను పొందడం, కనీసం ప్రజా మౌలిక సౌకర్యాలను వినియోగించుకోవడమూ వారికి కష్టంగానే ఉంది. అసహజ లైంగిక అలవాట్లున్న వారికి భవిష్యత్తులో కల్పించబోయే హక్కులకు శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో భరోసా కల్పించాల్సి ఉంది. దీనికోసం మంత్రిత్వశాఖలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలి. స్వలింగ సంపర్కుల హక్కుల విషయంలో శాసన వ్యవస్థలో జడత్వం నెలకొంది. దీనివల్ల స్వలింగ సంపర్కుల వివాహాలకు, దత్తతకు, వారసత్వ హక్కులకు ఇబ్బంది కలుగుతోంది. దేశంలోని అధిక శాతం మంది ప్రజల్లో ఇంకా సంప్రదాయ వాసనలు పోలేదు. ఇదే ఎల్‌జీబీటీక్యూఐఏ+ వ్యక్తులకు అడ్డంకిగా మారింది' అని జస్టిస్ కౌల్ అభిప్రాయపడ్డారు.

నగరాల్లోని యువతలో మార్పు వస్తోంది..

ఎల్‌జీబీటీక్యూఐఏ+ హక్కులపై దేశంలో ఇప్పుడిప్పుడే ప్రగతిశీల మార్పు కనిపిస్తోందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పేర్కొన్నారు. నగరాల్లోని యువత తమ అభిమతాన్ని స్వేచ్ఛగా వెల్లడించే పరిస్థితి నెలకొందని తెలిపారు. అయితే ఇంకా గ్రామీణ, సంప్రదాయవాదుల్లో మార్పు రాలేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటి కంటే భవిష్యత్తు మరింత ఆశావహంగా ఉంటుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌జీబీటీక్యూఐఏ+లకు అనుకూలంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ కొన్ని నిర్ణయాలు తీసుకుందని, రేషన్ కార్డులు, ఉమ్మడి బ్యాంకు ఖాతాలు ఇవ్వడానికి, భాగస్వామి చనిపోతే మృతదేహాన్ని అప్పగించేందుకు అనుమతించిందని వెల్లడించారు. వీటిని సుప్రీం కోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే ఇవి స్వల్పమేనని, ఇంకా ఎంతో చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

వివక్ష అతి పెద్ద సవాలు

'మన దేశం, ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు వివక్ష. ఆడ, మగ మధ్య సంబంధాన్ని తేలిగ్గా తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఒక యువతి తనకు ఇష్టమైన వారిని ఎంచుకుంటే సహించలేకపోతున్నారు. ఈ విషయంలో నగరాల్లోనూ వివక్ష కొనసాగుతోంది. కులాంతర వివాహాలను అసలే అంగీకరించడం లేదు. చివరకు కన్న బిడ్డలనూ అంతమొందిస్తున్నారు. టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ హత్యనే తీసుకోండి. మనం సమస్యల గురించే మాట్లాడుతున్నాం. కానీ సమాజం ఎలా ఉందో చూడండి. అది మారాలి' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ దాడులకు.. గాజాలో మరో 30 మంది బలి

డెయిర్ అల్-బలా: గాజాలో మారణహోమం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ బలగాలు అక్కడ ఆదివారం జరిపిన దాడుల్లో 30 మంది మృత్యువాతపడ్డారు. సెంట్రల్ గాజాలోని నుసీరత్ సమీపంలో ఓ నీటి కేంద్రం వద్ద వరుసలో నిల్చున్నవారిపై వెళ్లినవారిపై బాంబుదాడులు జరిగాయి. ఈ ఘటనలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. వారిలో ఆరుగురు చిన్నారులు ఉన్నారు. అయితే వాస్తవానికి నీటి కోసం వెళ్లినవారిని తాము లక్ష్యంగా చేసుకోలేదని ఇజ్రాయెల్ తెలిపింది. అక్కడికి కొద్దిదూరంలోని వేరే ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకోగా.. సాంకేతిక పొరపాటు కారణంగా పేలుడు పదార్థాలు నీటి కేంద్రం వద్ద పడి పేలాయని వివరించింది. మరో ఘటనలో- సెంట్రల్ గాజా నగరంలో జరిగిన దాడిలో 11 మంది కన్నుమూశారు. దాదాపు 30 మంది గాయపడ్డారు. జవైదా పట్టణంలోని ఓ ఇంటిపై చోటుచేసుకున్న మరో దాడిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా మొత్తం తొమ్మిది మంది మృతిచెందారు. 21 నెలలుగా సాగుతున్న ప్రస్తుత యుద్ధంలో గాజాలో ఇప్పటివరకూ ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 58 వేలు దాటిందని అధికారులు వెల్లడించారు.

లండన్‌లో కూలిన చిన్న విమానం

లండన్: చిన్న విమానమొకటి లండన్ సౌత్‌ఎండ్ విమానాశ్రయంలో ఆదివారం కూలిపోయింది. ఇది ఎక్కడకు వెళ్తోంది, దానిలో ఎంతమంది ఉన్నారనేది వెంటనే ప్రకటించలేదు. లండన్‌కు 72 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ విమానాశ్రయంలో తీవ్రమైన ఘటన జరిగిందని సమాచారం వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలోని గోల్ఫ్ క్లబ్, రగ్బీ క్లబ్‌లలో ఉన్నవారిని ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా అక్కడ నుంచి ఖాళీ చేయించారు. విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం బయల్దేరాల్సిన నాలుగు విమాన సర్వీసులను రద్దుచేశారు. ప్రమాద స్థలి నుంచి మంటలు, నల్లని పొగ ఎగసిపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి.

మరాఠీ వ్యతిరేక వ్యాఖ్యలు

- ఆటోడ్రైవర్‌పై శివసేన(యూబీటీ) నేతల దాడి



పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో మరాఠీ వ్యతిరేక వ్యాఖ్యలు చేశాడంటూ ఓ ఆటోడ్రైవర్‌పై శివసేన(యూబీటీ) నేతలు దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే.. దీనిపై ఫిర్యాదు అందలేదని ఆదివారం పోలీసులు తెలిపారు. స్కూటీ నడుపుతున్న స్థానిక వ్యక్తిని, ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఆటోడ్రైవర్ అధిగమించడంతో నాలుగురోజుల క్రితం వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక వ్యక్తి మరాఠీలో మాట్లాడగా, ఆటోడ్రైవర్ మాత్రం హిందీ, భోజ్‌పురీలోనే మాట్లాడతానని చెప్పాడు. దీనిని అక్కడున్న వారు వీడియో తీశారు. దీంతో రాష్ట్రాన్ని, భాషని, సాంస్కృతిక వారసత్వాన్ని అవమానించాడని ఆటోడ్రైవర్‌పై స్థానిక శివసేన నేతలు దాడి చేయడమే కాకుండా వీడియో తీశారు. ఎవరైనా మరాఠీ భాషను, ప్రజలను అవమానించడానికి ధైర్యం చేస్తే వారికి శివసేన ఇలానే బుద్ధి చెబుతుందని ఆ పార్టీ స్థానిక నేత ఉదయ్ జాదవ్ హెచ్చరించారు.



రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో ఆదివారం నిర్వహించిన 'జైపుర్ కౌంటర్ షో 2025'లో స్థానిక సంప్రదాయ దుస్తుల్లో యువతుల హొయలు

బహుళ సేద్యంతో భలే ఆదాయం

ఈటీవీ భారత్: ఒడిశాలోని కేంద్రపడా ఏటా ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే జిల్లా. తీర ప్రాంతంలో తుపాను పేరు వినగానే ఈ జిల్లా రైతుల గుండెల్లో దడ పుడుతుంది. జిల్లాలోని ఎలిమోపుర్ పంచాయతీ జునుస్ నగర్ గ్రామానికి




వ్యవసాయ క్షేత్రంలో చంద్రశేఖర్ దంపతులు

చెందిన రైతు చంద్రశేఖర్ మన్నా వాతావరణ ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని వ్యవసాయంలో మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. అటవీ శాఖలో చేస్తున్న చిరుద్యోగం కుటుంబ పోషణకు చాలనందున తన తండ్రి ప్రేరణతో 2014లో చంద్రశేఖర్ సాగు ప్రారంభించాడు. బ్యాంకు రుణంతో వ్యవసాయ పరికరాలు సమకూర్చుకొని, తనకున్న 3.5 ఎకరాల భూమిలో వివిధరకాల కూరగాయలకు తోడు డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బెర్రీ, కొబ్బరి వంటి వాణిజ్య పంటల సాగుకు శ్రీకారం చుట్టాడు. మిత్రుల సాయంతో పశువులు, కోళ్లు, చేపలు, బాతులను సైతం పెంచుతున్నాడు. సేంద్రియ ఎరువులను సొంతంగా తయారుచేసి వాడుతుండటంతో మంచి దిగుబడులు వచ్చి ఏటా రూ.అయిదారు లక్షలు మిగులుతున్నాయి. పదేళ్ల కిందట అటవీశాఖలో ఉద్యోగం చేసిన చంద్రశేఖర్ నేడు తనే అయిదారుగురికి ఉపాధి కూడా చూపుతున్నాడు.

ప్రజాప్రతినిధులపై నిరంకుశత్వం తగదు

- కశ్మీర్‌లో నేతల గృహనిర్బంధంపై ఒమర్

శ్రీనగర్: అమరవీరుల దినోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రముఖ నాయకులు గృహనిర్బంధానికి గురయ్యారు. 1931లో నిరంకుశ రాజు హరిసింగ్‌కు వ్యతిరేకంగా జరిపిన నిరసనల్లో మృతి చెందిన 22 మందికి నివాళులర్పించకుండా అడ్డుకునే ప్రయత్నాల్లో భాగంగా సైన్యం పలువురు నేతలను గృహనిర్బంధం చేసింది. దీనిపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రజాప్రతినిధులపై నిరంకుశత్వాన్ని ప్రదర్శించడమేనని తీవ్ర విమర్శలు గుప్పించారు. ''నాయకుల ఇళ్లను బయటినుంచి మూసివేసి తాళాలు వేయడం అప్రజాస్వామికం. కశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పించకుండా మీరు మమ్మల్ని అడ్డుకోగలిగారు. కానీ మేం వారి త్యాగాలను మర్చిపోలేదు" అని ఒమర్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. అరెస్టుల గురించి అధికారికంగా పోలీసులు, ప్రభుత్వం ప్రకటించనప్పటికీ చాలా మంది నేతలను నిర్బంధించిన విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పంచుకున్నారు. తన ఇళ్ల ప్రధాన ద్వారానికి తాళం వేసిన దృశ్యాలను పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీతో పాటు పలువురు నేతలు ఎక్స్‌లో పోస్టు చేశారు.



ఉగ్రవాదుల దాడి బాధిత కుటుంబసభ్యులకు ఉద్యోగ నియామకపత్రం అందజేత సందర్భంగా ఆదివారం బారాముల్లా జిల్లాలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా చేతిని ముద్దాడుతున్న ఓ మహిళ

కేరళ నర్సును కాపాడాలంటూ దాఖలైన పిటిషన్.. నేడు విచారణ

దిల్లీ: హత్య కేసులో యెమెన్‌లో బుధవారం ఉరితీయనున్న కేరళ నర్సు నిమిషప్రియను కాపాడేందుకు దౌత్య మార్గాలను ఉపయోగించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించనుంది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అభ్యర్థనను పరిశీలించనున్నారు.

✦ కన్వర్ యాత్ర మార్గాల్లో తినుబండారాలు విక్రయించే సిబ్బంది తమ యజమానుల పేర్లను తప్పనిసరిగా ఆహారశాలలపై ప్రదర్శించాలన్న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఈ నెల 15న విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

ప్రత్యేక పీఎంఎల్‌యే కోర్టులతో కేసులు వేగవంతం: ఈడీ

దిల్లీ: నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌యే) కింద నమోదయ్యే కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటుచేస్తూ కేంద్రం ఇటీవల వెలువరించిన నోటిఫికేషన్‌తో కేసుల విచారణ వేగవంతం కానుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తంచేసింది. 'తెలంగాణలో మొత్తం 16 ప్రత్యేక కోర్టులు ఇప్పటికే నోటిఫై అయ్యాయి. విశాఖలో రెండు ఉన్నాయి. రాజస్థాన్‌లో ఒకటి నుంచి ఐదుకు పెరిగాయి. తగినన్ని ప్రత్యేక కోర్టులు లేకపోవడం వల్ల విచారణలు ఆలస్యమవుతున్న రాష్ట్రాల్లో ఇప్పుడు అవి ఏర్పాటవుతున్నాయి. మనీలాండరింగ్ కేసులలో జాప్యాలపై ఉన్నత న్యాయస్థానాలు వ్యక్తంచేస్తున్న ఆందోళనను తొలగించేందుకు కూడా ఈ చర్య దోహదపడుతుంది' అని పేర్కొంది.

డెంగీ వ్యాక్సిన్ 3వ దశ ప్రయోగం అక్టోబరులో పూర్తి

- ఐసీఎంఆర్ ప్రకటన

దిల్లీ: దేశ మొట్టమొదటి డెంగీ వ్యాక్సిన్ 'డెంగీ ఆల్' 3వ దశ క్లినికల్ ట్రయల్‌ను అక్టోబరులో పూర్తి చేయనున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రకటించింది. పనాసియా బయోటెక్ ఈ వ్యాక్సీన్‌ను అభివృద్ధి చేస్తోంది. మూడో దశ క్లినికల్ ప్రయోగాల్లో భాగంగా దాదాపు 20 కేంద్రాల్లో 10,500 మంది ఈ వ్యాక్సీన్‌ను పొందనున్నారు. చెన్నై, పుణె, కోల్‌కతా, దిల్లీ వంటి కేంద్రాల్లో ఇప్పటికే 8వేల మందికి వ్యాక్సిన్ లేదా ప్లాసిబోను అందించారు. ఈ ట్రయల్‌లో పాల్గొన్న వారిని రెండేళ్లపాటు పరిశీలనలో ఉంచుతామని ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్రయోగాలను పుణెలోని ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ, ఎయిడ్స్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఈ) సంయుక్తంగా చేపడుతున్నాయి.

నైజీరియా మాజీ అధ్యక్షుడు బుహారీ కన్నుమూత



లాగోస్: నైజీరియా మాజీ అధ్యక్షుడు మహమ్మదు బుహారీ (82) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. లండన్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆఫ్రికాలో అత్యధిక జనాభా ఉన్న దేశమైన నైజీరియా అధ్యక్షుడిగా బుహారీ 2015 నుంచి 2023 వరకు పనిచేశారు. ఆయన పాలనాకాలంలో దేశంలో అవినీతి బాగా పెరిగిందని, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందని, తీవ్రవాదుల హత్యాకాండలు అధికమయ్యాయని విమర్శలున్నాయి. అంతకుముందు- సైనిక తిరుగుబాటు తర్వాత 1983 నుంచి 1985 వరకు మిలిటరీ అధిపతిగానూ బుహారీ దేశ పాలనా బాధ్యతలు నిర్వర్తించడం గమనార్హం.



'అహ నా పెళ్లంట'లో పిసినారి లక్ష్మీపతి పాత్రలో



కోట శ్రీనివాసరావు

- ఈ పేరు వినిపిస్తే చాలు... భాష మురిసిపోతుంది. యాస పరవశిస్తుంది. హావభావాలు ఆహా.. అంటూ దాసోహమవుతాయి. మేనరిజమ్ అంతెత్తు కోట ఎక్కి కూర్చుంటుంది. ఇక నన్నెవరూ అందుకోలేరనే గర్వంతో! మొత్తంగా ఆయా పాత్రలు... హోమ్ గ్రౌండ్‌లో ఆటలా ఒకొక్కటిగా చెలరేగిపోతాయి! కళ్లప్పగించి చూడటమే మన పని! రంగస్థల వేదికైనా... వెండితెర అయినా... తన నటనతో ప్రతి పాత్రనీ పరిపూర్ణం చేసిన దిగ్గజం కోట శ్రీనివాసరావు.

విలక్షణ నటనకు రాచ బాట.. కోట

ఒక్కో నటుడి పేరు చెబితే ఒక్కో తరహా పాత్రలు గుర్తుకొస్తాయి. కానీ కోట శ్రీనివాసరావుని మాత్రం అలా ఒక పాత్రకే పరిమితం చేయలేం. నవ్విస్తూనే, కంటతడి పెట్టించిన నటుడాయన. విలన్‌గా టెన్షన్ పెడుతూనే, మరోవైపు తన మార్క్ మేనరిజమ్‌తోనూ, మాట విరుపుతోనూ నవ్వించిన అరుదైన ప్రతిభ ఆయనది. ఇక తండ్రి, తాత, బాబాయ్ తరహా పాత్రలైతే తన కోసమే పుట్టాయన్నట్టుగా అందులో ఒదిగిపోయారు. తెరపైన విలన్ ఎంత బలంగా కనిపిస్తే, హీరోయిజం అంత గొప్పగా పండుతుంది! ఆ లెక్కన ఎన్నో సినిమాల్లో హీరోయిజాన్ని పండించిన ఘనత కోట శ్రీనివాసరావుది! అన్ని రకాల పాత్రలపై గొప్పగా ప్రభావం చూపించి ఆల్‌రౌండర్ అనిపించుకున్న అరుదైన నటుడాయన. ఎస్వీ ఆర్, రావు గోపాలరావు, కైకాల తర్వాత తెలుగు సినిమా విలనిజానికి, సహా పాత్రలకి ఇక దిక్కెవరో అన్న సందేహం తలెత్తినప్పుడు నేనున్నా అంటూ మెరిసిన నట శిఖరం కోట శ్రీనివాసరావు.

నాకేంటి... నాకేంటని?

ఏటా వందల సినిమాలు విడుదలవుతాయి. వేలాది పాత్రలు పుడుతుంటాయి. కానీ పిసినారితనం అనగానే తెలుగు ప్రేక్షకులకు గుర్తొచ్చేది 'అహనా పెళ్లంట' సినిమాలో కోట పోషించిన లక్ష్మీపతి పాత్రే. పిసినారితనానికి పరాకాష్ఠలా ఉంటుంది ఆ పాత్ర. కోట శ్రీనివాసరావు నటనలో ఓ కొత్త కోణాన్ని వెలికి తీసి, ఆయనకి తిరుగులేని గుర్తింపుని తీసుకొచ్చిన పాత్ర అది. పగిలిపోయిన కళ్లద్దాలు, ముతక పంచె, బనియన్‌తో కనిపిస్తూ... 'నాకేంటి నాకేంటని?' ప్రత్యేకమైన మేనరిజమ్‌ని ప్రదర్శిస్తూ ఆయన పలికించిన హావభావాలు, చెప్పిన సంభాషణలు, ఒంటికి పేపర్లని చుట్టుకుని అవే దుస్తులని చెప్పడం, కోడిని వేలాడదీసి ఒట్టన్నం తింటూ చికెన్ తింటున్నట్టుగా ఊహించుకోవడం, 'ఒరేయ్... అరగుండూ' అంటూ తన అసిస్టెంట్ పాత్రని పోషించిన బ్రహ్మానందంకు కోపం తెప్పించే సన్నివేశాలూ... ఇవన్నీ ఎప్పుడు గుర్తొచ్చినా నవ్వాగదు. కోట నట జీవితాన్ని మలుపు తిప్పిన సినిమా అంటే మాత్రం ఉషాకిరణ్ మూవీస్ నిర్మాణంలో, టి.కృష్ణ దర్శకత్వం వహించిన 'ప్రతిఘటన'. ఇందులో మినిస్టర్ కాశయ్య పాత్రలో 'హలో తమ్మీ... నేను మినిస్టర్ కాశయ్యను మాట్లాడతాండ' అంటూ తెలంగాణ యాసతో పాత్రని రక్తికట్టించారు కోట. ఆ సినిమానే ఆయనకి 'అహనా పెళ్లంట' సహా ఎన్నో సినిమాల్లో అవకాశాల్ని తెచ్చిపెట్టింది. అయితే నిజానికి ఈ పాత్ర కోట శ్రీనివాసరావును దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేసినది కాదు. ఈ పాత్రకు తొలుత అనుకున్నది రావు గోపాలరావునట.

'గణేష్'తో భయపెట్టి...

ఈమధ్య కోట శ్రీనివాసరావు ఎక్కువగా కామెడీ విలన్ పాత్రల్లో కనిపించారు కానీ... ఆయన తొలినాళ్లలో క్రూరమైన పాత్రలకి కేరాఫ్‌గా నిలిచి భయపెట్టారు. 'శత్రువు', 'గణేష్', 'రెండిళ్ల పూజారి' తదితర చిత్రాల్లోని పాత్రలే అందుకు సాక్ష్యం. థ్యాంక్స్... అనే ఊతపదం ఎక్కువగా చెబుతూ 'శత్రువు' సినిమాలో కోట పోషించిన విలన్ పాత్ర, 'రెండిళ్ళ పూజారి' సినిమాలో మెలికలు తిరుగుతూ క్రూరంగా ప్రవర్తించడం, డబ్బు కోసం దుర్మార్గాలకి పాల్పడే ఆ పాత్రలో అసలు సిసలు విలనిజం కనిపిస్తుంది. ప్రజల రక్తాన్ని జలగలా పీల్చే ఆరోగ్య మంత్రి సాంబశివుడిగా కోట విలనిజం పతాక స్థాయిలో పండిందంటే 'గణేష్' సినిమాలో. వెంకటేష్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో కోట కనిపించే తీరే భయపెడుతుంది. 'తమ్మీ... ఇన్నేటుగా పాయింట్‌కి వస్తున్న నీ ఇన్ఫర్మేషన్ మొత్తం కరెక్టే. మరి నాకైతే చార్మినార్‌కు న్నంత హిస్టరున్నది' అంటూ హీరోకి వార్నింగ్ ఇచ్చే సన్నివేశం మొదలుకొని ఇందులో ప్రతి సంభాషణతో కట్టిపడేశారు కోట. 'గాయం' సినిమాలో గురు నారాయణగా మరోసారి తెలంగాణ యాసలో మాట్లాడుతూ అదరగొట్టారు కోట. 'శివ', 'ఆమె', 'రేడీ', 'అత్తారింటికి దారేది' సినిమాల్లో రాయలసీమ యాస మాట్లాడుతూ విలనిజం పండించారు. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర, గోదావరి... ఇలా ప్రతి యాస అలవోకగా, పక్కా ప్రామాణికంగా పలికి పాత్రలకి జీవం పోశారు కోట. తెలుగు భాష అన్నా, తెలుగుదనం అన్నా ఆయనకి ఎంతో ఇష్టం.

ఎన్టీఆర్‌తో చేజారిన అవకాశం..

తెలుగు చిత్రసీమలో ఎంతో మంది అగ్రతారలతో కలిసి పని చేసిన కోట శ్రీనివాసరావు.. ప్రముఖ నటుడు ఎన్టీఆర్‌తో ఒక్కసారి కూడా కలిసి నటించలేకపోయారు. అది తన దురదృష్టమని ఎన్నో సందర్భాల్లో వాపోయారు కోట. ఎన్టీఆర్ చివరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్'లో నటించే అవకాశం వచ్చినప్పటికీ అనివార్య కారణాల వల్ల అది చేజారిపోయినట్లు ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.



'ప్రతిఘటన'



'హలో బ్రదర్'



'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు'



'గణేష్'



'మనీ'



'సర్కార్'లో అమితాబ్ బచ్చన్‌తో కోట



'లిటిల్ సోల్జర్స్'



'శత్రువు'

నవ్విస్తూనే.. గుండె బరువెక్కించి...

ఈ ఫోన్ ఎవడు కనిపెట్టాడ్రా బాబూ... (శత్రువు), గద్దైతే నేను ఖండిస్తున్న... (గాయం), నగర పౌరుల శాంతి భద్రతలే నాకు ముఖ్యం... (యమలీల), 'ఆ చెబుతారేటి?'... ఇలా కోట నోటి నుంచి వచ్చిన ఎన్నో సంభాషణలు, ఊతపదాలు ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. సాధారణమైన మాటని కూడా తనదైన విరుపుతో చెప్పడం కోట శైలి. తాను దరించే ప్రతి పాత్రకీ ఓ మేనరిజం ఉండేలా ఆయన చూసుకునేవారు. అదే ఆయన నటనకు విలక్షణతని తెచ్చిపెట్టింది. నవ్విస్తూనే గుండె బరువెక్కించిన నటుడు కోట. 'హలో బ్రదర్' సినిమాలో తాడి మట్టయ్య పాత్రలో సినిమా అంతా నవ్వించి, చివర్లో కంటతడి పెట్టిస్తారు. 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు' సినిమాలో తన వంశం పెరగాలని తాపత్రయపడే తండ్రిగా, మనవడితో కలిసి అల్లరి చేసే తాతగా నవ్వించారు. 'బొమ్మరిల్లు'లో కథానాయికకి తండ్రిగా, 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' సినిమాలో కథానాయకుడి తండ్రిగా మధ్యతరగతి జీవితాలకు అద్దం పట్టేలా గొప్ప నటనని ప్రదర్శించారు. 'గబ్బర్‌సింగ్' సినిమాలో కథానాయిక శ్రుతిహాసన్‌కు తండ్రిగా నటించారు. మందు బాబులం... అంటూ ఇందులో పాటని స్వయంగా ఆలపించారు కోట శ్రీనివాసరావు. 'మనీ', 'మనీ మనీ' సినిమాల్లోనూ వచ్చీరాని ఆంగ్లం మాట్లాడుతూ హాస్యం పండించారు కోట. భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ... అంటూ 'మనీ' సినిమాలో ఆడిపాడారు కోట. 'పెళ్లయిన కొత్తలో' సినిమాలో సంసారాల మెకానిక్‌గా కనిపించిన కోట.. అందులోనూ ఓ పాటకి అభినయించారు. జంధ్యాల, రామ్‌గోపాల్ వర్మ, ఎస్వీ కృష్ణారెడ్డి, ఇ.వి.వి.సత్యనారాయణ, త్రివిక్రమ్, శ్రీనువైట్ల తదితర దర్శకుల సినిమాల్లో కోట శ్రీనివాసరావు బలమైన పాత్రల్ని పోషించారు. 'సీరియస్ విలన్, కామెడీ విలన్ పాత్రల్ని పోషిస్తున్న నాకు విభిన్న క్యారెక్టర్లు చేసే అవకాశం ఇచ్చింది ఈవీవీ' అని చెప్పేవారు కోట. ఈ కలయికలో 'హలో బ్రదర్', 'ఆమె' మొదలుకొని 'ఏవండీ ఆవిడ వచ్చింది', 'అబ్బాయిగారు', 'ఆయనకిద్దరు', 'మానాన్నకు పెళ్లి', 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'.. ఇలా చాలానే ఉన్నాయి.

జీవితంలో కోల్పోయినవి ఆ రెండే!

సినిమాలతో బిజీగా ఉండటం వల్ల తన వ్యక్తిగత జీవితంలో రెండు విలువైన వాటిని కోల్పోయాననేవారు కోట శ్రీనివాసరావు. వరుస చిత్రాలతో తీరిక లేకుండా గడపడం వల్ల తన పిల్లల బాల్యాన్ని ఆస్వాదించలేకపోయానని.. వాళ్ల అచ్చటా ముచ్చటా తీర్చలేకపోయానని.. కనీసం వాళ్ల పుట్టినరోజులు, తన పెళ్లి రోజులు కూడా పట్టేవి కావని చెప్పారు. దీనికి తోడు రాత్రిపగలు చిత్రీకరణల్లోనే ఉండటం వల్ల జనరల్ నాలెడ్జ్ లేకుండా పోయిందని.. ప్రపంచంలో ఏం జరుగుతుందో పట్టించుకోలేదని.. ఈ రెండింటి గురించి తలచుకుని తాను అప్పుడప్పుడు ఏడుస్తుంటానని ఓ సందర్భంలో పంచుకున్నారు. ఎవరికైనా టైమ్ వస్తే టైమ్ ఉండదని తనకు బోధపడిందన్నారు. ఇక వీటన్నింటినీ మించి కొడుకు మరణం తనని ఇంకా పెద్ద దెబ్బ కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తన నక్షత్రం పేరుతోనే తొలిపాత్ర..

వెండితెరపై వందల కొద్దీ విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించిన కోట శ్రీనివాసరావు.. తొలిసారి ముఖానికి రంగేసుకుంది 'ఆడది' అనే నాటకంతోనే. పినిశెట్టి శ్రీరామూర్తి దాన్ని రచించారు. అందులో కోట శతభిషం అనే పాత్ర వేశారు. గమ్మత్తేంటంటే ఆయన నక్షత్రం కూడా శతభిషమే. అలా తన నక్షత్రం పేరుతో ఉన్న పాత్రతోనే రంగస్థలంపైకి అడుగుపెట్టారు కోట శ్రీనివాసరావు. ఇక ఇందులో ఉన్న మరో విశేషం ఏంటంటే ఈ నాటకం పేరు 'ఆడది' అయినా దీంట్లో ఒక్క స్త్రీ పాత్ర కూడా కనిపించదు.

ఎవర్‌గ్రీన్ కలయిక



'మామగారు'లో కోటతో బాబూ మోహన్

సినిమా రంగంలో కొన్ని కలయికలకు ఉండే క్రేజే వేరు. అలాంటి కలయికే కోట శ్రీనివాసరావు - బాబూ మోహన్‌లది. వీళ్లు ఇద్దరూ కలిసి తెరపై కనిపించారంటే ఆ సినిమా హిట్టే అని నమ్మేంతగా ఈ కలయిక ప్రభావం చూపించింది. 'బొబ్బిలిరాజా', 'మామగారు' నుంచి ఈ జోడీ విజృంభించింది. 'మామగారు'లో పోతురాజుగా కోట శ్రీనివాసరావు నటన, ఆహార్యం, ఆయన పక్కనే కనిపిస్తూ బాబూమోహన్ ప్రదర్శించిన టైమింగ్ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించింది. 'చినరాయుడు', 'ఏవండీ ఆవిడ వచ్చింది', 'రాజేంద్రుడు గజేంద్రుడు', 'నెంబర్ వన్', 'జంబలకిడి పంబ' ఇలా 100కి పైగా సినిమాల్లో ఈ జోడీ కనిపించి నవ్వించింది. తెరపైన కలిసి కనిపించినట్టే, నిజ జీవితంలోనూ కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఆయనకు అన్నదమ్ములున్నా, నన్నొక సొంత తమ్ముడిలా భావించేవారంటూ కోటతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు బాబూమోహన్. "సినిమాల్లోనే కాదు, బయట కూడా సరదాగా ఉండేవాళ్లం. రెండు రోజుల కిందటే మాట్లాడుకున్నాం. ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి నా కోటన్న వెళ్లిపోయారు. షూటింగ్ సమయం తక్కువగా ఉన్నప్పుడు ఆయనే అన్నం కలిపి పెట్టేవాడు" అంటూ కోటకు నివాళులర్పించిన అనంతరం కన్నీటిపర్యంత మయ్యారు బాబూమోహన్.

బాధించిన 'పంజరం'..

తన సినీ ప్రయాణంలో 'ప్రతిఘటన', 'అహనా పెళ్లంట', 'శత్రువు', 'మనీ', 'మనీ మనీ', 'గాయం', 'హలో బ్రదర్', 'గణేశ్', 'ఇడియట్' ఇలా ఎన్నో సంతృప్తినిచ్చిన చిత్రాలున్నా.. బాగా బాధపెట్టిన సినిమా ఒకే ఒకటి ఉందనేవారు కోట. అదే కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన 'పంజరం'. అందులో ఓ యువ హీరోయిన్ను పెళ్లి చేసుకుని.. ఆమెను అనుమానంతో పీడించే భర్త పాత్ర పోషించారు కోట. 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నా.. ఆ పాత్రపై ఇష్టంతో ఎంతో కష్టపడి దాన్ని చేశారట. కానీ, ఆ సినిమాకు ఫ్లాప్ టాక్ రావడంతో దాన్ని ఎవరూ చూడలేదని.. ఇలా ప్రాణం పెట్టి చేసిన సినిమా ఆడనందుకు ఎంతో బాధగా అనిపించిందని కోట శ్రీనివాసరావు ఓ సందర్భంలో చెప్పారు.

స్థానికులకు అవకాశాలు ఇవ్వాలని...

వివాదాలకి దూరంగా ఉండే కోట శ్రీనివాసరావు... తన మనసులోని అభిప్రాయాన్ని మాత్రం నిక్కచ్చిగా బయట పెట్టేవారు. తెలుగువారిని కాదని, పరభాషా నటులు, సాంకేతిక నిపుణులకి అవకాశాలు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టేవారు. "నేనూ పరభాషా చిత్రాల్లో చేసినవాణ్నే. కానీ అక్కడ మనకి ద్వితీయ స్థాయిలోనే ప్రాధాన్యం ఉంటుంది. ఏ భాషలోకి వెళ్లినా స్థానికులకే పెద్దపీట. కానీ మన దగ్గర పరభాషా నటులకు, సాంకేతిక నిపుణులకి ఫైవ్‌స్టార్ వసతులు కల్పిస్తారు. తెలుగు పలకడం కూడా చేతకాని వాళ్లకు అవకాశాలు ఎందుకు ఇస్తారు?' అంటూ ప్రశ్నించేవారు. కోట శ్రీనివాసరావు తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లోనూ నటించారు. 90, 2000 దశకంలో తమిళ నటుడు గౌండ్రమణి, మనివణ్ణన్ తదితర నటులు పోషించిన పాత్రలకి కోట డబ్బింగ్ చెప్పి, ఆ పాత్రల్ని తెలుగు ప్రేక్షకులు సొంతం చేసుకునేలా ప్రభావం చూపించారు.

వివాదాల 'మండలాధీశుడు'..

కోట శ్రీనివాసరావు తన సినీ జీవితంలో 'మండలాధీశుడు' చిత్రంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాను ఈ సినిమా చేయడానికి వెనకున్న కారణాల్ని.. అది విడుదలయ్యాక ఎదుర్కొన్న ఇబ్బందుల్ని ఓ సందర్భంలో పంచుకున్నారు. "మండలాధీశుడు'లో నాది ఎన్టీఆర్‌ను పోలిన పాత్రది. మొదట్లో ఆ పాత్ర చేయకూడదనుకున్నా.. బతికున్న వ్యక్తి పాత్రను పోషించే అవకాశం కదా సక్సెస్ అయితే బాగానే ఉంటుందని ఒప్పుకున్నా. నిజానికి ఆ సినిమా చూస్తే ఎన్టీఆర్‌ను ఎక్కడా విమర్శించే విధంగా ఉండదు. కానీ, ఆ సినిమా విడుదలయ్యాక ఏడాది పాటు ఎంతో ఇబ్బంది పడ్డా. ఓ రోజు 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' డబ్బింగ్ కోసం ఎన్టీఆర్ చెన్నైకి వచ్చినప్పుడు వెళ్లి ఆయన్ని కలిశా. 'నువ్వు గొప్ప నటుడువని విన్నాను బ్రదర్. నువ్వు మరెన్నో గొప్ప పాత్రలు పోషించాలి' అని ఆశీర్వదించారు. ఆ మాటలకు వెంటనే తన కాళ్లపై పడిపోయా. ఆ తర్వాత కొన్నాళ్లకు బాలకృష్ణతో 'రౌడీ ఇన్‌స్పెక్టర్'లో చేసే అవకాశం వచ్చింది. దీంతో 'మండలాధీశుడు' వల్ల ఏర్పడ్డ సమస్య సమసిపోయింది" అని కోట గతాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈనాడు సినిమా



అనుపమ

చివరికి గెలిచేది సత్యమే!

ఈ ఏడాది వరుస సినిమాలతో అలరించడానికి ముస్తాబవుతోంది అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అనే చిత్రంలో నటించింది. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించారు. సురేశ్ గోపీ కీలక పాత్ర పోషించారు. జూన్‌లో థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా పేరును మార్చాలంటూ సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సెన్సార్ పనుల్ని పూర్తి చేసుకున్న ఈ సినిమా పేరును 'జానకి వీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అని మార్చినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా కొత్త విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. "ప్రతి ఆలస్యం వెనుక.. ఒక విలువైన నిజం ఉంటుంది. అయినా చివరికి సత్యమే గెలుస్తుంది. ఈ నెల 17న సిద్ధంగా ఉండండ"నే వ్యాఖ్యను జోడించింది.


'జూనియర్'.. కొత్త అనుభూతిని అందిస్తుంది



జెనీలియా, శ్రీలీల, రవిచంద్రన్, కిరీటి, శివ రాజ్‌కుమార్

"విజువల్‌గా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే చిత్రం 'జూనియర్'" అన్నారు కిరీటి. ఆయన హీరోగా పరిచయమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాని రాధాకృష్ణ తెరకెక్కించారు. రజని కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానున్న నేపథ్యంలో ఆదివారం బెంగళూరులో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. శివ రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్ర టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ చూశాను. కిరీటి అద్భుతంగా డ్యాన్స్ చేశాడు. నటన కూడా అద్భుతంగా ఉంది. దర్శకుడు దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఇది చాలా పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ సందర్భంగా ఆయన కిరీటి, శ్రీలీలతో కలిసి "వైరల్ వయ్యారి" పాటకు స్టెప్పులేసి అలరించారు. ఈ కార్యక్రమంలో గాలి జనార్దన్ రెడ్డి, జెనీలియా, రవిచంద్రన్, సాయి కొర్రపాటి, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓనమ్‌కి హృదయపూర్వం



సంగీత్, మోహన్‌లాల్

ఇటీవలే 'తుడరుమ్' సినిమాతో ఓ సాధారణ టాక్సీ డ్రైవర్‌గా కనిపించి ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకున్నారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. ఇప్పుడాయన 'హృదయపూర్వం' చిత్రంతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో సత్యన్ అంతికాడ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. మాళవిక మోహనన్, సంగీత్ ప్రతాప్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఓనమ్ పండగ సందర్భంగా ఆగస్టు 28న రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మోహన్‌లాల్.

సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయింది



కోట శ్రీనివాసరావు మరణం చిత్రసీమని విషాదంలోకి నెట్టేసింది. సినీ పరిశ్రమ ఓ గొప్ప నటుణ్ని కోల్పోయిందంటూ పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం ప్రకటించారు.

"నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో తనదైన విలక్షణ నటనతో ఎన్నో విలక్షణమైన పాత్రలకు జీవం పోశారు కోట శ్రీనివాసరావు. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇతర భాషల్లోనూ నటించి, మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు". - నందమూరి బాలకృష్ణ

❑ "కోట శ్రీనివాసరావు మరణవార్త నన్నెంతో కలచివేసింది. నటనలో నిష్ణాతుడు, పోషించిన ప్రతి పాత్రకు ప్రాణం పోసిన లెజెండ్. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి". - రాజమౌళి

❑ "ఎస్వీ రంగారావు తర్వాత అంతటి మహానటుడు కోట శ్రీనివాసరావు. అంత గొప్ప నటుడ్ని తెర వెనుక చూసే అవకాశం నాకు కలిగింది. చాలాసార్లు ఆయనతో కలిసి పని చేసే అవకాశం నాకు కలిగింది. ఆయన మృతితో తెలుగు సినిమా క్యారెక్టర్ నటుల్లో ఓ చరిత్ర ముగిసిపోయింది". - త్రివిక్రమ్

❑ "ఆప్యాయత, హాస్యం.. అన్నింటి కంటే ముఖ్యంగా భర్తీ చేయలేని ప్రతిభ కోట శ్రీనివాసరావు సొంతం. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి". - నాగార్జున

❑ "కోట శ్రీనివాసరావు ఒక లెజెండ్. ఆయన ప్రతి పాత్రకు గొప్పదనాన్ని తెచ్చారు. సినీ చరిత్రలో ఒక చిరకాల వారసత్వాన్ని మిగిల్చారు. తెరపైనా.. బయటా మేము పంచుకున్న క్షణాలన్నీ నాకెప్పటికీ ప్రత్యేకమే. నా తొలి సినిమా నుంచి ఆయనతో నాకు అనుబంధం ఉంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలి". - వెంకటేష్

❑ "ప్రియమైన కోట.. మిమ్మల్ని ఇకపై మేము చాలా మిస్ అవుతాము. మీ ప్రతిభ, ఉనికి, మంచి మనసును ఎప్పటికీ మర్చిపోలేము. మాటల్లో చెప్పలేనంత బాధ కలుగుతోంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి శక్తిని ప్రసాదించాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా". - మంచు మోహన్‌బాబు

❑ "అహ నా పెళ్లంట' నుంచి కోట శ్రీనివాసరావుతో అనుబంధం ఏర్పడింది. 'ఆ నలుగురు', 'రాజేంద్రుడు గజేంద్రుడు', 'మాయలోడు'.. ఇలా చెబుతూ వెళ్తే నా సూపర్ హిట్స్ అన్నింటిలో ఆయన నటించారు. వారం క్రితమే ఆయనతో మాట్లాడాను. ఇంటికి రమ్మని ఆహ్వానించారు. ఇంతలోనే ఇలా జరిగింది. తెలుగు సినిమాలో ఆయనకున్న ప్రాముఖ్యత అజరామరం. ఇప్పుడాయన మన మధ్య లేరంటే ఎంతో బాధగా ఉంది". - రాజేంద్ర ప్రసాద్

❑ "కోట శ్రీనివాసరావు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు. తను నటరాజపుత్రులు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు మేము కలిసి పని చేశాం". - బ్రహ్మానందం

❑ "ఈరోజు సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయింది. ఆయనతో నాకు వ్యక్తిగతంగా దశాబ్దాలకు పైగా పరిచయం ఉంది. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా సినీ శిఖరంగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన వేసిన ప్రతి వేషం సంపూర్ణ నటుడిగా తనకు గుర్తింపు తెచ్చి పెట్టింది". - తనికెళ్ల భరణి

❑ కోట మృతిపై సినీ ప్రముఖులు మహేశ్ బాబు, రామ్‌చరణ్, ఎన్టీఆర్, రామ్‌గోపాల్ వర్మ, రవితేజ, నందమూరి కల్యాణ్‌రామ్, మంచు విష్ణు, ఆర్.నారాయణమూర్తి, ప్రకాశ్ రాజ్, అనిల్ రావిపూడి, రామ్, కొరటాల శివ, సురేశ్‌బాబు, అల్లు అరవింద్ తదితరులు సంతాపం ప్రకటించారు.

మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు మరో 1.5% వరకు పెరుగుతాయ్!



దిల్లీ: కార్ల ధరలను సెప్టెంబరు నుంచి 1 - 1.5% పెంచాలని మెర్సిడెస్ బెంజ్ ఇండియా యోచిస్తోంది. యూరోతో పోలిస్తే, రూపాయి విలువ తగ్గడం వల్ల కంపెనీపై పడుతున్న భారాన్ని తగ్గించుకునేందుకే ఇలా చేస్తున్నామని కంపెనీ ఎండీ సంతోష్ తెలిపారు. ఈ ఏడాదిలో జనవరి, జులై నెలల్లోనూ వాహనాల ధరలను ఈ కంపెనీ పెంచింది. యూరో విలువ రూ.100కు చేరి, నెలరోజులుగా తగ్గనందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంతోష్ వివరించారు. కంపెనీ విక్రయాల్లో 80% రుణంపైనే ఉంటాయని, వడ్డీరేట్ల ఫలితంగా ఈఎంఐ భారం తగ్గినందున.. కార్ల ధరలు కాస్త పెరిగినా వినియోగదార్లు భరిస్తున్నారని తెలిపారు. దేశీయంగా కార్ల అమ్మకాలు 2-3 శాతమే వృద్ధి చెందుతుంటే, విలాసకార్ల విక్రయాల్లో 5 -6% వృద్ధి లభిస్తోందని గుర్తు చేశారు.



పసిడి ధరలు తగ్గొచ్చు: డబ్ల్యూజీసీ



దిల్లీ: భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు చల్లబడితే కనుక, మధ్య కాలానికి బంగారం ధరలు కాస్త దిగివచ్చే అవకాశం ఉందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేస్తోంది. అమెరికా డాలర్ బలోపేతం అయినా, ట్రెజరీ రాబడులు పెరిగినా కూడా పసిడి ధరలపై ప్రతికూల ప్రభావం తప్పదని వివరించింది. కేంద్రబ్యాంకుల కొనుగోళ్లు నిదానించడం, వ్యక్తిగత కొనుగోళ్లు తగ్గడమూ బంగారం ధరలు దిగి వచ్చేందుకు కారణమవుతాయని పేర్కొంది. ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారానికి 2022 నవంబరు నాటి కనిష్ఠ ధర 1429 డాలర్లు కాగా, ప్రస్తుతం అంతకు రెట్టింపునకు మించి 3300 డాలర్లకు చేరడాన్ని ప్రస్తావించింది. అంటే ఏడాదికి 30% చొప్పున ప్రతిఫలం లభించిందని తెలిపింది. ఈ సమయంలో కేంద్రీయ బ్యాంకులు పసిడి నిల్వలు పెంచుకోవడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిపోవడానికి తోడు అమెరికా టారిఫ్‌ల వల్ల వాణిజ్యానికి అవరోధాలు ఏర్పడతాయనే భయాలు.. సురక్షితమని భావించే బంగారంలోకి పెట్టుబడుల ప్రవాహానికి కారణమయ్యాయి. ఇప్పుడిప్పుడే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు వాణిజ్య ఒప్పందాలు కూడా కొలిక్కి వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నందున.. పసిడిపైకి పెట్టుబడులు తగ్గొచ్చని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది. దీర్ఘకాలంలో పసిడి ధరలు దిగిరావాలంటే మరిన్ని సంస్థాగత మార్పులు అవసరమని.. అయితే విపరీతంగా పెరిగిన ధరల నేపథ్యంలో, గిరాకీ రూపంలో మధ్యకాలానికి ధరలు దిగిరావచ్చని విశ్లేషించింది.

రూ.20,000 కోట్ల సంస్థగా మారికో

వచ్చే 5 ఏళ్లలో రెట్టింపు ఆదాయమే లక్ష్యం



దిల్లీ: 2030కి రూ.20,000 కోట్ల సంస్థగా ఎదగడమే లక్ష్యమని ఎఫ్ఎంసీజీ కంపెనీ మారికో ఛైర్మన్ హర్ష్ మారివాలా తెలిపారు. వచ్చే అయిదేళ్లలో ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సఫోలా, ప్యారాచూట్, లివాన్ వంటి ప్రముఖ బ్రాండ్లపై ఉత్పత్తులను విక్రయించే ఈ కంపెనీ.. 2024-25లో రూ.10,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. మారికో బ్రాండ్లు, నూతనఆవిష్కరణల బలమే ఈ మైలురాయిని సాధించడానికి కారణమని, కంపెనీ వృద్ధిలో ఇవి కీలక పాత్ర పోషించాయని మారివాలా అన్నారు. తదుపరి దశ వృద్ధి కోసం కంపెనీ సిద్ధమవుతోందని, వచ్చే అయిదేళ్లలో రెట్టింపు ఆదాయంపై గురిపెట్టామన్నారు. ఆవిష్కరణలు, బ్రాండ్ నిర్మాణం, నిర్వహణ ప్రతిభ ద్వారా ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

● వంట నూనెలు, కేశ సంరక్షణ ఉత్పత్తుల్లో ప్రాచుర్యం పొందిన మారికో.. అనంతరం ఇతర విభాగాలకు వేగంగా విస్తరించింది. వినియోగదారు ఆధారిత ఉత్పత్తులను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కంపెనీ ఎండీ, సీఈఓ సౌగతా గుప్తా తెలిపారు. లాభదాయకత కలిగిన వర్ధమాన వ్యాపారాలను విస్తరిస్తున్నామని, తద్వారా ఆదాయాలు, లాభాల్లో పురోగతి సాధించామని వివరించారు.

ఎన్ఎల్‌సీ ఇండియా రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్: ప్రభుత్వ రంగ గనుల సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా, 2030 నాటికి రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత సామర్థ్యాలను 6.7 గిగావాట్ నుంచి 20 గిగావాట్‌కు విస్తరించనున్నామని కంపెనీ ఛైర్మన్, ఎండీ (సీఎండీ) ప్రసన్న కుమార్ మోటుపల్లి తెలిపారు. ప్రతిపాదిత రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడుల్లో.. దాదాపు రూ.65,000 కోట్లను పునరుత్పాదకాలు, ఇతర హరిత కార్యక్రమాలపై కంపెనీ వెచ్చించనుంది. థర్మల్ విద్యుత్తు కోసం రూ.45,000 కోట్లు, మైనింగ్ కోసం దాదాపు రూ.15,000 కోట్లు ఖర్చుచేయనుంది. పునరుత్పాదకాలపై పెట్టనున్న మొత్తంలో రూ.15,000 కోట్లను బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థపై వెచ్చిస్తారు. సామర్థ్యాల విస్తరణపై దృష్టి పెట్టామని, సంప్రదాయ సామర్థ్యాలతో పాటు పునరుత్పాదక సామర్థ్యాలను పెంచుతామని కుమార్ అన్నారు. ఈ భారీ పెట్టుబడులను అంతర్గత నిల్వలు, దేశీయ రుణాలు, తొలి పబ్లిక్ ఆఫర్లు (ఐపీఓలు), విదేశీ వాణిజ్య రుణాల (ఈసీబీలు) ద్వారా ఎన్ఎల్‌సీ ఇండియా సమీకరించనుంది.

● విదేశాల్లో కన్సల్టింగ్ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఎన్ఎల్‌సీ చూస్తోంది. ముందుగా శ్రీలంక, భూటాన్, నేపాల్, మయన్మార్, ఆఫ్రికా, పశ్చిమాసియాల్లో ఈ వ్యాపారాన్ని ఏర్పాటు చేయనుంది. వనాడియం, కోబాల్ట్, లిథియం, కాపర్ సహా బ్యాటరీ ఖనిజాల ఆస్తులను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతోంది.

● ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో రెండు అరుదైన ఖనిజ క్షేత్రాలను ఎన్ఎల్‌సీ దక్కించుకుంది. ఈ అనుభవంతో విదేశాల్లో కూడా అరుదైన ఖనిజాల మైనింగ్‌కు అవకాశాలను కంపెనీ అన్వేషిస్తోంది. మాలిలో కొన్ని లిథియం గనులను, కాంగోలో కొన్ని రాగి, కోబాల్ట్ గనులను పరిశీలించామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను చూస్తున్నట్లు ప్రసన్న కుమార్ వెల్లడించారు.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అనుబంధ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యువబుల్స్ లిమిటెడ్ (ఎన్ఐఆర్ఎల్)ను ఐపీఓకు తెచ్చేందుకు ఎన్ఎల్‌సీ సన్నాహాలు చేస్తోంది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను హరిత ఇంధన ప్రాజెక్టుల కోసం వినియోగించనుంది. ఎన్ఐఆర్ఎల్‌లో రూ.3,720 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ఎన్ఎల్‌సీకి ఇప్పటికే సూత్రప్రాయ అనుమతి లభించింది.

సిప్లా.. ఊబకాయ ఔషధాలు

దిల్లీ: ఊబకాయం (ఒబెసిటీ) చికిత్సలో వినియోగించే ఔషధాలను తయారు చేయనున్నట్లు సిప్లా మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ సీఈఓ ఉమాంగ్ ఓహ్రా తెలిపారు. కేంద్రీయ నాడీ వ్యవస్థ థెరాప్యూటిక్ ఔషధాల్లోనూ తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటామని చెప్పారు. ఆయా వ్యాధులకు విభిన్న చికిత్సలను ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామనీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఊబకాయం చికిత్సకు పెరుగుతున్న గిరాకీని గుర్తించామని, ఈ విభాగంలో సమగ్ర చికిత్సకు అవసరమైన ఔషధాలను విడుదల చేయడమే లక్ష్యమని వివరించారు. డెన్మార్క్‌కు చెందిన నోవా నార్డిస్క్, బహుళజాతి ఫార్మా కంపెనీ ఎలీ లిల్లీతో పాటు పలు దేశీయ బ్రాండ్లు కూడా ఊబకాయ మందులను విడుదల చేస్తున్న సంగతి విదితమే.

రెండేళ్లలో రూ.2 లక్షల కోట్లకు క్విక్ కామర్స్

2024-25లో రూ.64,000 కోట్ల ఆర్డర్లు: కేర్‌ఎడ్జ్ రేటింగ్స్



ముంబయి: బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.64,000 కోట్ల విలువైన ఉత్పత్తులను భారతీయులు కొనుగోలు చేశారని దేశీయ రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక తెలిపింది. 2023-24లో కొనుగోలు చేసిన రూ.30,000 కోట్ల వస్తువులతో పోలిస్తే, ఈ విలువ రెట్టింపునకు పైగా అధికం. 2027-28 నాటికి ఈ సంస్థలకు వచ్చే స్థూల ఆర్డర్ విలువ (జీఓవీ) ప్రస్తుతం కంటే 3 రెట్లకు పైగా పెరిగి రూ.2 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంటుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఆయా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు 2024-25లో ఫీజు రూపంలో రూ.10,500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయని తెలిపింది. 2021-22లో ఈ రూపంలో ఆర్జించిన ఫీజు రూ.450 కోట్లతో పోలిస్తే ఇది చాలా అధికం. 2027-28 నాటికి ఆదాయాలు రూ.34,500 కోట్లకు చేరొచ్చని నివేదిక పేర్కొంది.

● 'ప్రస్తుతం నిత్యావసర వస్తువుల గిరాకీలో 1% వరకే క్విక్ కామర్స్‌కు ఆర్డర్లు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సేవలు రెండో, మూడో అంచె పట్టణాల్లోనూ విస్తరించే అవకాశం ఉంది. అప్పుడు వినియోగదార్ల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సౌకర్యవంతమైన సేవలకు వినియోగదార్లు ఎప్పుడూ మొగ్గు చూపుతారని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అమీర్‌షేక్ వెల్లడించారు. 2024లో మన దేశంలో ఆన్‌లైన్ కొనుగోలుదార్ల సంఖ్య 27 కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఇ-రిటైల్ వినియోగదార్ల సంఖ్య మన దేశంలోనే ఉంది. గత ఏడాది ఇ-కామర్స్ విపణి 23.8% పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2025 ప్రారంభంలో మన దేశంలో మొబైల్ కనెక్షన్లు 112 కోట్లకు చేరాయి. స్మార్ట్‌ఫోన్లకు మారే వారి సంఖ్య వేగంగా పెరుగుతుండటం కూడా క్విక్ కామర్స్, ఇ-కామర్స్ విపణుల వృద్ధికి దోహదం చేస్తోంది.

●డార్క్ స్టోర్లు లేదా సూక్ష్మ గిడ్డంగులు కూడా 2024-25లో 70 శాతానికి పైగా పెరిగి 3,072కు చేరాయి. వీటి సగటు ఆదాయం 25% పెరిగింది.

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన.. బాధిత కుటుంబీకుల నుంచి బీమా క్లెయిమ్‌ల వెల్లువ



అహ్మదాబాద్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో బాధితులైన వారి కుటుంబీకుల నుంచి బీమా క్లెయిమ్‌లు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 12న లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం క్షణాల్లోనే కుప్పకూలడంతో 241 మంది ప్రయాణికులతో పాటు, విమానం కూలిన భవనం దగ్గర ఉన్న మరో 19 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రమాదవశాత్తు మరణం, బ్యాగేజీ నష్టం, హోటల్ బుకింగ్ - ప్రయాణాల రద్దు రూపంలో బీమా కంపెనీలకు పలు రకాల క్లెయిమ్‌లు వచ్చాయి. కిసాన్ క్రెడిట్ కార్డుదారులు సహా ప్రయాణ, వ్యక్తిగత ప్రమాద, జీవిత బీమా వంటి విభాగాల్లోనూ క్లెయిమ్‌లు వచ్చాయని కంపెనీలు చెబుతున్నాయి.

● 'ప్రయాణ బీమా, వ్యక్తిగత ప్రమాద బీమా కింద ఎక్కువ క్లెయిమ్‌లు వచ్చాయి. వీటిలో ప్రమాదవశాత్తు మరణం, ప్రయాణాల రద్దు, బ్యాగేజీ నష్టం, హోటల్ బుకింగ్స్ రద్దు వంటివి ఉన్నాయి. బాధితులకు సకాలంలో సెటిల్‌మెంట్ అందించేందుకు పనిచేస్తున్నాం. పాలసీదారులు, వారి కుటుంబాలకు ఈ కష్టకాలంలో అండగా ఉండటానికి కట్టుబడి ఉన్నాం' అని ఐసీఐసీఐ లాంబార్డ్ హెడ్ (హెల్త్ ప్రోడక్ట్స్, కార్యకలాపాలు, సేవలు) ప్రియా దేశ్‌ముఖ్ పేర్కొన్నారు.

● వ్యక్తిగత ప్రమాదం, వస్తువుల రవాణాకు సంబంధించిన క్లెయిమ్‌లను స్వీకరించినట్లు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. రోడ్డు, రైలు, వాయు, సముద్రం లేదా కొరియర్ ద్వారా రవాణా చేసే వస్తువులకు మెరైన్ కార్గో బీమా లభిస్తుంది.

● అయితే క్లెయిమ్‌ల సంఖ్యకు సంబంధించిన కచ్చితమైన వివరాలను ఎక్కువ శాతం బీమా సంస్థలు ఇవ్వడం లేదు. మృతుల కుటుంబీకుల నుంచి క్లెయిమ్‌లు వస్తుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నాయి.

● వ్యక్తిగత ప్రమాదానికి సంబంధించి ఏడు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్‌కు సంబంధించి 5 క్లెయిమ్‌లను సెటిల్ చేశామని న్యూ ఇండియా అస్యూరెన్స్ అధికారి వెల్లడించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కింద ఒకరు రూ.50,000 క్లెయిమ్ పొందారు.

● బాధిత కుటుంబాల నుంచి వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నామని బీమా కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. ఇప్పటికీ పలువురు బాధలోనే ఉన్నారని, ఏమైనా క్లెయిమ్‌లు ఉంటే వారిని సంప్రదిస్తామన్నారు. ఒక బాధితుడి క్లెయిమ్‌ను మూడు గంటల్లోనే పరిష్కరించామని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఓఓ మను లావణ్య పేర్కొన్నారు.

2013-14 తర్వాత ఐటీ రిఫండ్‌ల్లో 474% వృద్ధి



దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) రిఫండ్‌లు, గత 11 ఏళ్లలో 474% వృద్ధి చెంది 2024-25లో రూ.4.77 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో స్థూల పన్ను వసూళ్లు 274 శాతమే పెరిగాయి. ఐటీ రిఫండ్‌ల జారీకి పట్టే సమయం 2013లో 93 రోజులు కాగా, 2024 నాటికి 81% తగ్గి కేవలం 17 రోజులకు పరిమితమైంది. 2013-14లో ఐటీ విభాగం రూ.83,008 కోట్ల రిఫండ్‌లను జారీ చేసింది. 2024-25 వచ్చే సరికి ఐటీ రిఫండ్‌లు రూ.4.77 లక్షల కోట్లకు చేరాయి. స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 2013-14లో రూ.7.22 లక్షల కోట్లు కాగా, 2024-25లో 274% అధికమై రూ.27.03 లక్షల కోట్లకు పెరిగాయి. 2013లో 3.8 కోట్ల ఐటీ రిటర్న్‌లు దాఖలు కాగా.. 2024 కల్లా 133% వృద్ధితో 8.89 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. పన్ను వ్యవస్థ పనితీరు మెరుగైన కారణంగా పన్ను రిఫండ్‌లు పెరిగాయని, రిఫండ్‌ల జారీ సమయం గణనీయంగా తగ్గిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

నేటి బోర్డు సమావేశాలు: హెచ్‌సీఎల్ టెక్, ర్యాలీస్, టాటా టెక్నాలజీస్, తేజస్ నెట్‌వర్క్స్, నెల్కో, ఓలా ఎలక్ట్రిక్

కోడి గుడ్లు



14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510	గోదావరి	493
వరంగల్	512	విశాఖపట్నం	540
విజయవాడ	515	చిత్తూరు	583

పసిడి దిద్దుబాటు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.98,680 కంటే పైన కదలాడకుంటే.. .. లాభాల స్వీకరణ చోటుచేసుకుని, ధరల దిద్దుబాటుకు అవకాశం ఉంది. ఒకవేళ ఈ స్థాయికి ఎగువన చలిస్తే రూ.99,510- 99,988 వరకు రాణిస్తుందని భావించొచ్చు.

వెండి



వెండి ఆగస్టు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,15,191 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,17,272; రూ.1,21,433 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ కిందకు వస్తే రూ.1,08,949 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,04,788కు దిగిరావచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి జులై కాంట్రాక్టు రూ.891 కంటే పైన కదలాడకుంటే ప్రతికూల ధోరణికి ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయికి దిగువన షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మంచిది.

● సీసం జులై కాంట్రాక్టు దిద్దుబాటు అయినా, రూ.179.35 వద్ద మద్దతు పొందొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.178.65; రూ.177.45 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.181.25 కంటే పైన కదలాడితే రూ.182.45; రూ.183.15 వరకు పెరగొచ్చు.

● జింక్ జులై కాంట్రాక్టు రూ.255.60 కంటే కిందకు వస్తే, షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. లేదంటే లాంగ్ పొజిషన్లను కొనసాగించడం ఉత్తమం.

● అల్యూమినియం జులై కాంట్రాక్టును రూ.253.75 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిదే. అయితే రూ.254.15 వద్ద స్టాప్ లాస్‌ను పరిగణించాలి.


ఇంధన రంగం

● ముడి చమురు జులై కాంట్రాక్టు రూ.5,674 కంటే దిగువన ట్రేడయితే రూ.5,460; రూ.5,340 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.6,008 కంటే కిందకు రాకుంటే రూ.6,128; రూ.6,342 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.



● సహజవాయువు జులై కాంట్రాక్టును రూ.274 దిగువన షార్ట్ సెల్ చేయొచ్చు. ఈ కాంట్రాక్టుకు రూ.270.65 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.256.85; రూ.242.95 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.298.35 కంటే పైన కదలాడితే రూ.312.25; రూ.336.05 వరకు రాణించే వీలుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఆగస్టు కాంట్రాక్టు రూ.13,102 కంటే కిందకు వస్తే రూ.12,693; రూ.12,422 వరకు దిద్దుబాటు కావచ్చు. రూ.13,780 కంటే పైన కదలాడితే రూ.14,049; రూ.14,458 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

● పత్తి క్యాండీ జులై కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.56,766 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.57,583; రూ.58,516 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ కిందకు వస్తే రూ.55,016 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.54,083; రూ.53,066 వరకు దిగిరావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	96,485	97,830	1.39
వెండి (సెప్టెంబరు)	1,08,124	1,13,111	4.61
రాగి (జులై)	890.00	883.45	-0.74
సీసం (జులై)	181.45	180.00	-1.45
జింక్ (జులై)	255.95	258.60	1.04
అల్యూమినియం (జులై)	247.65	249.75	0.85
ముడి చమురు (జులై)	5,580	5,889	5.54
సహజ వాయువు (జులై)	286.00	284.50	-0.52
పసుపు (ఆగస్టు)	13,398	13,512	0.85
పత్తి క్యాండీ (జులై)	55,300	55,950	1.18

ఈ వారం ఒత్తిడిలోనే!

స్టాక్ మార్కెట్ ఈ వారం

● అమెరికాతో వాణిజ్య ఒప్పంద అంశాలు కీలకం ● కంపెనీల ఆర్థిక ఫలితాలపైనా దృష్టి

● ఐటీ, బ్యాంకింగ్, వాహన షేర్లకు ప్రతికూలతలు ● విశ్లేషకుల అంచనాలు



ప్రామాణిక సూచీలు ఈ వారం ఒత్తిడిలో కదలాడొచ్చు. టీసీఎస్ నిరుత్సాహక ఫలితాలతో సీజను మొదలు కావడం ఇందుకు నేపథ్యమని విశ్లేషకులు అంటున్నారు. అయితే అమెరికాతో వాణిజ్య చర్చల్లో సానుకూల పరిమాణం కనిపిస్తే, సూచీలు రాణించొచ్చనీ అంటున్నారు. సోమవారం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఫలితాలు కీలకం కానున్నాయి. సోమవారం (ఈనెల 14) విడుదలయ్యే ద్రవ్యోల్బణ గణాంకాలనూ గమనించాలి. నిఫ్టీ-50కి స్వల్పకాలంలో 25,000-24,800 పాయింట్ల వద్ద మద్దతు, 25,500-25,800 వద్ద నిరోధం కనిపించొచ్చన్నది సాంకేతిక నిపుణుల అంచనా. ఐటీతో పాటు, బ్యాంకింగ్, వాహన షేర్లలోనూ ఒత్తిడి ఉండొచ్చని ఓ బ్రోకరేజీ అంటోంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **టెలికాం** షేర్లు జూన్ త్రైమాసిక ఫలితాల ఆధారంగా కదలాడొచ్చు. టాటా కమ్యూనికేషన్స్ ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. గత వారం 5% నష్టపోయిన భారతీ ఎయిర్‌టెల్ ఈ వారం కాస్త పుంజుకోవచ్చు. వొడాఫోన్ ఐడియా రూ.7-8 మధ్య కదలాడొచ్చు.

● **ఎఫ్ఎంసీజీ** షేర్లకు 2-3 వారాల పాటు సానుకూలతలు కొనసాగొచ్చు. హిందుస్థాన్ యునిలీవర్, మారికో, నెస్లే వంటి షేర్లు నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ కంటే మిన్నగా రాణించొచ్చు. నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీకి ఈ వారం 54000 పాయింట్లు మద్దతుగా, 57200 కీలక నిరోధంగా ఉండొచ్చు.

● **ఐటీ** షేర్లు నష్టపోవచ్చు. అయితే ఫలితాల వల్ల భారీ దిద్దుబాటు ఏమీ ఉండకపోవచ్చు. హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, టాటా టెక్నాలజీస్ యాజమాన్యాల వ్యాఖ్యలు, భవిష్యత్తు అంచనాల నుంచి ఈ షేర్లు సంకేతాలు అందుకోవచ్చు.

● అమెరికా టారిఫ్‌లపై ఆందోళనలు కొనసాగుతుండడంతో, **లోహ** కంపెనీల షేర్లు ఒత్తిడికి గురికావొచ్చు. ఒప్పందం ఆలస్యమయ్యే కొద్దీ, ప్రతికూల నిర్ణయాలకు ఎక్కువ అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి.

● నిఫ్టీ **బ్యాంక్** సూచీ ఈ వారం నష్టపోవచ్చు. సాంకేతికంగా చూస్తే 56,600-56,300 పాయింట్ల వద్ద మద్దతు లభించి, అక్కడి నుంచి ఆల్‌టైం గరిష్ఠం దిశగా పయనించొచ్చు. ఒక వేళ 56,300 దిగువకు చేరితే వచ్చే 2-3 నెలల పాటు స్థిరీకరణకు గురికావొచ్చు.

● త్రైమాసిక ఫలితాల ముందు **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. ఈ రంగంలోని పాలీక్యాబ్ గురువారం ఫలితాలు వెల్లడించనుంది.

● **వాహన** షేర్లు సమీప భవిష్యత్తులో ఒత్తిడికి గురికావొచ్చు. రిటెయిల్ విక్రయాల వృద్ధిలో స్తబ్దత, బలహీన భవిష్యత్తు అంచనాలు ఇందుకు నేపథ్యం. హ్యుందాయ్ మోటార్ ఇండియాకు రూ.2,600 లక్షిత ధరతో, 'కొనుగోలు' రేటింగ్‌ను నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ ఇచ్చింది.

● ప్రభావం చూపే వార్తలు లేనందున **చమురు**-గ్యాస్ కంపెనీల షేర్లు సానుకూల ధోరణితో ఒక శ్రేణిలో చలించొచ్చు. లీటరుకు రూ.8 మించి రిటెయిల్ పంపు మార్జిన్లతో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ఫలితాల్లో రాణించొచ్చు.

● **సిమెంటు** కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. మెరుగైన ధర, ప్రభుత్వ మూలధన వ్యయాల పెంపు వల్ల, కంపెనీలు ఫలితాలు బాగుంటాయన్న అంచనాలున్నాయి. అల్ట్రాటెక్ సిమెంట్, జేకే సిమెంట్‌లను పరిశీలించొచ్చని ఓ బ్రోకరేజీ అంటోంది.

● నిఫ్టీ **ఫార్మా** సూచీ ఒక శ్రేణిలో చలించొచ్చు. జూన్ త్రైమాసిక ఫలితాలు, ఫార్మాపై అమెరికా టారిఫ్‌లను గమనించాలి. తగ్గినపుడల్లా కొనుగోలు చేసే వ్యూహాన్ని ఈ వారం అనుసరించొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	246.25	252.90	242.60
బజాజ్ ఆటో	8,067.00	8,392.00	7,883.00
ఐషర్ మోటార్స్	5,612.50	5,722.80	5,533.80
హీరో మోటోకార్ప్	4,218.70	4,399.60	4,099.60
ఎం అండ్ ఎం	3,073.20	3,199.30	2,999.30
మారుతీ	12,574.00	12,757.30	12,429.30
టాటా మోటార్స్	681.80	707.10	664.40
టీవీఎస్ మోటార్	2,754.50	2,859.20	2,693.60

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,758.50	5,980.80	5,605.80
కోల్గేట్ పామోలివ్	2,376.10	2,458.60	2,328.80
డాబర్ ఇండియా	530.85	545.80	511.20
ఇమామీ	587.00	612.20	569.90
హిందుస్థాన్ యునిలీవర్	2,519.60	2,572.50	2,434.50
ఐటీసీ	416.80	419.30	414.20
మారికో	725.65	740.20	715.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	258.70	263.60	254.50
సీజీ పవర్	667.75	682.70	659.00
ఎల్ అండ్ టీ	3540.60	3605.30	3503.10
సీమెన్స్	3117.70	3222.90	3052.50
థెర్మాక్స్	3465.00	3531.30	3374.30

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1124.80	1150.10	1102.50
బయోకాన్	374.20	379.80	369.40
సిప్లా	1485.00	1502.30	1461.30
డాక్టర్ రెడ్డీస్	1254.70	1280.00	1238.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	2181.10	2377.20	1996.40
లుపిన్	1894.70	1920.00	1862.40

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,983.70	2,013.70	1,965.90
ఐసీఐసీఐ బ్యాంక్	1,421.90	1,434.90	1,408.10
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	75.23	77.50	73.60
ఇండస్‌ఇండ్ బ్యాంక్	858.85	876.80	840.60
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2,220.60	2,241.10	2,188.30
పీఎన్‌బీ	110.21	112.40	107.50
ఎస్‌బీఐ	808.65	816.60	800.60

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	670.95	684.00	655.00
హిందుస్థాన్ జింక్	424.90	435.20	417.10
ఎన్ఎమ్‌డీసీ	69.05	71.40	67.70
సెయిల్	134.33	138.20	131.60
టాటా స్టీల్	159.84	162.60	158.00
వేదాంతా	442.75	451.60	432.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1495.20	1524.90	1475.50
బీపీసీఎల్	344.85	356.30	337.60
హెచ్‌పీసీఎల్	435.90	449.30	426.40
ఐఓసీఎల్	150.65	156.70	147.20
ఓఎన్‌జీసీ	241.76	244.20	239.60
ఆయిల్ ఇండియా	432.30	444.20	421.00

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1638.30	1666.80	1615.80
ఇన్ఫోసిస్	1594.90	1632.40	1544.20
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5578.50	5706.20	5496.20
టీసీఎస్	3266.00	3361.30	3213.50
టెక్ మహీంద్రా	1602.50	1625.00	1566.60
విప్రో	258.30	263.70	255.10

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,982.50	2,049.20	1,941.60
అంబుజా సిమెంట్స్	587.15	596.10	578.80
ఇండియా సిమెంట్స్	346.55	352.20	341.50
శ్రీ సిమెంట్	31,210.00	31,790.00	30,770.00
అల్ట్రాటెక్ సిమెంట్	12,495.00	12,713.00	12,343.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,921	1,976	1,886
ఎమ్‌టీఎన్ఎల్	48.59	49.70	47.80
టాటా కమ్యూనికేషన్స్	1,711.80	1,793.20	1,657.40
వొడాఫోన్ ఐడియా	7.17	7.40	7.00

నిర్ణయం సరైనదేనా?

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎస్సీ కేటగిరీలో 5542 ర్యాంకు వచ్చింది. ఇంటర్మీడియట్, లాంగ్‌టర్మ్ కోచింగులకు ఎక్కువ ఖర్చు కావడంతో బీటెక్‌లో చేరలేకపోతున్నాను. అమ్మానాన్నలు టీజీడీఈఈసెట్ రాయమంటున్నారు. ఇది సరైన నిర్ణయమేనా?

– జి.సింధూజ



■ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని జేఈఈ రాశారు కాబట్టి, మరో సంవత్సరం పాటు కోచింగ్ తీసుకొని సమయాన్ని వృథా చేయడం అనవసరం. మీ జీవితాశయం ఇంజినీర్ అవ్వడమా? ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడటమా? మరేదైనా ప్రభుత్వ ఉద్యోగం పొందడమా? ఈ ప్రశ్నలకు సరైన సమాధానంపై స్పష్టత తెచ్చుకోండి. మీ కెరియర్ లక్ష్యం ఇంజినీర్ అయితే, ముందుగా పాలిటెక్నిక్ కళాశాలలో చేరి, మూడేళ్ల డిప్లొమా తరువాత, మూడేళ్ల వ్యవధి గల బీటెక్ డిగ్రీ చేయండి. అలా కుదరకపోతే బీఎస్సీ, ఎమ్మెస్సీ చేసి, ఆ తరువాత ఎంటెక్ చేయండి. బీఎస్సీ తరువాత, ఎంసీఏ చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగప్రయత్నాలు చేయవచ్చు.

ఒకవేళ టీచర్‌గా స్థిరపడాలనుకొంటే అమ్మా నాన్నా చెప్పినట్లు టీజీడీఈఈసెట్ రాసి, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్లో రెండు సంవత్సరాల డిప్లొమా చేయండి. లేని పక్షంలో బీఎస్సీ, బీఈడీ చేయండి. అలా కూడా వీలవ్వకపోతే నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీఎడ్ పూర్తిచేసి ఉపాధ్యాయ ఉద్యోగ ప్రయత్నాలు చేయండి.

ఇంజినీర్, ఉపాధ్యాయుడు కాకుండా, ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం పొందాలనుకుంటే మీకు నచ్చిన సబ్జెక్టులో డిగ్రీ చేస్తూ, పోటీ పరీక్షల కోసం సన్నద్ధత ఇప్పటి నుంచే మొదలుపెట్టండి. చివరిగా కెరియర్ విషయాల్లో ఎంతమంది సలహాలు తీసుకున్నప్పటికీ ఏం చదవాలి అనే నిర్ణయం మాత్రం మీరే తీసుకోండి. మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుంటే ఆ రంగంలో రాణించే అవకాశాలు ఎక్కువ.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



కేంద్ర కొలువులకు సిద్ధమేనా?

▼ మల్టీ టాస్కింగ్ పోస్టులు
▼ తెలుగులోనూ నియామక పరీక్ష

పదో తరగతి విద్యార్హతతోనే కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో కొలువుదీరే అవకాశం వచ్చింది. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) నాన్ టెక్నికల్, హవల్దార్ పోస్టులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) ప్రకటన వెలువడింది. పరీక్షతో నియామకాలుంటాయి. తొలి నెల నుంచే సుమారు రూ.35,000 వేతనం అందుకోవచ్చు. తాజాగా ప్రకటించిన 1075 ఖాళీలూ హవల్దార్ విభాగంలోనివే. ఎంటీఎస్ పోస్టుల వివరాలు తర్వాత ప్రకటిస్తారు. ఈ విభాగంలో సుమారు 4000 ఖాళీలు భర్తీ చేయొచ్చు.

దాదాపు ఏటా వెలువడుతోన్న ఉద్యోగ ప్రకటనల్లో ఎస్ఎస్సీ ఎంటీఎస్ అండ్ హవల్దార్ ఒకటి. పరీక్షను తెలుగులోనూ రాసుకోవచ్చు. మల్టీ టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ రెండూ లెవెల్-1 ఉద్యోగాలే. వీరికి రూ.18వేల మూలవేతనం అందుతుంది. డీఏ, హెచ్ఆర్ఏ.. మొదలైనవాటితో తొలి నెల నుంచే సుమారు రూ.35,000 జీతం అందుకోవచ్చు. అనుభవం, శాఖాపరమైన పరీక్షల ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నాన్ టెక్నికల్ పోస్టుల్లో చేరినవారు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/కార్యాలయాలు అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ సంస్థల్లో విధులు నిర్వహిస్తారు. హవల్దార్‌గా ఎంపికైనవారు కేంద్ర రెవెన్యూ, ఆర్థిక మంత్రిత్వ శాఖలకు అనుబంధంగా పనిచేస్తారు. కేంద్రంలోని పరోక్ష పన్నుల విభాగాలు, నార్కోటిక్ బ్యూరోలో సేవలందిస్తారు.

పరీక్ష.. ఎంపిక

ఇందులో 2 సెషన్లు. 270 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ 3 చొప్పున 90 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో సెషన్ వ్యవధి 45 నిమిషాలు. సెషన్-1లో న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీలో 20, రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. వీటికి రుణాత్మక మార్కులు లేవు. సెషన్-2లో జనరల్ అవేర్‌నెస్‌లో 25, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి. ఈ సెషన్‌లో తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

పరీక్షలో అర్హత కోసం ప్రతి సెషన్‌లోనూ జనరల్ 30, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌లు 25, ఇతర విభాగాలవారు 20 శాతం మార్కులు పొందాలి. ఇలా అర్హత మార్కులు పొందినవారి జాబితా నుంచి సెషన్-2 మార్కుల మెరిట్‌తో, రిజర్వేషన్ల ప్రకారం ఎంటీఎస్ ఉద్యోగంలోకి తీసుకుంటారు.

హవల్దార్ పోస్టులకు మాత్రం.. సెషన్-2 మెరిట్‌తో విభాగాల వారీ ఒక్కో ఖాళీకి 7 మందిని చొప్పున ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పురుషులు 1600 మీటర్ల దూరాన్ని 15 నిమిషాల్లో నడవాలి. మహిళలు ఒక కిలోమీటర్‌ని 20 నిమిషాల్లో చేరుకోవాలి. ఫిజికల్ స్టాండర్డ్స్‌లో భాగంగా.. పురుషులు 157.5 సెం.మీ. ఎత్తు, ఛాతీ విస్తీర్ణం ఊపిరి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. పెరిగి 81 సెం.మీ. తక్కువ కాకుండా ఉండాలి. మహిళలు 152 సెం.మీ. ఎత్తు, 48 కి.గ్రా. బరువు అవసరం.

సన్నద్ధత ఎలా?

- నోటిఫికేషన్‌లో సిలబస్ వివరాలు శ్రద్ధగా పరిశీలించి, వాటినే బాగా చదువుకోవాలి. పరీక్షను సెప్టెంబరు- అక్టోబరులో నిర్వహిస్తారు. ఇప్పటినుంచి సిద్ధపడినా 70 కంటే తక్కువ కాకుండా సుమారు 105 రోజులు మీ చేతిలో ఉన్నట్లే. ఈ వ్యవధి సిలబస్ సమగ్ర అధ్యయనానికి సరిపోతుంది.
- ఆచరణ సాధ్యమయ్యేలా కాల ప్రణాళిక రూపొందించుకోవాలి. దాన్ని తప్పనిసరిగా అమల్లోకి తీసుకురావాలి. నెల రోజుల తర్వాత సమీక్షించుకుని, మార్పులు చేసుకోవాలి. వెనుకబడుతోన్న విభాగాలకు మరికొంత అదనపు సమయం కేటాయించాలి.
- అన్ని విభాగాలకూ సమాన ప్రాధాన్యం ఉంది కాబట్టి అవగాహన లేని/ వెనుకబడిన వాటికి అదనపు సమయం వెచ్చించుకోవాలి.
- చదవడం పూర్తయిన తర్వాత పాత ప్రశ్నపత్రాలు నిశితంగా పరిశీలించాలి. వాటిని బాగా సాధన చేయాలి. ప్రశ్నల స్థాయి, అంశాలవారీ పరీక్షలో ప్రాధాన్యం గ్రహించి తుది సన్నద్ధతను మెరుగుపరచుకోవాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
- కనీసం 20 మాక్ టెస్టులు రాయాలి. ఒక్కో పరీక్ష పూర్తయిన తర్వాత.. తప్పులు చేస్తోన్న అంశాలు ప్రత్యేక శ్రద్ధతో చదివి, వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- పరీక్ష తేదీకి ముందు వారం నుంచి పది రోజులు పునశ్చరణకు కేటాయించుకోవాలి
- పరీక్షలో ప్రశ్న పూర్తిగా చదివిన తర్వాతే సమాధానం గుర్తించండి. సులువైనవి, జవాబు కోసం తక్కువ సమయం తీసుకునే ప్రశ్నలకు ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాత కొంచెం ప్రయత్నిస్తే సాధ్యమయ్యే వాటిని చూడాలి. సమాధానం కోసం ఎక్కువ సమయం అవసరమయ్యేవి, కఠినమైనవాటిని చివరలోనే ప్రయత్నించండి.
- సెషన్-1 ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేనందున బాగా ఆలోచించి ఏదో ఒక ఆప్షన్ ఎంచుకోవచ్చు. సెషన్-2లో తెలియని ప్రశ్నలను వదిలేస్తేనే మేలు.

- సిలబస్ అంశాల ప్రకారం ముందుగా 8,9,10 తరగతుల మ్యాథ్స్, ఇంగ్లిష్, సోషల్ పుస్తకాలు బాగా చదవాలి.

ముఖ్య వివరాలు:

అర్హత: పదో తరగతి.
వయసు: ఆగస్టు 1, 2025 నాటికి ఎంటీఎస్ పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి. ఆగస్టు 2, 2000 - ఆగస్టు 1, 2007 మధ్య జన్మించినవారు అర్హులు. హవల్దార్, ఎంటీఎస్‌లో కొన్ని పోస్టులకు 18 నుంచి 27 ఏళ్ల వరకూ అవకాశం ఉంది. వీటికి ఆగస్టు 2, 1998 - ఆగస్టు 1, 2007 మధ్య జన్మించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని పోస్టులకూ ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు: 24.07.2025
దరఖాస్తు ఫీజు: రూ.వంద. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు ఉండదు.
పరీక్షలు: సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 24 వరకు.
వెబ్‌సైట్: https://ssc.gov.in/

కీలక అంశాలు ఇవీ!



రైల్వే, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ), ఇతర పోటీ పరీక్షల్లో 'కంప్యూటర్ ఆప్టిట్యూడ్' ఉంటుంది. ఈ విభాగంలో అధిక మార్కులు సాధించాలంటే ఏ అంశాలపై పట్టు పెంచుకోవాలో తెలుసుకుందాం!

కంప్యూటర్ ఆప్టిట్యూడ్/ ఎవేర్‌నెస్/ ప్రొఫిషియెన్సీ.. ఇలా ఏ పేరుతో ఉన్నప్పటికీ ఈ విభాగంలో పరీక్షించే ముఖ్యాంశాలు ఒకే రకంగా ఉంటాయి.

- **బేసిక్స్:** కంప్యూటర్ అంటే, ఇది చేసే పనులు, ఉపయోగాలు, వాటి లక్షణాలు, పరిణామక్రమం (కంప్యూటర్ జనరేషన్స్), వివిధ రకాల ఇన్‌పుట్- అవుట్ పుట్ పరికరాలు, కీ బోర్డ్ షార్ట్ కట్స్.
- **సాఫ్ట్‌వేర్:** ఆపరేటింగ్ సిస్టమ్స్ (విండోస్, మాకోస్, లైనక్స్, ఆండ్రాయిడ్, ఐఓఎస్), సిస్టమ్ సాఫ్ట్‌వేర్, అప్లికేషన్ సాఫ్ట్‌వేర్, వివిధ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు (ఎంఎస్ ఆఫీస్), ఇతర సాఫ్ట్‌వేర్ కాన్సెప్టులు.
- **హార్డ్‌వేర్:** కంప్యూటర్ భౌతిక భాగాలు. ఉదాహరణకు- మదర్ బోర్డ్, సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ (సీపీయూ), మెమరీ, వివిధ రకాల స్టోరేజ్ డివైజ్‌లు.
- **ఇంటర్నెట్, ఈ-మెయిల్స్:** ఇంటర్నెట్, ఇతర నెట్‌వర్కింగ్ కాన్సెప్టులు, వెబ్ బ్రౌజింగ్, సెర్చింగ్, డౌన్‌లోడింగ్, అప్‌లోడింగ్, ఈ-మెయిల్స్, ఈ-బ్యాంకింగ్.
- **డేటాబేస్ నిర్వహణ:** డేటాబేస్ భావనలు, వాటినెలా నిర్వహించాలో తెలుసుకోవడం.
- **నెట్ వర్కింగ్, కంప్యూటర్ భద్రత:** సైబర్ బెదిరింపులు, భద్రతా చర్యలు, భద్రతా చట్టాల గురించి అవగాహన.

ఈ పరీక్షలకు ఏవిధంగా సిద్ధం కావాలి?

- కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌పై మార్కెట్‌లో దొరికే ప్రామాణిక పుస్తకాలు, ఆన్‌లైన్ వనరులు ఉపయోగించుకోవచ్చు.
- మాక్ టెస్టులకు హాజరవటం మేలు చేస్తుంది.
- పాత ప్రశ్నపత్రాల సాధన ద్వారా పరీక్ష సరళిని అర్థం చేసుకోవచ్చు.
- ఈ విభాగానికి పరీక్షల్లో కేటాయించిన సమయాన్ని దృష్టిలో పెట్టుకొని సమయ నిర్వహణపై దృష్టి సారించాలి. ప్రతి ప్రశ్నకూ తగిన సమయం కేటాయించుకొని, అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇచ్చేట్లు చూసుకోవాలి.

ఐదు తరాల విశేషాలు

ఇచ్చిన సమస్య దత్తాంశాన్ని (డేటా) స్వీకరించి, ప్రోగ్రాం ప్రకారం డేటాను విశ్లేషించి ఫలితాలను అందించే ఎలక్ట్రానిక్ సాధనం.. కంప్యూటర్. ఇది చేసే పనులు, వాటి ఉపయోగాలు, వాటి లక్షణాల గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి. మొదటి తరం నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఐదు తరాల కంప్యూటర్‌ల గురించీ, వాటి పనితనం మెరుగుపడటం గురించీ అవగాహన అవసరం. అభ్యర్థులు కష్టంగా భావించే జనరేషన్స్‌ను ఈ కింది టేబుల్‌ను అవగాహన చేసుకోవటం ద్వారా సులభంగా గుర్తుపెట్టుకోవచ్చు.

జనరేషన్స్	కాల వ్యవధి	ఉపయోగించిన సాంకేతికత
1వ తరం	1940-1956	వాక్యూమ్ ట్యూబ్ ఆధారిత కంప్యూటర్
2వ తరం	1956-1963	ట్రాన్సిస్టర్ ఆధారిత కంప్యూటర్
3వ తరం	1964 - 1971	ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ ఆధారిత కంప్యూటర్
4వ తరం	1971 - ప్రస్తుతం	మైక్రో ప్రాసెసర్ ఆధారిత కంప్యూటర్
5వ తరం	వర్తమానం - భవిష్యత్తు	ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ పారలల్ ప్రాసెసింగ్ ఆధారిత కంప్యూటర్

ఈ జనరేషన్స్‌పై గత పరీక్షల్లో ఇచ్చిన ఒక ప్రశ్న చూద్దాం.

కింది వాటిలో ఏది చార్లెస్ బాబేజ్ రూపొందించిన మొదటి మెకానికల్ కంప్యూటర్‌గా పరిగణిస్తారు?

ఎ) UNIVAC బి) Abacus
సి) Analytical Engine డి) ENIAC

జవాబు: సి



డా. చెన్నంశెట్టి రమేష్

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్‌లో అవకాశాలు

చండీగఢ్‌లోని హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్ (హెచ్‌బీసీహెచ్ఆర్‌సీ).. 30 ఉద్యోగాలను భర్తీ చేయనుంది.

ప్రకటించిన పోస్టుల్లో ట్రేడ్ హెల్పర్- 15, అటెండెంట్-15 ఉన్నాయి.

- **ట్రేడ్ హెల్పర్:** పదో తరగతి/ తత్సమాన కోర్సు పూర్తిచేయాలి. ఆపరేషన్ థియేటర్/ ఐసీయూ/ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్/ లాబొరేటరీ/ ఇంజినీరింగ్ పరికరాల నిర్వహణ, ఆఫీసు పనుల్లో ఏడాది అనుభవం ఉండాలి.
- **అంటెండెంట్:** పదోతరగతి/ తత్సమాన కోర్సు. ఫైలింగ్, రికార్డు కీపింగ్, డిస్పాచ్ వర్క్, ఫొటోకాపీ మెషిన్ ఆపరేటింగ్, ఆఫీస్ పనిలో ఏడాది అనుభవం ఉండాలి.

వయసు: 25 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు, సంస్థ ఉద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.



దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులు/ మహిళలకు ఫీజు లేదు.
వేతనం: నెలకు రూ.18,000. లభ్యతను బట్టి ఉచిత వసతి కల్పిస్తారు. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ట్రావెలింగ్, వైద్య, పీఎఫ్ సదుపాయాలుంటాయి.

ఎంపిక

- రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- రాత పరీక్ష 100 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. జనరల్ నాలెడ్జ్, మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ ప్రశ్నలు ఇస్తారు.
- స్కిల్ టెస్ట్ అర్హత పరీక్ష మాత్రమే. ఉద్యోగానుభవానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.
- స్కిల్ టెస్ట్ సమయంలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.
- రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తేదీలను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి తెలియజేస్తారు.
- ప్రభుత్వ/ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నవారు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి.
- ఎంపికైనవారిని దేశవ్యాప్తంగా ఉన్న యూనిట్లలో ఎక్కడైనా నియమించే అవకాశముంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.07.2025
వెబ్‌సైట్: https://tmc.gov.in/m_events/events/JobDetail?jobId=35550

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఇలస్ట్రేటర్

సంస్థ: ఎస్ఏఎస్ గ్రూప్ **నైపుణ్యాలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, డిజిటల్ ఇలస్ట్రేషన్, స్కెచింగ్, స్టోరీబోర్డ్ **స్టైపెండ్:** రూ.12,000-18,000 **దరఖాస్తు గడువు:** ఆగస్టు 4
☛ https://shorturl.at/QAPLm

కలరింగ్ పేజ్ ఇలస్ట్రేటర్ అండ్ లైన్ ఆర్టిస్ట్

సంస్థ: కజరా గ్రూప్ **నైపుణ్యాలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, గ్రాఫిక్ డిజైన్, స్కెచింగ్ **స్టైపెండ్:** రూ.17,500-25,000
☛ https://shorturl.at/yfxFa

సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్–కెమిస్ట్రీ

సంస్థ: క్యూఏ సాల్వర్స్ **నైపుణ్యాలు:** కెమిస్ట్రీ, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ **స్టైపెండ్:** రూ.10,000-15,000
☛ https://shorturl.at/EYDgv

ప్రూఫ్‌రీడింగ్ అండ్ క్లయింట్ ఇంటరాక్షన్

సంస్థ: ఇంటర్న్‌శాల **నైపుణ్యాలు:** క్లయింట్ ఇంటరాక్షన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ప్రూఫ్‌రీడింగ్ **స్టైపెండ్:** రూ.14,445
☛ https://shorturl.at/XZSNl

ఎస్ఎంఈ కెమిస్ట్రీ

సంస్థ: క్లౌడ్‌బర్డ్ డిజిటల్ ప్రై.లి. **నైపుణ్యాలు:** ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ **స్టైపెండ్:** రూ.5,000
☛ https://shorturl.at/6bp8X

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఐసీఎస్ఐలో ఎగ్జిక్యూటివ్‌లు

దిల్లీలోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ఒప్పంద ప్రాతిపదికన 30 సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం, ఏడాది పని అనుభవం.
వయసు: 2025 జులై 1వ తేదీ నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.40,000 - రూ.60,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.07.2025
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
వెబ్‌సైట్: https://www.icsi.edu/careers/

ట్రిపుల్ఐటీ డీఎంలో నాన్ ఫ్యాకల్టీ

కాంచీపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్.. రెగ్యులర్ ప్రాతిపదికన కింది విభాగాల్లో 27 నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 03
- జూనియర్ టెక్నీషియన్: 13
- జూనియర్ అసిస్టెంట్: 11

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, డిజైన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, ఇన్‌స్టిట్యూట్ కంప్యూటర్ సెంటర్.
అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్, డిగ్రీ, ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం.
వయసు: జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్‌కు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్/ స్కిల్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్టులతో.
దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్‌కు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025.
వెబ్‌సైట్: https://iiitdm.ac.in/

ఎన్ఎండీసీలో మేనేజర్లు

హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ సంస్థ- నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండీసీ), 17 మేనేజర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- జూనియర్ మేనేజర్ (ఫైనాన్స్): 10
- అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్): 07

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/ సీఎంఏ, డిగ్రీ, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం.
వేతనం: నెలకు జూనియర్ మేనేజర్‌కు రూ.50,000- రూ.1,60,000; ఏజీఎం పోస్టుకు రూ.లక్ష- రూ.2,60,000.
వయసు: జూనియర్ మేనేజర్‌కు 30 ఏళ్లు, ఏజీఎంకు 45 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు గడువు: 28.07.2025.
వెబ్‌సైట్: https://www.nmdc.co.in/careers

ప్రవేశాలు

సీఐటీడీలో ఎంఈ

ఎంఎస్ఎంఈ టూల్ రూమ్ హైదరాబాద్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) 2025 విద్యా సంవత్సరానికి ఎంఈ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: ఎంఈ టూల్ డిజైన్ (ఎంఈటీడీ), ఎంఈ మెకట్రానిక్స్ ● **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. **అర్హత:** సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో బీఈ, బీటెక్ లేదా తత్సమాన విద్యార్హత. **వయసు:** 45 సంవత్సరాలు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** జనరల్ రూ.1500. ఎస్సీ, ఎస్టీలకు రూ.750.
ఎంపిక: మెరిట్ జాబితాతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 28.08.2025. **ప్రవేశ పరీక్ష తేదీ:** 29.08.2025. **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్.
వెబ్‌సైట్: www.citdindia.org/

అప్రెంటిస్

ఎన్‌హెచ్‌పీసీలో 361 ఖాళీలు

నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) వివిధ విభాగాల్లో 361 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 129
- డిప్లొమా అప్రెంటిస్: 76
- ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: 156

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకామ్, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, డిప్లొమా, ఐటీఐ, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా.
వయసు: 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ 5 ఏళ్లు, ఓబీసీ 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకు 15 ఏళ్లు సడలింపు ఉంటుంది.
స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు 13,500, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.12,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.08.2025
ఎంపిక: విద్యార్హతల్లోని మార్కులతో.
వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job

వాక్ఇన్

ఐసీఎంఆర్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

దిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన 3 కన్సల్టెంట్ యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- జేఆర్ఎఫ్/ ప్రాజెక్ట్ అసోసియేట్-I: 01
- ప్రాజెక్ట్ సైంటిస్ట్-I: 01
- ప్రాజెక్ట్ అసోసియేట్-I: 01

అర్హత: సంబంధిత విభాగంలో డాక్టోరల్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ (జెనెటిక్/ ప్లాంట్ బ్రీడింగ్/ జనటిక్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్/ బయోటెక్నాలజీ. డిగ్రీ పూర్తి చేసినవారికి నెట్/ యూజీసీ/సీఎస్ఐఆర్/ ఐసీఏఆర్ నెట్ అర్హత.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. (ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది).
వేతనం: నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్‌కు రూ.56,000; జేఆర్ఎఫ్/ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.25,000 (జాతీయ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులకు రూ.31,000). **ఇంటర్వ్యూ తేదీ:** 28.07.2025.
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

Wordwise-35

ఈ 'వర్డ్ వైజ్'ను ఒకసారి ప్రయత్నించండి. ఇది వినోదంతో పాటు పోటీ పరీక్షల్లో విజయానికీ తోడ్పడుతుంది.

ACROSS
1. A precious and rare metal chased by kings and pirates
5. Measured in square units, it tells you how much space lies within the boundary
6. A silly person who acts in a funny or crazy way to make others laugh.
7. A wordbook every English learner needs

DOWN
1. To look steadily at something, often with wonder or deep thought
2. Something done by mouth — related to speaking, not writing
3. To give something for a short time, expecting to get it back
4. A 24-hour period that includes morning, afternoon, and night

1	2	3	4
5			
6			
7			■

ANSWERS
ACROSS
1. GOLD 5. AREA
6. ZANY
7. ELD (English Language Dictionary)
DOWN
1. GAZE 2. ORAL
3. LEND 4. DAY

- డా. వంగీపురం శ్రీనాథాచారి



రైల్వే, పోటీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

పని పూర్తయ్యేందుకు ఆ ఇద్దరికీ పట్టే సమయం?

కాలం - పని

ముఖ్యాంశాలు

- పని స్థిరంగా ఉన్నపుడు దాని సామర్థ్యం, ఆ పనిని పూర్తి చేసేందుకు పట్టే రోజుల సంఖ్యకు విలోమానుపాతంలో ఉంటుంది.
- వ్యక్తుల సంఖ్య, ఒక పనిని పూర్తి చేసేందుకు పట్టే రోజుల సంఖ్య విలోమానుపాతంలో ఉంటాయి.
- పనిచేసే వారి సంఖ్య స్థిరంగా ఉన్నపుడు పని, ఆ పనిని పూర్తి చేసేందుకు పట్టే సమయం అనులోమానుపాతంలో ఉంటాయి.
- పని స్థిరంగా ఉంటే వ్యక్తుల సంఖ్య, ఆ పనిని పూర్తి చేసేందుకు కావాల్సిన రోజుల సంఖ్యలు అనులోమానుపాతంలో ఉంటాయి.
- ఈ విభాగంలో మొత్తం పనిని 1 యూనిట్‌గా భావించకుండా, వివిధ వ్యక్తులు, ఆ పనిని పూర్తి చేసేందుకు అవసరమయ్యే వివిధ రోజుల సంఖ్య కసాగు విలువను మొత్తం పని యూనిట్లుగా తీసుకుంటే సమస్యలను సులభంగా సాధించవచ్చు.

1. మహేష్ ఒక పనిని 28 రోజుల్లో, రమేష్ అదే పనిని 35 రోజుల్లో పూర్తి చేశారు. అయితే మహేష్, రమేష్‌లు కలిసి అదే పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు?

1) $31\frac{1}{2}$ రోజులు 2) $15\frac{7}{9}$ రోజులు

3) $15\frac{5}{9}$ రోజులు 4) $15\frac{4}{9}$ రోజులు

సాధన: ఇద్దరూ కలిసి ఆ పనిని పూర్తి చేసేందుకు అవసరమయ్యే

రోజుల సంఖ్య $= \frac{xy}{x+y}$

$\frac{28 \times 35}{28 + 35} = \frac{28 \times 35}{63}$

$= \frac{140}{9} = 15\frac{5}{9}$ రోజులు

సమాధానం: 3

2. A, B, C లు ఒక పనిని వరుసగా 14, 18, 21 రోజుల్లో పూర్తి చేస్తారు. అయితే అదే పనిని ముగ్గురు కలిసి ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు?

1) $5\frac{8}{11}$ రోజులు 2) $17\frac{2}{3}$ రోజులు

3) $5\frac{7}{11}$ రోజులు 4) $5\frac{9}{11}$ రోజులు

సాధన: మొత్తం పని యూనిట్లు (14, 18, 21 ల కసాగు) = 126

A సామర్థ్యం అంటే A ఒక రోజులో పూర్తి చేసే పని యూనిట్ల సంఖ్య $= 126 \div 14 = 9$ యూనిట్లు

B సామర్థ్యం $= 126 \div 18 = 7$ యూనిట్లు

C సామర్థ్యం $= 126 \div 21 = 6$ యూనిట్లు

A + B + C సామర్థ్యం $= 9 + 7 + 6 = 22$ యూనిట్లు

లెక్కలో కోరిన జవాబు $= 126 \div 22 = 5\frac{8}{11}$ రోజులు

సమాధానం: 1

3. P, Qలు కలిసి ఒక పనిని 24 రోజుల్లో పూర్తి చేస్తారు. అదే పనిని Q ఒక్కడే 40 రోజుల్లో పూర్తి చేస్తే, P ఒక్కడే ఆ పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తాడు?

1) 48 2) 50 3) 34 4) 60

సాధన: మొత్తం పని యూనిట్లు (24, 40 ల కసాగు) = 120

(P + Q) సామర్థ్యం $= 120 \div 24 = 5$ యూనిట్లు

Q సామర్థ్యం $= 120 \div 40 = 3$ యూనిట్లు

P సామర్థ్యం $= 5 - 3 = 2$ యూనిట్లు

∴ లెక్కలో కోరిన జవాబు $= 120 \div 2 = 60$ రోజులు

సమాధానం: 4

4. A అనే వ్యక్తి $\frac{1}{5}$ వంతు పనిని 7 రోజుల్లో, B అదే పనిలో 30% పనిని 9 రోజుల్లో, $\frac{2}{3}$ వంతు పనిని C అనే వ్యక్తి 18 రోజుల్లో పూర్తి చేశారు. అయితే ముగ్గురిలో ఎవరు ఆ పనిని త్వరగా పూర్తి చేస్తారు?

1) C 2) A 3) B 4) A, C

సాధన: A అనే వ్యక్తి పనిని పూర్తి చేసే రోజుల సంఖ్య $= \frac{5}{1} \times 7 = 35$

B అనే వ్యక్తి పనిని పూర్తి చేసే రోజుల సంఖ్య $= \frac{100}{30} \times 9 = 30$

C అనే వ్యక్తి పనిని పూర్తి చేసే రోజుల సంఖ్య $= \frac{3}{2} \times 18 = 27$

C అనే వ్యక్తి ఆ పనిని త్వరగా పూర్తి చేస్తాడు.

సమాధానం: 1

5. ఒక పని పూర్తి చేసేందుకు Q కంటే P రెట్టింపు సమయం, R కంటే P మూడు రెట్ల సమయం తీసుకుంటాడు. ముగ్గురు కలిసి ఒక పనిని 5 రోజుల్లో పూర్తి చేస్తే, అదే పనిని R ఒక్కడే ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తాడు?

1) 12 2) 10 3) 15 4) 13

సాధన: P : Q : R = 6 : 3 : 2

P : Q : R పని సామర్థ్యం $= \frac{1}{6} : \frac{1}{3} : \frac{1}{2} = 1 : 2 : 3$

P + Q + R పని సామర్థ్యం (1 రోజుకు)

$= 1 + 2 + 3 = 6$ యూనిట్లు

P + Q + R లు 5 రోజుల్లో పూర్తి చేసే పని యూనిట్లు

$= 5 \times 6 = 30$

R ఒక్కడే ఆ పనిని పూర్తి చేసేందుకు కావాల్సిన రోజుల సంఖ్య

$= \frac{30}{3} = 10$ రోజులు

సమాధానం: 2

6. A, B, Cలు ఒక ఇంటిని పెయింట్ చేసేందుకు వరుసగా 36, 40, 54 రోజులు తీసుకుంటారు. ఆ ముగ్గురు కలిసి ఆ ఇంటికి 5 రోజులు పెయింట్ వేసిన తర్వాత మిగతా భాగానికి C ఒక్కడే పెయింట్ వేయడానికి ఎన్ని రోజులు పడుతుంది?

1) $33\frac{3}{4}$ 2) $34\frac{1}{4}$ 3) $35\frac{1}{4}$ 4) $34\frac{3}{4}$

సాధన: మొత్తం పని యూనిట్లు (36, 40, 54 ల కసాగు) = 1080

A సామర్థ్యం $= 1080 \div 36 = 30$ యూనిట్లు

B సామర్థ్యం $= 1080 \div 40 = 27$ యూనిట్లు

C సామర్థ్యం $= 1080 \div 54 = 20$ యూనిట్లు

A + B + C సామర్థ్యం $= 30 + 27 + 20 = 77$

మిగిలిన భాగం $= 1080 - (77 \times 5) = 695$ యూనిట్లు

లెక్కలో కోరిన జవాబు $= \frac{695}{20} = 34\frac{3}{4}$ రోజులు

సమాధానం: 4

7. 30 మంది ఒక పనిని 15 రోజుల్లో పూర్తి చేయగలరు. 30 మంది 5 రోజులు పనిచేసిన తర్వాత, మిగతా భాగం పనిని 6 రోజుల్లో పూర్తి చేయడానికి అవసరమయ్యే అదనపు వ్యక్తుల సంఖ్య ఎంత?

1) 20 2) 15 3) 18 4) 24

సాధన: $15 - 5 = 10$ రోజుల్లో పని పూర్తి కావడానికి అవసరమయ్యే వ్యక్తుల సంఖ్య = 30

6 రోజుల్లో పని పూర్తి కావడానికి అవసరమయ్యే వ్యక్తుల సంఖ్య = ?

$30 \times \frac{10}{6} = 50$

∴ అదనపు వ్యక్తుల సంఖ్య

$= 50 - 30 = 20$

సమాధానం: 1



రచయిత
డా. వంగల శ్రీనివాస్
అసిస్టెంట్ ప్రొఫెసర్

710 Word of the Day

Loitering

Telugu meaning: పచార్లుకొట్టు, అక్కడక్కడే తిరగడం

English meaning: The word loitering (లాయిటరింగ్) is both a noun and a verb that describes the act of standing or moving about idly or aimlessly in a public place, often without any clear purpose.

Synonyms: Lingering, Hanging around

Antonyms: Rushing, Leaving

Usage: **1. (As a Noun):** The security guard warned the teenagers against loitering near the store entrance.

2. (As a Verb): Loitering outside government buildings without reason may raise suspicion.

కరెంట్ అఫైర్స్



దృశ్య పరిధి అవతలున్న (బియాండ్ విజువల్ రేంజ్) లక్ష్యాలను ఛేదించే 'అస్త్ర' క్షిపణిని భారత్ 2025, జులై 11న విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరానికి చేరువలో ఇది జరిగింది. గగన తలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ధ్వంసం చేయగల ఈ అస్త్రాన్ని సుఖోయ్-ఎంకెఐ యుద్ధ విమానం నుంచి ప్రయోగించారు. ఇది వంద కిలోమీటర్లకు మించిన పరిధి కలిగి ఉంది. ఇందులో అధునాతన గైడెన్స్, నేవిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. తాజా పరీక్షను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత వాయుసేన నిర్వహించాయి.



దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ చిత్రాన్ని లార్డ్స్‌లోని ఎంసీసీ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. 2025, జులై 10న భారత్-ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు ఆరంభానికి ముందు ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. 18 ఏళ్ల క్రితం తీసిన ఫొటో ఆధారంగా చిత్రకారుడు స్టువర్ట్ పియర్సన్ రైట్ దీన్ని చిత్రించాడు.



కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పదవీ కాలాన్ని 2026, ఆగస్టు 22 వరకు పొడిగిస్తూ కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈయన 1989 బ్యాచ్‌కు చెందిన సిక్కిం కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా 2024, ఆగస్టులో నియమితులయ్యారు. కేంద్ర మంత్రివర్గంలోని నియామకాల కమిటీ జులై 11న ఆయన పదవీకాల పొడిగింపునకు ఆమోదం తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా వ్యవహరించేందుకు జాతీయ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు (ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ)తో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో 2025, జులై 11న ఒప్పందంపై బ్యాంక్ ఎండీ రాజ్‌కిరణ్‌రాయ్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు సంతకాలు చేశారు.


మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్థానిక స్వపరిపాలన కోసం ఏర్పాటైన కమిటీలు

స్టడీ - జోన్

భారతదేశంలో అనేక గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2025 నాటికి మన దేశంలో 6.65 లక్షల గ్రామాలు ఉన్నట్లు అంచనా. ఇవి అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ఈ కారణంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గ్రామీణాభివృద్ధి కోసం అనేక ప్రయత్నాలు, కార్యక్రమాలు జరిగాయి. అవి నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

- ప్రజాస్వామ్యానికి ప్రత్యక్ష వేదికలుగా గ్రామాలను పేర్కొంటారు. పాలనలో ప్రజలను భాగస్వాములను చేసి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ దేశాన్ని ప్రగతి పథంలో




నడిపించేందుకు స్థానిక సంస్థలు అత్యంత కీలకమని అనేక కమిటీలు నివేదించాయి. అవసరమైన అధికారాలు, విధులు, నిధులు సమకూరిస్తే అక్కడ సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతుందని చెప్పాయి. దాంతోపాటు అధికార వికేంద్రీకరణకు అనేక సూచనలు చేశాయి.

గ్రామీణాభివృద్ధి కోసం ఏర్పాటైన పలు కమిటీలు

పేరు	కీలక సిఫార్సులు
బల్వంతరాయ్ మెహతా కమిటీ	మూడంచెల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు
అశోక్ మెహతా కమిటీ	రెండంచెల పంచాయతీరాజ్ విధానం
దంతెవాలా కమిటీ	గ్రామీణాభివృద్ధికి బ్లాక్ స్థాయి మూలస్తంభంగా ఉండాలి
సీహెచ్ హనుమంతరావు కమిటీ	జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీ బోర్డులను ఏర్పాటు చేయాలి
జి.వి.కె.రావు కమిటీ	బ్లాక్ వ్యవస్థను రద్దు చేయాలి
ఎల్ఎం సింఘ్వీ కమిటీ	పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగపరమైన గుర్తింపు ఉండాలి.
పి.కె.తుంగన్ కమిటీ	స్థానిక సంస్థలకు కాలానుగుణంగా ఎన్నికలు నిర్వహించాలి.
వి.ఎన్.గాడ్గిల్ కమిటీ	ప్రభుత్వ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు, మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వాలి.

జనరల్ స్టడీస్ - బయాలజీ



మొక్కలు - కాండం రూపాంతరాలు

మొక్కలు, పువ్వులు, పండ్లు, ఆకులకు మద్దతు ఇచ్చే నిర్మాణ అక్షం కాండం. మొక్కలో ప్రధాన భాగమైన కాండం మొక్క రకాన్ని బట్టి కొన్ని మిల్లీమీటర్ల నుంచి వందల మీటర్ల వరకు (పొడవు, వ్యాసం) పెరుగుతుంది. ముఖ్యంగా కాండం మొక్కకు రక్షణ, మద్దతు కల్పించి; కిరణజన్య సంయోగక్రియ, అలైంగిక పునరుత్పత్తికి ఉపయోగపడుతుంది.

- బంగాళాదుంప లాంటి కొన్ని మొక్కలు భూగర్భ కాండాన్ని కలిగి ఉన్నప్పటికీ, అది భూమిపై కనిపిస్తుంది.
- ఎగబాకే మొక్కల్లో పొడవైన, సన్నటి కాండాలు ఉంటాయి. ఇవి దేన్నైనా ఆధారంగా చేసుకుని పైకి ఎదుగుతాయి.

కాండం అంతర్నిర్మాణం

ఒక కాండం అంతర్నిర్మాణపరంగా బాహ్య చర్మ కణజాలం, మృదు కణజాలం (గ్రౌండ్ టిష్యూ), ప్రసరణ కణజాలం (వాస్కులర్ టిష్యూ) అనే మూడు కణజాలాలు కలిసి తయారవుతుంది.

కాండం రూపాంతరాలు

మొలకెత్తే విత్తనం ప్లుమ్యూల్ లేదా ప్రథమ కాండం నుంచి కాండం అభివృద్ధి చెందుతుంది. కాండం ప్రధాన లక్షణం: కణుపులు లేదా నోడ్స్, కణుపు మధ్యమం లేదా ఇంటర్‌నోడ్స్‌ను కలిగి ఉండటం.

కాండం విధులకు సంబంధించిన అంశాలు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Posts

Employees State Insurance Corporation (ESIC), Varanasi, Uttar Pradesh, is inviting applications for the filling of faculty posts in various departments on a contractual basis. The total no. of posts is 54. The application fee is Rs.500. Eligible candidates can apply online before 16 July 2025.

Assistant Professor Posts

The Medical & Health Services Recruitment Board (MHSRB), Government of Telangana, has released a notification for the recruitment of Assistant Professors across various specialities under the Director of Medical Education (DME). The total no. of posts is 607. The last date for submission of online applications is 17 July 2025.

Posts In RCFL

Rashtriya Chemicals and Fertilizers Limited (RCFL), Mumbai, is inviting applications for filling up the BC, SC, ST backlog posts in various departments. The total number of posts is 74. The last date for receipt of online applications is 25 July 2025.

Did You Apply..?

Today (July 14) is the last date for the following jobs

- 541 Probationary Officer jobs in SBI. ***Qualification:*** Graduation.
- 18 Assistant posts at CDAC, Bengaluru. ***Eligibility:*** Diploma, Any Graduate, BE, B.Tech, ME, M.Tech, PG, Ph.D.
- 39 Scientist posts in ISRO. ***Qualification:*** BE/BTech
- Liaison Officer posts in RBI. ***Eligibility:*** Degree.

For more information and other notifications - scan QR code

SSC Exams English

Fill in the Blanks

Directions (Qs. 1 - 22): *Select the most appropriate option to fill in the blank(s).*

1. The judge's remark was ...... and carried a deep message about justice and equality.
A) irrelevant B) profound
C) hostile D) ambiguous

2. Due to heavy rains, the match was ...... for an indefinite period.
A) postponed B) advanced
C) ignored D) rejected

3. The principal requested the students to maintain ...... during the assembly.
A) delays B) attendance
C) remarks D) silence

4. His explanation was so ...... that even a layman could understand the topic clearly.
A) vague B) complicated
C) lucid D) abstract

5. The director received an award for his ...... contribution to cinema.
A) artificial B) trivial
C) outstanding D) routine

6. She was ...... when she saw the surprise arranged by her friends.
A) devastated B) elated
C) furious D) confused

7. The athlete was ...... from the competition for violating doping regulations.
A) expelled B) awarded
C) honoured D) invited

8. The manager praised the team for completing the task well before the ......
A) salary B) budget
C) conflict D) deadline

9. India has a rich ...... of art, music, and culture.
A) heritage B) policy
C) ambition D) migration

10. To improve communication skills, one must ...... reading newspapers and speaking in English regularly.
A) avoid B) practice
C) oppose D) question

11. The firemen acted quickly to ...... the blaze and prevent further damage.
A) escalate B) intensify
C) ignite D) extinguish

12. Her promotion was the result of years of ...... work and dedication.
A) careless B) sluggish
C) sincere D) random

13. The scientist was awarded for his ...... research in the field of biotechnology.
A) minor B) groundbreaking
C) outdated D) unreliable

14. The teacher asked the students to ...... their doubts without hesitation.
A) hide B) suppress
C) express D) ignore

15. During the pandemic, many people relied on online platforms to ...... essential services.
A) attain B) disturb
C) evaluate D) resist

16. The government is trying to ...... inflation and ...... the economic slowdown.
A) increase, boost
B) suppress, disturb
C) ignore, manage
D) control, tackle

17. The scientist's theory was initially ...... by many but later ...... by evidence.
A) ignored, vanished
B) opposed, confirmed
C) rejected, validated
D) feared, forgotten

18. The teacher tried to ...... the student's question but eventually had to ...... it.
A) dodge, address B) answer, deny
C) neglect, enforce D) accept, reject

19. Though the law was ...... years ago, its proper ...... started only recently.
A) implemented, review
B) passed, enforcement
C) proposed, abolishment
D) withdrawn, interpretation

20. The politician's speech was both ...... and ......, inspiring many in the audience.
A) dull, weak
B) strong, aggressive
C) negative, biased
D) motivating, visionary

21. The project was ...... due to lack of funds and later ...... completely.
A) expanded, delayed
B) halted, abandoned
C) planned, finished
D) started, ignored

22. His leadership style ...... discipline and ...... respect from all team members.
A) enforced, received
B) dictated, expected
C) demanded, commanded
D) neglected, denied

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో కోట శ్రీనివాసరావు చెరగని ముద్ర

మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సినీ పరిశ్రమకు తీరని లోటు: మంత్రి కందుల దుర్గేశ్

కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. 'విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా 750కి పైగా చిత్రాల్లో తనదైన శైలిలో నటించి మెప్పించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. చలనచిత్ర రంగంతో పాటు నాయకుడిగా రాజకీయాల్లోనూ రాణించారు' అని కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.

ప్రజానాట్య మండలి సంతాపం

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగ రాజు, ఎస్.అనిల్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చలనచిత్ర పరిశ్రమ ఒక మంచి నటుడ్ని కోల్పోయిందని పేర్కొన్నారు.

స్వచ్ఛ అవార్డులపై గవర్నర్ హర్షం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఐదు నగరపాలక సంస్థలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డులకు ఎంపిక కావడంపై గవర్నర్ అబ్దుల్ నజీర్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన నగరపాలక సంస్థల కమిషనర్లు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలకు ఆదివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో యూటీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. చిత్రంలో కలెక్టర్ అనుదీప్ తదితరులు

నాలుగు లక్షల ఎకరాలకు ధోకా లేదిక

- సాగర్ ఎడమ ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ నిర్మాణం పూర్తి
- నేడు నీటి విడుదల: తెలంగాణ మంత్రి పొంగులేటి

ఈనాడు, హైదరాబాద్-కూసుమంచి, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువ కింద నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు ఇక ధోకా లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గతేడాది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కొట్టుకుపోయిన భారీ అండర్ టన్నెల్(యూటీ) నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి పాలేరు జలాశయానికి దిగువన సాగర్ ఎడమ కాలువపై చేపడుతున్న యూటీ పనులను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన పరిశీలించారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు యూటీ కొట్టుకుపోగా రైతులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మతులు చేసి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చినట్లు చెప్పారు. శాశ్వత ప్రాతిపదికన రూ.14.20 కోట్లతో నిర్మాణం చేపట్టి పూర్తి చేశామని, దీనివల్ల పాలేరు నియోజకవర్గంలోని 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత ప్రాధాన్య క్రమంలో రోజుకు రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఎడమ ప్రధాన కాలువకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని అన్నారు.

రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య

- మహిళా ఠాణా సీఐ కేసులు నమోదు చేశారంటూ సెల్ఫీ వీడియో



శ్రవణ్‌కుమార్

చొప్పదండి, న్యూస్‌టుడే: తెలంగాణలోని కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన రెవెన్యూ ఉద్యోగి మహిళా ఠాణా సీఐ పలు రకాల కేసులు నమోదు చేయడంతో మనోవేదనకు గురై సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చొప్పదండి ఎస్సై నరేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడారి శ్రవణ్ కుమార్(34) కరీంనగర్ గ్రామీణ మండలం రెవెన్యూ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. 2021లో కరీంనగర్‌కు చెందిన బత్తుల నీలిమతో శ్రవణ్‌కు వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. గతేడాది నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య నీలిమ పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల కరీంనగర్ మహిళా ఠాణాలో వరకట్నం కోసం వేధిస్తున్నారని శ్రవణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కుటుంబంతో కలిసి శ్రవణ్‌కుమార్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ మహిళా ఠాణా సీఐ శ్రీలత పలు రకాల కేసులు నమోదుచేసి మానసికంగా ఇబ్బందులకు గురి చేసినట్లు పేర్కొంటూ ఈనెల 7న సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అనంతరం గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తండ్రి నర్సింగం ఫిర్యాదు మేరకు భార్య నీలిమ, ఆమె తల్లి, మధ్యవర్తులతోపాటు కరీంనగర్ మహిళా ఠాణా సీఐపై కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీల 'యాప్'సోపాలు!

- లబ్ధిదారుల ఇళ్లకే పోషకాహారం పంపిణీలో ఇక్కట్లు
- సర్వర్ సమస్యతో తరచూ యాప్‌ల మొరాయింపు

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో కార్యకర్తలు, లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. గర్భిణులతో పాటు ఏడు నెలలు నుంచి మూడేళ్ల లోపు వయసున్న పిల్లల తల్లులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారి ఇళ్ల వద్దకే పోషకాహారాన్ని అందిస్తోంది. ఇందులో పారదర్శకత కోసం లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపును (ఫేషియల్ రికగ్నేషన్) ప్రవేశపెట్టింది. బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో నమోదు తర్వాతే సరకులు అందించాలి. సర్వర్ సమస్య కారణంగా ఆయా యాప్‌లు తరచూ మొరాయిస్తున్నాయి. ఒక్కోసారి రెండు, మూడు గంటల పాటు పనిచేయడం లేదు. ఫలితంగా లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. రెండు కాకుండా ఒకే యాప్‌లో వివరాల నమోదు చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తే పరిస్థితి కొంత చక్కబడే అవకాశముందని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

పిల్లలకు చదువు చెప్పడానికీ ఇబ్బందే

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం తీసుకునే లబ్ధిదారులు సుమారు 5 లక్షల మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతినెలా బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు, రాగులు, అటుకులు, బెల్లం, పప్పు చెక్క, ఖర్జూరం అందిస్తోంది. వీటిని నెలలో రెండుసార్లు పంపిణీ చేస్తున్నారు. పంపిణీ తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని, కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్ తీసుకొచ్చాయి. ఈ రెండు యాప్‌లూ గతేడాది కాలంగా అమల్లో ఉన్నాయి. ఒకవేళ లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు నమోదు కాకపోయినా రిజిస్టర్‌లో సంతకం తీసుకుని వస్తువులు అందించేవారు. కేంద్ర ప్రభుత్వం జులై నుంచి ముఖ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేసింది. సర్వర్ సమస్యల కారణంగా యాప్‌లు మొరాయిస్తుండటంతో గంటల కొద్దీ లబ్ధిదారులు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. కొంతమంది నెలలో ఐదారుసార్లు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పనితోనే కార్యకర్తలకు రోజులో ఎక్కువ సమయం గడిచిపోతుడడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల చదువు అటకెక్కుతోంది.

వస్తువులున్నా.. లేనట్లు చూపుతూ..

- ✦ బాల సంజీవని యాప్‌లో పోషకాహారం వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు నమోదుకు ప్రయత్నిస్తే.. ప్లీజ్ కాంటాక్ట్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అని చూపుతూ మొరాయిస్తోంది.
- ✦ కొన్ని సందర్భాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు నిల్వ ఉన్నా.. లేవని చూపుతోంది. ఇలా వచ్చినప్పుడు వాటిని లబ్ధిదారులకు ఇవ్వడానికి వీలుపడదు.
- ✦ సర్వర్ సమస్య కారణంగా రిజిస్ట్రేషన్ సకాలంలో పూర్తికావడం లేదు.
- ✦ కొత్త లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ముఖ ఆధారిత గుర్తింపు వివరాలు.. వారికి సరకులు అందించేటప్పుడు తీసుకునే ఫేషియల్ రికగ్నేషన్‌కు సరిపోలడం లేదు.
- ✦ పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఈకేవైసీ నమోదులోనూ జాప్యమవుతోంది. తరచూ 'ఎర్రర్' అని చూపుతూ నిలిచిపోతోంది.

కోతపడే అవకాశం

ప్రతినెలా 15 లోపు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలి. నిర్దేశిత సమయంలోగా యాప్‌లో నమోదైన పంపిణీ వివరాల ఆధారంగానే మరుసటి నెలలో ఆయా కేంద్రాలకు సరకులు కేటాయిస్తారు. సర్వర్, ఇతర సమస్యల కారణంగా నిర్దేశిత సమయంలోపు పంపిణీ జరగకపోతే మరుసటి నెలలో సమస్య తలెత్తుతుంది. ఇప్పటివరకు భౌతికంగా రిజిస్టర్‌లో సంతకం చేయించుకునే వెసులుబాటు ఉండటంతో పంపిణీలో ఇబ్బంది రాలేదు. కేంద్రం జులై నుంచి ఫేషియల్ రికగ్నేషన్‌ను తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ తరహా సాంకేతిక సమస్యలు లేకుండా అధికారులు చూడాల్సిన అవసరముంది.

పీఏసీఎస్‌ల పునర్ వ్యవస్థీకరణ జరిగేనా?

- కొన్నిచోట్ల మండలానికి ఒకటి..
- మరికొన్నిచోట్ల మండలానికి 10పైగా

ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పునర్ వ్యవస్థీకరణ సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసిన నేపథ్యంలో కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుపై మండల, జిల్లాస్థాయిలోని కూటమి పార్టీల నేతల్లో చర్చ మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో పీఏసీఎస్‌లను పునర్వ్యవస్థీకరించారు. మొత్తం 4,465 సంఘాలు ఉండగా, వాటిని 2,940కు కుదించారు. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రైతుల అవసరాల కంటే పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేసిందనే విమర్శలున్నాయి. ఈ దఫా పునర్వ్యవస్థీకరణలో మండల పరిధి, రైతుల సంఖ్య, స్థానిక అవసరాలు దృష్టిలో పెట్టుకోవాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయి.

ఇష్టారాజ్యంగా కేటాయింపు

రాష్ట్రంలో ప్రస్తుతం 2042 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఇందులో లిక్విడేషన్ దశలో ఉన్న 14 మినహాయిస్తే.. 2028 సంఘాలు పనిచేస్తున్నాయి. ఇందులో సుమారు 248 మండలాల్లో ఒక్కోటి చొప్పునే ఉన్నాయి. మరికొన్ని మండలాల్లో ఒక్కోచోట 7-10 వరకు ఉన్నాయి.

✦ కృష్ణా జిల్లాలో 25 మండలాలు ఉంటే.. 213 సంఘాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలు ఉంటే 166, ఏలూరు జిల్లాలో 27 మండలాలకు 163 సంఘాలున్నాయి.

✦ ఒక మండల పరిధిలో 20కి పైగా గ్రామాలున్నా ఒకటే సంఘం ఉంది. దీంతో అక్కడి రైతులు పీఏసీఎస్‌లలో అవసరాల కోసం 10-20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది.

✦ 2023లోనే పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ అంశం తెరమీదకు వచ్చింది. మూడు ఆర్బీకేల పరిధిలో ఒక పీఏసీఎస్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. అదీ సాధ్యం కాదని పక్కన పెట్టారు.

వైకాపా నేతల చేతుల్లో ఆస్తులు, భవనాలు

వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ పీఏసీఎస్‌ల ఆస్తుల్ని కబ్జా చేశారు. అయినా సహకార శాఖ పట్టించుకోలేదు. ఇప్పటికీ కొన్ని భవనాలు ఆ పార్టీ నేతల ఆధీనంలోనే ఉన్నాయి. వీటి విలువ రూ.వందల కోట్లలో ఉంది. వైకాపాకు చెందిన వారైతే చాలు పీఏసీఎస్‌లలో ఓటర్లుగా చేర్చారు. సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోవాలని కూటమి పార్టీల నేతలు కోరుతున్నారు.

ఈసెట్‌లో 51% సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ రెండో ఏడాది ప్రవేశాలకు నిర్వహించే ఈసెట్‌లో 50.81% సీట్లు భర్తీ అయ్యాయి. విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు కలిపి 333 ఉండగా, వీటిల్లో 35,691 సీట్లు ఉన్నాయి. వీటిల్లో 18,138 సీట్లు భర్తీ అయ్యాయి. అర్హత గల అభ్యర్థులు 31,922 మంది ఉండగా.. వీరిలో 21,060 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకున్నారు. బ్రాంచీలు, కళాశాలల ఎంపికకు 20,689 మంది వెబ్‌ఐచ్ఛికాలు నమోదు చేసుకోగా.. 18,138 మందికి సీట్లు కేటాయించారు. శాప్, ఎన్‌సీసీ విభాగాల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తి కానందున క్రీడా కోటాలో 159, ఎన్‌సీసీ కోటాలో 324 మంది సీట్లను పెండింగ్‌లో పెట్టారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యాక వీరికి సీట్లు కేటాయిస్తారు. మరోవైపు ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో..: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్‌కు 10 ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో కన్వీనర్ కోటా భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెంచూరియన్, ఎస్ఆర్ఎం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన సీట్ల వివరాలను ఇవ్వలేదు. ఒకవేళ ఈ వర్సిటీలు సవరించిన సీట్లను ఇస్తే వాటిల్లో 35% కోటా ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

పరిష్కరించాం.. తిరస్కరించాం!

- ప్రజా విజ్ఞప్తులపై కొందరు రెవెన్యూ అధికారుల తీరు
- అర్జీలు చూడకుండానే మమ అనిపిస్తున్న వైనం
- ప్రభుత్వ పరిశీలనలో వెలుగులోకి

"రెవెన్యూ సదస్సులు, ఇతర మార్గాల్లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే.. వారిని ఇబ్బంది పెట్టకుండా పరిష్కరించాల్సిన వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి."

– సీఎం చంద్రబాబు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ప్రతి సమీక్షలో చెప్పే మాట ఇది.

ఈనాడు – అమరావతి

ముఖ్యమంత్రి పదేపదే ఇంతలా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ మేరకు చర్యలు కనిపించడం లేదు. విజ్ఞప్తులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే కొన్నిచోట్ల రెవెన్యూ సిబ్బంది 'చేస్తాం.. చూస్తాం', 'ఆమోద యోగ్యం' కాదని చెప్పేస్తున్నారు. ఎందుకు ఆమోద యోగ్యం కాదో కారణాలు చూపడంలేదు. మరికొన్ని చోట్ల గ్రామ సచివాలయాలు, మీసేవా ద్వారా దరఖాస్తు చేయాలంటూ బాధితులను తిప్పి పంపుతున్నారు. దీంతో ఎప్పటిలాగే అధికారుల చుట్టూ తిరిగి, వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఫలితంగా రిపీటెడ్ దరఖాస్తులు పెరుగుతున్నాయి. అన్ని స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగుల సమయం వృథా అవుతోంది. 20 జిల్లాల్లో అధికారులు పరిష్కరించామన్న 50 విజ్ఞప్తులను ర్యాండమ్ విధానంలో ప్రభుత్వం పునఃపరిశీలించగా పలువురు తహసీల్దార్ల నిర్వాకం బయటపడింది. దరఖాస్తుల పరిష్కారంలో చాలా వరకూ మార్గదర్శకాలు, నిబంధనలు పాటించలేదని తేలింది.

నిదర్శనాలు..!

- పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం మండలం నుంచి ఒకరు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేస్తే చుట్టుపక్క రైతులకు నోటీసులు ఇవ్వకుండానే పరిష్కరించినట్లు పేర్కొన్నారు.
- అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్ష్మీపురం వాసి భూ ఆక్రమణ గురించి ఫిర్యాదు చేస్తే.. పంట సాగు చేయడం లేదని చెప్పి.. పరిష్కరించినట్లు చూపారు.
- మ్యుటేషన్ జరగడం లేదని నత్తవరం వాసి అర్జీ పెట్టుకుంటే రుజువులు చూడకుండా.. మీసేవా లేదా సచివాలయం ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.
- ప్రకాశం జిల్లా కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఓ భూ ఆక్రమణ ఫిర్యాదులో విశ్వసనీయత ఎంతో తెలుసుకోలేదు. రికార్డుల్లో ఏముందో పేర్కొనలేదు.
- నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు పరిధిలో ఒకరు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేస్తే కారణం లేమీ చెప్పకుండానే తహసీల్దారు కార్యాలయం తిరస్కరించింది.
- బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం పరిధిలో పొరబాటున నిషిద్ధ జాబితాలో చేర్చిన 4.74 ఎకరాల పొలాన్ని తప్పించాలని బాధితుడు కోరారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సూచించారు. వాస్తవానికి తహసీల్దారు సుమోటో కింద వివరాలను కలెక్టర్‌కు సమర్పించి, నిషిద్ధ జాబితా నుంచి తప్పించాలని సిఫారసు చేయాలి. బాధితుడు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.
- అనంతపురం జిల్లా కంబదూరు మండలం నుంచి చుక్కల భూమిని నిషిద్ధ జాబితా నుంచి తప్పించాలని కోరితే.. 'చర్యలు తీసుకున్నాం' అని పేర్కొన్నారు. కానీ..అందుకు తగ్గ వివరాలు ఎండార్స్‌మెంట్‌లో లేకపోవడం గమనార్హం.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి

- క్యూ న్యూస్ కార్యాలయంలో ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం
- మల్లన్న సహా పలువురికి స్వల్పగాయాలు
- పోలీసుల అదుపులో నలుగురు





ఆసుపత్రిలో చేతికి కట్టు కట్టించుకుంటున్న మల్లన్న ★ తెలంగాణ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, ఘట్‌కేసర్, నారాయణగూడ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయం వద్ద తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఇటీవల జహీరాబాద్‌లో నిర్వహించిన బీసీ నేతల సమావేశంలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జాగృతి కార్యకర్తలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం పైకి వచ్చారు. సిబ్బందిని తోసివేసి ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం చేశారు. ఈ సమయంలో మల్లన్న తన ఛాంబర్లోనే ఉండగా.. తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన కుడిచేతికి స్వల్ప గాయమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గన్‌మేన్ శ్రీనివాస్ తన తుపాకీతో ఆరు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. విషయం తెలుసుకొని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ఆందోళనకారులు కొందరు పరారయ్యారు. జాగృతి కార్యకర్త సాయి చేతికి అద్దం గుచ్చుకుని గాయమవగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. జాగృతి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సందుపట్ల సుజిత్‌రావు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మల్లన్నకు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. 'నాపై దాడి చేయడమే కాకుండా.. నా గన్‌మేన్ చేతిలోని తుపాకీ లాక్కొని నన్ను కాల్చేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మరో గన్‌మేన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఎమ్మెల్సీ కవిత తన ఉనికి కోసం బీసీ నాయకత్వం మీద దాడి చేస్తే ఊరుకోం' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కవిత, మల్లన్నలపై కేసులు నమోదైనట్లు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలి

తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మల్లన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో అదనపు ఐజీ(శాంతిభద్రతలు) రమణకుమార్‌కూ ఫిర్యాదు చేశారు. 'ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆయనే మల్లన్నతో మాట్లాడించారని భావించాల్సి ఉంటుంది' అని ఈ సందర్భంగా కవిత పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం హైదరాబాద్‌లో మరో బస్‌టెర్మినల్ నిర్మించాలన్న ఆర్టీసీ ప్రయత్నాలకు భూకేటాయింపు అంశం అవరోధంగా మారింది. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్‌టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్య కారణంగా ఎంజీబీఎస్‌కు ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్(ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వీటికి పరిహారంగా రూ.6 కోట్లు ఇచ్చేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఆ భూమిని ఆర్టీసీ బస్‌టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు.





హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో మాధవ్ ★ త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డితో..

హరియాణా, త్రిపుర గవర్నర్లను కలిసిన మాధవ్

ఈనాడు, హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఏపీ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డితో కూడా ఆదివారం ఆయన భేటీ అయ్యారు.

బచ్చా ఆగయా భాయ్

- కోడ్ భాషలో గంజాయి బ్యాచ్ సందేశం
- గచ్చిబౌలిలో ఈగల్ టీమ్ డెకాయ్ ఆపరేషన్‌తో వెలుగులోకి

ఈనాడు, హైదరాబాద్: 'భాయ్.. బచ్చా ఆగయా భాయ్' ఇదేదో సినిమా డైలాగ్‌లా ఉంది కదూ.. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి బ్యాచ్ వాడుతున్న కోడ్ భాష ఇది. మహారాష్ట్ర నుంచి గచ్చిబౌలిలోని కొనుగోలుదారులకు గంజాయి చేరబోతుందనే సమాచారంతో ఈగల్ (టీజీన్యాబ్) అప్రమత్తమైంది. మత్తుబాబులను పట్టుకునేందుకు టీజీన్యాబ్ ఎస్పీ చెన్నూరి రూపేశ్ పర్యవేక్షణలో డీఎస్పీ సి.హరిశ్చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేశ్‌రెడ్డి బృందం కొత్త తరహాలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. 100 మందికి పైగా పోలీసులు గచ్చిబౌలి పరిసర ప్రాంతంలో గంజాయికి అలవాటుపడి కొనేందుకు వచ్చిన 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఐటీ ఉద్యోగులు, ఉన్నత విద్యావంతులు, విద్యార్థులు ఉన్నారు. వీరంతా గంజాయి తీసుకుంటున్నట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారణ కావటంతో డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించారు.

వారాంతంలో ఆస్వాదించాలని..

ఆ దంపతులు ఉన్నత విద్యావంతులు. ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. తమ నాలుగేళ్ల పిల్లాడితో గంజాయి కొనేందుకు వచ్చారు. మూడేళ్ల కిందట పెళ్లయిన మరో జంట మత్తుకు అలవాటు పడి డ్రగ్స్ కొనుగోలుకు ఏజెంట్‌ను ఆశ్రయించారు. ఇలా ఒకరిద్దరు కాదు.. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రామ్‌గూడ పరిసర ప్రాంతాల్లో వందల మంది ఐటీ నిపుణులు, ప్రైవేటు ఉద్యోగులు గంజాయికి అలవాటు పడినట్లు, అంతర్రాష్ట్ర ముఠాల నుంచి సరకు కొంటున్నట్లు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో గుర్తించింది. వారిని పట్టుకునేందుకు శనివారం గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో పెళ్లయిన రెండు జంటలు ఉండటం పోలీసులను విస్మయానికి గురిచేసింది. నాలుగేళ్ల కుమారుడితో గంజాయి కోసం వచ్చిన భార్యాభర్తల్లో భర్త గంజాయి తీసుకుంటున్నట్టు నిర్ధారణ అయింది.

100 మందితో వాట్సప్ గ్రూప్

మహారాష్ట్రకు చెందిన సందీప్ హైదరాబాద్‌కు రైలులో గంజాయి సరఫరా చేస్తున్నాడు. కొనుగోలుదారులకు తాను వస్తున్నట్టు వాట్సప్ ద్వారా కోడ్ భాషలో 'భాయ్.. బచ్చా ఆగయా భాయ్' అంటూ సమాచారం చేరవేస్తాడు. తాను ఎక్కడున్నాననేది సమాచారం ఇవ్వకుండా జాగ్రత్త పడతాడు. తాను సూచించిన చోటికి రాగానే వారి చేతికి గంజాయి పొట్లం ఇచ్చి డబ్బు తీసుకొని మాయమవుతాడు. ఈ మత్తు దందాపై ఈగల్ బృందం నిఘా పెట్టింది. సాంకేతిక పరిజ్ఞానంతో పెడ్లర్, కొనుగోలుదారుల వివరాలు సేకరించింది. గంజాయి కొనుగోలు చేసే 100 మందితో సందీప్ వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశాడు. వారంలో ఒకరోజు ఎంచుకొని 5 కిలోల గంజాయిని ఒక్కో ప్యాకెట్ 50 గ్రాములుగా తయారుచేసి 100 ప్యాకెట్లను హైదరాబాద్ తీసుకొస్తాడు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.3 వేలకు విక్రయిస్తాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరకు చేరవేసి రూ.3 లక్షలు సంపాదిస్తాడు. ఈక్రమంలో టీజీ న్యాబ్ బృందం డెకాయ్ ఆపరేషన్‌కు సిద్ధమైంది. సందీప్ సందేశం పంపినట్లు వారే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాట్సప్ గ్రూపులో 'భాయ్.. బచ్చా ఆగయా భాయ్' అనే కోడ్‌ను పంపారు. నిజమేననుకున్న గ్రూపు సభ్యులు శనివారం గంజాయి ప్యాకెట్లు తీసుకునేందుకు రాగానే అక్కడే మఫ్టీలో ఉన్న పోలీసులు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన 86 మంది సమాచారం సేకరించారు.

విద్యుత్తు ప్రమాదంలో అంధ, బధిర బాలిక దుర్మరణం

- పొరపాటున తీగలు లాగడంతో ఎగసిపడిన నిప్పురవ్వలు
- తెలంగాణలోని మక్తల్‌లో విషాదం



భానుప్రియ

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: పొరపాటున విద్యుత్తు తీగలు లాగడంతో నిప్పురవ్వలు ఎగసిపడి అంధ, బధిరురాలైన బాలిక అగ్నికి ఆహుతైంది. ఈ విషాద ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని నందినినగర్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ పట్టణానికి చెందిన ఈసరి కృష్ణ, సుజాత దంపతుల కుమార్తె భవానీ అలియాస్ భానుప్రియ(12). పుట్టుకతోనే మూగ, చెవుడు, అంధురాలు. బుద్ధిమాంద్యంతోనూ బాధపడుతోంది. ఆదివారం తండ్రి మేస్త్రీ పనులకు వెళ్లగా, తల్లి కూలి పనులకు వెళ్లింది. బాలిక వంటింట్లో పొరపాటున విద్యుత్ వైర్లు లాగింది. నిప్పురవ్వలు పడి ఇంట్లోని దుస్తులు, బీరువా, కూలర్ తదితర వస్తువులకు అంటుకున్నాయి. ఈ క్రమంలో బాలికకు కూడా నిప్పంటుకోవడంతో శరీరం అంతా కాలిపోయింది. ఇల్లంతా పొగలు వ్యాపించడంతో గుర్తించిన స్థానికులు కొనఊపిరితో ఉన్న బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చేగుంట, న్యూస్‌టుడే: ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వైరును సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందారు. ఈ ఘటన తెలంగాణలోని మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాలలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోనాలకు చెందిన మురాడి చిత్తం(62) పొలానికి వెళ్లి బోరు మోటారు ఆన్ చేయగా.. విద్యుత్తు సరఫరా జరగలేదు. దీంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా ఫ్యూజ్‌వైర్ తెగిపోయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి ఫ్యూజ్‌వైర్‌ను సరిచేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఘటన స్థలంలో మృతదేహం వేలాడుతూ కనిపించడంతో గమనించిన రైతులు సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి విద్యుత్తు సరఫరాను నిలిపివేయించారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

డ్రగ్స్ రాకెట్ కేసులో.. మరో ఇద్దరి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: మాల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ రాకెట్ కేసులో ఈగల్ టీం(టీజీఏఎన్‌బీ) మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. రెస్టారెంట్ నిర్వాహకుడు సూర్యకు డ్రగ్స్‌ను సరఫరా చేసిన హర్షతోపాటు మరొకరిని రిమాండ్‌కు తరలించారు. ముంబయి, పుణె, గోవాల నుంచి వీరిద్దరు తరచూ డ్రగ్స్‌ను తీసుకొచ్చి సూర్యకు అందించారని గుర్తించారు. ములుగులోని ఫాంహౌస్‌లో పలుమార్లు డ్రగ్స్ పార్టీలు జరిగినట్లు తెలుస్తుండటంతో వాటి గురించి ఆరా తీస్తున్నారు. పలు పబ్‌లలో వీకెండ్ పార్టీల రూపంలో డ్రగ్స్ పార్టీలు నిర్వహించినట్లు తేలడంతో పబ్‌ల నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని ఈగల్ టీం నిర్ణయించింది. కాగా..ఈ కేసులో అరెస్టయిన నిందితుల సంఖ్య ఎనిమిదికి చేరింది.